# కథా కౌముది

2007





శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 17



## విషయసూచిక


| | | |
|---|---|---|
| జానకి | శ్యామలాదేవి దశిక | 3 |
| భయం | జె.యు.బి.వి.ప్రసాద్ | 7 |
| మీరెవరి తాలూకు? | నిడదవోలు మాలతి | 17 |
| వ్రేలు కోసిన కత్తి | సురేంద్ర దారా | 22 |
| వీడ్కోలు | పి.వి.డి.ఎస్.ప్రకాష్ | 29 |
| అమృతాన్ని సాధించు | వారణాసి నాగలక్ష్మి | 34 |
| ప్రతి బింబాలు | నండూరి శ్రీనివాస్ | 45 |
| తాబేలు అడుగు జాడల్లో.. | వాసంతి | 49 |
| కొండవాగులో బంతి | మూలా సుబ్రహ్మణ్యం | 53 |
| అవాక్కయ్యారా? | సోమంచి ఉషారాణి | 60 |
| ఆమె ఎవరు | గవరసాన సత్యనారాయణ | 64 |
| స్వాన్ రివర్ | నిర్మలాదిత్య | 67 |
| వినాయక వ్రతకల్పము | ప్రియ ఆదిరాజు | 73 |
| కాగల క్రౌర్యం | పి.సువర్ణకుమారి | 77 |
| ఆకాశానికి గుంజలు | శారద | 84 |
| నగరళం | జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి | 89 |
| నన్ను రేప్ చెయ్యవూ | కాకాని చక్రపాణి | 96 |
| మధ్యతరగతి మందు భాగ్యం | వెల్చేరు చంద్రశేఖర్ | 108 |
| అంతరంగం | అరుణకాంతి | 114 |
| సందర్భం | పి.చంద్రశేఖర అజాద్ | 118 |
| మేఘన | వారణాసి నాగలక్ష్మి | 123 |
| ఉన్నోళ్ళు | చొప్పదండి సుధాకర్ | 126 |
| మలుపు | శారద | 132 |
| నీవే తప్ప ఇతఃపరంబెరుగ | చొప్పదండి సుధాకర్ | 137 |
| కంటే కూతుర్నికంటి | మద్దూరి రాజ్యశ్రీ | 144 |

# జానకి

## శ్యామలాదేవి దశిక



జానకి భర్తతో అమెరికా వచ్చి 40 ఏళ్ళపైనే అయింది. ఎక్కడో పల్లెటూరిలో పుట్టి పెరిగి స్కూల్‌ఫైనల్ వరకే చదువుకున్న జానకి పెళ్ళి తమాషాగా ఇట్టే జరిగిపోయింది. బంధువుల ఇంట్లో పెళ్ళికని తల్లితండ్రులతో వెళ్ళిన జానకి పెళ్ళికూతురై తిరిగొచ్చింది. ఫ్రెండు పెళ్ళికని వచ్చిన రవిని, కుందనపు బొమ్మలా ఉన్న జానకి అందం, ఆమె అమాయకత్వం ఆకర్షించాయి. ఏ ప్రయత్నమూ చెయ్యకుండానే అంత మంచి సంబంధం రావడం చూసి జానకి అదృష్టానికి తల్లితండ్రులు మహా సంబరపడిపోయారు. పిల్లవాడు బాగా చదువుకున్నాడు, టిప్ టాప్‌గా దర్జాగా ఉన్నాడు. అన్నింటినీ మించి కానీ కట్నం లేకుండా చేసుకున్నాడు.

పెళ్ళిలో అప్పగింతలు అవగానే అత్తవారింటికి బయలుదేరి వెళుతున్న జానకితో తల్లి "మీ అత్తవారు పల్లెటూరివారు కాదు. పట్నంలో ఉండే వాళ్ళు, చదువుకున్నవాళ్ళు పైగా ఉన్నవాళ్ళు. వాళ్ళ పద్ధతులు అలవాట్లు తెలుసుకుని వాళ్ళకనుగుణంగా నువ్వు మారాలి గుర్తుంచుకో" అంటూ బోధించింది. అసలే కొత్తచోటుకు వెళుతున్నానన్న భయంతో ఉన్న జానకి తల్లితో వెంటనే "అలాగే" అంటూ తలూపింది.

హైదరాబాద్‌లో అత్తవారింట్లో అడుగుపెట్టిన జానకికి అక్కడ అన్నీ వింతగా, కొత్తగా అనిపించాయి. పనివాళ్ళతో, బయటవాళ్ళతో చకచకా హిందీలోనూ, జానకికి అర్థం కాని తెలుగులోనూ, మావగారి ఫ్రెండ్స్‌తో కొద్దిగా ఇంగ్లీష్‌లో కూడా మాట్లాడే అత్తగారి చాకచక్యం చూసి జానకి ఆశ్చర్యపోయింది. తెలియనివి నేర్చుకుంటూ, కొత్త వాతావరణానికి అలవాటు పడుతున్న టైములో జానకి భర్త

"వచ్చే నెలలో మనం అమెరికా వెళుతున్నాం" అన్నాడు.

బొంబాయిలో విమానం ఎక్కేముందు అత్తగారు జానకితో

"మనవాళ్ళంటూ ఎవ్వరూ లేని దూరదేశానికి వెళుతున్నారు ఇద్దరూ. దొరలు - దొరసానులు ఉండే దేశం అది. అబ్బాయిని జాగ్రత్తగా చూసుకో. వాడి మనసు గ్రహించి, వాడి ఇష్టానికి తగినట్టుగా నువ్వు మారాలి గుర్తుంచుకో" అంటూ సలహా ఇచ్చింది.

అత్తగారంటే ఎంతోగౌరవం ఉన్న జానకి వెంటనే భక్తిగా తల ఊపింది.

హైదరాబాదులో అక్కడి మాటలూ, పద్ధతులూ వింతగా అనిపిస్తే అమెరికాలో మనుషులతో సహా అన్నీ వింతగా, విచిత్రంగా అనిపించాయి జానకికి. కొత్తదేశంలో, కొత్త వాతావరణానికి, కొత్త రొటీనుకు అలవాటు పడటం మొదలు పెట్టింది జానకి. బయటకు వెళ్ళినప్పుడల్లా గజగజమని వణికే జానకిని చూసి భర్త

"ఎప్పుడూ ఆ నాజూకు నైలాన్ చీరలే కట్టుకుంటే ఎలా? నువ్వు ఇప్పుడు అమెరికాలో ఉన్నావు, ఇక్కడి వాతావరణానికి తగినట్టుగా డ్రస్ చేసుకోవాలి. నువ్వు మారాలోయ్" అన్నాడు.

తనను ఏరికోరి చేసుకున్న భర్త మాటకు సంతోషంగా తల ఊపింది. బయటకు వెళ్ళేటప్పుడు పాంటు, షర్టు వేసుకోవడం అలవాటు చేసుకుంది జానకి. అంతేకాకుండా పార్టీలకు వెళ్ళేటప్పుడు రవికి ఇష్టమయినట్లు జుట్టు లూజుగా వదిలేసుకోవడం, లిప్‌స్టిక్ వేసుకోవడం, హైహీల్స్ వేసుకోవడం నేర్చుకుంది.

చూస్తుండగానే ఏళ్ళు ఇట్టే గడిచిపోయాయి. ఈ పది పన్నెండేళ్ళలో జానకి జీవితంలో చాలా మార్పులు వచ్చాయి. జానకికి ఇప్పుడు ముగ్గురు పిల్లలు. వీలైనప్పుడల్లా కోర్సులు తీసుకుంటూ పార్ట్‌టైము జాబ్‌లో చేరిపోయింది. ఇల్లు, పిల్లలతో, ఉద్యోగం చేస్తున్న జానకి చివరివాడు కూడా స్కూలు మొదలుపెట్టగానే ఫుల్ టైము జాబ్‌లో చేరిపోయింది. ఇల్లు, పిల్లలతో, ఉద్యోగంతో జానకికి ఇప్పుడు క్షణం తీరిక ఉండదు. పిల్లలు చిన్నవాళ్ళుగా ఉన్నప్పుడు వాళ్ళ ముద్దుమాటలకు, చిన్నతరగతుల్లో ఉన్నప్పుడు వాళ్ళ తెలివితేటలకు మురిసిపోయిన జానకి వాళ్ళు పెరుగుతున్నకొద్దీ పిల్లల్లో మార్పు రావడం గమనించింది. ఆ మాటే రవితో అంటే "పెరిగే పిల్లలు వాళ్ళు మారక నువ్వూ నేనూ మారతామా?" అంటూ తేలిగ్గా కొట్టిపారేసాడు. భర్త చెప్పిందీ నిజమే అని ఎంత సరిపుచ్చుకున్నా తల్లిగా జానకి మనసులో ఆందోళన బయలుదేరింది.

పెద్దవాడు విజయ్ స్కూలునుంచీ ఇంటికి వస్తూనే బుక్‌బాగ్ ఓ మూలకు విసురుగా గిరాటేసి రూములోకి వెళ్ళిపోయి తలుపులు వేసుకుని ఇల్లు అదిరిపోయేటట్లు మ్యూజిక్ ఆన్ చేసేవాడు. కూతురు రేఖ అస్తమానం "What is that smell, this house Stinks అంటూ ఇల్లంతా air freshner స్ప్రే చెయ్యడం మొదలుపెట్టేది. ఇంట్లో ఉన్నంతసేపూ ఎప్పుడు చూసినా ఫోనులో ఎవరితోనో మాట్లాడటమో, పోట్లాడటమో చేస్తుండేది. పైవాళ్ళిద్దరిని చూసి చిన్నవాడు వినోద్ ఇంకా త్వరగా మారిపోతున్నాడనిపించింది జానకికి. ఒకరోజు జానకి పనిమీద బయటకు వెళ్ళబోతుంటే do you have to go out with that dot? అంటూ ప్రశ్నించాడు. వాడు దేనిగురించి మాట్లాడుతున్నాడో తెలియని జానకి ఒక్క క్షణం తెల్లబోయి, తర్వాత తనలో తను నవ్వుకుంది! అమ్మా, నాన్నల దగ్గర పెరిగినప్పుడు జానకి నుదుట కుంకుమ దిద్దుకునేది. పెళ్ళి అయి హైదరాబాద్ వచ్చాక అత్తగారు ఐటెక్స్ తిలకం పెట్టుకో అంత బొట్టెందుకు అంటే చిన్న బొట్టు పెట్టుకోవడం అలవాటు చేసుకుంది. ఇప్పుడు వేలుడెంత లేడు వెధవ "ఆ డాట్ లేకుండా ఉంటే నీ సొమ్మేంపోయిందీ" అని ప్రశ్నిస్తుంటే జానకికి నవ్వొచ్చింది.

ఎప్పుడైనా భర్తతో పిల్లల గురించి కంప్లైంట్ చేస్తే వాళ్ళమీద గట్టిగా అరిచేసి తన బాధ్యత తీరిపోయిందనుకునేవాడు. తండ్రిని బాహాటంగా ఏమీ అనలేక, మెత్తగా ఉండే జానకి మీద వాళ్ళ కోపం, విసుగు అంతా తీర్చుకునేవారు. జానకి నోరు విప్పి వాళ్ళతో ఏం మాట్లాడబోయినా, వాళ్ళు తప్పొప్పులను సరిచేయబోయినా జానకి యాక్సెంటుని ఎగతాళి చెయ్యడమో, జానకి ఇంగ్లీషుని కరెక్టు చెయ్యడమో చేసి అసలు విషయాన్ని పక్కదోవలు పట్టించేవారు. పోనీ ఏదైనా పిచ్చాపాటి మాట్లాడదామంటే, నీకేం తెలియదు అన్నట్లు చూసేవారు. ఇలా పిల్లల్లో వస్తున్న మార్పు, ఇంట్లో తనతో ప్రవర్తించే తీరు చూసి జానకి భయపడి ఏం చేయాలో తోచక దిగులు పడ్డం మొదలుమొదలు పెట్టింది.

ఒకరోజు జానకి తన ఆఫీసులోనే వేరే డిపార్ట్‌మెంట్లో పని చేసే సునీత కనిపించి

"ఏమిటి అలా డల్‌గా ఉన్నావు? " అంటూ ప్రశ్నించింది.

వయసులో, చదువులో అనుభవంలో అన్నిటా ఎంతో పైన ఉన్న సునీత ఇలా అడిగేసరికి ధైర్యం చేసి మనసులోని భయాన్ని బయటకు చెప్పేసింది. జానకి చెప్పినదంతా విని సునీత నవ్వుతూ

"ఇదా నీ భయం నీ పిల్లలు నీకు చిన్నవాళ్ళుగా కనిపించవచ్చు, కానీ వాళ్ళు పెద్దవాళ్ళవుతున్నారు. దాన్నే ఇక్కడ యడలెసెన్ స్టేజ్ అంటారు. ఫిజికల్‌గా, మెంటల్‌గా, వాళ్ళలో మార్పు రావడం సహజం. అది నువ్వు అర్థం చేసుకోవాలి" అంటూ చెప్పుకుపోతున్న సునీతను మధ్యలో ఆపుచేసి,

"కానీ.. వాళ్ళు నాతో శత్రువుతో మాట్లాడినట్లు మాట్లాడుతుంటేనూ, నన్ను హేళన చేస్తూ అస్తమానం నన్ను విమర్శిస్తుంటేనూ నేను ఎలా భరించేదీ, వాళ్ళను ఎలా పెంచేదీ" అంటూ కన్నీళ్ళతో ప్రశ్నించింది జానకి.

సునీత వెంటనే "నీ బాధ నాకు తెలుసు జానకీ, ఎందుకంటే అది నాకూ అనుభవమే. కానీ నువ్వు తల్లివని మర్చిపోయి, ఒక్క క్షణం వాళ్ళవైపు నుంచీ ఆలోచించు. వాళ్ళు మనల్ని గౌరవించటంలేదు, మన మాట మన్నించటంలేదు అని అనుకుంటాం. కానీ రోజూ వాళ్ళు బయట ఎన్ని అవమానాలకు, విమర్శలకు, ఛాలెంజ్‌లకు గురి అవుతారో తెలుసా? వెలివేసినట్లు ప్రత్యేకంగా కనిపించే మన పిల్లల్ని, బయట పిల్లలు ఎంత వత్తిడి చేస్తారో ఊహించగలవా? అందరు పిల్లలు చేసే పనులను చెయ్యగూడదని మన పిల్లలమీద ఆంక్షలు పెడతాం. ఇంట్లో ఒకటి చూస్తే, బయట ఇంకొకటి చూస్తారు. ఎదిగీఎదగని వయసులో వాళ్ళకు ఇదంతా అయోమయంగా అనిపిస్తుంది. మానసికంగా వాళ్ళలో ఘర్షణ మొదలవుతుంది. మనం పెరిగినట్లు మన పిల్లల్ని ఇక్కడ పెంచుదామంటే కుదరదు జానకీ. ఇక్కడ పుట్టి, ఇక్కడ పెరుగుతున్న నీ పిల్లలకు తెలిసిన ప్రపంచం ఇదే. అందుచేత వాళ్ళ పరిస్థితుల్ని, వాళ్ళ మనస్థత్వాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూ వాళ్ళకు నెమ్మదిగా నచ్చచెప్పుకోవాలి. నువ్వు ఏమీ అనుకోనంటే ఓ మాట చెపుతాను. వాళ్ళు మారిపోతున్నారని బాధ పడేకంటే, ఇక్కడి పరిస్థితులకు తగినట్లుగా నీ పిల్లల్ని పెంచడానికి తల్లిగా నువ్వు మారటం ముఖ్యం అన్నది తెలుసుకో" అంటూ మృదువుగా భుజం తట్టి వెళ్ళిపోయింది సునీత.

సునీత చెప్పిన మాటలు జానకిని ఆలోచింప చేసాయి. జానకి నెమ్మదిగా ఇంటిని, ఇంటి పద్ధతుల్ని, తనని మార్చుకోవడం మొదలుపెట్టింది.

కష్టపడి ప్రత్యేకంగా క్లాసులు కూడా తీసుకుని ఇండియన్ యాక్సెంటు లేకుండా ఇంగ్లీషు మాట్లాడగలగటం అలవాటు చేసుకుంది. పిల్లలతో మాట్లాడటానికి సినిమాలు, సంగీతం బాగా ఉపయోగపడతాయని గ్రహించిన జానకి వాళ్ళకిష్టమైన మూవీస్ గురించి, వాళ్ళు వినే మ్యూజిక్ గురించీ తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఇంతకు ముందులాగా పిల్లల్ని అన్నమే తినాలని బలవంతం చేయడం, తినకపోతే బాధపడటం మానుకుంది. పైపెచ్చు వాళ్ళకోసమని ఆ పుస్తకాలు, ఈ పుస్తకాలు తిరగేసి వాళ్ళ కిష్టమైన వంటలు చెయ్యటం నేర్చుకుంది. పూర్వంలాగా రేఖ ఆరునూరైనా పార్టీలకు ఇండియన్ బట్టలే వేసుకోవాలని బలవంతం చెయ్యడం మానుకుంది.

నెమ్మదిగా సునీత చెప్పిన మాటల్లో అర్థం తెలిసి రాసాగింది జానకికి. ఈ దేశంలో పిల్లలతో స్నేహంగా ఉంటూ ఇష్టమున్నా లేకపోయినా వాళ్ళలో కలిసిపోయి వాళ్ళ ప్రపంచంలోకి అడుగు పెడితే తప్ప పెంచలేమన్న సత్యాన్ని తెలుసుకుంది.

పదహారేళ్ళ వయసులో పెళ్ళిపేరిట పల్లెటూరు వదిలిన ఆ జానకి వేరు. 40 ఏళ్ళకు పైగా అమెరికాలో స్థిరపడ్డ ఈ జానకి వేరు. ఇన్నేళ్ళలో జానకి ఎంతో ఎత్తు ఎదిగింది. ఎన్నో ఆటుపోట్లు తింది. ఎన్నో సుఖాల్ని, వింత అనుభూతుల్ని పొందింది. అన్నింటికీ మించి జానకి పరిస్థితులకనుగుణంగా ఎంతో మారిపోయింది. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళు అవుతున్నకొద్దీ జానకికి ఇంకొకటి కూడా అర్థమయింది. పిల్లలతో కనీస సంబంధ బాంధవ్యాలు నిలబెట్టుకోవాలంటే వాళ్ళననుసరించి పోతూ, వాళ్ళ ఇష్టమే తన ఇష్టంగా భావించటం తప్ప వేరే మార్గం లేదన్న నిజాన్ని ఎవరూ చెప్పకుండా తనంతటతనే తెలుసుకుంది. అందుకే వాళ్ళ చదువుల విషయంలోకానీ, ఉద్యోగవిషయాల్లో కానీ, ఆఖరికి వాళ్ళ పెళ్ళిళ్ళ విషయంలో కూడా జానకి ఎటువంటి అభ్యంతరం పెట్టుకోలేదు.

పిల్లలు ముగ్గురూ మూడురకాలుగా వాళ్ళ కిష్టమైన వాళ్ళను చేసుకున్నారు. పెద్దవాడు విజయ్ కాలేజీలో తనతో చదువుకున్న అమెరికన్ అమ్మాయిని చేసుకున్నాడు. అమ్మాయి రేఖ తన ఆఫీసులో పని చేసే పంజాబీ అబ్బాయిని చేసుకుంది. చిన్నవాడు వినోద్ ఆఫ్రికాలో, పుట్టి, గయానాలో పెరిగి, అమెరికాలో స్థిరపడ్డ అమ్మాయిని చేసుకున్నాడు.

జానకి ఇప్పుడు గ్రాండ్ మదర్ కూడా అయిపోయింది. ఇన్నాళ్ళూ తన పిల్లల్ని పెంచి ప్రయోజకుల్ని చెయ్యడంలో అలిసిపోయిన జానకి ఇప్పుడు గ్రాండ్ చిల్డ్రన్‌ని కలిసినప్పుడల్లా తనూ ఒక చిన్నపిల్ల అయి వాళ్ళతో ఆడుకుంటూ ఆనందిస్తుంది. అందరిలోకి జానకి ఊహకు భిన్నంగా పెద్దవాడి కూతురు నికోల్ జానకిని చూస్తే చాలు వదిలిపెట్టదు. నాలుగేళ్ళు నిండిన నికోల్ జానకి ఏం చేసినా కుతూహలంగా చూస్తూ యక్షప్రశ్నలు వేస్తూ ఉంటుంది.

అప్పటివరకూ తన చుట్టూ తిరుగుతున్న నికోల్ ఉన్నట్టుండి మాయమయేసరికి జానకి గాబరాగా వెతకటం మొదలుపెట్టింది. కింద ఎక్కడా కనిపించక గబగబ పైకి వెళ్ళింది జానకి. అడుగుల చప్పుడు విన్న నికోల్ పరుగెత్తుకుంటూ జానకి దగ్గరకు వచ్చి పట్టుచీరలో, నుదుట కళ్యాణం బొట్టుతో, పువ్వుల జడతో, చేతులనిండుగా గాజులు, నగలతో తెలుగుతనానికి ప్రతీకగ ఉన్న జానకి ఫోటో చూపించి "who is this granma? she is pretty! "అని అడిగింది.

నికోల్ మనస్థత్వం తెలిసిన జానకి ఆ ఫోటో గురించి, ఆనాటి ముస్తాబు గురించి వివరంగా చెప్పింది. అంతా విన్న నికోల్ ఫొటోలో ఉన్న జానకి వైపు వేలు పెట్టి చూపిస్తూ

"I want to grow up and look like her అంది.

జానకి మొహం ఒక్కసారిగా ఆనందం, ఆశ్చర్యం మిళితమైన కాంతితో వెలిగిపోయింది. నికోల్ వెంటనే తలపైకెత్తి జానకి మొహంలోకి సూటిగా చూస్తూ

"You look so different. Why did you change grandma? "అంటూ అమాయకంగా ప్రశ్నించింది..!



# భయం

జె.యు.బి.వి.ప్రసాద్

అగ్రహారాన్ని పోలినట్టుండే ఆ పేటలో ఒక సందు. రోజూలాగే కూరలమ్ముకునే వాళ్ళ తోటీ, ముగ్గూ, ఉప్పూ, వగైరా అమ్ముకునే వాళ్ళ తోటీ, పనుల మీద తిరిగే వాళ్ళ తోటీ, వేసం కాలం శలవులు అయిపోతున్నాయనే దిగులుతో ఒక పక్కా, ఆటల ఆనందంతో ఇంకో పక్కా తిరిగే పిల్లల తోటీ, ఆ పూట కూడా సందు చాలా హడావిడిగా వుంది. ఆ సందులో అటువైపూ, ఇటువైపూ కలిసి ఇరవై గడపలుంటాయి. అందులో సగం పైన గడపలకి కరెంటు లేదు. రాత్రిళ్ళు ఆ సందు ఎప్పుడూ చీకటిగా వుంటుంది. బ్రాహ్మణ, వైశ్యులకు తప్పితే మరింకెవరికీ వాటాలు అద్దెకిచ్చేవారు కారు ఆ సందులో. అయినా చిన్న కులాల వాళ్ళమ్ముకున్న సరుకులు, పసుపు నీళ్ళు చల్లుకున్నాక భేషుగ్గా పనికొచ్చేవి.

ఆ సందు పేరు బోడా వారి సందు. అది కాకినాడలో దేవాలయం వీధికి దగ్గర వుండేది. మునిసిపాలిటీ కార్మికులు ఆ ఇళ్ళలో మరుగుదొడ్లు శుభ్రం చేసి, బకెట్లతో నడుస్తూ వుంటే, ముక్కు మూసుకుని, ముఖం చిట్లించుకుని వారికి దూరంగా తొలిగిపోయేవాళ్ళు కొందరయితే, బకెట్ల వారి కంట పడ్డామని మడి కోసం మళ్ళీ స్నానం చేసేవాళ్ళు మరి కొందరూ. ఆ ఇళ్ళలో వుండేవాళ్ళు పండగ రోజుల్లో పడేసే అర్థరూపాయి కోసం ఈ మునిసిపాల్టీ కార్మికులు కొంత వినయం ప్రకటించేవారు. వారికి ఆ దేవాలయం వీధిలో వున్న మరుగుదొడ్లలోకి ప్రవేశమే గానీ, అదే వీధిలో వున్న గుళ్ళలో ప్రవేశం లేదు. లేదని వారికి ఆక్రోశమూ లేదు. తమ బతుకులింతే అనుకునేవారేమో, దూరం నించే ఆ గుళ్ళలోని రాళ్ళ దేవుళ్ళకి ఓ దణ్ణం పడేసి పోతూవుండేవారు తమ బకెట్లతో.

మొత్తానికి ఆ మనుషులందరూ సంతోషంగా వున్నట్టే కనబడే వారు ఆ సందులో అందరికీ. తొమ్మిదేళ్ళ సూర్యానికి కూడా అలాగే అనిపించేది. వాడికి ప్రపంచంలో అన్నింటికన్నా పెద్ద కష్టం వచ్చింది ఆ పూట. ఆ సందులో వున్న జనాలకి కష్టాలేవీ లేవనిపించి, ఆ భావన వాణ్ణి మరింత కుంగ దీస్తోంది అంతకు ముందు రోజు నించీ. అప్పుడప్పుడు కళ్ళలో వూరుతున్న నీళ్ళని తుడుచుకుంటూ, వీధరుగు మీద కూర్చుని, సందులో వచ్చే పోయే వాళ్ళని చూస్తూ వున్నాడు. వాడికి జీవితం అంటే ఏమిటో తెలియదు గానీ, ఆ తెలియని జీవితం చాలా అగమ్యగోచరం అనిపించడం మొదలైంది.

ఇంతకీ ఆ నాడు వాడి కొచ్చిన కష్టం ఏమిటంటే, వాడు కోరుకున్న బళ్ళో ఆరవ తరగతిలో సీటు రాలేదు. అంతకు ముందు రోజు ఆ స్కూలు వాళ్ళు సీటు ఇవ్వం అని చెప్పినప్పటి నించీ విషాదంలో మునిగి పోయాడు.మూడిళ్ళ అవతల వుండే గొల్లపూడి వారబ్బాయి రాంబాబు గెంతుకుంటూ వొచ్చాడు సూర్యం దగ్గరకి.

"నిన్ను ఏ సెక్షనులో వేశార్రా బళ్ళో? నేను 'సి' సెక్షనులో పడ్డాను. మంచిదేనంటావా?" అనడిగాడు నవ్వుతూ.

సూర్యానికి బాధెక్కువైపోయింది. వస్తున్న ఏడుపాపుకుంటూ, "నాకు బళ్ళో సీటివ్వలేదురా!" అన్నాడు.

రాంబాబుకి చాలా ఆశ్చర్యం వేసింది. "నీకు నా కన్నా ఎక్కువ మార్కులొస్తాయి గదరా! నీకు సీటివ్వక పోవడం ఏమిటీ?" అన్నాడు.

సూర్యం మాట్టాడలేదు. ఆ లోపల వాళ్ళమ్మ చద్దన్నానికి పిలిస్తే లోపలకి వెళ్ళాడు. చద్దన్నం ముందర కూర్చున్నాడే గానీ, తిండి ఏమీ సయించలేదు వాడికి.
అన్నం కెలుకుతున్న వాడిని చూస్తే వాళ్ళమ్మకి జాలేసింది.

"నువ్వేం బాధ పడకురా సూర్యం! ఏదో ఒక ఆలోచన చేసి, నీకు సీటు వచ్చేలాగా చేద్దాం. నీకెందుకు, నువ్వు హాయిగా వుండు" అంటూ తల్లి ధైర్యం చెప్పింది.

తల్లి మాటలకి కాస్త ధీమా కలిగింది సూర్యానికి. ఎలాగన్నా తన కష్టం గట్టెక్కుతుందని నమ్మాడు వాడు. తినడం పూర్తి చేసి, మళ్ళీ వీధరుగు మీద కూర్చున్నాడు.

సూర్యానికి ఆ బళ్ళో సీటు రాక పోవడానికి ఒక కారణం వుంది. అది పూర్తిగా అర్థం చేసుకోవాలంటే కొంచెం వాడి చిన్నతనంలోకి తొంగి చూడాలి.

సూర్యం తండ్రి ఏదో హోటల్లో పని చేసేవాడు. పొద్దున్నే నాలిగింటికి లేచి వెళ్తాడు. మధ్యాహ్నం ఒంటి గంటకి ఇంటికొచ్చి, స్నానం చేసి, పూజ చేసి, అన్నం తిని, ఓ గంట సేపు నిద్ర పోతాడు. లేచి మళ్ళీ బయట కెళ్ళి పోతాడు. రాత్రి పది దాటాకే ఇంటికి తిరిగొస్తాడు. సంసారం బాధ్యతలన్నీ సూర్యం తల్లే చూసుకుంటుంది.

ముగ్గురు కూతుళ్ళ తర్వాత సూర్యం. ఆఖరు పిల్లాడనీ, ఒక్కడే మగ పిల్లాడనీ వాడంటే ఇంట్లో అందరికీ ముద్దే. అక్కలు కూడా వాడిని ప్రేమగానే చూసుకుంటారు. శలవురోజుల్లో తప్ప తండ్రి కనబడేవాడు కాదు వాడికి.

పొద్దున్న తండ్రి వెళ్ళేటప్పటికి పిల్లలెవరూ నిద్ర లేచే వాళ్ళు కారు. మధ్యాహ్నం అంతా స్కూళ్ళలో వుండేవారు. రాత్రి మళ్ళీ నిద్రలో వుండేవారు. కరెంటు లేని ఇళ్ళు. మూడు వాటాలున్న ఆ ఇంట్లో ఓ పదిమంది వరకూ పిల్లలూ. ఉమ్మడి సావిట్లోనో, ఉమ్మడి వసారాలోనో, అక్కడో, ఇక్కడో, ఎక్కడో పడుకుంటూ వుండేవారు పిల్లలు. పిల్లల బాధ్యతా, ఇంటి బాధ్యతా అంతా తల్లిదే. దాంతో సూర్యానికి తల్లి దగ్గరే చనువు ఎక్కువ. తండ్రంటే ప్రేమ వున్నా భయం ఎక్కువ. ఆ భయం కూడా తల్లి మాటలతో ఇంకా పెరిగేది. తన మాట విననప్పుడల్లా, "నాన్నతో చెప్తాను మీ సంగతి" అని బెదిరించేది. ఎప్పుడూ గంభీరంగా వుండే తండ్రి కొట్టకపోయినా, తిట్టకపోయినా భయమే పిల్లలకి. తండ్రి మాట జవదాట్టం ఎప్పుడూ లేదు ఆ ఇంట్లో.

హాయిగా ఆడుకుంటూ, నాలుగు సందులూ కలేసి తిరుగుతూ వుండే సూర్యాన్ని ఒక రోజు బళ్ళో ఒకటో తరగతిలో పడేసింది వాళ్ళమ్మ. ప్రగోడా స్కూలుకెళ్ళి సంతకం పెట్టి, వాడి పేరు రాయించింది. వాడు స్కూలుకెళ్ళనని ఒకటే గోల. వాడికి అయిదో యేడు వొచ్చి రెండు నెల్లయింది. కింద పడి కాళ్ళూ, చేతులూ కొట్టుకుంటూ ఏడుస్తున్న వాడిని, వాడి పెద్దక్కా, ఇంకో వాటాలో వుండే ఆంజనేయులు అనే అబ్బాయీ వాడి చేరో రెక్కా పట్టుకుని ఈడ్చుకుంటూ స్కూలుకి తీసుకెళ్ళారు. అప్పటి వరకూ గింజుకుంటూ, "నాకు స్కూలొద్దేవ్, నేనింటికి పోతానే" అని అరుస్తున్న వాడు కాస్తా, స్కూలు చూడగానే బిర్ర బిగుసుకుని పోయి, భయంతో ఏడుపాపేశాడు. వాడి పెద్దక్క వాణ్ణి ఒకటో క్లాసులో కూర్చో పెట్టి, అప్పారావు మేష్టారికి అప్పగించి వెళ్ళిపోయింది. ఆ స్కూల్లోనే అయిదో క్లాసులో వుంది సూర్యం మూడో అక్క.

అప్పారావు మేష్టారంటే పిల్లలందరికీ ఒకటే దడ. నోరిప్పితే వీపు మీద బాదేసేవాడు. ఏడుస్తున్న పిల్లలంటే ఆ టీచరుకి ఒళ్ళు మంట. ఎంతో మంది మొండి పిల్లల్ని తన చావబాదుడుతో దార్లో పెట్టాడని ఆ టీచరుకి పేరు కూడా. సూర్యం వేపు ఒక్కసారి వురుమురిమినట్టు చూశాడాయన. సూర్యం పై ప్రాణాలు పైకే పోయాయి. పక్క కుర్రాడేదో చేశాడని, ఆ టీచరు పళ్ళు కొరుకుతూ వచ్చి, ఆ పిల్లాడి వీపు రాంకీర్తన పాడించాడు. ఏడవడానిక్కూడా భయపడి ఆ పిల్లాడు నోరెత్తలేదు. కానీ పక్కనే వున్న సూర్యం దడుచుకుని లాగు తడిపేసుకున్నాడు. ఆ విషయమే పట్టించుకోలేదు టీచరు.

ఇంటికెళ్ళగానే తల్లిని కావలించుకుని భోరుమన్నాడు సూర్యం. వాడి తడి లాగూ చూసి, "మేష్టారు కొట్టార్రా నిన్నూ?" అనడిగింది వాడి తల్లి. వాడు జరిగింది చెప్పేసరికి, ఇంట్లో అంతా నవ్వారు. తల్లి వాణ్ణి సముదాయించింది.

"అమ్మా! నేనింకా స్కూలుకి ఎన్ని రోజులెళ్ళాలమ్మా?" అనడిగాడు సూర్యం జాలిగా.

"చాలా రోజులెళ్ళాలిరా! నువ్వు బాగా చదువుకోవాలి. ఈ బడి తర్వాత ఇంకా పెద్ద బళ్ళక్కూడా వెళ్ళి చదువుకోవాలి. బాగా చదువుకుంటే మంచి వుద్యోగం వస్తుంది. అప్పుడు సుఖంగా వుంటావు" అని తల్లి వివరంగా చెప్పింది.

ఆ మాటలు వాడి బుర్రలో నాటుకు పోయాయి. అప్పట్నించీ స్కూలుకెళ్ళడానికి వాడెప్పుడూ యేడవలేదు. బాగా చదువుకోవాలని వాడి కోరిక. దాని కోసం కష్టాలు
సహించడం నేర్చుకున్నాడు.

ఒకటో క్లాసులో సూర్యానికో కష్టం వచ్చింది. వాణ్ణి స్కూల్లో చేర్చినప్పుడు ఆనవాయితీగా టీచరుకి ఒక రూపాయి చదివించుకోవాలిట. ఆ విషయం తెలియక వాళ్ళమ్మ రూపాయి చదివించలేదు. ఆ కోపంతో టీచరు క్లాసులో అటెండెన్సుకి వాడి పేరు పిలిచేవాడు కాదు. తోటి పిల్లలందరూ, "ఎస్సార్", "వచ్చాను టీచర్", "ప్రజంటీచర్" అనంటూ వుంటే, తన పేరు పిలవకపోవడం సూర్యానికి చాలా అవమానంగా వుండేది. కారణం వాడికి తెలియదు. ఇంటికెళ్ళి వాళ్ళమ్మ దగ్గర వాపోయేవాడు. వాడి గోల వాళ్ళమ్మకి సరిగ్గా అర్థం అయేది కాదు. ఎప్పుడూ పనిలో వుండి, పట్టించుకునేది కాదు.

సూర్యం అలాగే ఒకటో తరగతి పూర్తి చేసి, రెండో తరగతిలోకి వచ్చాడు. అప్పుడూ వాడి పేరు అటెండెన్సులో లేదు. కానీ ఒక రోజు పక్క రూములో వున్న ఒకటో తరగతిలో వాడి పేరు అటెండెన్సు పిలవడం వాడికి వినిపించింది. వాడు భయంతో బిక్క చచ్చిపోయాడు. తనని మళ్ళీ ఎక్కడ ఒకటో క్లాసులో
కూర్చోమంటారో అనే భయంతో వాడా సంగతి ఎవరికీ చెప్పలేదు. అలాగే రెండు పూర్తి చేసి మూడుకొచ్చాడు. వాడి అటెండెన్సు మూడులో కూడా పిలవలేదు.

అప్పటికి వాడి గోల భరించలేక, వాళ్ళమ్మ వాడి పెద్దక్కని స్కూలుకి పంపించింది కనుక్కోమని. ఆ అమ్మాయి అడిగితే, "ఆరేళ్ళు నిండిన పిల్లాడిని మూడో
క్లాసులో వుంచమనీ, కావాలంటే రెండో క్లాసులోనే వుంచుతామనీ" స్కూలు వాళ్ళన్నారు. ఆ పిల్ల తల్లికి అంతా చెప్పింది.

యేడాదంతా రెండవ తరగతి చదివిన కుర్రాడిని మళ్ళీ రెండో క్లాసులో వెయ్యడానికి వాళ్ళమ్మ ఒప్పుకోలేదు. సూర్యానికి అప్పటికే తెలుగు వాక్యాలు రాయడం కూడా వచ్చేశాయి. కూడికలూ, తీసివేతలూ చేసేవాడు.

"ఏరా? మళ్ళీ రెండో క్లాసు చదువుతావా?" అనడిగింది వాడి తల్లి.

"అలా చేస్తే, నేను రెండో క్లాసు ఫెయిలయినట్టు కదా! వద్దమ్మా! నన్ను మూడులోనే వుండనీ" అని బతిమాలాడు వాడు.

ఏం చెయ్యాలో వాడి తల్లికి తోచలేదు. పిల్లల చదువులు పట్టించుకోని తండ్రికి చెప్పడానికి ఆ తల్లికి ధైర్యం లేదు. ఆయన బయట వుద్యోగం చేస్తున్న మనిషి కాబట్టి, ఈ సమస్య చెబితే తిడతాడనీ, ఆ సమస్యని తానే పరిష్కరించాలనీ ఆ తల్లి అనుకుంది.

ప్రగోడా స్కూలుకి పై సందులో భారతీ విద్యాలయం అని ఇంకో స్కూలుంది. ఒకటీ, రెండూ ఇంట్లో చదివామని చెప్పి ఆ స్కూల్లో మూడో క్లాసులో వేసింది వాడి తల్లి. ఈ సారి రూపాయి చదివించడం మర్చిపోలేదు ఆవిడ. వాడికో చిన్న పరీక్ష పెట్టి, వాడిని స్కూల్లో మూడో క్లాసులో చేర్చుకున్నారు. రోజూ అటెండెన్సులో వాడి పేరు పిలుస్తూ వుంటే, వాడు తన్మయత్వంతో, "ప్రజంట్ టీచర్" అనేవాడు. రెండేళ్ళు పోయిన పదవి మళ్ళీ దొరికినంత సంతోషం కలిగేది వాడికి.

ఎటొచ్చీ పక్క పిల్లాడు, "నువ్వింతకు ముందు ఏ స్కూల్లో చదివావురా?" అనడిగితే, బలవంతంగా, "నేను ఒకటీ, రెండూ ఇంట్లోనే చదివాను" అని అబద్ధం చెప్పేవాడు. స్కూల్లో అలా చెప్పాలని తల్లి వాడికి నేర్పించింది. అంతే కాదు, వయసు సరిపోదంటున్నారని చెప్పి, రెండేళ్ళు ఎక్కువేయించింది తల్లి, ఎందుకన్నా వుంటాయన్నట్టుగా. వయసు సంగతి వాడికి పట్టలేదు గానీ, ప్రగోడా స్కూలు గురించి అబద్ధం చెప్పడానికి కష్టపడిపోయేవాడు.

ఒకరోజు సూర్యం ప్రగోడా స్కూలు పక్క నించీ నడుస్తూ భారతీ విద్యాలయం వేపు వెళుతున్నాడు ఆ స్కూల్లో చేరిన కొత్తలో. పాత స్కూల్లోంచి అప్పారావు మేష్టారు బెత్తం ఆడించుకుంటూ, ఒక్క పరుగున బయటకి వచ్చి సూర్యాన్ని పట్టుకున్నాడు.

"ఏరా వెధవా! స్కూల్లోకి రాకుండా ఎక్కడకిరా పోతున్నావు?" అంటూ వాణ్ణి లోపలకి లాక్కెళ్ళి, మూడో క్లాసులో కూర్చోబెట్టాడు మేష్టారు.

"నేనీ స్కూల్లో చదవడం లేదు మేష్టారూ" అననడానికి వాడికి ధైర్యం లేదు. బిక్క చచ్చిపోయి కూర్చున్నాడు. ఈ కొత్త కష్టాన్నెలా తప్పించుకోవాలో అర్థం కాలేదు. కాసేప్పోయాక, ఎవరూ చూడకుండా, వాడా స్కూల్లోంచీ పారిపోయి, తన స్కూలుకెళ్ళాడు. ఆలస్యంగా వచ్చినందుకు దెబ్బలు కూడా తిన్నాడు. అప్పట్నించీ దూరమైనా చుట్టు తిరిగి వెళ్ళేవాడు కొత్త స్కూలుకి.

కొన్నాళ్ళకి అప్పారావు మేష్టారు ప్రగోడా స్కూలు నించీ ఇంకో స్కూలుకి వెళ్ళిపోయాడనే విషయం తెలిసింది. అప్పట్నించీ ఆనందకరమైన రోజులు మొదలయ్యాయి సూర్యానికి. వాడికి కొత్త స్కూలు బాగా నచ్చింది. కొత్త స్నేహితులు కూడా బాగా నచ్చారు. భారతీ విద్యాలయంలో ఐదు వరకూ చదివిన వాళ్ళని పి.ఆర్.జి.సీ. స్కూలుకి ఆరవక్లాసులోకి తీసుకుంటారని అనేవారు. అంతేగాక, ఆ స్కూలు ఇంటికి దగ్గరే. ఆ స్కూల్లో ఏడవ తరగతిలో సంస్కృతం నేర్పిస్తారు. పిల్లలందరూ ఆ స్కూలు మీదే మనసు పెట్టుకునేవారు. సూర్యం మూడో అక్క కూడా ఆ స్కూల్లోనే చదివేది.

ఆ రోజుల్లో సూర్యంలో మంచి మార్పులు రాసాగాయి. వాడికి పుస్తకాలు చదవడం వంట బట్టింది. మూడో క్లాసులోనే చందమామ రెగ్యులర్‌గా చదివేవాడు, స్నేహితుడి దగ్గర తీసుకుని. పక్క ఇళ్ళలో తీసుకుని వార్తా పత్రికల్లో

సినిమా కబుర్లు చదివేవాడు. ఎక్కడన్నా కథల పుస్తకం దొరికితే వదలకుండా చదివేవాడు. దాంతో వాడికి తెలుగులో గట్టి పట్టు వచ్చింది. చుట్టు పక్కల పిల్లలు వాడి చేత కథలు చెప్పించుకునే వాళ్ళు.

గోపాలస్వామి గుళ్ళో ప్రతీ యేడాదీ భగవద్గీత పోటీలుండేవి. తన కన్నా పెద్దవారితో బాటూ సూర్యం కూడా ఒక అధ్యాయాన్ని, పదచ్ఛేద, తాత్పర్యాలతో కంఠస్తం పట్టి, పోటీల్లో అప్పగించేవాడు, అయిదో క్లాసులో వుండగానే. అప్పటికే పత్రికల్లో సీరియల్సు కూడా చదివేవాడు. 'రాజూ, పేదా', 'ఏటి వొడ్డున నీటి పూలు', 'వైకుంఠపాళీ', వగైరా సీరియల్స్  ఇష్టంగా చదివేవాడు. వాడి ఆసక్తి గమనించి తల్లి, ప్రతీ వారం కొన్ని వార పత్రికలూ, ప్రతీనెలా కొన్ని మాస పత్రికలూ, చందమామా, బాలమిత్రా కొనుక్కోడానికి వాడికి డబ్బిచ్చేది. మళ్ళీ వాడి అక్కలకబ్బలేదు ఆ పుస్తకాల పిచ్చి. అప్పుడప్పుడు వాడి మూడో అక్క వాణ్ణి దగ్గర కూర్చో బెట్టుకుని వాడి చేత కథలు చెప్పించుకునేది, వాళ్ళమ్మ, "నువ్వే చదువుకోకూడదే సొంతంగా" అని తిట్టినా సరే. కథలు చెప్పినందుకు గానూ, తన దగ్గరున్న కాసిని డబ్బులిచ్చేది ఆ అమ్మాయి.

సూర్యానికి స్కూల్లో చెప్పే గాంధీ పాఠాలూ, సైన్సు పాఠాలూ బాగా బుర్రకెక్కేవి. అవి పాటించడానికి ప్రయత్నిస్తూ వుంటే, వాడి అక్కలు వాణ్ణి చూసి నవ్వేవారు. వాడి పెద్దక్క ఒక్కతే వాణ్ణి ప్రోత్సహించేది.

చిన్నతనంలో తెలియక, తండ్రికెప్పుడూ హోటల్ పనే అనుకునేవాడు. కానీ వూహ తెలిశాక అర్థం అయింది, ప్రతీరోజూ తండ్రి ఓ రెండు, మూడు గంటలు పేకాటలో కూర్చుంటాడని. పండగ వస్తే చాలు, ఆ సందులో వున్న అయిదారుగురు మగాళ్ళు మంగిపూడి వాళ్ళింట్లో చేరేవారు పేకాటకి. అదీ వుత్త పేకాట కాదు, డబ్బుతో ఆడేవారు. ఎక్కడ పోలీసులు వచ్చి తండ్రిని పట్టుకుంటారోనని సూర్యం చాలా భయపడుతూ వుండేవాడు.

పండగరోజు మధ్యాహ్న భోజనానికి రమ్మని సూర్యం చేత కబురంపించేది తల్లి పేకాడే చోటుకి. తండ్రి ఓ పట్టాన లేచొచ్చేవాడు కాదు. "వస్తాన్లే, నువ్వెళ్ళు" అని కసురుకునేవాడు. తల్లి మళ్ళీ పంపేది కాస్సేపాగి. ఇలా నాలుగయిదు సార్లు తిరగాల్సి వచ్చేది వాడికి. దాంతో పండగలంటే ఒక రకమైన భయం పట్టుకునేది వాడికి. ఎవరికీ తెలియకుండా సందు మొగలో కాపేసేవాడు పోలీసులొస్తారేమోననే భయంతో.

తండ్రి దగ్గర సూర్యానికి నచ్చని లక్షణం ఇంకోటి వుండేది. అదేమంటే, తండ్రి సిగరెట్లు తెగ కాల్చేవాడు. కొడుకు చేతే కొట్టు నించి తెప్పించుకునేవాడు. దగ్గర కెళితే చాలు ఆ సిగరెట్ వాసన గుప్పున కొట్టేది. సైన్సు పాఠాలు నేర్చుకుంటున్న సూర్యానికి ఇంకో పెద్ద దిగులు, తండ్రి ఆరోగ్యం గురించి. తండ్రి కేమన్నా అయితే, తాము దిక్కులేని వాళ్ళమయిపోతామని పెద్ద భయం.

ఒకరోజు తండ్రి ఏదో వస్తువు సూర్యానికిచ్చాడు లోపల పెట్టమని. కాస్త తటపటాయించి, "ఎవరి పన్లు  వాళ్ళు చేసుకోవాలని గాంధీగారన్నారుగా! నీ పని నాకు చెప్తావెందుకూ?" అన్నాడు సూర్యం కాస్త బెరుగ్గా.

వాడి తండ్రి ఆశ్చర్యపోయాడు. వాడి తల్లి సంతోషపడి పోయింది. తల్లి ప్రోత్సాహం చూసి వాడు స్కూల్లో నేర్చుకున్న వన్నీ ఇంట్లో ప్రయోగించేవాడు. తండ్రిని రోజూ చూడలేకపోతున్నాననే బాధ వుండనే వుండేది వాడికి. ఏం చెయ్యాలో తెలిసేది కాదు. ఉత్త భయం తండ్రంటే. అణకువగానే మాట్లాడేవాడు ఎప్పుడు తండ్రితో మాట్లాడినా.

ఇంకోరోజు తండ్రి జేబులోంచీ తల్లి చిల్లర డబ్బులు తీస్తూ కనబడింది వాడికి. ఆ రోజు చాలా మధన పడిపోయాడు వాడు. తల్లి దొంగతనం చెయ్యడం వాడు జీర్ణించుకోలేక పోయాడు. చాలా దిగులుగా వున్న వాణ్ణి చూసి తల్లి కారణం అడిగింది.

"అమ్మా! దొంగతనం చెయ్యడం పాపం అనీ, తప్పనీ స్కూల్లోనూ చెప్పారు, గుళ్ళోనూ చెప్పారు. నువ్వు కూడా పండగలప్పుడు చేసిన అప్పచ్చులు అడిగి తీసుకోవాలనీ, దొంగతనంగా తీసుకోకూడదనీ చెప్పావు. మరి నువ్వు నాన్న జేబు లోంచీ చిల్లర డబ్బులు తియ్యడం తప్పు కాదా?" కళ్ళల్లో నీళ్ళతో అడిగాడు సూర్యం.

తల్లి తెల్లబోయింది వాడి మాటలకి. ప్రేమగా దగ్గరకి తీసుకుంది.

"చూడు సూర్యం! నువ్వు నేర్చుకున్నవీ, చదివినవీ కరెక్టే! నేను చేసేది దొంగతనం కాదు. ఎందుకంటే నేను నాన్న జేబులోంచీ చిల్లర డబ్బులు తీసుకుంటానన్న విషయం నాన్నకి తెలుసు. అలా తీసుకున్న డబ్బులు ఇంటికే ఖర్చు పెడతానని కూడా నాన్నకి తెలుసు. నువ్వు బాధ పడకు" అంటూ ఓదార్చింది.

విషయం అర్థం కాకపోయినా, తల్లి దొంగతనం చేయలేదని అర్థం అయి, సంతోషపడ్డాడు. అలాగే ఆడుతూ, పాడుతూ అయిదో క్లాసు పూర్తి చేశాడు.

ఆ రోజుల్లో సూర్యం బుర్రలోకి ఒక చిన్న కాంతి కిరణం బలవంతంగా చొచ్చుకుని వెళ్ళే సంఘటన జరిగింది. ఒకరోజు పొద్దున్న ఆ సందులో మనుషులు హడావిడిగా పోతున్న సమయంలో, ఓ మరుగుదొడ్డి కార్మికుడి చీపురు పొరబాటున, పౌరోహిత్యం చేసే పక్కింటి భమిడిపాటి సత్యనారాయణ శర్మ చేతికి తగిలింది.

వెంటనే, "చమించండి బాబయ్యా! తప్పైపోనాది" అంటూ ఆ కార్మికుడు మన్నింపు వేడుకున్నాడు.

అయినా సరే, ఆ పురోహితుడు మండిపడ్డాడు.

"అప్రాచ్యపు వెధవా! నన్ను తగిలి మైల పరుస్తావా? నీ బతుకు చెడ. ఏ జన్మలో చేసుకున్న పాపం వల్లో, ఈ జన్మలో ఇటువంటి నీచ కులంలో పుట్టి, అప్రాచ్యపు పనులు చేసుకుంటూ బతుకుతున్నావు. నా లాంటి సద్బ్రాహ్మణ్ణి మైల పరిస్తే, ఇంకా అధమ జన్మ ఎత్తాల్సి వస్తుంది" అంటూ చాలా ఘోరంగా తిట్టాడు.

మిగిలిన కార్మికులు వచ్చి ఎంత సర్ది చెప్పినా వినిపించుకోకుండా చాలా సేపు తిట్టాడు. దాంతో ఆ కార్మికులకి కోపం వచ్చి, ఆ సందులో మరుగుదొడ్లు శుభ్రం చెయ్యడం మానేశారు కొన్నాళ్ళు. ఆ దుర్వాసనలు భరించలేక, అప్పుడు అర్థం అయింది సూర్యానికి వాళ్ళు చేసే పని ఎంత కష్టమయినదో! సందులో పెద్దలు నచ్చజెప్పడం వల్ల, కార్మికులు రాజీపడి మళ్ళీ పనిలో కొచ్చారు. కానీ ఆ ఎదురు తిరగడం అనే విషయం మొట్ట మొదటిసారి సూర్యానికి అనుభవంలో తెలిసింది.

ఆ రోజు వాడి పెద్దక్క వాడి స్కూలుకెళ్ళింది టీ.సీ, మార్కుల లిస్టూ తీసుకుని, మర్నాడు వాణ్ణి పి.ఆర్ జి.సి.స్కూల్లో చేర్చడానికి. పెద్ద కూతురు పెద్ద క్లాసులో కొచ్చినప్పటి నించీ, ఇంటి విషయాల్లోనూ, చిన్నవాళ్ళ చదువు విషయాల్లోనూ తల్లికి సాయంగా వుండేది. చదువుకున్న కూతురు చేతికి అంది రావడంతో తల్లికి హాయిగా వుండేది. తండ్రి ఆ బాధ్యతలు పట్టించుకోడనే కినుక వుండేది వాళ్ళకి.

మార్కుల లిస్టుతో ఇంటికి వచ్చిన వాడి పెద్దక్క నవ్వుతూ, "ఒరేయి సూర్యం! నువ్వు తెలుగులో ఇన్ని పుస్తకాలు చదువుతావూ, ఇన్ని మాటలు చెబుతావూ! మరి తెలుగులో మార్కులు సరిగ్గా రాలేదేం?" అనడిగింది.

సూర్యం మార్కుల లిస్టు చూశాడు. లెక్కల్లో 96. ఇంగ్లీషులో 96. హిందీలో 95. సైన్సులో 86. సోషల్లో 78. తెలుగులో 56.

"నేను బాగానే రాశాను తెలుగు కూడా. అయినా మేష్టారు ఎందుకో తెలుగులో మార్కులు వెయ్యరు. అందుకే పెద్ద బళ్ళో నేను ఏడులోకొచ్చాక సంస్కృతం తీసుకుంటాను. మార్కులేస్తారు. 'ఏ' సెక్షనులో కూడా వేస్తారు. అదీగాక

స్కూలు తెలుగు పుస్తకాల్లో వుండే తెలుగు వేరూ, కథల పుస్తకాల్లో వుండే తెలుగు వేరూ. ఎక్కువ కథల పుస్తకాల్లో మనం మాట్లాడే తెలుగు వుంటుంది. స్కూలు తెలుగు పుస్తకాల్లో అలా కాదు బాబూ" అన్నాడు సర్ది చెబుతూ.

పెద్ద బళ్ళో 'ఏ' సెక్షనుకి మంచి మేష్టార్లు వస్తారనీ, బాగా చదివే పిల్లలు ఆ సెక్షన్‌లోనే వుంటారనీ ఒక నమ్మకం.

సూర్యం పెద్దక్క మర్నాడే టీ.సీ, మార్కుల లిస్టూ పెద్ద బళ్ళో ఇచ్చింది తమ్ముడి ఆరవ తరగతి సీటు కోసం.

"ఇన్ని మార్కులొచ్చాయి. నీక్కాక సీటు ఇంకెవరికిస్తార్రా" అని తల్లి ధైర్యం చెప్పినప్పటికీ, సూర్యానికి ఒకటే దిగులు.

ఆరవ తరగతిలో ప్రతీ సబ్జక్టుకీ ఒక్కో టీచరొస్తారు. ఎత్తు బల్లలుంటాయి కూర్చోడానికి. రాసుకోడానికి ముందు బల్ల కూడా వుంటుంది. పెద్ద బళ్ళో చదవడం పెద్ద ప్రతిష్ఠ వాడికి.

రెండ్రోజులు పోయాక పెద్దక్కతో పెద్ద బడికెళ్ళాడు తన సీటు విషయం తెలుసుకోవడానికి. వాడికి ఎక్కడ అశుభం జరుగుతుందోనని ఒకటే దిగులు లోపల్లోపల. పొద్దున్నే తలారా స్నానం చేసి, దేముడికి పూజ చేశాడు. శుభం కలగాలని మొక్కులు మొక్కుకున్నాడు. బయల్దేరేముందు తల్లిని ఎదురు రమ్మన్నాడు.

"వీడికి చాదస్తం ఎక్కువయింది" అని మూడో అక్క విసుక్కుంది.

"పోనీ లేవే! చిన్న పిల్లాడు. వాడి భయం వాడిది" అని సర్ది చెప్పింది తల్లి.

అంతా చేసి, వాడి భయమే నిజం అయింది.

"ఒకటీ, రెండూ ఇంట్లో ప్రైవేటుగా చదవడం వల్ల, ఈ స్కూల్లో సీటివ్వరు" అంటూ, ఆ స్కూలు బంట్రోతు టీ.సీ, మార్కుల లిస్టూ సూర్యం పెద్దక్క చేతిలో పెట్టాడు.

చెప్పింది బంట్రోతనీ, అతనేమన్నా మామూలు ఆశిస్తున్నాడేమోనన్న విషయం కూడా సూర్యం పెద్దక్క గ్రహింపులోకి రాలేదు. బంట్రోతు మాట కాదని లోపలకి వెళ్ళి స్కూలు టీచరుతోనో, హెడ్ మేష్టారుతోనో మాట్లాడ్డం చేతకాలేదు ఆ అమ్మాయికి. అసలు ఆ ఆలోచనే రాలేదు. నిమ్న వదనాలతో ఇంటికి తిరుగు ముఖం పట్టారు అక్కా,తమ్ముళ్ళిద్దరూ. దారంతా ఏడుస్తూనే వున్నాడు సూర్యం.

ఇంటికి రాగానే వాళ్ళ మొహాలు చూసి విషయం అర్థం చేసుకుంది తల్లి. కూతుర్నించీ అన్ని వివరాలూ రాబట్టింది నెమ్మదిగా. వాడి చదువుకోసం ఒకప్పుడు తాను చేసిన చిన్న తప్పు, ఇప్పుడు మెడకి చుట్టుకుందని అర్థం చేసుకుంది.

"పోనీలెండి. ఆలోచిద్దాం ఏం చెయ్యాలో! ఆ భగవంతుడి దయ వల్ల ఏదో మార్గం దొరక్కపోదు" అంది తల్లి విషయాన్ని తేలిగ్గా తీసుకోవడానికి ప్రయత్నిస్తూ.

ఆ రోజంతా ఇంట్లో విషాదం తాండవించింది. మిగిలిన ఇద్దరక్కలూ కూడా తమ్ముడికి కోరుకున్న స్కూల్లో సీటు రాలేదని బాధ పడ్డారు. ఏం చెయ్యాలో ఎవరికీ తెలియదు. తెలిసే వయసు కూడా లేదు వాళ్ళకి. తండ్రికి ఆ విషయం చెప్పే ధైర్యం లేదు తల్లికి. ఎలాగో చెబితే, "ఒకటీ, రెండూ క్లాసులు ప్రైవేటు" అని రాయించినందుకు తనని తిడతాడని భయం ఆ తల్లికి. పోనీ వేరే స్కూల్లో ప్రయత్నిద్దామా అంటే, పిల్లాడు మనసంతా ఆ స్కూలు మీదే పెట్టుకున్నాడు. ఇంటికి ఆ స్కూలు దగ్గర, వెళ్ళి రావడానికి. దూరం స్కూలయితే రిక్షా పెట్టాలి. అదొక ఖర్చు. మధ్య తరగతి కుటుంబంలో అన్నీ ఇబ్బందులే. ఖర్చుకి తెగించినా ఇష్టం లేని స్కూలు. ఎంతో పెద్ద ఆపదొచ్చినట్టుగా అయిపోయారు వాళ్ళందరూ.

❦❦❦❦❦

ఇంకా వీధరుగు మీదే కూర్చున్న కొడుకుని ఇంట్లోకి రమ్మని పిలిచింది తల్లి. నెమ్మదిగా వెళ్ళాడు. అక్కడ వాడి ముగ్గురక్కలూ వున్నారు.

"నేను బాగా ఆలోచించాను. బెజవాడలో మీ పెద్ద మామయ్య భవానీ స్కూలుకి హెడ్ మేష్టారు. పెద్దక్కని వాడి దగ్గరకి పంపిస్తే, సూర్యం అయిదు క్లాసులూ ఆ భవానీ స్కూల్లోనే చదివాడనే టీ.సీ, మార్కుల లిస్టూ ఇస్తాడు. అవి పెట్టి వీణ్ణి ఇక్కడ పెద్ద బళ్ళో చేర్పించొచ్చు. ఎటొచ్చీ రైలు ఖర్చులు తగలెయ్యాలని ఆలోచిస్తున్నాను. ఇంకో రోజు చూద్దాం ఇంకా ఏమన్నా మంచి ఆలోచన దొరుకుతుందేమోనని!" అని చెప్పింది తల్లి వివరంగా.

సూర్యానికీ ఆలోచన నచ్చింది. పెద్దక్క వేపు చూశాడు. పి.యు.సి చదువుతున్న ఆ అమ్మాయి ఒక్కతే బెజవాడ వెళ్ళిరావడానికి సిద్ధ పడ్డట్టు ధైర్యంగా చూసింది.

"రేపు తగల పెట్టేదేదో ఈ రోజే తగలపెట్టొచ్చుగా! అప్పుడు నేను ఒకరోజు ముందుగా స్కూలుకి వెళ్ళొచ్చుగా!" అంటూ నీరసంగా అక్కడ నించీ లేచి వెళ్ళిపోయాడు సూర్యం.

వాడి మాటలకి ఆశ్చర్యపడింది తల్లి. వాడి మాటల్లో ఎంతో నిజం కనబడింది ఆవిడకి. స్కూలుకి వెళ్ళడానికి వీలుకాని ప్రతీ ఒక్కరోజునీ సూర్యం ఎంత బాధగా తీసుకుంటున్నాడో అర్థం అయింది ఆవిడకి. అంతే! ఎక్కడ లేని తెగింపూ వచ్చేసిందావిడకి. భర్త జేబుల్లోంచి కొట్టేస్తున్న చిల్లర ఒక పెంకు హుండీలో వేసి దాస్తోంది. అది బద్దలు కొట్టి డబ్బులు లెక్క పెట్టింది. కూతురికి పద్ధతులూ, దార్లూ, వివరాలూ అన్ని చెప్పింది. బాగా ధైర్యం చెప్పి, పదహారేళ్ళ కూతుర్ని, మేనమామ దగ్గర్నించీ పదేళ్ళ కొడుకు చదువు కోసం, దొంగ సర్టిఫికెట్ తీసుకురమ్మని రైలెక్కించింది.

ఇంక చెయ్యాల్సింది ఆ విషయం తండ్రికి తెలియకుండా. తెలిస్తే తండ్రి ఇంకా ఏమన్నా వుపయోగకరమైన పని చేస్తాడేమోనన్న ఆలోచన కూడా లేదు వాళ్ళకి. వుత్త భయం మాత్రం వుంది. ఇంటి మగాడు, ఇంటి యజమానీ అంటే భయం వుండటమే సహజం వాళ్ళకి. ఆ రోజు శనివారం. ఎలాగూ కాలేజీలో వుండాల్సిన పిల్ల. మర్నాడు ఆదివారం ఒక్క రోజూ తండ్రికి తెలియకుండా వుండగలిగితే, సోమవారం మధ్యాహ్నం లోపు ఎలాగూ ఆ అమ్మాయి బెజవాడ నించీ వచ్చేస్తుంది. అదీ వాళ్ళ ప్లాను.

కరెంటు లేదు ఆ కొంపలో. మూడు వాటాలూ, పది మంది పిల్లలూ గల ఆ దిగువ మధ్య తరగతి కుటుంబాలలో, పిల్ల గురించి ఒక్క రోజు ఆ తండ్రికి తెలియకుండా వుంచడం అసాధ్యం కాలేదు. ఆ అద్దెకున్న వాటాల్లో పిల్లలు అక్కడా, ఇక్కడా రాత్రిళ్ళు నిద్ర పోవడం మామూలే. వంటిల్లుతో కలిపి రెండేసి గదుల వాటాలు. ఉమ్మడి సావిడి, చిన్న వసారా. అన్నీ అన్ని వాటాల వాళ్ళూ కలిపే వాడుకునేవారు.

మొత్తానికి తండ్రి నించీ ఏ ఆపదా రాకుండానే ఆ అమ్మాయి విజయంతో ఇల్లు చేరుకుంది క్షేమంగా. ఆ అమ్మాయి తిరిగి వచ్చేవరకూ, ఆ తల్లీ,కొడుకులు మొక్కని మొక్కు లేదు. తప్పు చేస్తున్నానేమోనని తల్లికి భయం. తన కోసం అక్కని అంత కష్ట పెట్టేస్తున్నామని పిల్లాడికి బాధ. ఆ అమ్మాయి కొత్త టీ.సీ తోనూ, కొత్త మార్కుల లిస్టు తోనూ ఇంటికి చేరగానే వాళ్ళ బాధంతా చేత్తో తీసేసి నట్టయింది.

కొత్త మార్కుల లిస్టులో అన్ని మార్కులూ మేనమామ తక్కువ వేశాడని గొణుక్కున్నాడు సూర్యం. పాత టీసీలో దొంగ వయసు రెండేళ్ళు ఎక్కువుంటే, కొత్త దొంగ టీ.సీలో దొంగ వయసు ఒక్క యేడాదే ఎక్కువుందని తల్లికి

కాస్త సంతోషం. అక్క అంత పెద్ద పని చేసుకొచ్చిందని మిగిలిన ఇద్దరు పిల్లలూ, ఆ అమ్మాయిని ఎంతో ఆరాధనగా, ఎంతో గౌరవంగా చూశారు.

స్నానం, భోజనం చేసి కాసేపు పడుకుంటానంది సూర్యం పెద్దక్క. ప్రయాణంలో పిల్ల అలిసిపోయిందని, "కాస్సేపు పడుకో. లేచాక వెళుదువు గాని స్కూలుకి వాడితో" అంది తల్లి కూతురితో అభిమానంగా.

ఇంక అప్పటి నించీ, ఎప్పుడు అక్క లేస్తుందా, ఎప్పుడు స్కూల్లో చేర్పిస్తుందా అని సూర్యం కాలుగాలిన పిల్లిలా తిరగడం మొదలుపెట్టాడు. ఇంక వాడి బాధ చూడలేక, మనసులో ఇబ్బంది పడుతూనే కూతుర్ని నిద్ర లేపింది తల్లి.

సూర్యం, వాడి పెద్దక్కా తయారయ్యారు స్కూలుకి వెళ్ళడానికి దొంగ సర్టిఫికెట్లతో. అప్పుడొచ్చింది వాళ్ళమ్మకి ఇంకో ఆలోచన.

"పక్క సందులో సుబ్రహ్మణ్యం మేష్టారున్నారు. ఆయన ఈ పెద్ద బళ్ళోనే పని చేస్తున్నారు. వెళ్ళి ఆయనకి ఒకసారి కనబడి విషయం చెప్పి వెళ్ళు" అంది కూతురితో.

సూర్యాన్ని తీసుకుని పక్క సందులోని మేష్టారింటి కెళ్ళింది ఆ అమ్మాయి.

"మేష్టారండీ! మేం మీ పక్క సందులో వుంటామండీ. మా తమ్ముడిని మీ స్కూల్లో చేర్చడానికి సర్టిఫికెట్లు తీసుకుని వెళుతున్నామండీ. మీరు కాస్త సహాయం చెయ్యండీ" అంది ధైర్యంగా.

ఆ మేష్టారు వాళ్ళని ముందర వెళ్ళమనీ, తను వెనకాల సైకిలు మీద స్కూలుకి వస్తాననీ చెప్పాడు. వీళ్ళు స్కూలుకి చేరేసరికి ఆయన కూడా స్కూలు చేరాడు. వీళ్ళ దగ్గర టీ.సీ, మార్కుల లిస్టూ తీసుకుని లోపలకి వెళ్ళాడు. కాస్సేపట్లో తిరిగొచ్చి వాళ్ళ చేతిలో అప్లికేషను పెట్టి, "ఇది పూర్తి చేసి, జీతం కట్టెయ్యండి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అక్కా, తమ్ముళ్ళ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ఎంతో సంతోషంగా ఇంటికి చేరుకున్నారు. ఇంటిళ్ళపాదీ నవ్వు ముఖాలతో తిరిగారు. వెంటనే అప్లికేషను పూర్తి చేసి, జీతం కట్టేశారు. ఆ రోజంతా పెద్దక్క ఏ పని చెప్పినా నోరెత్తకుండా చేశాడు సూర్యం. రాత్రి సంతోషంతో ఓ పట్టాన నిద్ర పట్టలేదు వాడికి.

మర్నాడు స్నేహితులతో కలిసి స్కూలుకెళ్ళాడు. మధ్యాహ్నం వరకూ బాగానే జరిగాయి క్లాసులు. మధ్యాహ్నం ఒక టీచరుకి బోరు కొట్టింది పాఠం చెప్పడానికి.

ఒక్కో విద్యార్థినీ లేచి ఏ స్కూల్లో చదివిందీ, ఎన్ని మార్కులొచ్చిందీ చెప్పమంది. బిక్క చచ్చిపోయాడు సూర్యం. ఇంట్లో అమ్మా, అక్కా చెప్పిన పాఠం గుర్తుంది
వాడికి.

తడబడుతూ, "నేను బెజవాడలో భవానీ స్కూల్లో చదివాను. నాకొచ్చిన మార్కులివీ" అంటూ చెప్పాడు.

పక్కనున్న కుర్రాడు, "తప్పు టీచర్! వీడు మా భారతీ విద్యాలయంలోనే చదివాడు టీచర్! అబద్ధం చెబుతున్నాడు" అని కంప్లైంటు చేశాడు.

"లేదు టీచర్! నేనబద్ధం చెప్పడం లేదు" ఏడుపొక్కటే తక్కువ సూర్యానికి.

ఆ టీచర్ మొదటి నించీ ఏ విద్యార్థి మాటలూ వినడం లేదు. విసుగ్గా వుందావిడ. "సైలెన్సు" అని గట్టిగా అరిచి, ఇంకో కుర్రాడిని లేపింది వివరాలు చెప్పమని వాడి గురించి.

"బతికానురా దేముడా" అనుకుంటూ, బిక్కు బిక్కు మంటూ కూర్చున్నాడు సూర్యం. పక్కనున్న కుర్రాడు సూర్యాన్ని రాజనాలని చూసినట్టు చూశాడు వాడు చెప్పిన అబద్ధానికి. స్కూలు నించీ ఇంటి కొచ్చే దారంతా కాల్చుకు తిన్నాడు, "అబద్ధం ఎందుకు చెప్పావూ" అంటూ.

ఇల్లు చేరేటప్పటికి చాలా విసుగు పుట్టింది సూర్యానికి. ఇంట్లో చూస్తే తండ్రి ఇంకా పనికి వెళ్ళలేదు. తల్లిని ఏదో తిడుతున్నాడు.

"అంత చిన్న పిల్లని ఒక్కతినీ బెజవాడ పంపిస్తావా? బుద్ధుందా నీకు? నాతో ఒక్క మాట చెప్పొద్దా? నేను గాంధీనగరం స్కూల్లో చేర్చేవాడినిగా వాడిని? ఇంటి యజమానికి నాకు చెప్పకుండా, అన్నీ మీరే చేసెయ్యడమేమిటీ? పిల్లకి ఏమన్నా అయితే?" తల్లిని మందలిస్తున్నాడు.

తల్లి కళ్ళల్లో నీళ్ళు. ఆ విషయం తండ్రికెలా తెల్సిందో అర్థం కాలేదు. రెండో అక్క చెప్పింది వాడికి సంగతి. పెద్ద మేనమామ పిల్లని తిరుగు రైలు ఎక్కించే ముందే, పిల్ల క్షేమంగా చేరగానే కార్డు రాయమని రాసిన కార్డు అప్పుడే వచ్చి తండ్రి కంట పడింది. తల్లిని గట్టిగా అడిగితే, భయపడుతూ విషయం అంతా చెప్పేసింది. తప్పంతా తనదేనన్నట్టు తల వాల్చుకు నించుంది.

"మీ అమ్మ అంటే చదువుకోలేదు. నువ్వు చదువుకుంటున్నావు కదమ్మా? అలా ఒంటరిగా బెజవాడ వెళ్ళి రావడం ఎంత డేంజరో నీకు తెలియదూ? నాన్నతో అంతా చెప్పాలని తోచలేదా నీకూ?" అంటూ కూతుర్ని కూడా మందలించాడు తండ్రి.

అభిమానంతో ఆ కూతురు కన్నీళ్ళు కార్చింది.

అసలే స్కూల్లో గొడవతో వున్న సూర్యం, అమ్మా, అక్కల కన్నీళ్ళు చూడలేకపోయాడు. తన వల్లే కదా వీళ్ళకీ ఇబ్బందులన్నీ? భరించలేకపోయాడు. ఎక్కడ లేని ధైర్యం వచ్చేసింది.

"నాన్నా! వాళ్ళు చేసిందంతా నా కోసం కదా! నీతో చెప్పాలంటే అందరికీ భయమే. ప్రతీదానికీ భయమే. భయం, భయం. నువ్వెప్పుడూ కొట్టవూ, తిట్టవూ కదా! మరెందుకు నాన్నా నువ్వంటే మా కంత భయం? అస్తమానూ అమ్మ, "ఇంటి యజమానీ", "ఇంటి మగాడూ" అంటుందేమిటీ నిన్నూ? నువ్వు మా నాన్నవే కదా! నువ్వెందుకు మా చదువుల సంగతులు పట్టించుకోవూ? ఆదివారం కూడా ఇంట్లో వుండకుండా ఎక్కడి కెళ్తావూ? అస్తమానూ సిగరెట్లు కాలుస్తావు. నీ ఆరోగ్యం గురించి భయం. రోజూ పేకాడతావు. పోలీసులు పట్టుకుంటారేమోనని భయం. ఎన్ని భయాలతో బతుకుతున్నామో మేము. నేను ఎప్పుడూ బాగా మాట్లాడతానని అంటారుగా. ఇప్పుడు ఇలా అంటున్నానని కొడతావా? నాన్నంటే భయం ఎందుకుండాలి నాన్నా? అమ్మా, అక్కా ఏడుస్తుంటే నాక్కూడా ఏడుపొస్తోంది నాన్నా!" అంటూ గట్టిగా ఏడవసాగాడు సూర్యం.

అన్ని ప్రశ్నలకూ జవాబు తెలుసనుకునే ఆ తండ్రి, కొడుకడిగే ఆ ప్రశ్నకి జవాబెలా చెప్పాలో తెలియక, కొడుకు వేపు అలాగే చూస్తూ వుండిపోయాడు.

***

# మీరెవరితాలూకు!

## నిడదవోలు మాలతి



"ఆవిడెవరూ? ఒక్కరే వచ్చినట్టున్నారు. ఎక్కడా చూసినట్టులేదు?" అన్నారొకావిడ వెనక వరసలో కాస్త ఎడంగా కూర్చున్నావిడనుద్దేశించి.

పది కళ్ళు అటు తిరిగేయి పొద్దు తిరుగుడు పువ్వుల్లా.

"ఆవిడా? కౌశికిగారు. మీకు తెలీదూ? అదే మన పిచ్చికుంట్ల సుబ్బరామయ్యలేరూ. ఆయన భార్య. నాకూ తెలీదు అంబరీషుగారు చెప్పేవరకూ" అంది అంబరీషుగారి భార్య.

అమెరికాలో అదొక మహానగరం. స్థలం ఒక ఆలయప్రాంగణం. అక్కడ చేరిన జనం తెలుగు జాతీయులు. సందర్భం సంక్రాంతి సంబరాలు.

హాలంతా కోలాహలంగా ఉంది - పట్టుచీరెల రెపరెపలతో. పంజాబీ కుర్తాల్తో, షెర్వాణీలతో, పువ్వుల పరికిణీల్లో జీన్ల కలవాటుపడ్డ కాళ్ళమూలాన కలిగిన తొట్రుపాటుతో, అదిచూసి తలలు నెరిసిన తల్లుల నవ్వులతో అచ్చంగా మన ఊళ్ళలోలాగే.

ఆడవారంతా ఓపక్కనా, మగవారు మరోపక్కనా చేరి మంతనాలాడుకుంటున్నారు. ఇంగ్లీషూ, తెలుగూ, హిందీ కలగాపులగంగా, ఉగాదిపచ్చడికి దీటు రాగల నుడికారంతో.

పిల్లలు చిన్న చిన్న గుంపులుగా తమ తమ తరగతుల్ని బట్టీ, సరదాల్ని బట్టీ జట్లు జట్లుగా విడిపోయి గలగల తిరిగేస్తున్నారు హుషారుగా.

మగవాళ్ళలో మధ్య వయస్కులు పిల్లల కాలేజీ చదువుల గురించీ, వాటికయే ఖర్చులగురించీ వాదించుకుంటున్నారు. ఆస్థాయి దాటినవారు తాము పెంచి పెద్ద చేసిన పిల్లలు ముందు ముందు తమని ఆదుకుంటారా,... కోరా,... కోకపోతే తమరేం చేయాలి వంటి సాధకబాధకాలు చర్చించుకుంటున్నారు.

మధ్యలో మగవారు తమ తాలూకూ ఆడవారిని తాళాలేవీ, పిల్లలేరీ, నీకిచ్చిన కాయితాలేవీ లాటివి అడగడానికొచ్చి, ఆ పక్కనా ఈ పక్కనా ఉన్నవారు ఎవరో, ఎవరు ఎవరికేమవుతారో తెలుసుకుని తృప్తిగా వెనక్కి మళ్ళుతున్నారు...

ఆ ప్రజా సమూహం మధ్య, ధ్వజస్థంభంలా కాకపోతే తామరాకు మీద నీటిబొట్టులా అందరిలో కలిసిపోతూ, విడిపోతూ, అందరికీ అయినదానిలాగానూ, ఎవరికీ కానిదానిలాగానూ సీదాగా తిరుగుతున్నారు పంకజంగారు.

సభ మొదలయింది. వేదిక మీదకి దీక్షితులుగారు విజయం చేశారు.

"మామూలుగా ఇలాటి వేడుకల్లో ఉపన్యాసాలుండవు కాని కార్యదర్శి పెద్దిరాజుగారు సంక్రాంతి విశేషం ఏమిటో నాలుగు ముక్కల్లో చెప్పమన్నారు. అంచేత రంగమ్మీద కొచ్చేను. మీలో చాలామందికి నన్ను సుబ్బలక్ష్మిగారి హబ్బీగానే తెలుసు. మా తల్లితండ్రులు బారసాలనాడు నాకు చేసిన నామకరణం అభిరామదీక్షితులు...."

మూడో వరుసలోంచి ఎవరో విశ్వదాభిరామ వినురవేమా అంటూ దీర్ఘం తీసారు. దీక్షితులు అటుతిరిగి, "లేదు నాయనా, ఆ అభిరాముణ్ణి కాను. కనీసం దాయాదులం కూడా కాం." అన్నారు ప్రేక్షకులు నిశ్శబ్దంగా నవ్వారు. దీక్షితులుగారు సంక్రాంతి పదానికి అర్థం, విశేషాలు గబగబ నాలుగంటే నాలుగు ముక్కల్లో పరువు దక్కించుకున్నారు.

తరువాత నలుగురు పిల్లలు స్టేజీ మీదికొచ్చి మా తెలుగుతల్లికి మల్లెపూదండ పాడేరు. తరువాత వరుసగా పిల్లలు స్టేజీ ఎక్కడం, దిగడంతో ఓ అరగంట గడిచింది. స్టేజీమీద పాడుతున్న మరియు ఆడుతున్న పిల్లలు ఎవరు ఎవరి తాలూకో స్టేజీ ముందు తిరుగాడుతున్న కెమేరాలని బట్టీ, స్టేజీకి కాస్త ఎడంగా నిలబడి దిలాసా కబుర్లాడుకుంటున్న వారిని బట్టీ విశదం అవుతోంది. కాస్త చురుకుపాలు ఎక్కువైనవాళ్ళు పందేలు కాస్తున్నారు ఎవరెవరి తాలూకు అయివుండొచ్చో, అలా అనుకోడానికి కారణాలేమిటో వివరిస్తూ.

మూడో వరుసలో ఉన్న సుందరిగారు, "అదుగో ఆ చివరనున్న పాప మా పెదనాయన మూడో కూతురు మనమరాలు" అంది పక్కనున్నావిణ్ణి మోచేత్తో పొడిచి.

ఆ పక్కనున్నావిడ ఉలిక్కిపడి, సర్దుకుని, "ఇటుచూడండి, వీరయ్యగారి వెనకాలున్న ఉంగరాల జుత్తు కుర్రాడే నేను మీకు ఇందాక చెప్పింది. మా పొరుగూరు చంద్రయ్యగారి బామ్మర్ది. మీ చెల్లెలి కొడుక్కి ఈడూ జోడూను" అంది మరో చివరున్న చిన్న వాణ్ణి వేలెత్తిచూపుతూ.

అలా చూపబడిన కుర్రాడు వాళ్ళ వరస గమనించి పక్కకి తప్పుకున్నాడు అప్రసన్నంగా.

'నేను అభిరామ్‌గారి వైపుని" అంది సుందరిగారికి అటుపక్కనున్నావిడ కణ్వశ్రీగారి కోడలు.

సుందరిగారు అటు తిరిగి నవ్వింది. "బాగుంది. అయనేమో సుబ్బలక్ష్మిగారు హబ్బీనన్నారు. మీరేమో అభిరామ్‌గారి వైపునంటున్నారు."

"వల్లిగారెక్కడ కనిపించలేదు. ఆమె రాలేదేమి" అన్నారు మరెవరో.

"సరేలెండి. మీకు తెలీదేమో. చక్రిగారు లేకుండా ఆవిడ రారు. ఆయనేమో ఇండియా వెళ్ళారు."

"మీ వారేరీ?" వెనుకవరసలో ఉన్న వినతిగారు ముందుకి వంగి కౌశికి భుజం తట్టి ప్రశ్నించారు.

కౌశికి ఇబ్బందిగా కదిలి, "మీకు తెలీదేమో, మేం విడిపోయి చాలాకాలం అయిందండీ," అంది.

"అయితేనేం. యూకెన్ ఆలేవ్స్ బి ఫ్రెండ్స్. మా అమ్మాయి ఆల్సో డైవోర్సుడే ఇప్పటికీ చిలకా గోరింకల్లా కలిసి తిరుగుతారు," అంది స్థానికుల భావాలు పెంపుడు చిలకలా ఒప్పగిస్తూ వినతిగారు. స్టేజీ మీద అమ్మాయి "చెయ్యెత్తి జేకొట్టు తెలుగోడా, గతమెంతో ఘనకీర్తి గలవోడా..." అంటూ అందుకుంది.

కౌశికి పాట వినసాగింది ప్రయత్నం మీద తాను చిన్నప్పుడు ఆపాట నేర్చుకోడానికి ఎంత తంటాలు పడిందో గుర్తు చేసుకుంటూ. ఆ పాటే ఇప్పుడు మనసుని తాకడంలేదు ఎంచేతో మరి. నోరు వెగటుగా ఉంది. వినతిగారి వాక్యాలు ఎదలో ముల్లై కెలుకుతున్నాయి. ఆయనే ఉంటే మంగలెందుకు అన్న సామెత గుర్తుకొచ్చింది. అందరికీ ఒక్కలా జరగదు. వెనకటితరం వారికీ, ఈతరం వారికీ సహస్రాంతం తేడా ఉంది.

కౌశికి మొహం కళ తప్పడం పంకజంగారు గమనించి చిన్న నిట్టూర్పు విడిచారు. చెప్పుకు తిరగడానికి నాగరీకదేశంలో వాసం. మాట సొంపు చూస్తే ఇక్ష్వాకులనాటి జాతీయాలు!

ఇంతలో రమణగారు వచ్చి, "కాఫీ కావాలా?" అని అడిగారు పంకజంగారిని.

"ఎక్కడుంది, నేను తెచ్చుకుంటాను లెండి" అని రమణగారికి సమాధానం చెప్పి ఇటుతిరిగి చూస్తే కౌశికి లేదు.

పంకజం లేచి, వరండాలో కాఫీ తీసుకుని, రెండు పంచదార ముక్కలు తీసుకుని, చుట్టూ కలయచూసింది. దూరంగా ఓ స్థంభాన్నానుకుని నిలబడి సూర్యాస్తమయం తిలకిస్తున్న కౌశికి కనిపించింది. దగ్గరికి వెళ్దామా, వద్దా అని తను సందిగ్ధంలో పడికొట్టుకొండగానే ఆ అమ్మాయే ఇటు తిరిగి చూసి చిన్నగా నవ్వింది. అదే పచ్చ జండాగా గుర్తించి, పంకజం అటు నడిచింది.

"ఏం బయటకొచ్చేశారు, ఆ పాటలూ, ఆటలూ చూసేలా లేవనా?" అంది నవ్వుతూ.

"అదేం లేదండీ. పిల్లలు, ఏంచేసినా ముద్దుగానే ఉంటుంది. అందులోనూ మనదేశానికి ఇంతదూరంలో ఉండీ ఆమాత్రం నేర్చుకున్నారంటే గొప్ప మాటే కదా."

కాస్సేపు ఇద్దరూ అస్తమిస్తున్న సూర్యుణ్ణీ, కమ్ముకొస్తున్న చిరుచీకట్లనీ చూస్తూ కూర్చున్నారు.

"అసలు ఇలాటి సమ్మేళనాలకి రావడం నాకంత ఇష్టం ఉండదు. రాను మొర్రో అని మొత్తుకుంటున్నా వినకుండా మా మేనత్త మనమరాలు ఈడ్చుకొచ్చింది వాళ్ళమ్మాయి డాన్సు చేస్తుంది రమ్మని."

"ఏరీ ఆవిడ మరి?"

"తెరవెనకుంది. వాళ్ళమ్మాయికి ముస్తాబు చేస్తోంది."

పంకజం తలూపింది.

కౌశికే కొంచెంసేపూరుకుని, మళ్ళీ అంది, నెమ్మదిగా తనలో తను మాటాడుకుంటున్నట్టు, "ప్రభావతిగారిని చూడండి. నా సంగతి నాకంటే ఆవిడకే ఎక్కువ తెలుసు. అయినా ప్రతిసారీ మీ ఆయన్ని ఇక్కడ చూసాను, మీ ఆయన ఇలా అన్నారు అంటూ ఒకటే సొద. నాకంటే ఆవిడకే ఎక్కువ యావలా ఉంది. మళ్ళీ తన భర్త గురించి మాటాడినప్పుడు మావారు అనదు. పద్మనాభంగారు అంటూ పేరెట్టి మాటాడుతుంది. ఎందుకలా చెడిపోయిన సంబంధాల గురించి ఎత్తి పొడుస్తున్నట్టు మాటాడ్డం చెప్పండి. అక్కడికి ఫలానా ఆయన ఒగ్గేసిన ఆడమడిసిగానే నా అస్తిత్వం అయినట్టు. ప్రతివారికీ ఈ కొండ గుర్తులు అవసరమా అని కూడా అనిపిస్తుంది ఒక్కొక్కప్పుడు..."

పంకజంగారికి మాట తోచలేదు. ఆసమయంలో తను చేయగలిగిందల్లా వినడమే. మందహాసం చేసారు అర్థమయిందన్నట్టు.

మళ్ళీ కౌశికే అంది, "ఇంతకీ మీ మాట చెప్పనే లేదు, మీరెవరి తాలూకూ?"

ఈసారి ఆవిడ గట్టిగానే నవ్వేశారు. కౌశికి కూడా నవ్వింది ఆపూటకి తొలిసారిగా.

"తాలూకాలూ లేవూ, జిల్లాలూ లేవు. ఎవరికివారే యమునాతీరే," అంటూ ఆగిపోయారు, లిప్తపాటు తనవునికిని మరచి.

కౌశికి అప్పుడే కొత్త వ్యక్తిని చూసినట్టు ఆవిడ మొహంలోకి చూడసాగింది.

"అదికాదండీ. మీరు కూడా ఒక్కరే వచ్చినట్టున్నారు. మీకింత నిబ్బరం ఎలా వచ్చిందనీ."

"పారలాక్స్ ఎర్రర్ అనుకో, దృష్టిదోషం అనుకో, కొంతవరకూ మానవనైజం కూడాను. ప్రతిజీవుడికీ మరో మనిషికో, గుంపుకో చెందాలన్న తపన తప్పదనుకుంటాను. ప్రతిమనిషీ మరొక మనిషితో ఏదో ఒరకం చుట్టరికం కోసం అనుక్షణం వెతుక్కుంటూనే ఉంటాడు. మా ఊరువాడూ, మా పొరుగువాడు, మాకులంవాడూ, మా ఆఫీసులోవాడూ అంటూ బీరకాయపీచు చుట్టరికాలు కలుపుకుంటూనే ఉంటాడు. ఆదిని గణవిభజనకి కూడా ఇదే ప్రాతిపదికేమో."

"మీకు మనుషులమీద మహానమ్మకంలా ఉంది," అంది కౌశికి కళ్ళు చిట్లించి చూస్తూ.

"ఏమో, అది నమ్మకమో అమాయకత్వమో నాకు తెలీదు. నిజానికి మూఢనమ్మకమేనేమో కూడా. ఓ కథ చెప్తాను. నేను దాదాపు పాతికేళ్ళ కిందట ఇండియా వెళ్ళాను. ఆరోజుల్లో బొంబాయో, మద్రాసో వెళ్ళి మా ఊరు వెళ్ళేవాళ్ళం. అలా వెళ్ళి వస్తుంటే, ఆసారి మాత్రం సవ్యంగా సాగలేదు, పూనాలో మా అన్నయ్యని చూసి బొంబాయి బయల్దేరుతున్నాను. సరిగ్గా తెల్లారి బయల్దేరే సమయానికి మా పిల్లకి డయేరియా, నాకు నూటనాలుగు జ్వరం ఏం చెయ్యను? నేనొక్కదాన్నయితే ఏదో తంటాలు పడుదును. చేతిలో మూడేళ్ళ పిల్ల. మా అన్నయ్య ఆ రోజుకి ఉండిపొమ్మన్నాడు. బొంబేలో ఎయిరిండియాకి ఫోన్ చేశాడు. వాళ్ళు టిక్కెట్లు మార్చడానికి ఒప్పుకున్నారు అన్నాడు. సరే రెండురోజుల తరువాత, కాస్త స్తిమితపడిన తరువాత, మా ఇద్దరినీ టాక్సీ మాట్లాడి పంపించాడు. టాక్సీ డ్రైవరుకి మరీ మరీ చెప్పాడు జాగ్రత్తగా తీసుకెళ్ళమని. తీరా ఎయిరిండియా ఆఫీసుకి వెళితే నెలరోజులవరకూ ఖాళీ లేదన్నాడు ఆ ఆఫీసరు. నాకు గుండె గుభేలుమంది. మళ్ళీ ఆ టాక్సీయే ఎక్కి బ్రిటిష్ ఎయిర్వేస్ ఆఫీసుకి వెళ్ళాను. అక్కడా అంతే. అలా ఆ పూటంతా తిరిగాం.

గత రెండురోజులుగా మా ఇద్దరికీ ఒంట్లో బాగోలేకపోవడం మూలంగానూ, రోజంతా టాక్సీలో తిరగడం మూలానూ ప్రాణం కడబట్టింది.

బండి తోలుతున్న సర్దార్జీకి కూడా విసుగేసినట్టుంది, "బెహన్జీ, నేను ఉదయం నుంచీ మీతోనే ఉన్నాను. మీరు ఎక్కడికి వెళ్తారో చెప్పండి. మిమ్మల్ని అక్కడ విడిచేసి ఇంటికి పోతాను. మా భార్య బిడ్డ నాకోసం చూస్తుంటారు," అన్నాడు సర్దార్జీ తనకొచ్చిన ఇంగ్లీషులో.

"సరే, ఏదేనా చిన్న హోటలికి తీసుకెళ్ళు," అన్నాను నాకొచ్చిన హిందీలో.

నాకు మరీ పెద్ద హోటళ్ళు పడవు. ఏదో మామూలు హోటలు చూడమన్నాను. అతను ఏవో రెండు మూడు హోటళ్ళకి తీసుకెళ్ళాడు. ఎక్కడా గదులు లేవు. ఊళ్ళో ఏవో మీటింగులూ, సంబరాలూనట. రాత్రి తొమ్మిదయింది. ఒకహోటల్లో ఒక చిన్నగది చూపించాడు లోపలికి తీసికెళ్ళి. చీకటి గుయ్యారం, కిటికీలు లేవు. తలుపు వేసుకుంటే ఇనప్పెట్టెలో ఉన్నట్టే. మనం సామాన్లు కొట్టు అంటాం చూడు అలా ఉంది. పగలయినా గాలీ వెలుతురూ తగిలే సూచనల్లేవు. ఆ మేనేజరు ఎందుకో బయటికి వెళ్ళిన సమయం చూసి, సర్దార్జీ ఈ గది బాగోలేదు. మీరు ఉంటానంటే మీ ఇష్టం. లేకపోతే వేరే చూద్దాం అన్నాడు, ఇంగ్లీషు వదిలేసి తనకలవాటయిన హిందీలో. మరో రెండు నిముషాలకి ఆమేనేజరు తిరిగి వచ్చాడు.

"మళ్ళీ వస్తాను" అన్నాను. ఈ గది నాకొద్దు అని స్పష్టంగా చెప్పడానికి బెరుకు. సర్దార్జీ కూడా కాస్త తొట్రుబాటుతో "నాదేంలేదు బెహన్జీ ఇష్టం" అన్నాడు.

ముగ్గురం బతుకు జీవుడా అనుకుంటూ బయట పడ్డాం.

కారెక్కాక, సర్దార్జీ అన్నాడు, "భాయ్‌సాబ్ మిమ్మల్ని జాగర్త అని చెప్పినారు, అంచేత చెప్తన్న బెహన్జీ మీకు నమ్మిక అయితే మా ఇంటికి పోదాం. మా అమ్మా, నాన్నా కూడా ఉంటారు."

పంకజం ఒక్క క్షణం ఆగి మళ్ళీ మొదలు పెట్టారు, "నేను అట్టే ఆలోచించలేదు. ఎందుకని అడక్కు. నాకు పూర్తిగా మతిపోయింది. సరే పదమన్నాను. అతనన్నట్టుగానే ఇంటి నిండా జనం. పాత చుట్టాన్ని ఆదరించినట్టు ఆదరించారు నన్నూ, మాపిల్లనీ. మర్నాడు బయలుదేరుతూ ఆ సర్దార్జీ కూతురు చేతిలో ఓ నోటు పెట్టబోయాను కానీ వాళ్ళు ఒప్పుకోలేదు. మమ్మల్ని తండ్రి ఎయిరిండియా ఆఫీసుకి తీసుకెళ్ళాడు. నన్ను కార్లోనే ఉండమని చెప్పి అతను లోపలికెళ్ళాడు. పావుగంటలో తిరిగొచ్చాడు. మాకు టిక్కెట్లు దొరికాయి."

"మంచివాళ్ళే, మీకు భయం వెయ్యలేదూ?" అంది కౌశికి విస్తుపోతూ.

"ఏమో అప్పట్లో నాకు తోచినట్టు చేశాను. తర్కానికి దిగితే నేను జవాబులు చెప్పలేను. ఇంటికొచ్చాక మావారికి చెప్తే, ఎవడితో పడితే వాడితో అలా వెళ్ళిపోవడమేనా, బుద్ధిలేదూ వాడు ఏ సందులోకో తీసుకెళ్ళి నాలుగు తంతే ఏం చేస్తావు అని కేకలేశారు. నాకు మొదట్లో తోచలేదు కానీ తరువాత ఆలోచిస్తుంటే నాకే నవ్వొచ్చింది. ఏ సందులోకో తీసుకెళ్ళడం ఎందుకు. ముందురోజు నేను ఎయిర్‌లైన్స్ ఆఫీసులచుట్టూ తిరుగుతున్నప్పుడు భోషాణాల్లా నాలుగు పెట్టెలు అతని కార్లోనే వదిలేశాను కదా కావాలనుకుంటే అతను ఆ పెట్టెలతో సహా కారు తోలుకుపోలేడా. నేను చేసేదేముంది కనక."

"నిజంగా? కాకమ్మ కథలా ఉంది."

"నమ్ము, నమ్మకపో, నీఇష్టం. నామటుకు నేను కూడా చాలా ఆలోచించాను ఎందుకలా చేశానా అని. ఇప్పటికీ అనుకుంటూనే ఉంటాను ఆ సర్దార్జీ రోజూ ఎంతమందిని కారులో ఎక్కించుకుంటాడో, వాళ్ళందరినీ తన ఇంటికి తీసుకెళ్తాడా, ఆ రోజు అతనికి ఆ బుద్ధి ఎందుకు పుట్టిందీ, నేనెందుకు అతన్ని నమ్మేనూ, మరో ప్రయత్నం గట్టిగా చెయ్యాలని నాకెందుకు తోచలేదూ, ... నాకు ఇప్పటికీ సమాధానాలు లేవు. బహుశా అతను, భాయిసాబ్, బెహన్జీ అంటూ బంధుత్వాలు కలపడంతో మన ఆతిథ్యాలు ఏమూలో మనసున పొడగట్టి పనిచేశాయేమో."

ఇద్దరు కొంచెంసేపు మౌనంగా దిగంతాల్లోకి చూస్తూ కూర్చున్నారు.

"నిజమేనేమోలెండి నేనందరికీ దూరంగా ఉంటాను, ఒంటిపిల్లి రాకాశిని. అయినా ఏ కూరల బజారులోనో ఓ తెలుగు పలుకు వినిపిస్తే గిరుక్కున వెనుతిరిగి చూస్తాను అసంకల్ప ప్రతీకార చర్యలాగా' అంది కౌశికి తప్పు చేసినట్టు తలవంచుకుని.

"అయివుండొచ్చు. నువ్వు ఈరోజు ఇక్కడికి రావడం కూడా అలాగే జరిగి ఉండొచ్చు. మీమేనత్త మనవరాలు నిమిత్తమాత్రురాలు."

"మీమాటే నిజమనుకుందాం. నా ఇష్టాఇష్టాలు కూడా గమనించాలి గదా జనాలు. నేను ఏబంధాలు పెంచుకున్నానో, ఏవి తెంచుకున్నానో తెలీనివాళ్ళు కనీసం తెలీనట్టు ఉండాలి కదా."

"నా అభిప్రాయం ఏమిటంటే నిజానికి మనిషంత irriational జంతువు మరి లేదు భువిలో. ఎప్పుడు ఏ మాట తోస్తే అప్పటికామాట అనేస్తారు. ఆ వెంటనే మరచిపోతారు. మళ్ళీ వాళ్ళే ఏరోడ్డుమీదో నీకు తారసపడితే నిన్ను గుర్తుకూడా పట్టకపోవచ్చు. నీలాటివాళ్ళు మాత్రం ఆ మాటలు పట్టుక్కూచుని మనసు పాడుచేసుకుని మధనపడతారు," అన్నారు పంకజంగారు సన్నగా చీవాట్లు పెడుతున్నట్టు కనిపించకుండా.

ఇంతలో హాల్లోంచీ హోరున చప్పట్లు వినిపించాయి.

కౌశికి మొహం చూసి ఏం అడగబోతూందో ఊహించినట్టు, "మరి ఇంకేం మాటాడకు. పద. ఇక్కడ మనం ఇలా తలా తోకా లేని కబుర్లతో కాలక్షేపం చేస్తూంటే అక్కడ వాళ్ళందరు మంచి మంచి పాటలూ, డాన్సులూ వినీ, చూసీ ఆనందించేస్తున్నారు."

"పదండి, మా మనవరాలి నృత్యం అయిపోయిందంటే నేను ఈ పూటంతా పడిన అవస్థకి ఫలితం సున్నా." అంది కౌశికి కూడా లేస్తూ.

# ప్రేలుకోసిన కత్తి

## సురేంద్ర దారా



'కడుపు మంట అన్న దాని గురించి ఎన్నోసార్లు విన్నాను, మరెన్నో సార్లు చదివాను. కానీ అది ఇలా ఉంటుందా. వాడు, ఆ ఫ్రాన్సువా గాడు ఇలా చేస్తాడా. ఎంత ధైర్యం వాడికి? పైగా తప్పు చేసి ఎలా తప్పించుకుందాం అనుకున్నాడు. వాడలా అనుకున్నా నేను చేసేదేమీ లేదు. ఎంతైనా వాడు ఈ దేశీయుడు, నేనే పరాయివాడిని. నేనిక్కడ ఎంత పెద్ద పొజిషన్‌లో ఉన్నా, కొన్ని సందర్భాల్లో స్థానికులని ఏమీ చేయలేని పరిస్తితి విదేశీయులది' అనుకున్నాడు చంద్రమౌళి.

చంద్రమౌళి పశ్చిమాఫ్రికాలోని బెనిన్ అనే ఓ చిన్న ఫ్రెంచి దేశంలో ఐక్యరాజ్యసమితికి సంబంధించిన ఒక ప్రాజెక్టులో ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. ఒక ఉద్యోగం అంటూ లేకుండా విదేశీయుల ఇళ్ళచుట్టూ ఈ పనులూ, ఆ పనులూ చేస్తానంటూ తిరుగుతూ ఉండే ఫ్రాన్సువా చంద్రమౌళికి తన ఆఫీసులో పనిచేసే ఒకతని ద్వారా పరిచయం అయ్యాడు.

అల్లర్లు, అలజడులూ లేకుండా ప్రశాంతంగా జీవించే బెనిన్ దేశీయులు ఎన్నో రకాలుగా చాలా వెనుకబడినవారు. కొన్ని దశాబ్దాల క్రితమే ఫ్రాన్సు ఆక్రమణ నుంచీ స్వాతంత్ర్యం లభించినా అభివృద్ధి అనేదానికి చాలా దూరంలో ఉన్నదాదేశం. శ్వేతజాతీయులను చాలా గొప్పవారిగా, పైలోకం నుంచీ దిగివచ్చిన వారిలా చూసే బెనినీయులు విదేశీయులను సాధారణంగానే గౌరవిస్తారు. ఇలాంటి వెనుకబడిన దేశాలనూ, ఆ ప్రజలనూ ఉద్ధరిస్తామంటూ వచ్చిన అనేక అంతర్జాతీయ సేవా సంస్థలకు కొదవలేదక్కడ. ఇలా వచ్చిన విదేశీయులు తమని ఉద్ధరిస్తున్నారో, లేక ఆర్థిక సహాయం పేరుతో తమ దేశానికిచ్చిన సహాయ నిధిని

తిరిగి తమతమ సేవా సంస్థల నిర్వహణ కోసమూ ఖర్చుచేస్తున్నారో అర్థం కాని పరిస్థితి ఆ దేశప్రజలది. ఈ సంస్థలు చేసే సేవ కన్నా అందులో పనిచేసే వారి విలాసవంతమైన జీవితాలే అక్కడి ప్రజలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. అలాంటి ఆకర్షణకు లోనైన వాళ్ళలో ఫ్రాన్సువా ఒకడు.

ఫ్రాన్సువాకి ఇరవయ్యేళ్ళుంటాయేమో. ఏకారణంవల్లో గానీ తన గురించి తాను ఎక్కువగా ఊహించుకుంటాడతను. డబ్బున్నవాళ్ళ ఇళ్ళల్లో పని చేస్తూ, తనూ ధనవంతుడై పోయినట్లు భావించుకుంటాడు అని చేసిన ఆ కొద్దిసేపూ. మంచి ఉద్యోగం తెచ్చుకునేందుకు కావలసిన చదువులేదు. కష్టపడి పనిచేసే తత్వం కూడా లేదు. ఏదో కొంత జీతానికి ఎవరో ఒకరి దగ్గర చేరడానికి సిద్ధపడితే అతనికి ఉద్యోగం రాకపోదు. నెల మొత్తం జీతగాడిలా పనిచేసే బదులు, అంతకన్నా ఎక్కువ డబ్బుని అప్పుడప్పుడూ సహాయపడటం ద్వారా సంపాదించాలని ఆలోచన. అతనికి స్థిరత్వం లేదని తెలియడం వల్లే ఎవరూ అతనికి నెలవారీ ఉద్యోగం ఇవ్వరు కూడా. తక్కువ కష్టంతో, తక్కువ సమయంలో ధనవంతుడైపోవాలని పగటి కలలు కంటూ ఉంటాడు ఫ్రాన్సువా. చేసే ప్రతీ పనీ, మాట్లాడే ప్రతీ మాటలో ఈ ధోరణి కనబడుతుంది. బలంగా, పొడవుగా మోటుగా ఉండే ఫ్రాన్సువా అతి తెలివి ప్రదర్శించడానికి ఎప్పుడూ ప్రయత్నించినా, అతనిలోని బుర్ర తక్కువతనం, అనుభవ రాహిత్యం ఆ వెంటనే బయటపడుతూ ఉంటాయి. ఈ కారణం వల్లనేమో, వాడు చేసే పిచ్చిపనులను పిల్ల చేష్టలుగా భావించి క్షమించేస్తుంటారందరూ.

అయితే దానికీ హద్దుంది. చంద్రమౌళి దగ్గర అతి తెలివి ప్రదర్శించడం ఫ్రాన్సువాకి కొత్తేమీ కాదు. చంద్రమౌళి ఈత కొట్టడం నేర్చుకోవాలనుకుంటున్న విషయం ఎవరి ద్వారానో విని మొదటిసారిగా ఈత నేర్పుతానంటూ వచ్చాడు. పోనీలే వాడికి సహాయం చేసినట్టూ ఉంటుంది తనకు ఈతా వస్తుంది కదాని ఒప్పుకున్నాడు చంద్రమౌళి. వారానికి ఒకటి రెండు క్లాసుల చొప్పున క్లాసుకి ఇంతని మాట్లాడుకుని ఈతకు వెళ్ళడం మొదలుపెట్టాడు. నెలయ్యింది, రెండు నెలలయ్యింది, మొదటిరోజు ఎక్కడున్నాడో రెండు నెలల తర్వాత కూడా అక్కడే ఉన్నాడు చంద్రమౌళి. త్వరగా ఈత నేర్పితే తనకు వచ్చే డబ్బులు పోతాయని వీలయినంత తక్కువగా నేర్పాలన్నది ఫ్రాన్సువా పథకం. కానీ అది చంద్రమౌళికి అర్థంకాదు అనుకోవడం అతని వెర్రిబాగుల తనానికి నిదర్శనం. దాంతో ఫ్రాన్సువాని ఈతపాఠాలు నేర్పొద్దని మానిపించేసాడు చంద్రమౌళి. ఇంకోసారైతే చంద్రమౌళి ఇంట్లో జరిగే ఓ పార్టీకి తను వంటలు చేస్తానంటూ ముందుకొచ్చి, సరుకులు కొనడం నుంచీ మొదలుపెట్టి చివరి వరకూ అందినంతా నొక్కేయడానికి ప్రయత్నించాడు. చంద్రమౌళి వాడికి చివాట్లు పెట్టి మందలించాడు. కుక్కతోకలాంటి ఫ్రాన్సువా బుద్ధి అంత తొందరగా మారదు. వ్రేలు తెగింది కదాని కత్తిని పారేసుకోని విధంగానే ఫ్రాన్సువా అవసరమైతే పనులు చేసేందుకు ఎవరో ఒకరుండాలి. విదేశీయులకు ఊరికే డబ్బు వచ్చిపడుతోందనుకుని, అవకాశం ఉన్నంతలో ప్రతి పనిలోనూ ఎక్కువ డబ్బు కొట్టేద్దామని ప్రతివాడూ చూస్తుంటాడు. ఇలాంటి అనుభవాలకు అలవాటు పడడం అక్కడి జీవన విధానంలో ఒక భాగం.

ఇలాంటి నేపథ్యంలో జరిగిందో సంఘటన. సుమారు నెలన్నర క్రితం ఓ రోజు చంద్రమౌళి ఆఫీసుకు వెళ్ళాడు ఫ్రాన్సువా. ఇంగ్లీషునీ, ఫ్రెంచినీ కలిపి మాట్లాడుతూ అడిగాడు చంద్రమౌళిని. "ఆమధ్య మీకు చెప్పాను కదా, మిస్యూర్, ఒకతను తన ఎక్సర్‌సైజ్ ఎక్విప్‌మెంటు అమ్మదామనుకుంటున్నాడని. ఆ జార్జి వచ్చే నెలలో ట్రాన్స్‌ఫర్ అయ్యి వెళ్ళిపోతున్నాడు. ఆ ఎక్విప్‌మెంటు అమ్మడానికి సిద్ధంగా ఉన్నాడు. మంచి సిస్టం. బావుంది. ఇదిగో ఫోటో, చూడండి."

ఎక్విప్‌మెంటు నిజంగానే బావుంది. అన్నిరకాల ఎక్సర్‌సైజులూ చేసుకోవచ్చు. జిమ్‌కి ప్రతినెలా బోలెడు డబ్బు కడుతున్నా, వెళ్ళడానికి మాత్రం బద్ధకించడం అవుతోంది. ఇది ఇంట్లోనే ఉంటే రోజూ చెయ్యడానికి మోటివేషనూ వస్తుంది, వీలుగానూ ఉంటుంది అనుకున్నాడు చంద్రమౌళి.

"ఎంత చెబుతున్నాడేమిటి?" ఫ్రాన్సువాని అడిగాడు.

"మూడున్నర లక్షల ఫ్రాంకులు. మంచి కండిషలో ఉంది, మిస్యూర్. మేడిన్ కెనడా. దీన్ని పోనివ్వకండి."

"మూడున్నర లక్షలే. ఎక్కువ చెబుతున్నాడు. ఫోటోలో బాగానే ఉంది కానీ, చూస్తే గానీ చెప్పలేం. నేనోసారి చూడాలి. చూసాక చెప్తాను." అన్నాడు చంద్రమౌళి తనలోని ఉత్సాహాన్ని బయటపడనివ్వకుండా.

"సరే, అతనితో మాట్లాడి మీరు వెళ్ళి చూసే ఏర్పాటు చేస్తాను. రేటు గురించి నేను మాట్లాడి తగ్గించేలా చూస్తాను. ఈ బేరాన్ని మాత్రం వదలకండి. మంచి సరుకు" అని చెప్పి ఫ్రాన్సువా వెళ్ళిపోయాడు.

తర్వాత వారానికో రెండు వారాలకో ఎక్విప్‌మెంటు చూడ్డానికి ముహూర్తం పెట్టాడు ఫ్రాన్సువా.

"నిన్ననే జార్జి, తన ఇంటిలోని కొన్ని సామాన్లు తీసుకుని ఐవరీకోస్టుకి వెళ్ళిపోయాడు, ఇంకో రెండువారాల్లో వచ్చి మిగిలినవి తీసుకుని వెళతాడు. మీకు వీలైతే ఇవ్వాళ రేపట్లో వెళ్ళి చూద్దాం. నేను మిమ్మల్ని తీసుకువస్తే లోపలికి వెళ్ళనివ్వమని వాళ్ళ పనివాడితో చెప్పాడు కాబట్టి మనం వెళ్ళి చూడొచ్చు."

"వెళ్ళి చూస్తాం సరే, మరి ఎంతకి అమ్ముతాడో బేరమదీ ఆడొద్దూ. ఇప్పుడతను లేకపోతే ఎలా మాట్లాడుతాం?" అన్నాడు చంద్రమౌళి.

"మిస్యూర్, దాని గురించి మీకెందుకండీ, మీకు నష్టం కలగనిస్తానా? అసలు ఆ ఎక్విప్‌మెంటుని నాలుగు లక్షల ఫ్రాంకులకి తక్కువ అమ్మనన్నాడు. అతనికి అప్పుడప్పుడూ పనుల్లో సహాయం చేస్తాను కాబట్టి, ఆ పరిచయం కొద్దీ ముందే చెప్పాను. ఎవరికీ అమ్మొద్దు నాకు బాగా తెలిసినాయనొకరు కొంటారు అని. నామాట మీదే డబ్బు తగ్గించి మూడున్నర లక్షలు చెప్పాడు."

"కొనేది నువ్వా, నేనా, ఫ్రాన్సువా? నేనివ్వదల్చుకున్న మొత్తం మాత్రమే ఇస్తాను. స్వంత పెత్తనానికి పోయినందుగానూ మిగిలిన డబ్బు నువ్వు ఇవ్వు." అన్నాడు చంద్రమౌళి కొంచెం కోపంగా.

"అమ్మమ్మ, ఎంతమాటన్నారు, మిస్యూర్. మీరు నన్ను పూర్తిగా చెప్పనివ్వలేదు. మీతో మాట్లాడి వెళ్ళాక వారం పైగా నాకు జార్జి దొరకలేదు. చివరికి మొన్న వెళితే ఇంట్లో ఉన్నాడు. ఇంకా ఒకరిద్దరు అమెరికన్లకు చెప్పాడట ఆ ఎక్విప్‌మెంటు గురించి. వాళ్ళెవరో కొనడానికి సిద్ధంగా ఉన్నారన్నాడు. నేను అమ్మి పెడతానని మాటిచ్చాక వేరెవరికో చెప్పడం ఏమిటి, అవతల మా మిస్యూర్‌కి కూడా చెప్పేసాను. మీరెవరికీ అమ్మడానికి వీల్లేదని జార్జితో వాదించాను. అంతేనా, మా మిస్యూర్ మూడులక్షలకి మించి ఇవ్వరని కూడా చెప్పేసాను." అన్నాడు ఫ్రాన్సువా.

నిజానికి చంద్రమౌళికి ఆ ఎక్సరసైజ్ ఎక్విప్‌మెంటు బాగా నచ్చింది. చదువుకునే రోజుల్లో మిస్టరు కాలేజ్ కూడా అయిన చంద్రమౌళి ఉద్యోగంలోకి వచ్చాక వ్యాయామం చెయ్యడం తగ్గిపోయింది. సాయంత్రం ఆఫీసునుంచీ ఇంటికి వచ్చేసరికి అలసటగా ఉండటం, ఆ ఊళ్ళో ఉన్న ఒక్క జిమ్మూ ఇంటికి దూరం కావడంతో అతనికి అనుకున్నంత తరచుగా ఎక్సరసైజు చెయ్యడం కుదరడం లేదు. ఇలాంటి ఎక్సరసైజ్ మెషీన్లు బెనిన్‌లో దొరికే ప్రసక్తేలేదు. విదేశాలనుంచీ వచ్చినవాళ్ళు తిరిగి వెళ్ళిపోయేప్పుడు ఇలాటి వస్తువులను అమ్మి వెళ్ళిపోతుంటారు. మళ్ళీ అలాంటిది ఎవడైనా అమ్ముతాడా, అమ్మినా మనకు తెలుస్తుందా? ఇంతకు ముందోసారి చిన్న ఎక్సర్‌సైజు మెషీన్ అమ్మకానికి వచ్చింది కానీ అదసలు బాగోనే లేదు. ఇప్పుడు మనం కాదంటే ఆ అమెరికన్లెవరో తీసుకుపోతారు. ఎంతైనా, అవసరం అయితే ఈ తెల్లవాళ్ళంతా ఒక్కటవుతారు. తను ఎక్కువగా బేరమాడితే, తక్కువిచ్చినా ఆ అమెరికన్లకే అమ్మేస్తాడు కానీ నాకివ్వడు అనుకున్నాడు చంద్రమౌళి. కానీ, ఈ ఫ్రాన్సువా మాత్రం తక్కువవాడా, వీడు ఇందులో ఏమీ తినకుండా పని చెయ్యడు కదా. అదే మాట అడిగాడు కూడా.

"నేను కొనే దానికి నిన్ను బేరం చెయ్యమన్నానా? నువ్వు చిన్న చిన్న పనులకే అతి తెలివి ప్రదర్శిస్తావు. నీ పుర్రాకులు నాకు తెలియనివా? ఇందులో నువ్వెంత లాగుతున్నావు?"

"అయ్యో, మిస్యూర్, నమ్మండి. మీరు అలా అనుకోవడంలో తప్పులేదు. ఆకతాయతనం కొద్దీ గతంలో కొన్నిసార్లు కక్కుర్తి పడ్డాను. ఆ తప్పులకు ప్రాయశ్చిత్తంగా ఇప్పుడు మీకు దీన్ని మంచి రేటుకి కొనిపెట్టి, నా పొరపాటు సరిదిద్దుకుందామనుకుంటున్నాను. నిజం చెప్పకపోవడమే. దాన్ని అమ్మిపెడితే జార్జి నాకు పాతికవేలు ఇస్తానన్నాడు. మీరు మాత్రం నాకేమీ ఇవ్వొద్దు. నేనే దాన్ని ఫ్రీగా మీ ఇంట్లో ఇన్‌స్టాల్ చేసిపెడతాను. సరేనా?" అన్నాడు ఫ్రాన్సువా.

'అంటే వీడికి బుద్ధొచ్చిందన్నమాట ఇంతకాలానికి, వాడు చెప్పిందీ నిజమే. అంత పెద్ద ఎక్విప్‌మెంటుని అక్కడ విప్పడానికీ, ఇంటికి తీసుకురావడానికీ తిరిగి ఇక్కడ బిగించడానికీ ఎవరో ఒకరు ఉండాలి. ఈ పని చెయ్యడం తెలిసిన వాళ్ళు మాత్రం మళ్ళీ ఎక్కడ దొరుకుతారు. ఓ పదో, పాతికో మింగితే మింగనీ' అనుకున్నాడు చంద్రమౌళి.

ఆ రోజు సాయంత్రమే జార్జి ఇంటికి వెళ్ళారు. పనివాడు డాబా మీదకు తీసుకువెళ్ళాడు. బెనిన్‌లో డబ్బున్న ప్రతివాళ్ళ ఇంటిలో డాబాల మీద పయోట్‌లని ఉంటాయి. పయోట్ అంటే చిన్న కుటీరంలాంటిది. పైన రెల్లుగడ్డితో నేసిన కప్పుండి, పయోట్ సైజుని బట్టి క్రింద మూడు నుంచీ ఐదు స్థంభాలు సపోర్టుకి ఉంటాయి. సాయంత్రాలు దీని కింద కూర్చుని విశ్రాంతి తీసుకోవడానికో, బంధుమిత్రులతో కల్సి కబుర్లు చెప్పుకోవడానికో వాడుతూ ఉంటారు. అలాంటి పయోట్ కింద ఉంది ఎక్సర్‌సైజ్ మెషీన్. పగలంతా ఇటూ, అటూ ఎండ తగలడం మూలాన కాబోలు దాని రంగు అక్కడక్కడా పెచ్చుల్లా ఊడిపోతూ ఉంది. కానీ మొత్తం మీద దిట్టంగా, ముచ్చటగా ఉంది. ఫోటో చూసినప్పటినుంచే చంద్రమౌళి దాని ప్రేమలో పడిపోయాడు. దానికున్న ఫీచర్సు అన్నీ ఉపయోగించి చూసాడు. బాగానే ఉంది. కానీ ఎక్కువగా వాడుతున్నట్టు లేదు. "సరే ఫ్రాన్సువా. ఇది నచ్చింది నాకు. కానీ పుల్లీలు అవీ బిగుతుగా కదులుతున్నాయి. గ్రీజు అదీ పెట్టి మంచి కండీషన్లోకి తీసుకురాగలవా? కొన్నాక సరిగా పనిచెయ్యకపోతే నాకొద్దు." అన్నాడు.

"మీకెందుకు, మిస్యూర్. అవన్నీ నాకొదిలెయ్యండి. ఇంకో పదిరోజుల్లో జార్జి రాగానే డబ్బిచ్చి మనం దీన్ని తెచ్చేసుకుందాం. మిగతావన్నీ నేను చూసుకుంటానుగా."

అన్నట్టే ఓ పదిరోజులు పోయాక ఫ్రాన్సువా వచ్చాడు. డబ్బిస్తే ఎక్విప్‌మెంటు తీసుకుకొచ్చే ఏర్పాట్లు చేస్తానన్నాడు. మళ్ళీ అతనితో బేరమాడి చూసాననీ, మూడులక్షలకు తగ్గనన్నాడనీ, కావాలంటే జార్జి తనకు కమీషనుగా ఇస్తానన్న పాతికవేలూ చంద్రమౌళిని తీసుకోమనీ అన్నాడు.

"అక్కర్లేదులేవోయ్. ఈ డబ్బు నా కెందుకు. దాన్ని మా ఇంట్లో ఫిక్స్ చేసినందుకు నేనూ నీకు కొంత ఇస్తానులే, నువ్వేమీ నాకు ఊరికే చెయ్యక్కర్లేదు. అది సరే కానీ, జార్జికి డాలర్లలో చెక్కు ఇస్తే సరిపోతుందా లేక సొమ్ము ఫ్రాంకుల్లో ముట్టచెప్పాలా? నాదగ్గరైతే అంత సొమ్మురెడీగా లేదు, సాయంత్రం మార్చి ఇస్తాను సొమ్ముకావాలంటే మాత్రం." అన్నాడు చంద్రమౌళి.

"వెళ్ళేముందు ఇక్కడి ఖర్చులకి అవసరమని ఫ్రాంకులే కావాలన్నాడు. డాలర్లు మార్చి సాయంత్రం ఇవ్వండి." అంటూ భరోసా ఇచ్చాడు ఫ్రాన్సువా.

బెనిన్‌లో పనిచేసే చాలామంది విదేశీయులకు డాలర్లలోనో, మరే ఇతర కరెన్సీలలోనో జీతాలు వస్తుంటాయి. వీళ్ళ బ్యాంకు అకౌంట్లు కూడా విదేశాల్లోనే ఉంటాయి. అక్కడి అవసరాలకు కావలసినంత డబ్బుని తరచు ఫ్రాంకుల్లోకి

మార్చుకుంటారు. అయితే బెనిన్‌లోని బ్యాంకుల్లో చెక్కులు ఇస్తే దాన్ని ప్రోసెస్ చెయ్యడానికి ఖర్చూ, అనేక రోజుల సమయమూ అవసరం కాబట్టి దాదాపు విదేశీయులందరూ హవాలా మార్గాల్లోనే ద్రవ్యాన్ని మారుస్తూ ఉంటారు. విదేశీయుల నుంచీ చెక్కులు పుచ్చుకుని, దానికి సమానమైన ఫ్రాంకులను వెంటనే ముట్టచెబుతారు ఊళ్ళోని కొందరు పెద్ద వ్యాపారస్తులు.

ఆ రోజు సాయంత్రం పియెర్ ఒకొలాండ్జో దగ్గరకు వెళ్ళాడు చంద్రమౌళి. "బోన్ స్వార్, మిస్యూర్. బాగున్నారా?" అని పలకరించాడు పియెర్. అతనో బట్టల వ్యాపారి. సంపాదనలో వీలైనంత భాగాన్ని విదేశీమారక ద్రవ్యంగా మార్చి విదేశీ బ్యాంకుల్లో దాచుకుంటాడు మిగతా పెద్ద వ్యాపరస్తుల్లాగే. చంద్రమౌళి ఫ్రాంకుల కోసం పియెర్ దగ్గరికే వెళుతుంటాడు. కొంతమంది వ్యాపారులైతే ఇప్పుడు డాలర్లు అవసరం లేదనో, తమదగ్గర తగినన్ని ఫ్రాంకులు లేవనో చెపుతూ ఉంటారు ఒక్కోసారి. పియెర్ దగ్గర ఆ గొడవలేదు. ఎప్పుడు వెళ్ళినా డబ్బు మారుస్తాడు. పైగా మిగిలిన వారి కన్న డాలరుకి ఐదు పది ఫ్రాంకులు ఎక్కువే ఇస్తుంటాడు.

"బానే ఉన్నాను, పియెర్. ఎలా ఉన్నారు మీరు? వ్యాపారం ఎలా ఉంది?" అడిగాడు చంద్రమౌళి.

"వ్యాపారానికేముంది, మిస్యూర్. గవర్నమెంటుతో ఎప్పుడూ గొడవే కదా. పోర్టులో నుంచి మా సరులుకు దించుకోవాలంటే రోజుకో క్రొత్త నిబంధనలు అధికారులకి ఎక్కువ ముట్టచెప్పి జేబులు నింపుకోవడానికే కానీ ప్రభుత్వాదాయాన్ని పెంచడానికో, దేశక్షేమం కోసమో కాదు. అలా అయితే మా దేశం ఎప్పుడో బాగుపడేది. సరే కానీ, డబ్బు కావాలా మిస్యూర్? ఎంత కావాలి?"

ఎంత కావాలో చెప్పి ఆ మొత్తానికి చెక్కు రాసిచ్చాడు చంద్రమౌళి. దానికి సరిపోయే ఫ్రాంకులను లెక్కగట్టి, అవి మంచి నోట్లే అన్నది అల్ట్రావయొలెట్ కిరణాలు వచ్చే ఒక పరికరం దగ్గరపెట్టి చంద్రమౌళికి చూపించాడు పియెర్. మంచివైతే, ఆ అతినీలలోహిత కిరణ కాంతిలో నోట్ల మీద ఉన్న సెక్యూరిటీ మార్కులన్నీ మెరుస్తూ కనబడతాయి. "మీ మీద నమ్మకం ఉంది లెండి, పియెర్. ఆ నోట్లు మంచివే అని నాముందు చూపించనక్కర్లేదు" అన్నాడు చంద్రమౌళి.

"లేదు మిస్యూర్. నెల రోజుల నుండీ నైజీరియా నుంచీ వచ్చే దొంగనోట్లు ఎక్కువైపోయాయి. ఇదివరకటి కన్నా ఎక్కువగా జాగ్రత్త పడాల్సి వస్తోంది. మీకు చూపించడం కోసమనే కాదు. నేనూ మరోసారి సరి చూసి ఇస్తున్నానంతే."అని చంద్రమౌళి చేతికి డబ్బందించాడు పియెర్.

మర్నాడు ఫ్రాన్సువా వచ్చి డబ్బు తీసుకుని వెళ్ళాడు. తనే దగ్గరుండి అన్ని ఏర్పాట్లూ చేసి ఎక్విప్‌మెంటుని తీసుకు వచ్చి, చంద్రమౌళి ఇంట్లో ఇన్‌స్టాల్ చేసాడు. అంతా బాగానే ఉంది కానీ చంద్రమౌళికి ఒక ఫీచర్ గురించి అనుమానం వచ్చింది. దాన్ని ఎలా ఉపయోగించాలో ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్ ఉంటే చూసి తెలుసుకుందామని ఫ్రాన్సువాని అడిగాడు. జార్జి అలాంటి మాన్యువల్ ఏమీ ఇవ్వలేదన్నాడు ఫ్రాన్సువా. "సరే జార్జి ఫోన్ నంబరుంటే ఇవ్వు, అతనికి ఫోన్ చేసి కనుక్కుంటాను." అన్నాడు చంద్రమౌళి.

ఏకారణం చేతో ఫ్రాన్సువా ముఖంలో రంగులు మారాయి. "ఎప్పుడూ ఇంటికి వెళ్ళి మాట్లాడడమే కానీ ఫోను చెయ్యలేదు జార్జికి. నేనే వెళ్ళి మాన్యువల్ తీసుకు వస్తాను." అని చెప్పి కంగారుగా వెళ్ళిపోయాడు ఫ్రాన్సువా.

ఫ్రాన్సువా ఎందుకు అలా వింతగా ప్రవర్తించాడో చంద్రమౌళికి అర్థం కాలేదు. అతడు మాన్యువల్‌ని జార్జి నుండి తెస్తాడో తేడో అన్న అనుమానం వచ్చి, ఎవరెవరికో ఫోనులు చేసి జార్జి ఫోన్ నెంబరు కనుక్కుని ఆ రాత్రి జార్జికి ఫోన్ చేసాడు చంద్రమౌళి. అప్పటి వరకూ అతన్ని కలవడం జరగనేలేదు. అదే మొదటిసారి జార్జితో మాట్లాడ్డం. జార్జి

దగ్గర ఇన్‌స్ట్రక్షన్ మాన్యువల్ లేదట. ఆవిషయమే చెప్పి, చంద్రమౌళికి ఏమికావాలో తెలుసుకుని, సందేహ నివృత్తి చేసేడు.

"మాన్యువల్ లేకపోతే, భవిష్యత్తులో నాకేమైనా అనుమానాలుంటే తీర్చుకునేది ఎలా, మీరు కూడా రేపు ఊరినుంచీ వెళ్ళిపోతున్నారు. మూడు లక్షల ఫ్రాంకుల్లో నుంచీ కొంత తగ్గించాలి నాకు" అన్నాడు చంద్రమౌళి నవ్వుతూ.

"మూడు లక్షలేమిటీ, మీరు ఎంతకి కొన్నారు? ఫ్రాన్సువాకి ఎంతిచ్చారు మీరు?"

"మూడులక్షల ఫ్రాంకులకు. మరి మీతో బేరం కుదిర్చాడంటగా ఆ మొత్తానికి? ఏం, మీరెంతకు అమ్మారసలు?"

"ఎంతో తెలుసా? లక్షన్నర. అందులో పాతికవేలు వాడి కమీషనుగా ఫ్రాన్సువాయే మినహాయించుకున్నాడు. ఎక్విప్‌మెంటుని అమ్ముదామంటే ఆసక్తి ఉన్నవాళ్ళెవరూ దొరకలేదు. వెళ్ళిపోతున్నాను కాబట్టి వీలైనంతలో ఎంతో కొంత మంచి రేటుకు అమ్మేద్దామని వాడితో చెప్పాను. దొంగ వెధవ, మిమ్మల్ని మోసం చేసాడు" అన్నాడు జార్జి తాపీగా.

గుండె గుభేలు మంది చంద్రమౌళికి. జార్జికి తను అనుకున్నంత మొత్తమేదో వచ్చినట్టుంది అందుకే అతనా విషయాన్ని పట్టించుకుంటున్నట్టులేదు. మంచి మాటలు చెప్పి, తన్ను మాత్రం తెలివిగా మోసం చేసాడు ఫ్రాన్సువా. "ఎంత పని చేసాడు! మీరు ఊళ్ళో లేరనీ, ఇదీ అదీ చెప్పి మీరూ, నేనూ మాట్లాడుకునే అవకాశమే లేకుండా చేసాడు. సరే, నేను ఏదో ఒక ఉపాయం ఆలోచించాను. మీరూ సహకరిస్తే వాడి నుంచీ డబ్బు వసూలు చేస్తాను. కావాలంటే మీకు మరికొంత మొత్తం ఇస్తాను. అప్పుడు మనిద్దరకూ లాభిస్తుంది." అన్నాడు చంద్రమౌళి.

"మీకు జరిగిన దానికి చింతిస్తున్నాను. కానీ నాకు ముట్టిన డబ్బు గురించి పట్టించుకోదలుచుకోలేదింక. నేను రేపు రాత్రికి వెళ్ళిపోతున్నాను కాబట్టి ఇలాంటి వాటిగురించి వర్రీ అయ్యి ఉపయోగం ఉండదు. ఏదైనా అవసరమైతే చెప్పండి, సమయం ఉంటే రేపటిలోగా చెయ్యగలిగింది చేస్తాను. గుడ్‌లక్." అని ఫోన్ పెట్టేసాడు జార్జి.

కడుపు మండిపోయింది చంద్రమౌళికి. ఆకతాయి తనమని ఎప్పటికప్పుడు ఫ్రాన్సువా చేసిన తప్పుల్ని క్షమిస్తూ వచ్చాడు. బుద్ధి వచ్చినట్టు, దొంగ కబుర్లన్నీ చెప్పి ఇప్పుడింత మోసం చేసాడు. పోయిన మొత్తం గురించి కన్న తనను నమ్మక ద్రోహం చేసాడన్నదే చంద్రమౌళి కోపానికి కారణమయ్యింది. ఎలాగోలా ఆ డబ్బుని తిరిగి రాబట్టాలి రేపటిలోగా. ఫ్రాన్సువాని డైరక్టుగా అడగడం వల్ల ఉపయోగం ఉండదు, కాకమ్మ కథలు చెబుతాడంతే. ఆలోచించి ఒక పథకం సిద్ధం చేసుకున్నాడు చంద్రమౌళి.

మర్నాడు ఫ్రాన్సువాని పిలిపించాడు. అతనితో మాట్లాడుతూ ఉండగా చంద్రమౌళి అసిస్టెంటు ఓనోరే వచ్చాడు ఓ పదివేల ఫ్రాంకుల నోటు పట్టుకుని. "మిస్యూర్, క్షమించాలి. నిన్న మీరు ఇచ్చిన నోటు మంచిది కాదు. బయట మార్చబోతే చెల్లలేదు. ఓసారి చూడండి." అని నోటు అందజేసాడు.

దాన్ని పట్టుకుని ఇటూ అటూ తిప్పి చూసాడు చంద్రమౌళి. నోటు మీద ఏవేవో వివరాల కోసం పరిశీలించాక ఆందోళనగా అన్నాడు "నిజమే, ఇది దొంగ నోటు లాగే ఉంది. మొన్న మార్చిన డబ్బుతో పాటు వచ్చిందది. ఆ మొత్తంలో ఇంకెన్ని దొంగనోట్లున్నాయో. సాయంత్రం వీటిని మిస్యూర్ ఓకొలాండ్జోకి తిరిగిచ్చేసి మంచివి తీసుకుంటాను. ఈ విషయం బయటెక్కడా అనకు, ఓనోరే. దొంగనోట్లను కలిగి ఉండడం కూడా నేరమే. పోలీసులకు తెలిస్తే అనవసరమైన గొడవ. అంతే కాక ఆ డబ్బుని కూడా ఇచ్చేయాలి వాళ్ళకు."

ఇది విన్న నల్లని ఫ్రాన్సువా ముఖంలో రంగులు మారడం కనబడలేదు కానీ, కళ్ళలో మాత్రం కంగారు కనబడింది. ఇంతలో చంద్రమౌళి ఫ్రాన్సువా వైపు తిరిగి అన్నాడు "నిన్న జార్జికి ఇచ్చిన డబ్బులో ఎన్ని దొంగ నోట్లున్నాయో మరి. అతనికిచ్చిన డబ్బుని అడిగి పుచ్చుకో, మార్చి మంచినోట్లు ఇద్దాం."

"అలాగే కనుక్కుంటాను, మిస్యూర్. అతను ఈ రోజు వెళ్ళిపోతున్నాడు కదా. దొరుకుతాడో లేదో. కానీ ప్రయత్నిస్తాను." అన్నాడు ఫ్రాన్సువా. అతనికి జార్జికిచ్చిన లక్షాపాతికవేల గురించి బెంగేలేదు. అందులో దొంగనోట్లుంటే ఉండనీ. అది జార్జికి సంబంధించిన సమస్య. మిగిలిన లక్షాడెబ్భైదువేలలో కొంత రాత్రికి రాత్రే జల్సాల కోసం ఖర్చుపెట్టేసాడు. అందులో దొంగ నోట్లుంటే, మారుస్తుండగా పట్టుబడితే? భయమేసింది ఫ్రాన్సువాకి. కానీ తనకిచ్చిన మొత్తాన్నంతా తెచ్చి చంద్రమౌళికి చూపించడం ఎలా అన్నదే ఇంకా పెద్ద సమస్య. జార్జిని కలిసి మళ్ళీవస్తానని చెప్పి వెళ్ళిపోయాడు ఫ్రాన్సువా. అతను వెళ్ళాక చంద్రమౌళితో అన్నాడు ఓనోరే "బుట్టలో పడ్డట్టున్నాడు, మిస్యూర్. ఏంచేస్తాడంటారు?"

"వీడు మూడొంతులు జార్జి దగ్గరకు వెళ్ళకపోవచ్చు. అతనెలాగూ వెళ్ళిపోతాడు కాబట్టి అతనికిచ్చిన డబ్బుగురించి పట్టించుకునే రకంకాదు ఫ్రాన్సువా. అయినా నేను ప్రొద్దుటే జార్జికి ఫోన్ చేసి చెప్పాను నా ప్లాన్ గురించి. ఒకవేళ ఫ్రాన్సువా వస్తే ఏదోకటి చెప్పి పంపెయ్యమన్నాను. పోలీసు ప్రస్తావన తెచ్చాను కదా. మీ పోలీసుల తఢాకా తెలిసిన ఫ్రాన్సువా మిగిలిన డబ్బునైనా తిరిగి తెస్తాడని నమ్మకం ఉంది. చూద్దాం ఏంచేస్తాడో."

ఓ రెండు గంటలు పోయాక ఫ్రాన్సువా తిరిగి వచ్చాడు. "మిస్యూర్, జార్జితో మాట్లాడాను. అతనికి మనం ఇచ్చిన డబ్బులో కొంత ఇప్పటికే ఖర్చుచేసాడట. మిగిలిన లక్షాయాభైవేలూ ఇచ్చాడు. సాయంత్రం వెళ్ళిపోతాడు కాబట్టి వెంటనే వీటిని సరిచూసి మంచి నోట్లిమ్మన్నాడు. ఇలా జరిగినందుకు కొంచెం చిరాకు పడ్డాడు కూడా. తిరిగి సొమ్ము సిద్ధం చేస్తే వెంటనే వెళ్ళి ఇచ్చేస్తాను." అన్నాడు.

చంద్రమౌళి ఆ డబ్బుని తీసుకుని అన్నాడు "నీకు ఎప్పటికీ బుద్ది రాదా, ఫ్రాన్సువా? నువ్వు జార్జికి ఎంతకి అమ్మావో నాకు తెలిసింది. నువ్వు ఎంత మోసం చేసావో? కావాలంటే నాదగ్గరా కొంత కమీషన్ తీసుకోవాలంతే కానీ ఇలాంటి తప్పుచేస్తావా? నువ్వు బుద్ధెప్పుడు తెచ్చుకుంటావసలు? అవి దొంగ నోట్లు కావు. నీ నుంచి తిరిగి డబ్బురాబట్టడం కోసం అలా చెప్పాను."

ఇలాంటి పరిస్థితులు ఫ్రాన్సువాకి కొత్తేం కాదు. ఏదోకటి చెప్పి తప్పించుకోవడం అలవాటే. "లేదు లేదు, మిస్యూర్. ఇదంతా జరిగింది. వాడు ఇంత మోసం చేసాడా? వాడి పని చెబుతాను ఆ డబ్బుని మీదగ్గరే ఉంచండి. తిరిగి ఇవ్వకండి. మళ్ళీ కలుస్తాను, మిస్యూర్. జరిగినదానికి నా క్షమాపణలు." అని చెప్పి హడావిడిగా వెళ్ళిపోయాడు.

వీడికి బుద్ధిరాదు, పైగా తను చెప్పిన కారణం నేను నమ్ముతాననుకుంటాడు అనుకున్నాడు చంద్రమౌళి.

కొన్నిరోజులు పోయాక ఫ్రాన్సువా చంద్రమౌళి ఇంటికి వెళ్ళాడు. వాచ్‌మాన్ వాడిని లోపలికి రానివ్వకుండా తిట్టి పంపించెయ్యబోతున్నాడు. అది విన్న చంద్రమౌళి, ఫ్రాన్సువాని తనే పిలిపించానని చెప్పి లోపలికి రానీయమన్నాడు. ఫ్రాన్సువా చంద్రమౌళితో మాట్లాడి వెళ్ళిపోయాక వాచ్‌మాన్ అడిగాడు "మిస్యూర్, వాడు అంత మోసం చేసాక మళ్ళీ ఎందుకు రానిచ్చారండీ. ఆ దొంగ వెధవ బుద్ది మారదు. మళ్ళీ ఏదోరకంగా టోపీ పెట్టడానికి ప్రయత్నిస్తాడు."

చంద్రమౌళి నవ్వి చెప్పాడు "ఫ్రాన్సువా సంగతి నాకు తెలుసు. కానీ నాకు వాడి అవసరం ఉంది. వీడో పదునైన కత్తిలాంటివాడన్నది నిజమే. అయినా కత్తి తనంతటతనే మనకు హాని చెయ్యదు. మనచేతిలో ఉన్నప్పుడే,

అజాగ్రత్తగా ఉంటే మనకు గాయం అవుతుంది. గాయమయ్యింది కదాని కత్తిని పారేయం కదా. మళ్ళీ వాడినప్పుడు జాగ్రత్తగా ఉంటాం, ఇప్పుడు నేను చేసేది కూడా అదే. మరోసారి వాడు మోసగించకుండా జాగ్రత్త పడడం."

(సేవకుడూ, హితుడూ, శ్రేయోభిలాషీ అయిన పియర్ ఒకొలాండ్జొకి అంకితం)

 

## వీడ్కోలు - పి.వి.డి.ఎస్. ప్రకాష్

**"ఒరేయ్, తాతా! ఏం చేస్తున్నావురా, ఇక్కడ?** ఈ తాతతో ఆడుకుందువుగాని రామ్మా!నీకు బోల్డు కథలు, కబుర్లు చెబుతాను..." ఏడేళ్ళ వశిష్టను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటూ అన్నాడు పరంధామయ్య.

వశిష్ట ఒక్కసారిగా ఆయనను విదిలించికొట్టి తుర్రున పరుగుతీసి తన గదిలో దూరిపోయాడు తూనీగలాగ.

అయినా, పరంధామయ్య పట్టువదల్లేదు. డెబ్బయ్యేళ్ళ శరీరం అలసటను తట్టుకోలేక కదలనని మొరాయిస్తున్నా పంటి బిగువున శక్తి కూడదీసుకుని లేచి నెమ్మదిగా అడుగులో అడుగువేసుకుంటూ వశిష్టని వెంబడించాడు.

"తాతయ్యా! ఇంకోసారి చెబుతున్నాను. ప్లీజ్, దగ్గరకు రాకు. నాకు బోల్డంత పనుంది. నన్ను డిస్టర్బ్ చేయకు" అంటూ చిన్ని చేతులతో బెదిరిస్తూ నే తాతని తప్పించుకు తిరుగుతున్నాడు వశిష్ట.

"ఒరేయ్, తాతా! ఉదయంనుచీ నీకోసమెంతలా ఎదురుచూసానో తెలుసా? సాయంత్రమెపుడవుతుందా ఎపుడెపుడు నువ్వొస్తావా? అని కళ్ళలో వత్తులు వేసుకుని గుమ్మం దగ్గర పడిగాపులు కాసాను. ఓ అరగంట అలా కాలక్షేపం చేద్దాంరారా! స్కూలు నుంచీ వచ్చీరాగానే ఏం పనుంటుంది చెప్పు" బతిమాలుతున్నాడు పరంధామయ్య.

"దగ్గరకు రాకు, తాతయ్యా! ముసలి కంపు. నీతో నాకేం కబుర్లుంటాయి? పాత చింతకాయపచ్చడి కబుర్లు. వట్టినస. విసిగించకు నన్ను. మమ్మీ డాడీతో చెప్పానంటే మళ్ళీ నిన్నే తిడతారు, నన్నెందుకు డిస్టర్బ్ చేస్తున్నావంటూ... స్కూలునుంచీ రాగానే ఇంట్లో వట్టి న్యూసెన్స్. ముసలాడివి.. ఏమూలో కూర్చోగూడదూ" గట్టిగా అంటూనే వశిష్ట తన గదిలో కంప్యూటర్ ఆన్ చేసి 'గేమ్స్' ఆడడం ప్రారంభించాడు.

ఆ మాటలు చిన్నపిల్లాడైన వశిష్ట అంటున్నట్లుగా లేదు, కళ్ళెదురుగా కోడలు పిల్ల నిల్చుని అంటున్నట్లుగానే ఉంది పరంధామయ్యకి. పరిగెట్టి మనవడిని పట్టుకోవాలనే ఉత్సాహం కాస్తా నీరుకారిపోయిందాయనకి. 'ఉస్సూర'ని నిట్టూరుస్తూనే సోఫాలో చతికిలపడిపోయాడు.

వశిష్ట మాటలే గుర్తుకొస్తున్నాయి మాటిమాటికి.

"దగ్గరకు రాకు తాతయ్యా.. ముసలి కంపు.... ఏం కబుర్లు చెపుతావు నాకు. పాత చింతకాయ పచ్చడి

కబుర్లు.." పశ్చిమాన కొండల్లోకి జారిపోతున్న సూర్యుడు వేడితగ్గిన ఆఖరికిరణమొకటి లోకం మీదకు విసిరినట్లు పరంధామయ్య పెదవులపై వెలిసిపోయిన నవ్వొకటి మెరిసింది.

వశిష్ఠ వంక చూసాడతడు. ఏకాగ్రతతో 'కంప్యూటర్ గేమ్స్' ఆడుతున్నాడు. మధ్య మధ్య హుషారుగా కేకలేస్తున్నాడు. వాల్‌క్లాక్ వేపు చూసాడు పరంధామయ్య. ఆరైంది. మరో రెండు గంటలు. రాత్రి ఎనిందైతే కానీ ఈ ఇంట్లోకి కొడుకు, కోడలు రానే రారు. ఇద్దరూ ఉద్యోగులే. వచ్చీరాగానే ఎవర్ని పలకరించినా కస్సుబుస్సే.

అవును మరి, ఎనిమిది గంటలపాటు ఆఫీసులో పనివత్తిడితో విసిగివస్తారేమో, ముఖం కాళ్ళూ చేతులూ కడుక్కుని కాస్త చల్లపడ్డాక కాఫీపానీయం సేవించి రిలాక్సవుతారు.

ఆ తర్వాతనే ఇంటిగురించి, వంటి గురించి పట్టించుకుంటారు. అపుడు కోడలు కిచెన్‌రూంలోకి ప్రవేశించి వంట పూర్తి చేసి అందరి భోజనాలయేసరికి రాత్రి పదకొండు దాటుతుంది. ఆతర్వాత ఇంకేముంది? ఎవరి గదుల్లోకి వారు దూరటమే తరువాయి. తలచుకుని బాధగా నిట్టూర్చాడు పరంధామయ్య.

"తాతయ్యా! నే గెలిచానోచ్!" చెంగు చెంగున గెంతుతూ వచ్చి చెప్పాడు వశిష్ఠ. రెండు చేతులూ చప్పట్లు చరుస్తూ - "ఎస్, తాతయ్యా! వన్‌వీక్ నుంచీ ప్రయత్నిస్తున్నా ఈ గేమ్ ఎలాగైనా గెలిచి తీరాలనే నాలో పట్టుదల పెరిగింది. అంతే! ఏకాగ్రతతో ఆడాను. గెలిచాను. ఎస్, తాతయ్యా! నే గెలిచాను"

సంబరంగా చెబుతున్న వశిష్ఠ పరంధామయ్య నుంచీ సానుకూల స్పందన రాకపోవడంతో ఒక్క క్షణం ఆగి తాతయ్యవేపు చూసాడు. పరంధామయ్య ముఖంలో ఏ భావమూ పలకడంలేదు. కనీసం, బోసినోటితో 'శభాష్ మనవడా!' అన్నట్లు చిర్నవ్వయినా చిందించడంలేదు. శిలా ప్రతిమలా అలా కూర్చున్నాడంతే.

"ఏమైంది, తాతయ్యా!" అడిగాడు వశిష్ఠ దగ్గరకు వచ్చి.

"ఏం కాలేదు. ఎప్పుడూ ఉండే జబ్బే. ముసలి జబ్బు. దగ్గరకు రాకు. ముసలికంపు కొడతానురా! వార్ధకాన్ని మించిన శాపం మరోటి లేదని తెలుసు. తెలిసి తెలిసి ఇంకా బతుకుతున్నాను... ఎందుకో తెలుసా? చచ్చిపోవడం చేతకాక!. బలవంతంగా ఏ నుయ్యో గొయ్యో చూసుకుని చచ్చినా దెయ్యమైపోతానే కానీ, శాశ్వత విముక్తి లభించదుకదా! అందుకే, చావొచ్చేదాకా ఇలా బతికుంటూ, బతికున్నాను కనుక.. నీలాంటి వాళ్ళ చీదరింపులకు గురవుతూ.. "ఆయన రెండుకళ్ళూ నీటిచెలమలయ్యాయి. ఆ సన్నివేశాన్నెదుర్కొనేందుకు వశిష్ఠ సిద్ధంగా లేడు. ఎపుడూ గుబురుగా పెంచుకున్న తన మీసాల మీద చేతులు వేస్తూ, ఎంత వారిస్తున్నా వినకుండా 'తాతా!' అని పిలుస్తూ ఆటపట్టించే తాతయ్యే వశిష్ఠకి తెలుసు అంతే!

"ఏం మీ నాన్నగారు భోజనానికి రారా... బొట్టుపెట్టి మరీ పిలవాలేమో అయ్యగార్ని వెళ్ళి పిలుచుకురండి. అన్నాలందరూ తినేస్తే అంట్ల పనొకటుందికదా, నా ప్రాణానికి" కోడలు కౌసల్య మాటలు వినిపిస్తున్నాయి లీలగా పరంధామయ్యకి.

✡✡✡

"నిద్రపోతున్నారేమో, లేపడమెందుకు? అంతగా ఆకలైతే ఆయనే లేచి భోంచేస్తారు. గిన్నెలు సర్దేసి వచ్చేయి. మళ్ళీ రేపొద్దున్నే తయారవ్వాలి ఆఫీసులకి" కొడుకు కృష్ణకాంత్ గొంతది.

వశిష్ఠ ఏదో జోక్ పేల్చినట్లున్నాడు. ముగ్గురి నవ్వులు వినిపించాయి. కొద్దిసేపు గిన్నెలు సర్దుతున్న చప్పుడు, ఆ తర్వాత, అదీ ఆగిపోయింది.

నిశబ్దం... భయంకర నిశబ్దం..

గదిలోని నీలిరంగు బల్బు అందిస్తున్న చిన్ని వెలుతురులోనే గోడకు వేలాడుతున్న భార్య ఫోటో వేపు చూసాడు పరంధామయ్య.

"అదృష్టవంతురాలివి సుకన్యా! ముందుగా వెళ్ళిపోయి సుఖపడ్డావు. మీకంటే ముందుగా నేపోవాలండీ. మీరుపోయిన తర్వాత పసుపు కుంకుమ, ఏ అలంకరణలు లేని 'తెల్లచీర బతుకు' నాకొద్దంటూనే అన్నమాట నెగ్గించుకుని మరీపోయావు. ఒక్క తెల్లచీరలేదు కానీ, నాదీ 'వెధవాయి' బతుకే అయిపోయింది. ఎలా పుట్టాను? ఎలా పెరిగాను? ఎలా బతికాను? ఇపుడో.. ఇపుడు ఎలా చితికిపోయానో?"

తన శరీరాన్ని చూసుకున్నాడోసారి పరంధామయ్య.

'వృద్ధాప్యం' అనే పులి విసిరిన పంజా దెబ్బకు శిధిలమైన శరీరాన్ని చూసుకున్నాడతడు. ధారుష్యం లేనేలేదు. వేడి నెత్తురెపుడో చల్లారిపోయింది. వట్టి ఎముకలే తప్ప ఇంకేం లేవు.

'బంగారు బాల్యం' గత జన్మ జ్ఞాపకమైపోయింది. ఏవీ ఆనాటి ఆటపాటలు? ఎక్కడా కన్పించడంలేదు.వచ్చీరాగానే 'కంప్యూటర్' ముందు కూర్చుని 'గేమ్స్' ఆడుకునే వశిష్ఠ గుర్తొచ్చాడు. ఏమాత్రం శారీరక వ్యాయామం లేని కంప్యూటర్‌గేమ్స్ బాల్యంలోకి ప్రవేశించిన కాలమిది.

మరి, తన బాల్యమో?

తల్చుకుంటేనే, ఈ శుష్కశరీరంలోనూ వసంతంలా తాకే అలనాటి కలలాంటి పులకింత. చక్కని ఊరు, ఊరుపక్కన పారే ఏరు, ఆ ఏరు పక్కన కోవెల. ఆ కోవెల్లో, వెన్నెల రాత్రుల్లో ఆటలాడుకున్న బాల్యం గుర్తొచ్చింది పరంధామయ్యకి. పక్కింటి జ్యోతి, ఎదురింటి కిషోర్, రాజు, శేషు..తను.

ఎన్నెన్ని ఆటలాడేవారమో? కోతికొమ్మచ్చి, బిల్లంగోడు, బొంగరాలు, గోలీలు, దాగుడుమూతలు, దొంగాట –

మరిప్పుడో, కంప్యూటర్ స్క్రీన్ ముందు కూర్చుని 'మౌస్' పట్టుకుని 'గేమ్స్'. కదలకుండా, మెదలకుండా చాలీచాలని వెలుతురులో అలా గంటలకొద్దీ ఆటలాడడం –

"ప్చ్" నిట్టూర్చాడు పరంధామయ్య.

పక్కింటి జ్యోతి ఒక్కసారి గుర్తుకొచ్చిందాతడికి. రంగురంగుల పరికిణీ వేసుకుని ఆటలకొచ్చేది తను. జారిపోతున్న నిక్కరుని ఎగదోసుకుంటూ వెళ్ళేవాడు తను.

ఊహ తెలీని వయసులో, 'పెళ్ళి' అంటే అవగాహన అసలు లేని బాల్యంలో 'అమ్మానాన్న' ఆటాడేవారు.

'అమ్మ'ని కసరడమే నాన్న పని. ఒదిగి ఒదిగి సేవలు చేయడమే 'అమ్మ' విధి. అంతకంటే, ముందుకెళ్ళలేదు ఆనాటి ఆలోచన. అందుకే, 'అమ్మానాన్న' ఆటలో అపుడెపుడో 'గతజన్మ'లో 'అమ్మ' పాత్ర పోషించిన జ్యోతి ఇన్నాళ్ళకీ, ఇన్నేళ్ళకీ హృదయంలోలోతుల్లో మధుర జ్ఞాపకమై పరిమళిస్తూనే ఉంది. ఉంటుంది.

చుట్టూ ఒక్కసారి చూసాడు పరంధామయ్య.

ఏదో నిస్తేజం.. ఏదో నిరాశ.. అంతులేని దుఃఖం.. అవధుల్లేని విషాదం.

"అవును – ఇది తనెరిగిన ప్రపంచం కాదు. తన కొడుకు.. కోడలు.. వారిలాంటి మరికొందరు నిర్మించుకున్న ప్రపంచం. ఈ సరికొత్త ప్రపంచంలో 'ఆధునికత' అడుగడుగునా ప్రతిబింబిస్తోంది.

'జీవితం' కూడా కంప్యూటరీకరణకు లోనవుతున్న కాలం ఇది.

'ఎమ్టీవి, ఎఫ్‌టీవి'ల్లోని దుస్తుల్లేని యువతి ప్రేక్షకుల గుండెల్లోకి సరాసరి నడిచొస్తున్న రోజులివి. ఇక్కడ తను సుదీర్ఘంగా జరిగిన యుద్ధంలో క్షతగాత్రుడైన సైనికుడు. అంతే! గాయాలైతే ఉన్నాయి కానీ, చికిత్స లేని శరణార్థుల శిబిరం ఇది. ఒక్కసారి తాను 'గతజన్మ'లోకి తొంగిచూసుకోవాలి. తన ఊరుని చూసుకోవాలి. ఊపిరి ఆగిపోయేలాగా ఒక్కసారి తల్లిలాంటి 'పల్లె'ని పలుకరించిరావాలి. ఆ రాత్రి గట్టి నిర్ణయానికొచ్చాడు పరంధామయ్య.

✡✡✡

"ఈ వయసులో అంత దూరం ప్రయాణమా? ఆ పల్లెటూరుకి వెళ్ళాలంటే అన్ని ప్రయాణసాధనాలు ఉపయోగించాల్సిందే రైలు, బస్సు, ఆటో, పడవ.. చివరికి 'గుర్రంబండీ' కూడా ఎక్కాల్సిందే" చెబుతున్నాడు కృష్ణకాంత్.

"అవును మామయ్యా! మీరంతదూరం ప్రయాణించలేరు. మధ్యలో మీకేమైనా అయిందా, మాకెంత 'అప్రదిష్ట' అంతేకాదు, ఆఫీసులో ఆడిట్ జరుగుతున్న ఈ సమయంలో 'ఆఖరిచూపు' కూడా దక్కదు మాకు. మీరు హైరానాపడి.. మమ్మల్ని ఇబ్బంది పెట్టకండి. హాయిగా వండిపెడుతుంటే, తిని కూర్చోక ఆ పల్లెటూరిని చూస్తారట. అసలేముందక్కడ?" అడిగింది కౌసల్య.

"నా జీవితం" చెప్పాడు పరంధామయ్య.

"అవునురా!.. నా 'జీవితం' ఉందక్కడ. ఆ మట్టిలో, ఆ గాలిలో, అక్కడ ప్రవహించే నీటిలో ఒకనాటి నా బతుకు జ్ఞాపకాల పరిమళముంది. 'ముసలి కంపు' కొట్టే ఈ 'కట్టె' కర్పూరం చెట్టులా అక్కడే సుగంధం వెదజల్లిందొకనాడు. ఆ రోడ్లమీద లేతవయసులో కదిలిన నా అడుగుల గుర్తులను వెతుక్కోవాలనుంది. నాన్నారి చేతి చిటికనవేలు పట్టుకుని ఫర్లాంగు దూరం నడిచిన అద్భుతాలున్నాయక్కడ. ఏటిఒడ్డున టీకొట్టు. ఆ టీకొట్టు తడికెపై అంటించిన అలనాటి 'బ్లాక్ అండ్ వైట్' కళాఖండాలు నాకిప్పటికీ గుర్తే. 'సుమంగళి' సావిత్రి పోస్టర్ నాగుండెగోడపై ఇప్పటికీ పదిలంగానే ఉంది. 'గులేబకావళి కథ,' 'బభ్రువాహన', 'అమరశిల్పి జక్కన'.. సిన్మాలేవీ మరచిపోలేదు. ఒక ఎన్టీఆర్, ఒక ఎన్నీఆర్, 'తెలుగు తెర' ఎప్పటికీ మరిచిపోలేని మహానటీమణి సావిత్రి మనమధ్య ఇప్పుడు లేకపోవచ్చు. 'ఎమ్టీవి, ఎఫ్టీఈవి' కాట్‌వాక్‌లే మీకు తెలుసు. కానీ, అలనాటి కళాఖండాల్లోని 'గుండె కింద తడి' మాకు తెలుసు. నన్ను వెళ్ళనీ.." అన్నాడు పరంధామయ్య.

మరేం మాటాడలేదు కొడుకు కోడలు.

✡✡✡

పరంధామయ్య ప్రయాణం ఏర్పాట్లు దగ్గరుండి చూడ్డం ప్రారంభించారు కృష్ణకాంత్, కౌసల్య. కొత్త పంచెలు, లాల్చీలు కొని తెచ్చారు. కొత్త లుంగీలు, తువ్వాలు, ఇతర అవసర సరంజామాను పెట్టెల్లో, బాగ్‌ల్లో సర్దారు. రైలు టికెట్‌ని రిజర్వ్ చేసారు. ఆరోజే ప్రయాణం -

మరో రెండుగంటల్లో ట్రయిన్ బయల్దేరనుంది.

పరంధామయ్య హడావుడి అంతా ఇంతా కాదు. చిన్న పిల్లాడు తొలిసారి రైలెక్కుతున్నంతగా సంబరపడిపోతున్నారాయన. ఆయన ఆనందాన్ని చూస్తుంటే కృష్ణకాంత్ కళ్ళలో ఒక్కసారిగా కన్నీటి తెర. ఆనీటి తెరనుంచి చూస్తుంటే, మసకమసకగా తండ్రి రూపం కనిపిస్తోంది. తల్లిపోయాక తండ్రెంత ఒంటరివాడయ్యాడో తనసలే గమనించలేదు. తనూ, తన భార్య, కొడుకు వశిష్ఠ. భవిష్యత్ ఆలోచనలు, ఆర్థిక ప్రణాళికలతో తలమునకలయ్యాడు

తను.

"అన్నం పెడుతున్నాం... ఇంట్లో సుఖంగానే ఉన్నాడ"నుకున్నాడు తను. కానీ, శరీరంతోపాటూ మనసూ చితికిపోయిందని కృష్ణకాంత్ కిపుడే అర్థమైంది.

భారంగా నిట్టూర్చాడు.

"నాన్నా..!" దగ్గరగా వచ్చాడు కృష్ణకాంత్.

"ఏరా!" ఆప్యాయంగా అన్నాడు పరంధామయ్య.

చిన్నతనంలో తనని అక్కున చేర్చుకుని పిలిచిన తండ్రి పిలుపే ఇప్పుడూ వింటున్నట్లనిపించింది కృష్ణకాంత్‌కి.

"త్వరగా వచ్చేయి నాన్నా! నీకేం ఇబ్బంది ఎదురైనా ఇన్‌ఫాం చెయ్యి స్వయంగా నే తీసుకు వస్తాను, సరేనా?"

"అలాగేరా!"

ఇంతలో వశిష్ఠ అక్కడకు వచ్చాడు.. "ఏరా, మనవడా! నీకిక 'ముసలికంపు' బెడద లేదురా! అంతా 'పర్‌ఫ్యూమ్' పరిమళమే. ఏమ్మా! కోడలా.. మావాడినీ, మనవడినీ జాగ్రత్తగా చూసుకో" అంపకాలు పెట్టాడు పరంధామయ్య.

మరో గంటలో అందరూ స్టేషన్‌కి వచ్చారు. ఎక్కవలసిన రైలు ఎక్కి కేటాయించిన సీట్లో కూర్చున్నాడు పరంధామయ్య. అది విండో సీటు. కొడుకూ, కోడలూ ఏవో జాగ్రత్తలు చెబుతున్నారు. అన్నింటినీ ఆనందంగావింటున్నాడు పరంధామయ్య.

గార్డు పచ్చ జెండా ఊపాడు. రైలు నెమ్మదిగా కదిలి వేగం పుంజుకుంటోంది. పరంధామయ్య కిటికీలోంచి చూస్తూ చేతులూపుతూ వీడ్కోలు చెబుతున్నాడు.

జీవితం రైలుప్రయాణంలాంటిదే. ఎన్నో కలయికలు.. మరెన్నో వీడ్కోళ్ళు. ప్లాట్‌ఫాం మీద ఎందరెందరో తమ ఆత్మీయులకు కన్నీటి వీడ్కోలు చెబుతున్న దృశ్యం కనిపిస్తోంది పరంధామయ్యకి.

ఈరోజు కాకుంటే, రేపు -

ఇలా కాకుంటే, మరోలా -

తనకు కొడుకూ కోడలూ వీడ్కోలు చెప్పాల్సిందే తను ఆ ఇంటిని ఖాళీ చేయాల్సిందే ఎందుకంటే, ఆ ఇల్లు తనదికాదు. ఆ ఇంట్లో తాను బలవంతపు అతిథి. తన భార్యని కంబళించిన మృత్యువు తనని మరచిపోయింది. అందుకే, 'ముసలికంపు' కొడుతున్న శిథిల శరీరంతోనే 'రాలిపోని పండుటాకు'లా ఆ ఇంటిని పట్టుకుని వేలాడుతున్నాడు. తనుంటే, ఆ 'సంసారాని'కి ఇరుకు కదూ! తనకు వారు వీడ్కోలు చెబితేనేకదా, హాయిగా 'సంసారం' చేసుకుంటారు. అందుకే, తనంతట తానుగా తప్పుకుంటున్నాడు.

రైలు ఇంకాస్త వేగం పుంజుకుంటుండగా పరిగెత్తుతూ వచ్చిన కృష్ణకాంత్ అంటున్నాడు - "నాన్నారూ! మీ ఊరి ఏటిపక్క టీకొట్టు తడికమీదున్న 'సుమంగళి' సావిత్రిని అడిగానని చెప్పండి".

రైలు వేగం పుంజుకుంది. కొడుకు ఆఖరిమాటలు గాలిలో కలిసిపోతున్నాయి.

"పిచ్చికన్నా! ఇంకా 'సుమంగళి' సావిత్రి అక్కడ ఉంటుందా? లోకం మారిపోయిందన్న వాస్తవాన్ని గమనించలేనంత మూర్ఖుడు కాదురా నీ తండ్రి. ఆఊరు, ఆఏరు, ఆకోవెల, ఆటీకొట్టు.. అన్నీ మారిపోయే ఉంటాయి. అక్కడా, ఆధునిక కట్టడాలు, భవంతులు ఏర్పడి ఉంటాయి. బాల్యం తర్వాత యవ్వన, వార్ధక్యాల్లాగే ఆ 'పల్లె' కూడా

పట్నమైపోదూ!" అనుకున్నాడు పరంధామయ్య. అయినా, అతడి కళ్ళముందు 'స్వర్ణస్వప్నం'లా అలనాటి బాల్యం.. ఆబాల్యంలో అందమైన ఊరు, ఊరు పక్కన పారే ఏరు, ఆ ఏటి పక్కల్న తడికల 'టీ'కొట్టు.. అక్కడ 'సుమంగళి' సావిత్రి గుర్తొస్తూనే ఉంది. అతడి కళ్ళలో కన్నీరు స్రవిస్తూనే ఉంది.

✡✡✡

రైలు అలా సాగిపోతూనే ఉంది.

"ఇదిగో, పెద్దాయనా! ఎంతసేపలా చూస్తుంటావ్, నువు దిగాల్సిన స్టేషన్ దాటిపోయినా పట్టించుకోవేం? వచ్చేస్టేషన్‌లోనైనా దిగు. గమ్యస్థానం దాటినా ఇంకా ఎంతసేపలా ప్రయాణం?" కస్సుబుస్సుమంటున్నాడు టికెట్ కలెక్టర్

అయినా, పరంధామయ్య ఉలకలేదు, పలకలేదు. ఆయనలో ఏ స్పందనా కానరావడం లేదు. రైలు కిటికీలోంచి ఆయన చూపులు శూన్యంలో చిక్కుకునే ఉన్నాయి. ఆ కళ్ళు ఏ దృశ్యాలు వీక్షిస్తున్నాయో అర్థం కాలేదు. టికెట్ కలెక్టర్ కి. అసలా కళ్ళు చూస్తున్నాయో, గాజు కళలా నిస్తేజంగా మారిపోయాయో కూడా తెలీలేదతనికి. అప్పటికే ఆయన ప్రయాణం ముగిసిందన్న సంగతి పాపం, ఆ టికెట్ కలెక్టర్‌కి ఏం తెలుసు?

✡✡✡



# అమృతాన్ని సాధించు!

వారణాసి నాగలక్ష్మి

అదో అగాధం, అదో సముద్రం,

అదో అగోచర కీకారణ్యం!

హృదయం! హృదయం! హృదయం!

ఎప్పుడో విన్న లలితగీతం మనసులో మెలికలు తిరుగుతోంది.

'మనసా! కవ్వించకే నన్నిలా!' ఎస్.జానకిలా వేడుకుంది నీరద. 'నేనోడిపోయి గెలుపొందినానూ... గెలిచానని నవ్వనా? ఏడ్వనా?' ఎందుకు పాడిందో అలాగ? ఏ సందర్భంలో పాడిందో? ఇంతకీ తను గెలిచిందా? ఓడిందో? గెలిచాననుకుని ఓడిపోయిందా?

"నీరదా!" అవినాశ్ పిలుపుకి ఉలికిపడింది నీరద. తనపేరు భలే పెట్టారు నాన్న. వర్షమేఘాలంటే అంత ప్రేమ ఎందుకో? దట్టమైన నల్లమబ్బులు కమ్మేసినట్టుంది తన మానసాకాశం. ఉప్పొంగే నదులూ, ఎగిసిపడే సముద్రాలూ, ఉరిమి ఉరిమి ఒక్కసారిగా కురిసే వర్షాలూ, ముంచెత్తే ఉప్పెనలూ, దిక్కుతోచని కారడవులూ, ఎంతలోతో కూడా తెలియని అగాధాలూ... అన్ని తన మనసులోనే ఉన్నట్టనిపించింది.

"నీరదా!" అవినాశ్ మళ్ళీ పిలిచాడు గట్టిగా. పలకాలని. పలకాలని లేదు. కానీ తప్పదు. అతనికి కోపం వస్తే చాలా యాగీ చేస్తాడు. పక్కవాళ్ళకి వినిపించేలా అరుస్తాడు. ఇంట్లో ఏమైనా, ఒంట్లో ఎలా ఉన్నా, నలుగురూ ఏమనుకుంటారో అని.. సమాజం మెప్పుకోసం, ఒప్పుకోసం, ఒంగి వొదిగి బతుకుతూ, తరతరాలుగా, పడిలేచే, లేచినా మళ్ళీ పడడానికి సిద్ధపడే తరంగంలాగా, అంతరంగంలోని ఆలోచనా తరంగాలు కూడా భర్తకి ఆమోదయోగ్యంగా ఉండేలాగా తమని తాము మలచుకుంటూ... స్త్రీలెందుకిలా బతకాలి?

"నీరదా!" ఎక్కడున్నావ్? వినపడటంలేదా అరుస్తున్నా?" పెద్దగా కోపంగా వినిపించింది అవినాశ్ పిలుపు.

చటుక్కున లేచి బాల్కనీలోంచి పడకగదిలోకి పరుగు పెట్టింది మంచం మీద మెత్తటి నీలిరంగు రజాయి లోపల బద్ధకంగా పడుకుని ఉన్నాడు అవినాశ్. భావరహితంగా అతనివైపు చూసింది. ఉబ్బిన మొహం. తాగుడెక్కువై రాత్రంతా వాంతులు చేసుకోవడంతో నీరసించిన శరీరం. ఎరుపు జీరలు తేలిన ఆ కళ్ళూ, ఇంకా మత్తు పూర్తిగా దిగనట్టుగా మొద్దులా పడుకుని ఉన్న ఆ భంగిమా మనసులో జుగుప్సను రేకెత్తించాయి. అర్ధరాత్రి దాటాక తూలుతూ అతను ఇంట్లోకి రావడం, ఏదో అసౌకర్యాన్ని సూచిస్తూ అస్థిమితంగా నాలుగడుగులు వేయడం, బాత్‌రూమ్ చేరేలోపే హాల్లో కార్పెట్ మీద భళ్ళున వాంతి చేసుకోవడం, తను మళ్ళీ అగాధంలోకి కూరుకుపోవడం... అంతా గుర్తుకొచ్చింది. నందిని పెళ్ళి క్రితం రాత్రి అయిపోయిందని గుర్తొచ్చింది. నందిని ఆ పెళ్ళికి ఇద్దరూ కలిసి వెళ్ళాలని ముందుగా అనుకున్నారు తను చక్కగా అలంకరించుకుని ఎదురుచూస్తూ కూర్చుంది... ముందు రోజు బాంక్ లాకర్‌లోంచి తెచ్చిన డైమెండ్ పెండెంట్ మెడలో వేసుకుని! 'పదిహేను నిముషాల్లో వస్తున్నాను, రెడీగా ఉండమని' అతను క్లినిక్ నుంచీ ఫోన్ చేశాడు. తన మనసులో అనుమానం ఉండనే ఉంది. అతని 'సమయపాలన' తనకి తెలియంది కాదు. అయినా ఈసారి తనని నిరాశపరుస్తాడని అనుకోలేదు!

ఆ ఫోన్ తర్వాత మళ్ళీ కబురులేదు అతన్నుంచీ. పదింటిదాకా ఎదురుచూశాక 'ఏమైపోయాడో' అని భయం మొదలైంది. మొబైల్ కనెక్షన్ దొరకలేదు. ఒకవైపు ఆగ్రహం, మరోవైపు ఆదుర్దా. కణతలు అగిలే తలనెప్పి. ఒంటి గంటక వచ్చాడు తాగి, తూలుతూ!

'మళ్ళీనా? వొద్దు భగవంతుడా ఈ బాధ' అని తన హృదయం ఆక్రోశించింది. ఎన్నోసారి ఇలా? ఏ జన్మ తాలూకు కసి ఇతనిలా తనమీద తీర్చుకుంటున్నాడు? వైద్యుడయ్యీ ఎందుకిలా చేస్తున్నాడు? మానసికంగా తనని కుంగదీస్తూ, తన ఆరోగ్యాన్ని దిగజార్చుకుంటూ.. తాగినదంతా అతను బాత్‌రూమ్‌లో వాంతులు చేసుకుంటుంటే పూర్వంలా తను వెంట వెళ్ళలేదు. అగ్నిగోళంలాంటి మనసుతో ప్రేక్షకురాలిలా చూస్తూ ఉండిపోయింది. రాత్రంతా జాగారమే!

"ఏంటలా చూస్తున్నావ్?" నవ్వు మొహం పెట్టబోయాడు అవినాశ్.

ఏం లేదన్నట్టు తలూపింది నీరద.

"చాలాసేపట్నుంచీ పిలుస్తున్నా వినిపించలే?"

"ఏదో ఆలోచనల్లో ఉన్నా."

"అబద్ధం... నా మీద కోపం వచ్చింది కదూ?"

"..."

"ఇట్రా"

మెల్లిగా కదిలి దగ్గరకి వెళ్ళింది.

పక్కన చోటు చూపిస్తూ జరిగాడు పడుకునే.

కూర్చుంది. తన కుడిచేతిని, ఒడిలో పెట్టుకున్న ఆమె చేతులమీదుగా వేశాడు.

"ఫ్రెండ్స్ బలవంత పెడితే కొంచెం తీసుకున్నా. జస్ట్ లిటిల్. డిజప్పాయింట్ అయ్యావా?"

ప్రతిసారీ ఇదే సంజాయిషీ. ఇదే ప్రశ్న.

"ఆ నవ్వు చూస్తే నాకు తిక్కరే.." పదునుగా ఏదో అనబోయి, ఆగి సౌమ్యంగా "ఎందుకిలా నవుతావు? ఏదో ఒకసారి సోషియలైజింగ్" అన్నాడు విసుగు కనపడనీయకుండా.

కళ్ళెత్తి అతని కళ్ళలోకి చూసింది నీరద. చూపులు కలపలేక గడియారం వైపు చూశాడు అవినాశ్.

"ఒకసారా?" సౌమ్యంగా అంది నీరద.

"పోనీ రెండు సార్లు"

"రెండుసార్లు కాదు అవినే! మన పెళ్ళైన తర్వాత ఈ ఆరేళ్ళలో ఇరవై ఆరు సార్లు ఇలా చేశావు"

"అబ్బా! ఎప్పుడూ నిందలేస్తూ మాట్లాడతావ్" ఇంగ్లీషులో చిరాకుపడ్డాడు.

"ఇవి నిందలా? నిజం కానివి నిందలు! ఇవన్నీ నేను మరచిపోలేని బాధాకరమైన నిజాలు అవినే! పెళ్ళైన నెలకి ఇప్పుడే వస్తానని కార్లో కూర్చోపెట్టి, మాయమైపోయి, మూడు గంటల తర్వాత వచ్చావు. ఏదో వింత కారణం చెప్పావు. మొదటి పెళ్ళిరోజునాడు? ఫ్రెండ్స్‌ని ఇంటికి పిలిచి, అంతా వెళ్ళిపోయాక అర్ధరాత్రి ఇంటి కొచ్చావు. నా పుట్టినరోజున హోటల్లో పార్టీ ఇచ్చి, తాగి, అక్కడే అసహ్యంగా మా అమ్మా నాన్నల గురించి నానామాటలూ అన్నావు! నా తల భూమిలోకి కుంగిపోయింది. అందరిలో తలెత్తుకోలేక.."

"నీరదా! నా సహనాన్ని పరీక్షిస్తావు! ఇద్దరు కలిసి బతకాలంటే 'గివ్ అండ్ టేక్' ఉండాలి! సర్లే... నాకు సర్జరీ ఉంది."

చటుక్కున ఆమె పక్కనుంచీ మంచం దిగి, బాత్‌రూమ్‌లో దూరాడు. మరో పదినిముషాల్లో హాస్పటల్‌కి

వెళ్ళిపోతాడు! ఉసూరుమంది నీరద మనసు. అతను లేచాక ఇవ్వబోయే హామీలు, చెప్పబోయే సారీలు, అనునయ పూర్వకమైన స్పర్శ, ప్రేమ నిండిన చూపులు... ఏమీ లేవు! ఎందుకిలా అయిపోయింది జాగ్రత్తగా నిర్మించుకున్న తన జీవన సౌధం??

ఫోను మోగింది. సునంద..

"బానే ఉన్నానే"... "డల్‌గానా? అబ్బేలేదే?"... ఆc.. సెల్ సిగ్నల్స్ లేవుట".... "ముందు కూడా ట్రై చేశాట్ట. ఇంటి ఫోన్ ఎంగేజ్ ఉందిట!" అనుకోకుండా వాళ్ళ రూమ్మేట్ వచ్చాట్ట న్యూయార్క్ నించీ. అప్పటికప్పుడు అంతా వెళ్ళారట ఊరి బైట ఏదో క్లబ్‌కి"... "సారీ నందా. సెల్‌ఫోన్ కాంటాక్ట్ కూడా దొరక్కపోతే భయం వేసింది. ఏం చెయ్యాలో తోచలేదు" "ఊ కొంచెం ... అంతెక్కువేం కాదులే" .... "అబ్బే హేంగోవరేం లేదు. నార్మల్‌గానే ఉన్నాడు. డోంట్ వర్రీ!"

"భోజనానికా? రాలేం. అవిన్‌కి సర్జరీ ఉందట. "

"......"

"వద్దులేవే. అతనితో ఏం పెట్టుకున్నా టైమ్‌కి అవదు. అతనికి టైమ్ సెన్సులేదు. ఎదురు చూస్తుంటే నాకు తలనొప్పి వస్తుంది! ఇంకోళ్ళని వెయిట్ చేయిస్తుంటే నాకు ఒళ్ళు కాల్చుకున్నంత బాధ"

".........."

"పిచ్చి వాగుడులాగే ఉంటుంది నీకు. ఇవ్వాల్టికి వదిలేయ్. ఫోన్ పెట్టేస్తున్నా.. బై"

వెనక్కి తిరిగేసరికి అవినాశ్.

"ఎవరు?"

"సునంద"

"రాత్రి ఫోన్ చేశావా నా మొగుడింకా ఇంటికి రాలేదని?"

"నేను చెయ్యలేదు. నందిని పెళ్ళికి వెళుతూ 'పికప్' చేసుకోనా అని అదే చేసింది. మనిద్దరం వస్తామని చెప్పాను. అక్కడ కలుస్తామని ఎదురు చూసి మళ్ళీ ఫోన్ చేసింది పదిన్నరకి - డిన్నర్ చేస్తూ. అప్పటికింకా నువ్వు రాలేదని చెప్పా. ఇంటికెళ్ళి పదకొండున్నరకి చేసింది. ఇంకా రాలేదు నువ్వు. మొబైల్ ఆఫ్ చేసి పెట్టుకున్నావు!"

"తాగొచ్చానా అని అడుగుతోంది కదూ?" ఉబ్బిన కళ్ళలో కోపపు జీరలు. మెరుపు కళ్ళతో, చురుగ్గా కదిలే శరీరంతో తన మనసు దోచుకున్నది ఇతడేనా? అతడూ, ఇతడూ ఒకరేనా?

"...."

"అదెవత్తి? మన విషయాలు దానికెందుకు?"

"అవిన్!" దెబ్బ తిన్న తాచులా చూసింది.

"మన మధ్య గొడవలు సృష్టించాలని అంత ఉబలాటం ఎందుకు? "

నిద్రలేకా, దుఃఖం వల్లా ఎర్రబడ్డ కళ్ళలో నీటిపొర కదిలింది. చురకత్తుల్లాంటి చూపులతో తర్జని చూపిస్తూ "అవిన్! అదెవరని అడుగుతున్నావు కదూ? అయిన వాళ్ళందరినీ వదులుకుని, నీ ప్రేమే సర్వస్వం అనుకుని, నిన్ను పెళ్ళి చేసుకుని వచ్చేస్తే నాకు అవసరమైన ఏనాడూ నువ్వు నాపక్కన లేవు! ఆఖరికి... ఆఖరికి డెలవరీ అప్పుడు కూడా హాస్పటల్లో చేరేవరకూ ఉండి, తర్వాత నా ఖర్మానికి నన్నొదిలేసి పోయావు సర్జరీ కేసుందని! గైనకాలజిస్టుకి పురుటి

నెప్పులుండవా! కాంప్లికేషన్సు ఏవీ రావని ఎక్కడైనా రాసుందా?.. ఆవేళ నా దగ్గరుండి నాకు ధైర్యం చెప్పింది అదే. పుట్టబోయేది 'స్టిల్‌బేబీ' అని తెలియగానే 'స్టిల్ బేబీ' కోసం సిజేరియన్ కాకూడదని, దగ్గరుండి మానసికంగా, శారీరకంగా..." బుగ్గలమీద జారడానికి సిద్ధమైన కన్నీటి బిందువు జారనా, మాననా అన్నట్టు కంటి కొసలో ఆగింది. తుడుచు కోవాలనిపించని వైరాగ్యం, నైరాశ్యం.

"అదే ఎన్నిసార్లు చెప్తావ్? అంత 'సెల్ఫ్‌పిటీ' ఏమిటి? మా హాస్పటల్లో నర్సు, రోజంతా డ్యూటీ చేసి వెళ్ళి, 'క్వయిట్'గా పిల్లని కంది. ప్రకృతి సహజమైన విషయానికి అంత హంగామా ఏమిటి? ఆఖరిసారి చెపుతున్నా నీరదా! నాజీవితంలో ఎవరికీ... ఎవ్వరికీ ఊడిగం చెయ్యను. ముఖ్యంగా ఏ అగ్రవర్ణపు అహంకారికీ!"

నిశ్చేష్టగా నిలుచుండిపోయింది నీరద. అతను వెళ్ళిపోయాడు. ఆమె నీరదై కరిగి పోయింది. పక్క మీదకి వొరిగిపోయింది. పక్కలెగిరి పడేలా వెక్కిళ్ళు పెట్టింది. కన్నీళ్ళతో చెక్కిళ్ళు కడిగి కడిగి, అలా పడుకుని ఉండి పోయింది పై కప్పుచూస్తూ. అతని చివరి మాటలు ఆమె చెవుల్లో మళ్ళీ మళ్ళీ వినిపించాయి. తను మార్చాలనుకుంటున్నది ఒక వ్యక్తిని కాదు! ఒక వ్యవస్థని! అంత శక్తి తనకి లేదు! నిస్సహాయంగా, నిస్త్రాణగా వేళ్ళాడిపోయింది.

హాస్పటల్లో తన కాబిన్‌లో కూర్చుని ఉంది నీరద. పండగ రోజు కావడంతో అంత రద్దీగా లేదు. సైకియాట్రిస్టు నిరంజన్ మాటలు పదే పదే గుర్తొస్తున్నాయి. నిరంజన్ ఎంబీబియస్‌లో తన క్లాస్‌మేట్. 'అణిచివేతకి గురైన వర్గం నుంచీ ఇలాంటి backlash సహజమే నీరదా' అతని మాటల అర్థం బోధపడ్డ కొద్దీ బాధ ఎక్కువవుతోంది. ఇది సర్దుకోవడానికి చాలా సహనం, ఓపిక కావాలిట. చాలాకాలం పడుతుందిట. అంటే తన జీవితం ఈ 'రిపెయిర్ వర్క్' లో గడిచిపోతుందన్నట్టేగా! తమలాంటివాళ్ళేగా తారా, ప్రకాష్! ఎంత హాయిగా జీవిస్తున్నారు? తన జీవితమే ఎందుకిలా కావాలి? ఎన్ని కలలు కంది! అన్నీ నిరర్థకమేనా? గ్రీష్మంలో ప్రభాతాలు, శరత్కాలపు వెన్నెల రాత్రులు, నది ఒడ్డున విహారాలు, ఒకరికొకరై ప్రపంచాన్ని వదిలేయగల ధీమా.. ఇవేవీ తనకందవన్నట్టేగా!

'నిరంజన్! ప్లీజ్! ఏదైనా చెయ్యి. అతనితో మాట్లాడు. రెండు విలువైన జీవితాలు ఇలా నిస్సారంగా గడిచిపోవాల్సిందేనా?' అడిగింది తను.

'నేనేం మాట్లాడినా విలువుండదు నీరదా! *అడక్కుండా ఇచ్చే సలహాకి విలువుండదు*' అన్నాడు.

'నీ విలువ తగ్గిపోతుందనన్నమాట నీ బాధ?' అలిగింది తను.

'నీరదా! అతని వైపు నుంచీ కూడా ఆలోచించడానికి ప్రయత్నించు. ఈ స్థితికి ఎదిగేలోపు ఎన్ని అవమానాలని ఎదుర్కొన్నాడో అవిన్. అతని లోపల ఏదో అగ్ని ఉంది. నీ ప్రేమతోనే దాన్ని చల్లార్చాలి' -

ఏం సలహా అది? 'అతని గతం తాలూకు గాయాలలో నా ప్రమేయం ఏమిటి చెప్పు నిరంజన్' అనడిగింది తను. 'నేనతన్ని అతనుగా చూసి ప్రేమించాను. తమ సర్వస్వాన్ని ఇచ్చి పెంచిన నా తల్లితండ్రుల్ని వదిలేసి, ఇతన్ని వరించి పెళ్ళిచేసుకున్నాను. నా తర్వాత నా చెల్లెలి గతేమిటని ఆలోచించకుండా వచ్చేశాను. ఇంతటి పిచ్చి ప్రేమకు ఇదా ఫలం?' అనడిగింది.

'నీరదా! అయామ్ సారీ టు సేదిస్! అవిన్ ఏమనుకుంటున్నాడో తెలుసా? దీన్ని నువ్వొక త్యాగంగా భావిస్తున్నావని అతని అనుమానం!' అన్నాడు నిరంజన్.

'నిరంజన్! నాది ప్రేమో, త్యాగమో, మరొకటో. ప్రతిదానికీ ఓ పేరు పెట్టడానికి ఇది కథో, నవలో కాదు. నా జీవితం. నన్ను నన్నుగా చూడమను. భార్యగా ప్రేమించమను. ఆదరించమను. నా కులం ఎందుకు అతనికి? *ఏ కులవ్యవస్థ వల్ల అతను తిరస్కారానికి గురయ్యాడో ఆ కులాన్నే పట్టుకు వేళ్ళాడుతూ నా జీవితాన్నీ, తన జీవితాన్నీ ఎందుకిలా నాశనం చేస్తున్నాడు?*' ఆక్రోశించింది తను.

"హాయ్!"

తెప్పరిల్లి, గుమ్మం వైపు చూసింది నీరద. నవ్వుల మల్లెలు విసురుతూ డాక్టర్ జాహ్నవి. అంత హాయిగా ఎలా నవ్వుతుందో!

"హాయ్" బదులిచ్చింది అలాగే నవ్వడానికి ప్రయత్నిస్తూ.

"చిన్న సహాయం కావాలోయ్. మా పనిమనిషి కూతురు.. జయప్రదా! ఇటా.. ఆరోనెల నడుస్తుందోయ్! త్రెటెండ్ అబార్షన్ కేసు" వెనక్కి తిరిగి ఆ అమ్మాయిని పిలిచింది. పాతికేళ్ళు ఉంటాయేమో ఆరునెలల గర్భిణీలా లేనేలేదు. లోతుకుపోయిన కళ్ళు. ఎండిన పెదవులు. వెంట నలభైల్లో ఉన్న బక్క పలచని స్త్రీ. తల్లి కాబోలు. చేతిలోని కార్డు నీరదకి ఇచ్చింది.

" ఈ డాక్టరమ్మ చూస్తార్లే యాదమ్మా! అన్నీ చెప్పు" అని పెద్దామెతో చెప్పి, నీరద భుజం తాకి, వెళ్ళొస్తానన్నట్టు సూచించి, హడావుడిగా వెళ్ళిపోయింది. ఆమెతో పాటే ఒక సన్నని పరిమళం కదిలిపోయింది. తనెప్పటికైనా అలా పూర్వపు నీరదలా ఉండగలుగుతుందా అనుకుంది. పక్కనున్న స్టూల్ చూపించి కూర్చోమంది జయప్రదని.

చాలా నీరసంగా, బరువు తక్కువగా ఉన్న ఆమెను చూస్తూ

"ఏమైందమ్మా?" అనునయంగా అడిగింది స్టెతస్కోపు తీస్తూ.

"ఒకటే సుస్తు డాక్టరమ్మా. ఒంట్లో సత్తువే లేకపోయె" మూలుగుతున్నట్టు అంది జయప్రద.

"మంచిగా తినాలి. ఆకు కూరలూ, పప్పూ, గుడ్డూ.."

"డాక్టరమ్మ చెప్పిందమ్మా. పనికి పోవద్దంది. ఎట్ల గడుస్తదమ్మ?" జయప్రద మాటలు పూర్తికాకుండానే

"మాట ఇనదమ్మా. డాక్టర్లట్టనే చెప్తరు. పనికి పోతా అంటది. గట్టిగా చెప్పు తల్లి నీ కాల్మొక్త" వెనక నుంచీ తల్లి అందుకుంది.

"ఏమి జయప్రదా? డాక్టరమ్మ చెప్పినా ఇనవా? పనికిపోతే బిడ్డ దక్కదు. ఎబార్షనై పోవచ్చు.. ఏమైంది? పడ్డావా? రక్తస్రావం ఎందుకైంది?" మెల్లగా ఆదరంగా అడిగింది నీరద. తనకు దక్కని పాపాయి గుర్తొచ్చి కలుక్కుమంది!

మాట్లాడకుండా కూర్చుంది జయప్రద. ఆమె తల్లి మెటికలు విరుస్తూ "ఆ సచ్చినోడు, దాని పెనివిటి వొట్టి ముదనష్టపోడమ్మా! తాగుడికి పైసలియ్యమని తంతడు. తాగొచ్చి, దొరమీది కోపం దాని మీద సూపిస్తడు" తన దుఃఖంతా చెప్పబోయింది.

"ఊకో. నీకెందుకు?' కసురుకుంది జయప్రద.

"ఆఁ. నాకెందుకు?? పురిటికి తీస్కపోవాలె. వైద్దెం చేపిచ్చాలె. మంచీ, చెడ్డా కాస్కోవాలె. పురుడు పోసి, సొమ్ములెట్టి పంపాలె. కడుపుతున్న బిడ్డని తన్నిండని తెల్సినా ఒకమాట అనేందుకి లేదా ఏమే?" గొంతు పెంచి అడిగింది యాదమ్మ. వినీ వినపడకుండా గొణుక్కుంది జయప్రద.

యాంత్రికంగా ఆమెని పరీక్షిస్తున్నా నీరద మనసు నిండా తేనె తుట్టెలా ముసురుతున్న ప్రశ్నలే. ***ఇద్దరు వ్యక్తులు కలిసి జీవితానందాన్ని, ప్రేమలో మకరందాన్ని అనుభవించడానికి అడ్డుపడేదేమిటి?*** తనకి పూర్వం తెలిసిన అవిన్‌కీ, భర్తగా తన ముందున్న అవినాశ్‌కీ మధ్య ఇంత తేడా ఎలా వచ్చింది? తన కులం పట్ల ఇంత ఆగ్రహం అతనికి ఉంటే తననెందుకు పెళ్ళి చేసుకున్నాడు? తన వెంట పడ్డ ప్రతిమను చేసుకోలేక పోయాడా? ఇపుడతను ఎవరినుద్ధరించినట్టు? వ్యవస్థలోని అస్తవ్యస్తత పట్ల మనిషిలో వ్యధాగ్ని, క్రోధాగ్ని ప్రజ్వరిల్లితే, అది ఆ అస్తవ్యస్తతని సరిచేసే దిశలో చెలరేగాలి! అంతే గానీ ఆ మంట అతన్నీ, అతని కుటుంబాన్నీ దహించేసేదైతే ఉపయోగం ఏమిటి? 'తాగొచ్చి దొరమీది కోపం దానిమీద చూపిస్తాడు'... విరక్తిగా నవ్వుకుంది. ***ఏ వర్గమైనా తనకన్నా బలహీనమైన వర్గాన్ని అణచేయాలనుకోవడంలో పెద్ద తేడా లేదేమో!*** దొర ఆమె భర్తని తంతాడు. అతనొచ్చి భార్యని కొడతాడు. ఆమె కిందకూడా ఎవరైనా పనిచేస్తుంటే వాళ్ళని ఆమె కూడా నాలుగు ఉతుకుతుందేమో! అవిన్ ఈమెని చూస్తే ఏమంటాడో? అతని ఆగ్రహం ఏమవుతుందో? ఏమీ అవక పోవచ్చు! అతని ఎజెండాలో ఇష్యూ లేదేమో! ఈమె తన మొగుణ్ణి ద్వేషిస్తూ ప్రపంచంలో భర్త హోదా వెలగబెట్టే వాళ్ళందరి పట్లా కసి పెంచుకుంటే??

"అయిందా తల్లీ? తిండికి వస్తావా?" ఎనస్థటిక్ పూర్ణిమ గొంతు.

"ఎంత బాగా అడిగావు?" నవ్వి, "ఇవ్వాళ నా లంచ్ కాంటిన్లో. పొద్దున్న వంట చెయ్యలేదు. జ్వరం వచ్చినట్టనిపించింది" తల్లీ కూతుళ్ళని పంపించేస్తూ అంది నీరద.

"ఎపుడూ నువ్వే చేస్తావా వంట? ఒంట్లో బాలేకపోయినా? ప్రేమ వివాహమైనా వంటిల్లు స్త్రీదే అన్నమాట!" కళ్ళెగరేస్తూ అంది పూర్ణిమ.

నవ్వింది నీరద.

"జ్వరం వచ్చినపుడు కాంటిన్ తిండి తినాలి! అపుడు వారం రోజులు సెలవు ఇస్తార్ట! డయేరియాతో పాటు!" ఊరించింది పూర్ణిమ. వెనక నుంచీ సిస్టర్ నవ్వింది కిలకిలా.

"నా బాక్స్ షేర్ చేసుకోవచ్చు రావోయ్! ఇవాళ మంచికూర. మా సుబ్బు చేశాడు ఉల్లికారం పెట్టి బెండకాయ కూర!"

"ఎంత లక్కు?"

"ఇదీ లక్కే? ఓసోస్. మా ఇంట్లో అన్ని పన్లూ ఇద్దరం కలసి చేసుకుంటాం. తనకి డెబ్బైవేలు వస్తుంది. నాకు పదివేలు. మీలాగా నేను డబ్బు ఖర్చుపెట్టేటప్పుడు వంద లెక్కలు వెయ్యను తెలుసా? నా మనసులో ఎపుడూ అతని డెబ్బైవేలు, నావి పదివేలు అనిపించదు. ఇంట్లో అన్నీ ఇద్దరివీ బాధ్యతలే కాదు, నా హక్కులు కూడా నాకు తెలుసు! మంజరి చూడు ఒక్క సెల్ ఫోను, అదీ ఎంతో అవసరమైంది కొనుక్కుందుకు అంత రిక్వెస్టు చెయ్యాలా అతన్ని? అతని సంపాదన తనది కూడా కాదా? ***తొమ్మిది నెలలు మోసి, వేవిళ్ళు పడి, పురిటి నెప్పులు భరించి, పిల్లాడ్ని కన్నపుడు 'నాకొడుకు' అని అతను మురిసి పోలేదూ?*** సంసారంలో పనులన్నీ ఇద్దరూ సమానంగా చెయ్యలేరు. కానీ

సర్దుకుంటే దుఃఖం, సుఖం సమానంగా పంచుకోగలరు. చెరిసగం అనే భావం ఉంటే... సంసారం, సంసారం! ప్రేమ సుధాపూరం, నవజీవన సారం, సంసారం!"

"యూ శాంగ్ బ్యూటిఫుల్ డాక్టర్!" మళయాళి సిస్టర్ మెచ్చుకోలు. ఆలోచిస్తూ లేచి పూర్ణిమ వెంట నడిచింది నీరద.

నీరద ఇల్లు చేరేసరికి అవిన్ సాయంత్రపు క్లినిక్‌కి బయలుదేరే సమయమైంది. హాల్లో కూర్చుని టీవీ చూస్తున్నాడు. మౌనంగా గదిలోకి నడవబోయింది నీరద.

"మీ సునంద ఫోన్ చేసింది నీకోసం" చెప్పాడు అవిన్. టీవీ వెలుగులు పడి రకరకాల రంగుల్లో కనిపించిందతని మొహం.

"సరే. నే చేస్తాలే" ముక్తసరిగా అంది.

"లంచ్‌కి ఇంటికొచ్చా. వంట చెయ్యలేదేం?" యధాలాపంగా అడిగినట్టు అడిగాడు.

"పొద్దున్న చెప్పానుగా - ఓపిగ్గా లేదు, బయట తినెయ్యమని!"

"నువ్వు చెప్పలేదు" ఆంగ్లంలో అన్నాడు.

"చెప్పాను. ఒకసారి కాదు. రెండుసార్లు" తనూ ఆంగ్లంలో అంది.

"ఎంత మాత్రం చెప్పలేదు" గట్టిగా అన్నాడు.

"మనింట్లో ఇరవై నాలుగ్గంటలూ వీడియో రికార్డింగ్ నడుస్తూ ఉండాలి... ఎందుకంటే ఇంకే విధంగానూ నా మాటలు నిరూపించలేను" నిర్లిప్తంగా అంది నీరద.

"ఒకే లీవిట్. సునంద ఫోన్ చేసింది. రాగానే నిన్ను చెయ్యమంది"

"చేస్తాలే"

"ఇప్పుడు చెయ్యి"

"ఏమిటింత ఇది అవిన్!? నాకు తెలీదా ఎపుడు చెయ్యాలో? దానితో నేనేం మాట్లాడతానో తెలుసుకోవాలనా?"

"నీరదా!" గట్టిగా నవ్వాడు అవిన్. "నువ్వేం చెప్పుకున్నా నాకు లెక్కలేదు. నీకు తెలీదూ ఆ విషయం? ఇంటి విషయాలు బయట పెట్టుకుంటే నీకే అవమానం. నాకేం పర్లేదు" ఎంత ధీమా ఆ కళ్ళలో!

"తెలుసు" నిస్తేజంగా అంది.

"బయల్దేరు. వాళ్ళింట్లో దింపి వెళ్తా క్లినిక్‌కి"

"ఎందుకు"

"ఏమో! అడిగింది నిన్ను దింపమని. క్లినిక్ అయిపోయాక వచ్చి పికప్ చేసుకుంటా"

"నాకు వెళ్ళాలని లేదు"

"అవును. నీకు వెళ్ళాలని ఉండదు. ఇంట్లో కూర్చుని జరిగిపోయినవి తవ్వుకుంటూ ఏడుస్తూ కూర్చోవాలని ఉంటుంది!"

అతని మాటలు వినాలనిపించక గబగబా పడక గదిలోకి వెళ్ళింది. అద్దం మీద మరచిపోయిన సెల్‌ఫోను. మూడు 'మిస్డ్ కాల్స్' సునంద నుంచి. ఒకటి నందిని నుంచీ.

సునందకి ఫోన్ చేసింది.

"నీరూ! వేడి పకోడీలు... అల్లం టీ.. 'రెండు రెళ్ళు ఆరు' డీవీడీ! వెంఠనే వచ్చేయ్! ఇంకేం మాట్లాడకు. అవిన్‌ని అడిగాను. సరే అన్నాడు"

'ఊ. సరే అంటాడు. అనకేం చేస్తాడు? నాలోని జవసత్వాలు పీల్చేసి పడేస్తే, నీదగ్గరకొచ్చి వాటిని నింపుకుని, మళ్ళీ అతనిముందు నవ్వుల నదిలా ప్రవహించాలిగా' కసిగా అనుకుంది. అయినా వెళ్ళాలనిపించింది. ఎదురుగా పొడవాటి రాత్రి భయపెట్టింది. వెంటనే బాత్‌రూమ్‌లో చల్లని నీటిని వేగంగా చల్లుకుంటూ మొహం కడుక్కుంది. అద్దంలో తన కళ్ళు ప్రేమగా చూసుకోవాలి! మనసులో ఉత్సాహాన్ని సృష్టించి కళ్ళలోకి పంపింది. కాస్త నయం. మెత్తటి తువాలుతో తుడుచుకుని, మృదువుగా చేతులతో కళ్ళని అదిమింది. అలవాటైన పౌడర్‌ని వదిలేసి, కబోర్డ్‌లోంచి కొత్త పౌడర్ డబ్బా తీసింది. కొత్త సువాసన. 'నన్ను నేను ప్రేమించుకోవాలి!' మెత్తగా జుట్టు దువ్వుకుని, క్లిప్పు పెట్టి వదిలేసింది. కోల బొట్టు బిళ్ళ అంటించుకుంది. సన్నగా కాటుక తీర్చుకుంది. 'లిప్‌గార్డ్' రాసుకుంది. రెండు మూడు సార్లుకళ్ళు చికిలించి, ఉత్సాహంగా మొహం పెట్టి చూసుకుంది. మెత్తటి ప్రింటెడ్ క్రేప్ చీర కట్టుకుని, దానితో వచ్చిన జాకెట్ వేసుకుంది.

తలుపు తీసి వచ్చేలోపు అవినాశ్ పిలిచాడు టైమైపోతుందని.

"నువ్వెళ్ళిపో అవిన్. నే వెళ్తాలే"

అవిన్ నవ్వాడు. "అంత కోపం ఎందుకమ్మా? అపుడు తాగి ఉన్నానమ్మా!" సినిమా పాట బాణీలో పాడుతూ అన్నాడు.

"అదే మరి. ఎందుకు నువ్వు తాగావమ్మా? ఎందుకలా చేశావమ్మా?" అదే స్టైల్లో అంది నీరద.

"ఎందుకోలే. తీరిగ్గా చెప్తా. ఇపుడు త్వరగా రా"

"ఎందుకో చెప్పనా అవిన్? నా మీద ఎంత ప్రేమో అంత ద్వేషం నీకు!" నవ్వుతూనే అంది యధాలాపంగా అన్నట్టుగా.

"పోనేలే అలానే అనుకో! *తరతరాల బానిస మనస్తత్వం ఒక్క తరంలో దొరలాగా మారితే తట్టుకోవడం కష్టం పాపం"*

"నీదా బానిస మనస్తత్వం? భలేవాడివి! నీది దొరల మనస్తత్వం బాబూ. మగదొరల మనస్తత్వం! అదేదో సినిమాలో ఓ పాట ఉంది.. 'దొరల నీకు కనుల నీరు, దొరలదీ లోకం. మగదొరలదీ లోకం' అంటూ"

"పోన్లే. మన సైన్ కర్వ్ - ఈ ఎత్తులూ పల్లాలూ ఎపుడూ ఉన్నవే పద పద టైమైంది"

కార్లో మెత్తగా ప్రయాణం. ఏసీ వల్లో, అవిన్ మామూలుగా ఉండడం వల్లో, చల్లని నీటితో మొహం కడగడం వల్లో నీరద మనసు కాస్త కుదుట పడింది.

గేటు దగ్గరే సునంద ఎదురైంది. నీరదని హత్తుకుని, అవిన్ వైపు తిరిగి "హాలో డాక్టర్ హాండ్సమ్! రండి. మీకోసం వేడి పకోడీలు ఎదురు చూస్తున్నాయి" అంది నిన్నటి చికాకు ఇంకా కనిపిస్తోంది ఉబ్బిన అతని కళ్ళ వెనుక. బాధ కనపడకుండా నవ్వింది.

"హాలో మిసెస్ స్వీట్ టాక్! సారీ.. నా క్లినిక్ టైం దాటిపోయింది. ఇంకోసారి!"

"అంత ఆలస్యం ఏంకాదు లెండి. అంతా రెడీ. అక్కడ పేషెంట్సేమోగానీ ఇక్కడ మంచి టీ వెయిట్ చేస్తోంది! జస్ట్ సిప్!"

"అబ్బే అయాం సారీ! మరోసారి.." కారు రివర్స్ చేసుకుని వెళ్ళిపోయాడు. లోపలికెళ్తూనే చేతుల మధ్య నీరద మొహాన్ని పట్టుకుని, నుదిటిమీద ముద్దు పెట్టుకుంది సునంద. "చాలా బాధేసిందా నందిని పెళ్ళి మిస్సయ్యావని?"

"ఊఁ ముందే చెపితే నే వెళ్ళిపోదును కదా. అలా చెయ్యడు. ఒకోసారి కసిగా ప్రవర్తిస్తాడు. పైకి తెలియనివ్వడు. ప్రేమగా ఉన్నాడనుకుని బొక్కబోర్లాపడతాను. ఐ గెట్ హర్ట్!"

నిట్టూర్చి "పోన్లే! దా. సినిమా చూద్దాం!" అని, "చుక్కమ్మా! టిఫిన్ పట్రా" అంది సునంద.

"నందూ! నువ్వే లేకపోతే ఏమైపోదునో!" సునందని చూస్తూ ఆర్ద్రంగా అంది నీరద.

"నే ఉన్నాగా! ఇంకెందుకా ఆలోచన?" నవ్వుతూ రిమోట్ నొక్కింది, సోఫాలో కూర్చుంటూ. నవ్వుల జల్లు ఆరంభమైంది.

పన్నెండేళ్ళ చుక్కమ్మ ప్లేట్లలో పకోడీలు, గాజుగ్లాసుల్లో మంచి నీళ్ళు ఒక ట్రేలో పెట్టి తెచ్చింది. పొట్టిగా, పీలగా ఉన్న చుక్కమ్మని చూస్తూ 'బావున్నావా?'అనడిగింది నీరద. మనసులో అనుకుంది '*అర్థం లేని ప్రశ్న. బడిలో చదువుకుంటూ ఉండాల్సిన పన్నెండేళ్ళ పిల్ల ఇంట్లో చాకిరీ చేస్తూ ఉంటే అడగాల్సిన ప్రశ్నేనా ఇది?* 'అని.

"ఆఁ" వినయంగా తలూపి, లోపలికెళ్ళింది చుక్కమ్మ.

"నందూ! ఎందుకే ఇలా చైల్డ్‌లేబర్... మంచిది కాదే"

"పోవే. వాళ్ళ కవసరం. నాకు వీలు. మళ్ళీ నీసోది మొదలెట్టకు" పకోడీ ప్లేటు అందిస్తూ అంది సునంద.

"పోనీ ఒక పూట స్కూలుకి పంపవే"

"తల్లీ! ఆ విషయం వదిలెయ్. ఇది చైల్డ్ లేబరేం కాదు. అది చిన్నగా కనిపిస్తుంది గానీ దాని వయసు పద్దెనిమిది. అది అడల్ట్" మొండిగా అంది.

'సునంద ప్రేమ తనకి కావాలి. వాళ్ళ ఇంటి సంగతి, పనివాళ్ళ సంగతి తనకనవసరం' సినిమా వైపు దృష్టి తిప్పింది సునంద. వేడి పకోడీలు నములుతూ మధ్య మధ్యలో కబుర్లు చెప్పుకుంటుంటే సినిమా ముందుకు నడిచింది. బాగా నవ్వొచ్చి కళ్ళు చెమ్మగిలినపుడు "నందూ! అయి లవ్యూ" అంది నీరద.

"యూ ఛీట్! అటు అవిన్‌తో, ఇటు నాతో.. ఇద్దరితో ప్రేమాయణం నడుపుతావా?" కోపం నటించింది సునంద. ఇద్దరూ ఫక్కున నవ్వుకున్నారు.

చుక్కమ్మ వేడి టీ తెచ్చింది. ముందు సునంద కిచ్చి, నీరద వైపు ట్రే చాపింది. నవ్వుతూ కప్పు అందుకుంటుంటే టీ తొణికి, వేడి టీ కొంచెం నీరద చేతిమీద, చీరమీద పడింది. చుర్రుమని కాలింది. లేత రంగు క్రేప్ చీర మీద మచ్చ కనిపించగానే 'అయ్యో!' అని బాత్‌రూమ్ వైపు పరుగు పెట్టింది నీరద. మరక పడ్డ భాగం జాగ్రత్తగా శుభ్రం చేసుకుని మళ్ళీ హాల్లోకి వచ్చే సరికి, కార్పెట్ మీదా, కింద పడ్డ మరకల్ని తడిబట్టతో తుడుస్తోంది

చుక్కమ్మ. సోఫాలో కూర్చోబోతూంటే నీరద కంట పడ్డాయి చుక్కమ్మ లేతబుగ్గ మీద చేతి వేళ్ళ అచ్చులు! తడికళ్ళు! మనసంతా కెలికేసినట్టైయింది నీరదకి. సునంద! తన బాధ అర్థం చేసుకుని, తనని పువ్వులా ప్రేమగా చూసుకునే స్నేహమయి. తన మానసిక వేదనని చెప్పకుకుండానే గ్రహించి, స్నేహహస్తం చాచి, తన కన్నీరు తుడిచే ప్రేమ మూర్తి. అనారోగ్యంగా ఉన్నపుడు తనకి తల్లితండ్రుల అండ లేదని, వారి బాధ్యతని సంతోషంగా స్వీకరించిన నెచ్చెలి! మరి ఇపుడిపుడే కౌమారంలోకి అడుగుపెడుతున్న చుక్కమ్మ చెంపమీద ఆ ఎర్రని చారలు?

ముడుచుకుపోయి సోఫాలో కూర్చుంది నీరద.

"నీరూ? చీర పాడైందా? ఇందాకే అనుకున్నా ఎంత బావున్నావో ఈ చీరలో అని! అదో ఎడ్డి మొహం. ఎన్నిసార్లు చెప్పినా జాగర్త లేదు!" చిరాగ్గా అంది సునంద.

"నందా! ప్లీజ్... చుక్కమ్మ తప్పేం లేదు. నాపొరపాటు వల్ల తనకి..." జాలిగా నెమ్మదిగా అంది - 'నాకు నీ స్నేహం కావాలి. కానీ ఇలాంటి అన్యాయం భరించలేను' అన్నట్టు.

"నీరూ! నువ్వు మరీ ఇంత సున్నితంగా ఉంటే లాభం లేదే"

ఇబ్బందికరమైన మౌనం ఇద్దర్నీ చుట్టివేసింది.

మళ్ళీ సునందే అంది "నీరూ! ఏ విధంగా నైనా.. డబ్బు విషయంలోగానీ, అధికారంలో గానీ బలవంతుడు బలహీనుడి మీద పెత్తనం చేయడం ఎప్పట్నించో ఉంది, ఎప్పటికీ ఉంటుంది. మా ఆయన్ని చూడు... చెయ్యని తప్పుకి 'డిమోట్' చేసి ట్రాన్స్‌ఫర్ మీద పంపేశారు! కేసు కోర్టులో ఉంది నాలుగేళ్ళుగా. ఆయనక్కడ. నేనూ పిల్లలూ ఇక్కడ. ఆ బాస్‌కి తన మీద ఎందుకో కసి. ఎప్పటికో కేసు తేలి, ఆయనిక్కడకొచ్చేసరికి మా జీవితంలో ముఖ్యభాగం గడిచిపోతుంది! ఇదే జీవితం. దీన్ని అంగీకరించాల్సిందే" నీరద చేతి మీద చెయ్యేసి నెమ్మదిగా అంది సునంద.

"నందా! నీ అభిప్రాయాలతో ఏకీభవించలేకపోతున్నాను. నాకు ఇంటికి వెళ్ళిపోవాలనుంది. చుక్కమ్మని.. ప్లీజ్ ట్రీట్ హర్ వెల్.. నా కోసం" అంది నీరద సునంద మొహంలోకి చూడలేనట్టుగా, టీవీ మీద దృష్టి నిలిపి.

"నీరూ!" విస్మయంగా చూసింది సునంద. "దాని బాగోగులన్నీ చూస్తాను. మంచి తిండి పెడతాను. నీకన్నీ తెలుసు దాని కుటుంబానికి నేనెంత చేస్తానో" నొచ్చుకున్నట్లు అంది.

"నందా! ఇతరుల తప్పుల వల్ల మన తప్పులు ఒప్పులవవు. ఇదివరకు కూడా చూశాను. ఏదేనా పొరపాటు జరిగితే నీ చెయ్యిలేస్తుంది దానిమీదకి. పింకీ వయసుది అది! బాబీ దాన్ని అస్తమానం మొట్టికాయలు వేస్తుంటాడు. నువ్వు నవ్వుతూ 'బాబీ! తప్పురా' అంటావు అంటీముట్టనట్టు. 'వాడు వినడు' అంటావు మురిపెంగా! చూసిన ప్రతిసారీ నాకు ఏదో మానసిక వేదన! ఎందుకంటే నాకు నువ్వు కావాలి.." నీరద కళ్ళు వర్షించాయి.

"నీరూ! ఒక పనిపిల్ల గురించి నన్ను నిందిస్తున్నావా?" షాక్ తిన్నట్టుగా అడిగింది సునంద. ఆమె వదనం ఎర్రబడింది. పెదవులు అదిరాయి.

తర్వాత గంటకి ఇంటిదారి పట్టిన నీరదకి అంతా అగమ్యగోచరంగా అనిపించింది. మనసు నిండా ఎన్నో ప్రశ్నలు. ఉవ్వెత్తున ఎగిసిపడే తరంగాల్లాంటి ప్రశ్నలు. హృదయ సముద్రంలో మథనం జరుగుతోంది. హృదయం! అదో అగాధం, అదో సముద్రం, అదో అగోచర కీకారణ్యం! ఆ కీకారణ్యంలో దారి వెతుక్కోవాలి. ఆ అగాధంలో జారిపడినా శక్తి కూడదీసుకుని గమ్యం వైపు పయనించాలి. ఆ సముద్రాన్ని మథించి అమృతం సాధించాలి?

వీధి మలుపులో అవిన్ ఎదురయ్యాడు. మౌనంగా కారెక్కింది. చాలాసేపు నిశ్శబ్దం. ఇంటివైపు మలుపు తిరగ్గానే ఎడంచేత్తో నీరద చేతిని మృదువుగా నొక్కి "అయామ్ సారీ నీరూ!" మెల్లగా అన్నాడు అవిన్. నీరద కళ్ళెత్తి అతన్ని చూసింది. అతడి తడికళ్ళు వీధి దీపాల వెలుగులో మెరిశాయి.

****

# ప్రతిబింబాలు

## నండూరి శ్రీనివాస్



నిన్నటిదాకా నాలో వెలుగులు నింపిన జీవనజ్యోతి ఈ రోజు రాజేశ్వరి తల దగ్గర మిణుకు మిణుకు మంటోంది. జీవితంలో ఈ ఒక్కరోజూ లేకుండా ఉంటే ఎంత బావుణ్ణు అని ఉదయం నుంచీ ఎన్ని వేల సార్లు మూగగా ఏడ్చుంటానో? మా ఇద్దరి బంధం ముప్ఫై ఏళ్ళ పైమాటే. జీవితంలో సంతోషాన్నీ విషాదాన్నీ నాతోపాటే ఇన్నాళ్ళూ కలిసి పంచుకున్న నా రాజీ అచేతనంగా పడిఉంటే నాకు నోటమాట రావట్లేదు.

రాజీది రాజీపడని అందం. తను నా జీవితంలో అడుగుపెట్టిన క్షణం నుంచీ ఆ అందానికి నేను నిత్య ఆరాధకుణ్ణే. ఆ ఆలయంలో నిత్య పూజారినే. అలాంటి రాజీ ఇప్పుడు లేదన్న నిజాన్ని నమ్మలేక నా గుండె పగిలిపోతోంది. కానీ కళ్ళు మాత్రం కన్నీరు కార్చటం లేదు. ఇందాక వినోద్‌తో ఫోన్లో మాట్లాడాకా కన్నీళ్ళు ఆవిరై-యిపోయాయి.

వినోద్ మా ఒక్కగానొక్క కొడుకు.

"ఒరేయ్, మీ అమ్మకి ఉన్నట్టుండి చాలా తేడా చేసింది. వెంటనే బయలుదేరిరారా" ఆదుర్దాగా చెప్పాను.

అమ్మ పోయిందని తెలిస్తే వాడు తట్టుకోలేడేమో అని నా ఉద్దేశ్యం.

"ఎంత డబ్బైనా పర్లేదు నాన్నా, మంచి వైద్యం చేయించు, మనీ కావాలంటే వెంటనే అకౌంటు ట్రాన్స్‌ఫర్ చేస్తాను" అన్నాడు.

చెప్పు తీసి కొడదామనిపించింది వాణ్ణి.

కనీసం అమ్మకి ఏమయ్యిందని కూడా అడగలేదు. అడ్డగాడిద.

వాడు మాట్లాడిన మూడు మాటల్లో రెండు డబ్బు గురించే. వాడికి ఎంత సేపూ డబ్బే.

"ఈ వయస్సులో మమ్మల్ని వదిలేసి పోకురా" అని ఎంత బ్రతిమాలుకున్నా పెళ్ళైన వెంటనే పెళ్ళాన్ని తీసుకుని అమెరికా పోయాడు. వయసైపోయే లోపే సంపాదించుకోగలిగినంత సంపాదించుకోవాలని వాడి ఆశ.

ఇంక ఉండబట్టలేకపోయాను.

"ఒరేయ్, మీ అమ్మ పోయిందిరా.." వెక్కుతూ అన్నాను.

అవతల ఒక్క నిముషం నిశ్శబ్దం.

షాకయ్యాడేమో, పాపం మెల్లిగా చెప్పి ఉండాల్సింది అనుకున్నాను.

"అయ్యో! అలాగా, సరే నువ్వుకానిచ్చేయ్ నాన్నా, ప్రస్తుతం ప్రాజెక్టు డెడ్‌లైన్సు, చాలా బిజీగా ఉన్నాను. వీలు చూసుకుని వస్తాను"

ఎంత తేలిగ్గా చెప్పాడు? అమ్మపోయిందని బాధ కూడా లేదు వీడికి.

ఇన్నేళ్ళూ మేమిద్దరం రెక్కలు ముక్కలు చేసుకుని ఎంతో కష్టపడి సంపాదించి పెంచి పెద్ద చేసింది ఈ భ్రష్టుడికేనా అని అనిపించింది. వీడిలా తయారవ్వడానికి అసలు వీడి పెళ్ళామే కారణం. ఆ శూర్పణఖ ఏం చెపితే అదే వాడికి లక్ష్మణరేఖ.

ప్రొద్దుట్నుంచీ ఎంతో మంది రాజేశ్వరిని చూసి పోతున్నారు. నేనూ రాజీ కలిసి ఒక "చిల్డ్రన్ డేకేర్" పెట్టాం. మా ఏరియాలో ఇద్దరూ ఉద్యోగం చేసే జంటలు చాలానే ఉన్నాయి కానీ వాళ్ళ పిల్లలని చూసుకోవడానికి ఒక్క డేకేర్ కూడా ఉండేది కాదు. ఆ బలహీనతని రాజీ కనిపెట్టింది... ఇంకేముంది? మేమే ఆరుగురు టీచర్లని అపాయ్‌ంట్ చేసుకునేంత పెద్దగా ఆ "డేకేర్" ఒక్క సంవత్సరంలోనే ఎదిగిపోయింది. ఉదయంనుంచీ ఆ చుట్టుపక్కల పేరెంట్సుతోనూ, వాళ్ళ పిల్లలతోనే మా వాకిలి నిండిపోయింది. రాజేశ్వరి లేదన్న నిజాన్ని ఎవ్వరూ నమ్మలేకపోతున్నారు.

"రాజేశ్వరి మిస్సుకి ఏమైంది?" అని మూడున్నరేళ్ళ అనీల్‌గాడు వాళ్ళ నాన్నని అడుగుతుంటే నా గుండె పిండినట్లయింది. వాడికున్న పాటి ఆదుర్దా కూడా గాడిదలా ఎదిగిన నా కొడుక్కి లేదు.

"మేస్టారూ! చీకటి పడే లోపు కార్యక్రమం పూర్తి చేసేద్దామా, లేక మీ అబ్బాయి వచ్చేదాకా ఆగుదామంటారా?" అన్నారు చుట్టుపక్కలవాళ్ళు. ఇంకెక్కడ అబ్బాయి? ఉదయం నుంచీ మూడు సార్లు ఫోన్ చేసాను. చివరిసారయితే కోడలు ఎత్తింది.

"అయ్యో పాపం అత్తయ్యా!? అని కూడా అనలేదు. కన్న కొడుకే పట్టక పోతే ఇంక కోడలెంత?

అసలే నాకోడలకి విపరీతమైన అహంకారం. అందం, డబ్బూ, ఉన్న చాలా మంది ఆడవాళ్ళకి వద్దనుకున్నా ఉండే మూడోది. వినోద్‌కి పెళ్ళై పిల్లడు పుట్టాక మనవణ్ణి చూపించమని ఎన్నో సార్లు ఫోన్ చేసేది, ఉత్తరాలు రాసేది. విసుగెత్తి చివరకు "నేను చస్తే తప్ప వీడు నన్ను చూడటానికి కూడా రాడేమోనండి" అనేది.

ఇప్పుడు అది కూడా భ్రమే అని తెలిస్తే ఆ ఆత్మ ఎంత క్షోభిస్తుందో? పుత్రుడు పుడితే పున్నామ నరకం నుంచీ తప్పిస్తాడంటారు. ఆ పున్నామ నరకం ఎక్కడుంటుందో తెలియదు కానీ, వీడు బ్రతికుండగానే చూపించేశాడు. ఇలాంటి వెధవ చేత తల కొరివి పెట్టిస్తే రాజేశ్వరి ఎంత క్షోభిస్తుందో? ఇంక రాజీని చివరిసారిగా నేనే సాగనంపాను.

నా కళ్ళల్లో పెట్టుకుని పదిలంగా చూసుకున్న ఆ రూపాన్ని, మృత్యువు ఒక్క క్రీగంట చూపుతో సొంతం చేసుకుంది. అగ్ని దేవుడు పొడవాటి నాల్కలు చాచి, నిర్దాక్షిణ్యంగా రాజీని కంబళించాడు.

ఇన్నాళ్ళూ పంచప్రాణాలు ఎత్తుగా చూసుకున్న నా అర్ధాంగిని, పంచభూతాలు తమలో కలిపేసుకున్నాయి. వచ్చిన వాళ్ళు ఒక్కొక్కళ్ళే వెళ్ళిపోతున్నారు.

నాకు మాత్రం వెళ్ళాలనిపించడంలేదు.

నా రాజీ సాన్నిహిత్యంలో నేను గడిపే ఆఖరి రోజదే

నిన్నటికీ ఈ రోజుకీ ఎంత మార్పు? నిన్న అన్నీ ఉన్న చక్రవర్తిని. నేడు యుద్ధంలో ఓడిపోయి ఒంటరిగా మిగిలిన సైనికుణ్ణి. రాజీ లేకపోతే ఎంత మార్పు? రేపటి నుంచీ రాజీ లేని ఒంటరి జీవితం గడపడం ఎంత కష్టమో? తల్చుకుంటేనే భయంగా ఉంది. ఇంక నా రోజులన్నీ అనుభూతి శూన్యమే కదా?

ఇప్పటిదాకా బింకంగా ఉన్నాను కానీ, ఇంక దుఃఖం కట్టలు తెంచుకుంది. మొదటి కన్నీటి చుక్క బయటకు రాలింది. ఎంత తట్టుకుందామన్నా బాధ తీరడంలేదు. ఒక్కసారి వినోద్‌ని చూడాలని, నాకొచ్చిన అతి పెద్ద కష్టాన్ని వాడితో చెప్పుకోవాలనీ, వాడిని గట్టిగా కావలించుకుని ఏడవాలనిపించింది.

అసలు వీడెందుకిలా తయారయ్యాడో?

రాజేశ్వరి మొదటి నుంచీ చాలా పట్టుదల కల మనిషి. (దీన్నే చుట్టాల్లో కొంతమంది మొండితనం అనేవారు.) అనుకున్న దాన్ని సాధించడం కోసం దేన్నైనా వదులుకునే స్వభావం తనది. మాదొక మధ్య తరగతి కుటుంబం. అప్పట్లో నా ఆదాయం నెలకి నాలుగొందల రూపాయలు. తన కలలు సాకారం చేసుకోవడంకోసం రాజీ ఉద్యోగంలో చేరతానని నన్ను రోజూ సతాయించేది. చివరికి ఒప్పుకున్నాను. తొందరలోనే ఒక బ్యాంకు ఉద్యోగం సంపాదించింది.

వినోద్‌ని ప్రసవించాకా, మూడో నెల్లో తను పుట్టింటి నుంచీ తిరిగొచ్చింది. తీరా చూస్తే బిడ్డని తీసుకురాలేదు. వాళ్ళమ్మ దగ్గరే వదిలేసి వచ్చింది. మా ఇద్దరికీ పెళ్ళయ్యాక ఆ రోజే మొదటిసారిగా పెద్ద యుద్ధం అయ్యింది.

రోజూ ఉద్యోగానికెళుతూ బాబుని చూడం కష్టం కదాని అలా చేసిందట.

పిల్లల కోసం ఉద్యోగం మానేయచ్చు కదా అని నా వాదన.

ఇద్దరం రెక్కలు ముక్కలు చేసుకుని సంపాదించేది పిల్లలకోసమేగా అని తేల్చింది. నాకేం చెప్పాలో తెలియలేదు. చివరకు నేనే తగ్గాను. రాజీకి కోపం వచ్చిందంటే అది గ్రీష్మ తాపమే. కోపం వచ్చినప్పుడు ఆ రోజు రాత్రంతా ఇక నాతో మాట్లాడేది కాదు. అన్నం మానేసి ఒక మూల కూర్చునేది. చివరకు నేనే తగ్గాల్సి వచ్చేది.

పక్కింటి రవి చంద్రన్ తన మూడేళ్ళ పాపతో ఇసుక దిబ్బల మీద ఆడుకోవడం చూసినప్పుడల్లా నాకు చాలా అపురూపంగా అనిపించేది. గంటల తరబడి అదే దృశ్యాన్ని మా కిటికీలోంచి దొంగ చాటుగా ఎన్నాళ్ళు చూసుంటానో? నేనేదో గొప్ప పెన్నిధి కోల్పోతున్నాననే భావన అను క్షణం నన్ను వెంటాడేది. కానీ రాజీని కన్విన్స్ చేయడం చాలా కష్టమని నాకు తెల్సు.

ఇలా చాలా ఏళ్ళు గడిచాకా చివరికి వినోద్‌ని మంచి కాన్వెంటులో వేయడం కోసం మేమే తెచ్చేసుకున్నాము. మళ్ళీ కథ మొదటికొచ్చింది. వినోద్‌ని చూసుకోవాలిగా, ఉద్యోగం మానేయమని నేను, వీల్లేదని తను. చివరికి ఒక ఆయాని పెట్టుకున్నాము. ఆయాలో అనురాగం, డబ్బా పాలల్లో మమకారం దొరికితే ఇంక ప్రపంచంలో అమ్మలెందుకు?

వినోద్ ఆయా దగ్గర ఉండటానికి ఇష్టపడేవాడు కాదు.

అప్పుడే జరిగింది నేను మర్చిపోలేని సంఘటన. ఇప్పటికీ ఆ జ్ఞాపకం నా గుండెల్లో పచ్చి పచ్చిగానే ఉంది.

రాత్రి మాస్టర్ బెడ్‌రూంలో మా ఇద్దరి పడక, వాడికేమో ఇంకొక బెడ్‌రూం...

నాకెందుకో అది నచ్చేదికాదు. కానీ వాడికి స్వతంత్రంగా పెరగడం నేర్పించాలని రాజీ ఉద్దేశ్యం.

ఆరోజు రాత్రి మేము గాఢ నిద్రలో ఉన్నామో, లేక మాటలు వినిపించుకోలేని ఇంకేదో స్థితిలో ఉన్నామో తెలీదు కానీ, తెల్లారి చూస్తే మా బెడ్‌రూమ్ తలుపు దగ్గరే వినోద్ పడిపోయి ఉన్నాడు. వాడి ఒళ్ళు జ్వరంతో కాలిపోతోంది. రాజీ ఆఫీసులో ఏదో ఇన్స్పెక్షన్ ఉందట. మానడానికి వీల్లేదంది. ఎంత డబ్బైనా పర్లేదు, మంచి డాక్టరికి చూపించమని చెప్పి వెళ్ళిపోయింది. నేనే లీవు పెట్టుకుని చివరికి మూడురోజులు వాడితో కూర్చున్నాను. అప్పటికి నెమ్మదించింది.

నాకు చాలా బాధ కలిగింది. షరా మామూలే. ఉద్యోగం మానేయమని నేను, వీల్లేదని తను. రక్తం రుచి మరిగిన పులిని సంపాదన రుచి మరిగిన ఆడదాన్ని మళ్ళీ మామూలుగా మార్చడం దాదాపు అసాధ్యమే అనిపించింది. చివరికి ఒక నిర్ణయానికొచ్చాము. దగ్గర్లో ఉన్న సిటీలో ఒక మంచి రెసిడెన్షియల్ స్కూల్ చూసి వాడిని అందులో జేర్చాము. ఆ పక్క వారమే వాడిని చూడటానికి వెళ్ళేసరికి వాడు బోరు బోరుమని ఒకటే ఏడుపు. వాడికొచ్చిన పెద్ద కష్టాన్ని మాటల్లో చెప్పడం వాడికి చేతకాలేదు.

"నేను మీ దగ్గరే ఉంటాను, ఇక్కడ ఉండను" అని వెక్కి వెక్కి ఏడుస్తుంటే, నేను తట్టుకోలేకపోను. సముదాయిద్దామంటే రాజీ గట్టిగా చెప్పింది.

"వాణ్ణి బుజ్జగిస్తే, ఇంక ఇక్కడ వార్డెన్ల మాట వినడు. కొన్నాళ్ళు పట్టించుకోకుండా ఉంటే వాడే అలవాటు పడిపోతాడు." అని. మొదట్లో నాక్కూడా మనసు లాగినా, మెల్లిగా అలవాటయిపోయింది. చాలా రోజుల పాటు చూడటానికి వెళ్ళలేదు. ఇద్దరికీ ఉద్యోగాలతో తీరికెక్కడిది.? మళ్ళీసారి వెళ్ళేసరికి వాడికి పెద్దరికం వచ్చేసింది. ఆ జీవితానికి అలవాటు పడిపోయాడు. కానీ సెలవుసెలవులకి ఇంటికి వచ్చినపుడు మాత్రం తిరిగి హాస్టల్‌కి వెళ్ళడానికి ఏడ్చేవాడు. వాడింటికి వచ్చినప్పుడు వాడితో ఆడుకోవడానికి ఇంట్లో ఎవ్వరూ ఉండేవారు కాదు. ఇద్దరం ఉద్యోగాలే కదా! రాను రాను వాడికి ఇంటికన్నా, హాస్టలే నయమనిపించింది. ఇంటికి రారా అంటే వద్దని మారాము చేసేవాడు. ఇంకా కొంచెం పెద్ద క్లాసుల్లోకి వెళ్ళాకా, సెలవుల్లో వాళ్ళ ఫ్రెండ్స్ ఊళ్ళకి వెళ్ళిపోయేవాడు. తరువాత వాడి యూనివర్శిటీ చదువు, ఇప్పుడు ఫారిన్లో ఉద్యోగం మొత్తానికి మా జీవితంలో వాడితో కలిసి గడిపిన వారాల్ని వేళ్ళమీద లెఖ్ఖపెట్టొచ్చేమో.

పిల్లలతో గడిపగలిగే మధురమైన సంవత్సరాలు మొదటి పది, పదిహేనే అంటారు. ఆ మాధుర్యం మేము రుచి చూడకుండానే మా వాడి బాల్యం వెళ్ళిపోయింది. మాకు ఉద్యోగాలతోనే సరిపోయింది. ఆ పదిహేను సంవత్సరాలు రెక్కలు ముక్కలు చేసుకుంటే మేము కూడ బెట్టినది షుమారుగా రెండు లక్షలు. అదిప్పుడు మా వినోద్‌కి ఒక నెలజీతంలో సగమన్నమాట.

*ప్రేమను పుట్టేయమని స్విచ్ వేస్తే పుట్టడానికి మనస్సేమీ యంత్రం కాదు కదా. ప్రేమ ఒక రెస్పిపొకేషన్. దాని విలువ తెలిసేసరికి చెయ్యి దాటిపోవడం ప్రేమకున్న మరో లక్షణం.*

ఎంత దౌర్భాగ్యపు బ్రతుకు?

తప్పు ఎవరి వల్ల జరిగింది?

రాజేశ్వరి మొండితనం వల్లా. లేక నా చేతకాని తనం వల్లా?

నాకు రాజేశ్వరిని లాగొక్కటి కొట్టాలని జీవితంలో మొదటిసారి అనిపించింది. ఛా.. ఇంత ఆలస్యంగానా.

"సానా ఆనస్యం ఐనాది. ఎంత బాధపడ్డా పోయింది తిరిగిరాదుగా. ఎళ్ళి రండి బాబూ" అన్నారెవరో. చూస్తే కాటికాపరి. నాజీవితాన్నంతా ఒక్క వాక్యంలో ఎంత గొప్ప చెప్పాడు?

చెయ్యాలి, ఏదో ఒకటి చెయాలి..

లేకపోతే నా అంతరాత్మ నన్ను బ్రతకనిచ్చేలాలేదు.

పోనీ నేను కూడా ఫారిన్ వెళ్ళిపోయి, నా కొడుకుతో కోల్పోయిన రోజుల్ని కనీసం నా మనవలతో ఐనా అనుభవిస్తే? అస్సలు బావుండదు. ఇన్నాళ్ళూ లేని మమకారం ఇప్పుడు పుట్టుకొచ్చిందా అని జనాలు అడగరూ? ఏదో ఒకటి చేసేయాలి... నా పాపాన్ని కొంచమైనా కడుక్కోవాలి.

ఇంటికి రాగానే ఎదురుగా కనిపించింది "చిల్డ్రన్ డేకేర్" బోర్డు.

ఆ బోర్డు విరగ్గొట్టి అవతల పారేశాను.

గోడల మీద పేర్లన్నీ చెరిపేశాను.

ఇంకొంతమంది తల్లితండ్రుల్ని మాలాంటి వాళ్ళగా తయారు చేసే ఫ్యాక్టరీ మూసేసాను.

అదొక్కటే ప్రస్తుతానికి నేను చెయ్యగలిగింది...



# ఆ అడుగుజాడల్లో

## వాసంతి

బస్సు దిగి బ్యాగ్ బుజానికి వేసుకుని శ్రీను ఉత్తరాన్ని గుర్తు చేసుకుంటూ నడక మొదలు పెట్టేను. "అమ్మగారు పోయేక మాస్టారు మరీ ఒంటరైపోయారు. ఏడాది పాటు మనశ్శాంతి వెతుక్కుంటూ ఊళ్ళంటా దేశాలమ్మటా తిరిగి వచ్చేసరికి ఆయన ఇంటిని కలుపుకుని పక్కింటి సీతారాం ఇంటి చుట్టూ ప్రహరీ గోడ వెలిసింది. వాడిని ఎరుగుదువుగా, ఆ రాక్షసుడితో ఈ మనలాంటి ప్రాణి ఏం తలపడగలడు? అతి మర్యాద చేసి వాడిచ్చిన పంచె, కండువా వీధి చివర గుడి ముందరి ముష్టివాడికిచ్చి ఆయన పుట్టి పెరిగిన పల్లెటూరికి వెళ్ళిపోయారు. అక్కడి పాత ఇంటికి చేతనయిన బాగులు చేయించుకుని అందులో ఉంటున్నారు ఆయన కొచ్చే కాస్త పెన్షన్‌లోనే మిగిల్చి చుట్టు

పక్కల పిల్లలకు పుస్తకాలవీ కొనిపెట్టి చదువు చెపుతూ నలుగురికి చేతనయిన సాయం చేస్తూ సంతోషంగా ఉన్నారు. నేను వెళ్ళినపుడు సీతారాముడి చేతిలోంచి ఇల్లు విడిపిస్తానని, లేకపోతే ఆయన ఉన్న ఇంటిని బాగు చేస్తానని, అవసరానికుంటాయి, బ్యాంక్‌లో డబ్బు వేస్తానని ఎంత పట్టుబట్టినా దేనికీ ఒప్పుకోలేదు. నాలుగు రోజులు ఆయనతో ఉండి వచ్చాను. ఆయన లాంటి భాగ్యవంతుడితో పోలిస్తే నాలాంటి సామాన్య ఎన్నారై ఎంతరా? నువ్వు ఇండియా వెళితే ఆయనతో నాలుగు రోజులు గడిపిరా నీకు జీవితం పైనా, నీ మీదా నమ్మకం పెరుగుతుంది"

శీను ఉత్తరంలో వ్రాసిన గుర్తుల ప్రకారం రావిచెట్టు కిందకి వచ్చాను. ఆ ఊరు నాగరిక ప్రపంచంనుంచీ దూరంగా విసిరేసినట్లుందున్న వల్లేనేమో రావి చెట్టు, చుట్టూ పెద్ద గట్టూ ఇంకా ఉన్నాయి. పక్కనే పంచాయితీ ఆఫీస్ తెరవడానికి తాళాలు పట్టుకున్న మనిషిని అడిగాను, 'రాఘవరావు మాష్టారి ఇంటికెటు వెళ్ళాలి?". అతను తాళం చేతిలో పట్టుకుని గడియ తీస్తూ అన్నాడు "ఈ ఊళ్ళో రాఘవరావనే మాష్టారెవరూ లేరండి. ఇక్కడి స్కూల్లో పనిచేసే మాష్టార్లెవరూ ఈ ఊళ్ళో కాపురం ఉండరు."

"ఉద్యోగం నుండీ రిటైరయి రెండేళ్ళుగా ఇక్కడికి వచ్చి ఉంటున్నారు. ఆయనది యీ ఊరే. నల్లగా సన్నగా పొడుగ్గా ఉంటారు." ఇంకా వివరాల కోసం తడుముకుంటున్నాను.

"ఓహో, అలా చెప్పండి, పిచ్చి పంతులు గార్రా" చెట్టు క్రింద సిగరెట్టు కాలుస్తున్న గళ్ళ చొక్కా కుర్రాడు వెంటనే చెప్పేడు.

"నీలాంటి వాడికి ఆయన పిచ్చి పంతులే.... అదిగో పోస్టాఫీసు గుమ్మంలో సైకిలెక్కుతున్నాడు ఉత్తరాలాయన, ఆయన్నడుగు బాబూ చెపుతాడు. అయ్యగారు వచ్చేసరికి ఉండకపోతే తిడతారు, లేకపోతే నేనే తీసుకెడుదును."

ఆయన పట్ల అతను చూపించిన గౌరవానికి కొంచెం ఆశ్చర్యం వేసింది, ఇక్కడ ఉండక పోయినా ఆఫీసులు, ఉద్యోగస్తులు ఎలా ఉంటున్నది ఇంకా మరచిపోలేదు నేను. అప్పుడు మాష్టారి ముందు నాకోపాన్ని వెళ్ళగక్కితే ఆయన నవ్వేవారు "వాళ్ళని అలా చేసిన పరిస్థితులనీ, పరిసరాల్ని అనాలిరా, చేతనయితే వాటిని మార్చాలి" అంటూ.

పోస్ట్‌మన్ దగ్గిరకు వెళ్ళి మాష్టారి కోసం అడిగేను. అతను రమ్మంటే వెంట బయలు దేరాను. వీధి తిరిగి ఉత్తరం ఇచ్చేందుకు వెడుతూ, "అదిగో కుడివైపుకి తిరిగి తిన్నగా వెళ్ళండి, చివరిల్లే ఆయనది. ఈ పనయ్యాక నేను అక్కడికే వస్తాను" అన్నాడు. మాస్టార్ని అర్థంచేసుకుని గౌరవించే వాళ్ళు తమ పని ప్రక్కన పెట్టి అనవసరంగా ఆయనింటికి రారు.

పరిసరాలు చూసుకుంటూ నడకసాగించాను. మురికి, చెత్తా పోగేయడంలో టౌనుకేం తక్కువ కాదన్నట్లున్నాయి వీధులు. కొంత దూరం వెళ్ళేసరికి చెత్త కనిపించటం ఆగిపోయింది. వాకిళ్ళు అద్దాల్లా ఉన్నాయి. ఎక్కడా చెత్తపోగు, మురికి గుంటా లేదు. అన్నీ చిన్న చిన్న ఇళ్ళు, ఒక్కక్షణం ఆశ్చర్యం, అంతలో ఆనందం - వీళ్ళంతా మాష్టారి శిష్యులయి ఉండాలి. ఆ పది ఇళ్ళూ దాటేక పెద్ద ఆవరణా చుట్టూ మొక్కలతో సరిహద్దు ఉన్న చివరి ఇల్లు కనబడింది. ఇంక ఆగలేకపోయా. పరుగెత్తి వెళ్ళి వెదురు బద్దల గేటు తీసి లోపలకు వెళ్ళి, మళ్ళీ గేటు జాగ్రత్తగా మూశాను. చుట్టూ చిన్నవీ పెద్దవీ మొక్కలు, చెట్లు శుభ్రమైన ఆవరణ. ఇంటి తలుపులు తీసే ఉన్నాయి. పక్కనే ఉన్న వేపచెట్టు కింద చాప మీద పుస్తకాలలో శ్రద్ధగా రాస్తున్నారు పిల్లలు.

"ఎవరొచ్చేర్రా" అంటూ మాష్టారు బయటకు వచ్చేరు.

నీళ్ళు నిండిన నా కళ్ళకి మసకగా కనిపించే ఆ దైవానికి వంగి నమస్కరించబోయాను. వంగకుండానే పైకి లేపి నవ్వుతూ భుజం తట్టేరు. "కాళ్ళకి దండం వద్దు, ఇక నువ్వు నా స్నేహితుడివి" ఉద్యోగానికి వెళ్ళబోతూ ఆయనకు నమస్కరించబోతే ఆయన అన్న మాటలు గుర్తువచ్చేయి.

"రా,రా పొద్దున్న లేత వంకాయలు కోస్తూ నిన్నే తల్చుకున్నాను".

నన్ను లోపలకు తీసుకెడుతూ పిల్లల్ని హెచ్చరించారు

"అరగంటలో అందరూ పూర్తి చెయ్యాలి, ఇదిగో మీ అన్నయ్య వీడు, తరువాత వీడితో గడపాలి"

పిల్లలు నన్ను చూసి నవ్వి తలలు వంచుకుని శ్రద్ధగా వాళ్ళ పనిలో పడ్డారు.

కాఫీ రెండు కప్పుల్లో పోసి తెస్తూ "ఎప్పుడొచ్చావు రాజూ? శ్రీమని కలిశావేమిటి" అన్నారు.

నా ఉద్వేగాన్ని అణుచుకున్నాను. కప్పు అందుకుని మంచం మీద ఆయన పక్కకెళ్ళి కూర్చున్నాను. ఎలా ఉన్నారు. ఈ ఊరెలావుంది లాంటి ప్రశ్నలు ఆయన్ని అడగటం అనవసరం. ఆయనెప్పుడూ బాగానే ఉంటారు. ఏ ఊరైనా ఆయనకు బాగుంటుంది, కాదు, బాగుండేలా చేసుకోగలరు. 'దేనిలో నయినా మంచి ఉంటుంది. దాన్ని వెతికి పట్టుకుని అనుభవించాలి' అంటారాయన.

కుశల ప్రశ్నలు పూర్తి చేసి, 'స్నానానికి వెళ్ళు, ఈలోగా ఏం తినాలో ఆలోచించి ఉంచుతా' అన్నారు.

'నేను వండుతా మరి'

'వంట బాగానే నేర్చుకున్నావన్న సంగతి నువ్వు క్రిందటి సారి వచ్చినప్పుడు తెలిసిందిలే, పెళ్ళయినా మరచి పోలేదన్నమాట'

జవాబుగా నవ్వేను ' మీ ట్రైయినింగ్ మరి' అన్నట్లు.

నేను స్నానం పూర్తి చేసి బయట తువ్వాలు ఆరవేసి వచ్చేసరికి పిల్లలు పుస్తకాలు పట్టుకు వచ్చేరు. ఒకటి ఆయన తీసుకుని మరొకటి నాకు ఇవ్వమని సంజ్ఞ చేసారు. తీసుకున్నాను. ఈ వేళ వాళ్ళు చెయ్యాలనుకున్న పని గురించి వ్రాయమన్నట్లున్నారు, ఇంటి పని, వంటపనిలో అమ్మకీ, బయట పనిలో నాన్నకు ఏంచేయాలో, సాయంత్రం చిన్న క్లాసు పిల్లలకు ఏ లెక్కలు చెప్పాలో రాత్రి పెద్ద వాళ్ళ బడిలో ఏం పాఠం చెప్పాలో ఎంత అందంగా వ్రాసాడో చదువుతుంటే మాష్టారి బోధలు గుర్తుకు వచ్చాయి. ***"ఏపని చెయ్యటమైనా ఒకరికి సాయం చేయటం అవదు, అది మన జీవితం ఇంకా ఆనందమయం చేసుకోవడం. ఒక పని ఇష్టంగా చేసి చూడు, నీకెంత ఆనందం కలుగుతుందో".***

ఈ మాటలే మనసుకు ఎక్కించుకున్న పిల్లలు వ్రాసే రాత ఇది. అందరూ తలో విషయం వ్రాసారు. అన్నీ చదివేక మనసు నిండిపోయింది.

పిల్లలు వెళ్ళేక ఇద్దరం వంట చేయటానికి కూర్చున్నాం. చిన్నప్పుడు శెలవల్లో వంట ప్రయత్నాల పండగ గుర్తుకు వచ్చింది. నేనూ, నా వంటి మరో అనాథ పిల్లవాడు సూర్యం, తాగుబోతు లక్ష్మీపతి కొడుకు సుబ్బారావు, స్కూల్లో గదులూడ్చి మంచినీళ్ళు పెట్టే తిరుపతి, పనిమనిషి కూతురు సీత అందరూ ఇంట్లో హక్కుదారులే, ఏది వండాలో తేల్చడానికి, చివరకి మాష్టారు వచ్చి పూటకొకళ్ళు చెప్పింది వండాలని రాజీ చేసేవారు. అందరం పోటీ పడి పెంచిన కూరలు కొయ్యడం, బాగు చెయ్యడం, తరగటం, ఇల్లు శుభ్రం చేయటం - అన్నీ ఆటలాడినంత ఆనందంగానే ఉండేది. ఈ సాయాలతో అమ్మగారి కాళ్ళకీ వేళ్ళకీ అడ్డం పడిపోయేవాళ్ళం.

తలవంచుకుని కూరలు కోస్తూ కన్నీళ్ళు అణుచుకున్నాను.! *'మనకు ఈ రోజు వచ్చిన కష్టం గురించి బాధపడి దుఃఖంలో మునగటం కన్నా నిన్నటివరకు పొందిన సుఖం తలచుకుని సంతోషంగా ఉండాలి. అప్పుడే రేపు మళ్ళీ మంచిరోజులొస్తాయి.'* మాష్టారి మాటలు తల్చుకుని వంకాయకూర అమ్మగారికిష్టమైన చుక్కకూర పప్పు తింటుంటే మాష్టారి ముఖంలో తృప్తి నాకు హెచ్చరిక చేసింది నిబ్బరంగా ఉండమని.

భోజనాలయ్యాక నాకు వ్యవధి దొరికింది, సంచిలోనుంచీ ఆయనకని తెచ్చిన బట్టలు, ఆయన దగ్గరకు వచ్చే పిల్లకోసం కథల పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు తీసి బయట పెట్టేను. "ఈ బట్టలు ఇప్పుడే కట్టుకోండి"

"నువ్వు రావడం పండుగ. కొత్త బట్టలు కట్టుకోక పోతే ఎలా?" ఆయన వెంటనే వెళ్ళి కట్టుకుని వచ్చారు. నా గురించీ సుజాత గురించీ మా ఉద్యోగాల గురించీ స్నేహితుల గురించీ నేను చెప్పేవన్నీ ఆనందంగా విన్నారాయన. మాకు పుట్టబోయే పాపకు గాయత్రి అని పేరు పెడుతున్నామని నేను చెప్పినపుడు మాత్రం ఆయన కన్నీళ్ళు ఆగలేదు. మేరు పర్వతాన్ని సైతం పెకిలించగల భూకంపం ఆయనకు భార్యా వియోగం అనుకున్నాను.

సాయంత్రం పిల్లలు వచ్చారు పుస్తకాలు లేకుండా. ముందు మొక్కల కుదుళ్ళు బాగు చేసి నీళ్ళుతోడి పోశాం. తరువాత పిల్లలతో కలసి చిన్నప్పటి ఆటలన్నీ గుర్తుచేసుకుని కాయలకు జామచెట్టెక్కాను. కాయలు కోస్తుంటే బయట హడావుడి. పొద్దుట చూసిన పోస్ట్‌మాన్ మరో పదిమంది కంగారుగా లోపలకు వస్తున్నారు. చెట్లమీద వాళ్ళందరం క్రిందకి దూకి పరుగెత్తాం. అందర్నీ మాష్టరు నెమ్మది పరచి విషయం అడుగుతున్నారు.

పొద్దున్న నాకు దారి చూపించిన పోస్ట్‌మాన్ సత్తిరాజు బట్వాడా పూర్తి చేసి ఆఫీసుకెడుతుంటే తెలిసిందట పొలం గట్టు మీద రెండు గ్రూపులు కొట్టుకుని తలలు పగిలిన వాళ్ళను వదిలేసి పోలీస్ రిపోర్టిచ్చి పెద్దలంతా పట్నం పోయారట పైరవీలకు. సంగతి విని సత్తిరాజు నలుగుర్ని కేకేసి దెబ్బలు తిన్నవాళ్ళని హాస్పటల్‌కు తీసుకువెళ్ళేరుట. అప్పటికే మూడు గంటలు ఆలస్యం అయి వైద్యం అందేసరికి ఒకడూ, ఆపరేషన్ అవుతుంటే ఒకడూ చచ్చిపోయేరు. పట్నం నుండీ పెద్దలు దిగేసరికి వేడిగా వడ్డించినట్లు కబురు అందుకుని రోడ్డూ మీద పడ్డారు నినాదాలు చేసుకుంటూ. ఓ గుంపు డాక్టరు నిర్లక్ష్యం చేసాడంటూ ఆయన్ను కొట్టి హాస్పటల్ ధ్వంసం చేసారు. మరో గుంపు చచ్చిపోయిన వాళ్ళ కుటుంబాలకు పురెక్కిస్తున్నారు డాక్టరు మీద కంప్లైంటు ఇవ్వమని ప్రభుత్వాన్నీ కాంపెన్సేషన్ అడగమని, కొట్టించిన వాడేమో వాళ్ళ నాయకుడే

"ఈ మనుషులెప్పటికీ ఇంతే. కొట్టినాయనే ఒక పెద్ద కార్మిక నాయకుడు కదా, ఇదివరకంతా పేద వాళ్ళనీ బాధితులనీ సపోర్టు చేస్తూ తిరిగేవాడు - డబ్బు ఆయనివ్వాలి కానీ ప్రభుత్వానికేం పని?" నా ఉద్రేకాన్ని చూసి మాష్టారు నవ్వేరు.

కొంచెం తగ్గి, "పోనీ దెబ్బలు తిన్న వాళ్ళకి వైద్యసహాయం అందిస్తే వాళ్ళు బ్రతికే వాళ్ళు కదా. తమకోసం దెబ్బలు తిన్న వాళ్ళ పట్ల ఆ మాత్రం బాధ్యత లేదా" అన్నాను. మాష్టారి కళ్ళలోకి చూసేసరికి ఆయన అలాంటి సందర్భాల్లో అనే "నేతిబీరకాయలో నెయ్యిలేదని బాధపడితే ఎలారా?" అన్నమాటలు గుర్తువచ్చేయి.

అందరం లేచి బయల్దేరాం. సెంటర్లో గొడవగా ఉంది. వాళ్ళ మధ్యలోకి వెళ్ళేరు మాష్టారు. ఆయన వెనుక నేను. చనిపోయిన వాళ్ళ బంధువుల్ని ఓదారుస్తున్నారాయన. చంపుతాం నరుకుతాం అన్న వాళ్ళని అనునయిస్తున్నారు. పోయినతని కొడుక్కి ఆయన బోధలు నచ్చలేదు. "ఏంటయ్యా నీతులు చెపుతున్నావు? నీకేం తెలుస్తుంది? ఇలా నీ ఇంటోడు పోతే తెలిసేది" అరుస్తూ మీద మీదకు వస్తుంటే అందరూ కొప్పడి ఆపేరు.

ఒక్కక్షణం మాష్టారి కళ్ళలో వెలుగు ఆరినట్లయింది. ఆయనకు తెలుసు ఆ బాధ. పెద్దల అర్థంకాని కలహాల్లో చిక్కుకుని ఆయన పదేళ్ళ కొడుకు, బడినుండీ వస్తూ ఎలా బలైపోయాడో. అందుకే, అలాంటి బాధ ఆయనకు తెలుసు. ఆయన చెయ్యి పట్టుకుని బయటకు తీసుకు వస్తుంటే మళ్ళీ మామూలయిపోయేరు.

రాత్రంతా తనివి తీరా కబుర్లు చెప్పుకున్నాం. ఉదయాన్నే ఇద్దరం కలసి టిఫిన్ చేసుకుని పిల్లలందరితో కలిసి తిన్నాం. పిల్లలంతా ఆరోజు తాము చూచిన ఏదో ఒక విషయాన్ని గురించి రెండు పేజీలు వ్రాయటానికి వెళ్ళి కూర్చున్నారు.

వెళ్ళాలంటే మనసు బరువుగా ఉంది. "మీ దగ్గర చదువుతున్న పిల్లలను ఏదైనా రెసిడెన్షియల్ స్కూలులో పెడదాం, డబ్బు పంపుదాం. ఇళ్ళలో ఒకొక్కరోజు వాళ్ళకు తిండి ఉండదంటున్నారు కదా"

"వద్దు. వాళ్ళు తమను, తమ లేమిని, తల్లితండ్రులని, పరిస్థితులనీ అర్థం చేసుకుని, గౌరవించి, మంచి మనుష్యులుగా తయారవటానికి సాయం చేద్దాం. దానమిచ్చి వాళ్ళను మానసికంగా దరిద్రులను చెయ్యొద్దు. వచ్చినప్పుడు రెండు రోజులు వాళ్ళతో ఇలాగే గడుపు. వీలైతే వాళ్ళకు అప్పుడప్పుడు ఒక ఉత్తరమో, కార్డో పంపు. వాళ్ళల్లో ఆత్మగౌరవం పెంచు,".. నన్ను ఆయన పెంచినట్లే.

***

నిదానంగా, స్థిరచిత్తంతో కథలో తాబేలులా గమ్యం వేపు అడుగులు వేయటం నాలాగే వాళ్ళూ నేర్చుకోవాలి.

ఆయన్ని వదిలి వస్తుంటే ఆయన కాళ్ళకు దండం పెట్టలేదు. నాహృదయాన్ని ఎప్పట్లా ఆయన పాదాల దగ్గిర వదిలి వచ్చేసాను.



# కొండవాగులో బంతి

## మూలా సుబ్రహ్మణ్యం

**IIT kharagpur** లో **Phd** లో చేరిన రెండేళ్ళకి పేపర్ పబ్లిష్ చేయగలిగాను. అదీగాక ఈ సంవత్సరం బెంగుళూరులో జరుగుతున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎంబడెడ్ సిస్టమ్స్‌లో పబ్లిష్ అయ్యింది. నా ప్రజంటేషన్‌కి మంచి స్పందనే వచ్చింది. ఈ విశేషాలన్నీ kharagpur లో ఉన్న మా గైడుకి ఫోన్ చేసి చెప్పాలని కాన్ఫరెన్స్ హాల్ నుంచీ బయటకు వచ్చి, మొబైల్ ఆన్ చేసేసరికి రెండు న్యూమెసేజెస్ వచ్చాయి. ఒకటి ఎప్పటిలాగే ఎయిర్‌టెల్ విషెస్ wishes you a pleasent stay

in Karnataka అని.... మరొకటి హిమబిందు దగ్గరనుంచీ... `Ravi, please call me immediatly, bindu. ` ముందు గైడుకి ఫోన్ చేసి విశేషాలన్నీ చెప్పేసి, వెంటనే హిమబిందుకి ఫోన్ చేసా. అర్జంటుగా నన్ను కలవాలట. ఎందుకో కలిసినప్పుడే చెబుతుందట. ప్రస్తుతం భద్రాచలంలో ఉందట.

ఈమెని భరించడం కష్టం. ఆమెలో ఒక సెలయేరుతో పాటు ఒక జలపాతం కూడా ఉంది. ఒక్కోసారి వెల్లువెత్తినట్టు మెయిల్స్, ఫోన్స్ కురిపిస్తుంది. మరొకసారి కొన్ని నెలలపాటు మౌనంగా ఉండిపోతుంది. నేను ఇప్పుడు కలవడం కుదరదన్నా తను వినదు. అందుకని ఇవాళ కాన్ఫరెన్స్ ఐపోగానే ఫ్రెండ్‌ని కలవడానికి వైజాగ్ వెళుతున్నాననీ, ఎల్లుండి అంతా అక్కడే ఉంటాననీ, ఎల్లుండి వైజాగ్ రాగలిగితే కలవొచ్చనీ చెప్పాను. 'సరే అయితే జనవరి 12, ఆరు గంటలకి RK.Beach` అని చెప్పి పెట్టేసింది.

మొదటిసారి ఆమెని రాజమండ్రిలో కలిసాను. నేను hermitary.com కి రాసిన, A modern budha need not sit under bodhi tree అన్న article చదివి, నాకు మొదటిసారి మెయిల్ చేసింది. నా ఫిలాసఫీ ఆమెకి నచ్చిందని. ఆ తర్వాత మా మధ్య చాలా మెయిల్స్ నడిచాయి. తన ఇష్టాఇష్టాలన్నీ రాసేది. తనకి నదులంటే ప్రాణం అనీ, భారతదేశంలోని నదుల మీద పరిశోధన చేస్తున్నాననీ, ప్రస్తుతం దక్షిణ గంగ అయిన గోదావరి మీద రిసెర్చిలో భాగంగా రాజమండ్రిలో ఉన్నాననీ వీలైతే కలుద్దామనీ చెప్పింది. నేను అపుడు వింటర్ ఇన్‌టర్న్ షిప్ హైదరాబాద్ qualcom లో చేస్తుండేవాడిని. అది పూర్తికాగానే తిరిగి ఖరగ్‌పూర్ వెళ్ళిపోతూ మధ్యలో రాజమండ్రిలో దిగాను.

ఆ రోజు నాకు బాగా గుర్తు. సాయంత్రం గోదావరి ఒడ్డున కూర్చున్నాం ఇద్దరం. తను లేత నీలి రంగు చీర కట్టుకుంది. పొట్టీ పొడువూ లావూ సన్నం కాని రూపం. సంధ్య కాంతి ఆమె మొహం మీద పడి మెరుస్తోంది. కొంచెం సేపు నిశ్శబ్దం తర్వాత "అంత పెద్ద పెద్ద Philosophical articles రాస్తారు కదా, ఏమైనా మాట్లాడండి" అంది నవ్వుతూ...

"మీ మైయిల్స్ అభిప్రాయాలు చూసి మీరేదో జీన్ ప్యాంటూ, స్లీవ్లెస్సుతోనూ ప్రత్యక్షమౌతారనుకున్నా ఇలా అచ్చ తెలుగు బాపూ బొమ్మలా ఉంటారనుకోలేదు" అన్నాను.

మామూలుగా ఎలా ఉన్నా నది ఒడ్డుకి వచ్చేటప్పుడు మాత్రం చీర కట్టుకోవాలనిపిస్తుందిట. "అటు చూడండి గోదావరికి సూర్యుడు బంగారు చీర కడుతున్నాడు" అని చూపించింది. నిజంగానే సంధ్య కాంతి మీద పడుతున్న ఆ దృశ్యం అద్భుతంగా ఉంది.

"ఇంకా నయం! కస్తూరిగా మారి నీ నుదుటనే చేరి కడదాక కలిసుండనా" అని సూర్యుడు గోదావరితో పాట పాడుతున్నాడనలేదు" అని నవ్వాను. ఆమె నవ్వి "మీ nihilism tao philosophy చదివి, మీరేదో పరమ జిడ్డుగా, బట్టతల, గుబురు గెడ్డంతో ప్రత్యక్షమౌతారనుకున్నా, తీరా చూస్తే మీరేమో సర్ఫరోష్‌లో అమీర్ ఖాన్ లెవల్లో ఎంట్రీ ఇచ్చి, జంధ్యాల సినిమాలో రాజేంద్రప్రసాద్‌లా జోకులు కూడా వేస్తున్నారు అని, సరేగానీ మీ గురించి చెప్పండి" అంది.

"నా గురించి పెద్దగా చెప్పడానికేమీ లేదండీ. చాలా వరకు మీకు తెలిసిందే.. రేపే మృత్యువు నా తలుపు తడుతుందని ఊహించుకుని ఇవాళ గడపడం అన్నిటికన్నా నాకిష్టమైన పని. అలా బ్రతకడంలో గొప్ప థ్రిల్ ఉంది. Mathematics, music నా passions"అన్నాను.

"ఐతే మీరూ, నేనూ ఇలా సరిగ్గా ఈ సాయంత్రం గోదావరి ఒడ్డున కలుసుకుని కబుర్లు చెప్పుకోవడంలో ఎన్ని కాంప్లికేటెడ్ ఈక్వేషన్స్ సాల్వ్ అయ్యుంటాయో చెప్పుకోండి చూద్దాం" అని నవ్వింది. నవ్వినప్పుడు ఆమె కళ్ళు సగం

మూసుకుపోతాయి. అమాయకత్వం, కొంటెతనం కలబోసిన కళ్ళు. కోపం వచ్చినప్పుడు కళ్ళతోనే వ్యక్తిని అదుపులో పెట్టగల కళ్ళు ఈమెవి అనుకున్నాను. ఆమె కళ్ళల్లోకి అలా తదేకంగా చూస్తే బావుండదని చూపులు మరల్చి "నా గురించి అడిగారు గానీ మీ గురించి చెప్పనే లేదు" అన్నాను.

"మెయిల్స్‌లో చెబుతూనే ఉన్నాగా.. డాడీ పెద్ద కాంట్రాక్టర్ చెన్నైలో.. పక్కా బిజినెస్ మైండెడ్.. పోటీ వచ్చిన వాళ్ళని నామరూపాల్లేకుండా చేసాడు. చిన్నప్పుడు ఏదో చిన్న గొడవ చిలికి చిలికి గాలివానలా మారితే అమ్మని పీక పిసికి చంపేసి, రెండు నెలలు తిరక్కుండానే మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. అంతా సవతి తల్లిని అంత క్రూరంగా ఎందుకు చిత్రిస్తారో అర్థం కాదు. నన్ను మాత్రం కన్న తల్లికన్నా సవతి తల్లే బాగా చూసుకునేది. నాకో తమ్ముడున్నాడు. చదువు అబ్బలేదు కానీ బిజినెస్‌లో తండ్రిని మించిన తనయుడు. రోజుకో అమ్మాయితో తిరుగుతాడు. ఐతే ఎవరినీ వెంటపడి వేధించడు. పెళ్ళి చేసుకుంటాననీ, ప్రేమనీ అబద్ధాలు కూడా చెప్పడు. అయినా బోలుడు మంది అమ్మాయిలు వాడి చుట్టూ ఎందుకు చేరతారో ఆశ్చర్యంగా ఉంటుంది. ఇంటి నిండా ఎప్పుడూ నౌకర్లు... కార్లు... ఐశ్వర్యం... వీటన్నిటి మధ్యా పెరిగినా నాలో ఏదో అసంతృప్తి... ఈ రీసెర్చిలో నాకు కొంత ప్రశాంతత లభిస్తోంది... డాడీ నాకు ఎంతో స్వేచ్ఛ ఇచ్చారు... ఇప్పటికీ రీసెర్చి అనీ అదనీ ఇదనీ కొన్ని నెలల పాటు ఇంటికి దూరంగా ఉన్నా ఏమీ అనరు"

ఇలా ఆమె చెప్పుకుంటూ పోతోంది. నాకు ఎందుకో తన మాటలు వింటుంటే తామర పువ్వు గుర్తొచ్చింది. మౌనంగా ఆలోచిస్తున్న నన్ను చూసి "ఏంటండీ మా వాళ్ళ మంచి చెడ్డలు అంచనా వేస్తున్నారా" అని అడిగింది.

"ఒకరి మంచి చెడ్డలు అంచనా వెయ్యడానికి నేనెవరండీ" అదేం లేదు అన్నాను.

ఆమె వెంటనే "ఈ అమ్మాయేంటీ తన వ్యక్తిగత విషయాలు ఎలాంటి సంకోచాలూ లేకుండా ముక్కూ మొహం తెలీని, మొదటిసారి కలసిన వ్యక్తికి చెప్పేస్తోందనేగా మీ అనుమానం" అంది.

ఈమె మనుషుల్ని భలే చదువుతుంది అనుకున్నా మనసులో.

మరోసారి నవ్వి, "నేను M.Phill చదివే రోజుల్లో స్నేహ అని ఒక రూమ్మేట్‌తో సంవత్సరం పాటు ఉన్నాను. సంవత్సరం కలిసి ఉన్నా ఒకరి ఇష్టమైన రంగేమిటో కూడా మరొకరికి తెలీదంటే అతిశయోక్తి కాదేమో అని, ఒంటరితనం ఒక్క దేహానికేనా?" అంది సూటిగా చూస్తూ...

నేనేమీ మాట్లాడలేదు

"ఇంతకీ మీకు ఈ చైనీస్ ఫిలాసఫీ మీద ఆసక్తి ఎప్పుడు కలిగింది? అని అడిగింది...

అంతకుముందు చాలా మందే నన్నా ప్రశ్న అడిగారు. నిజానికి నాకు ఈ విషయాల మీద ఆసక్తి కలిగి అప్పటికి ఒక సంవత్సరమే అయ్యింది. అప్పటిదాకా నేను కూడా అందరిలాగే ఐశ్వర్యం వెనుక, అబద్ధాల వెనకా పరిగెత్తిన వాడినే. ఆ దశలో ఒకరోజు రాత్రి అకస్మాత్తుగా చనిపోయినట్టు పీడకల వచ్చింది. ఆరాత్రి మరి నిద్రపోలేదు భయంతో వణికిపోయాను. అప్పుడనిపించింది అసలు కలకీ, వాస్తవానికీ తేడా ఏముందని? రెప్పలు తెరిచే వరకూ కల కూడా నిజంగా జరిగిందేమో అన్నంతలా కలుగుతుంది. బహుశా మనం నిజం అనుకుంటున్న ఈ జీవితం కూడా మరొక ప్లేన్లో కలేనేమో! అకస్మాత్తుగా నాకేదో రహస్యం తెలిసిపోయిన అనుభూతి. అప్పటి నుండే ప్రవాహానికి ఎదురీదడం మానేసి, ప్రవాహంతో పాటు అలా హాయిగా కొట్టుకుపోతున్నాను. అప్పుడే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి పిహెచ్‌డిలో చేరాను.

ఈ విషయాలన్నీ ఆమెతో చెబితే, "చాలా ఇంట్రెస్టింగ్ గా ఉందండీ మీ కథ.. ఐతే అది కొట్టుకుపోవడం ఎలా ఔతుంది? మీరు సెలయేటితో ఒక perfect harmonyలో ఉన్నారు. "కొట్టుకుపోవడం" అనే పదం తప్పు... Its a kind of

ecastasy"అంది

"సెలయేరంటే గుర్తొచ్చింది.. ఇంతకీ నదుల మీద పరిశోధించాల్సినంత ఏముందండీ?" అని అడిగాను.

"అసలు నా దృష్టిలో పరిశోధించాల్సిన అవసరం లేని విషయమేదీ లేదు... ప్రతి దాన్లోనూ మనకి తెలియని లోతులు ఎన్నో ఉంటాయి... కాదంటారా?"

అని అడిగి మళ్ళీ కొనసాగించింది... "నదుల గురించి ఒక్కో విషయం తెలుసుకుంటుంటే భలే గమ్మత్తుగా ఉంటుంది. మనిషి సంస్కృతి, కళలు,నాగరికత ఇవన్నీ నదులతో ఎలా మమేకమైపోయాయోనని తెలుసుకున్న కొద్దీ పట్టరాని సంతోషం కలుగుతుంది. నిన్నే తెలిసింది గాంధీగారు తల్లి చనిపోయినప్పుడు గోదావరిలో స్నానం చేసారుట తెలుసా" అంది. ఈ విషయాలు చెపుతుంటే ఆమె కళ్ళల్లో మెరుపు.

"ఐతే ఫైనల్‌గా మీరు వైజాగ్లో సెటిల్ ఔతారన్నమాట" అన్నా. " ఎందుకండీ" అని అడిగితే "నదులన్నీ చివరికి సముద్రాన్నే కదండీ చేరాల్సింది" అన్నాను.

ఆమె సవ్వడి చెయ్యకుండా నవ్వింది. శీతాకాలపు చలిగాలి నెమ్మదిగా తాకుతోంది. ఆ గాలికి ఆమె ముంగురులు నాట్యం చేస్తున్నాయి. రాజమండ్రి దీపాలు గోదాట్లో తమ మొహాలు చూసుకు మురిసిపోతున్నాయి. నేను ఈమె కళ్ళల్లో నన్ను నేను చూసుకు మురిసిపోతున్నట్లే. ఆకాశంలో అక్కడక్కడా పక్షులు. జనం పల్చబడుతున్నారు. చాలాసేపు అలా మౌనంగా కూచుండిపోయాం. ఆమె మాటలతో పాటు మౌనం కూడా బావుంది. Slience is ever speaking!! నిజమే కాబోలు..

"ఇలాంటప్పుడు వేడి టీ తాగితే భలే ఉంటుంది కదండీ" నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ఆమె అంది. "ఐతే పదండి. అలా నడుస్తూ దగ్గర్లో ఏమైనా మంచి హోటల్ ఉందేమో చూద్దాం" అన్నా. "ఈ మాత్రం దానికి హోటల్ ఎందుకండీ అదిగో అక్కడేదో టీ బండి ఉంది అక్కడ తాగుదాం పదండి" అని తీసుకెళ్ళింది.

రెండు టీలు చెప్పాం. చల్లగాలి రివ్వున వీస్తోంది. తను చేతులు రుద్దుకుని బుగ్గలకి అద్దుకుంటోంది. రెండు గ్లాసులు అందుకుని ఒకటి ఆమెకి అందించాను. ఆ సాయంత్రం ఆమెతో కబుర్లు చెబుతూ పొగలు కక్కుతున్న టీ తాగడం! అదొక అనుభవం. కాలాన్ని కట్టేసిన ఆ క్షణంలో నిన్న లేదు. రేపు లేదు. ఆమె లేదు. నేను లేను. అనంతంగా విస్తరించిన వర్తమానమే!

తర్వాత ఒక రిక్షా మాట్లాడుకుని రాజమండ్రిలో కొంచెం సేపు తిరిగి, టిఫిన్ చేసి రాత్రి 8.30 కి స్టేషన్‌కి చేరుకున్నాం. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ సరిగ్గా తొమ్మిదికి వచ్చింది. రీసెర్చిలో భాగంగా తను గోదావరిని వివిధ ప్రాంతాల్లో తీసిన అరుదైన ఫోటోలున్న ఒక ఆల్బం నాకు బహుమతిగా ఇచ్చింది. నేను The mighty and mystical rivers of india అనే పుస్తకాన్ని ఇస్తే కవర్ పేజీని చిన్న పిల్లల్ని తడిమినట్టు తడిమి మురిసి పోయింది. There is a small child in every one of us అన్న వాక్యం గుర్తొచ్చింది ఆ క్షణంలో. రైలు మెల్లగా కదిలిపోతూంటే, ఆమె చేతులూపుతున్న దృశ్యం ఎప్పటికీ మరవలేను.

తర్వాత నేను ఖరగ్‌పూర్ వెళ్ళిపోయి మళ్ళీ నా రీసెర్చితో బిజీ ఐపోయాను. ప్రొఫెసర్ నుంచీ కూడా చాలా ఒత్తిడి ఉండేది. ఆమె అప్పుడప్పుడూ ఫోన్ చేస్తుండేది. పొరపాటున మా ప్రొఫెసర్ కాస్త ఇబ్బంది పెడుతున్నాడని చెబితే "మిమ్మల్ని ఇంకెవరో ఎలా ఇబ్బంది పెట్టగలరండీ" అనేది. తన మాటలు వింటుంటే నేను ఇంకా ఎంతో ఎదగాలనిపించేది. నేను పగలూ రాత్రీ రీసెర్చి ప్రోబ్లెం సెలక్షన్ గురించే ఆలోచించేవాడిని. తన నుంచీ కూడా సడన్‌గా

మెయిల్స్ ఆగిపోయాయి. బహుశా బిజీగా ఉందేమో అని నేను కూడా మెయిల్ చెయ్యలేదు.

తర్వాత ఒకసారి కాశీ నుండీ ఫోన్ చేసింది. నీలాచల్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరుతున్నా, వీలైతే ఖరగ్‌పూర్లో స్టేషనుకి రమ్మని. ఆమె గొంతులో ఏదో తేడాని నేను గుర్తించకపోలేదు. వెళ్ళాను. చాలా గంభీరంగా ఉంది. "ఏంటి అంత సీరియస్‌గా ఉన్నారు" అని అడిగితే, నది కూడా అప్పుడప్పుడు గంభీరంగా ప్రవహించాలి కదండీ అని, "తత్వశాస్త్రం, సాహిత్యం మనిషిని అవసరమైన సమయాల్లో ఎంతవరకు ఆదుకుంటాయంటారు అంది? "

నాకు జరగరానిదేదో జరిగిందని తెలుస్తోంది. ఏం జరిగిందండీ అనడిగితే,

వాళ్ళ తమ్ముడు ఏదో ఏక్సిడెంటులో చనిపోయాట్ట. చిన్నప్పుడు ఇద్దరు పిల్లల్ని ఏక్సిడెంటు నుండీ తప్పించినందుకు గవర్నమెంటు వాళ్ళు బ్రేవరీ అవార్డు కూడా ఇచ్చారనీ, ఇప్పుడు అదే యాక్సిడెంటుకి బలైపోయాడనీ అంది.

తన చేతిని నా రెండు చేతుల మధ్యకి తీసుకున్నాను. ఆమె నిశ్చలంగా ఉంది. చచ్చు ఓదార్పు మాట్లతో ఆ సమయాన్ని కలుషితం చెయ్యదల్చుకోలేదు. మౌనంగానే ఉండిపోయాను. రైలు కదిలిపోయింది. ఈ స్టేషన్లో కొందరిని దించేసినట్టే, రైలు తనని కూడా తన స్టేషన్లో దించేసి మౌనంగా కదిలిపోతుంది. ఇంతా. చివరికి మిగిలేదంతే. అనంతానంత వైరుధ్యాల మనిషి జీవితంలో పరమ పవిత్రమైనది మృత్యువొక్కటే. పుట్టుక ఎంత సహజమో ఇది కూడా అంతే. లోతుగా చూస్తే చావు, పుట్టుక వేరు కాదు. జీవితానికి అర్థం జీవించడమే! Life is a random event... a ball in the mountainstream..బరువెక్కిన మనసుతో వెనక్కి వచ్చేసాను.

తర్వాత కొన్ని నెలలపాటు ఆమె నుంచీ ఎలాంటి సమాచారం లేదు. తను ఏకాంతంగా గడపాలనుకున్నప్పుడు మొబైల్ నంబర్ మార్చేస్తుంది. ఇంటి నెంబరు ఎప్పుడూ ఇవ్వదు. అయినా ఆమె ఇంట్లో ఎప్పుడైనా ఉంటేగా! బహుశా ఒక దగ్గర నిలవలేని తత్వమే ఆమెని నదులకి దగ్గర చేసి ఉండొచ్చు. అసలు ఆమె నదుల మీద పరిశోధన చేస్తోందా లేక తనని తనే శోధించుకుంటోందా? అకస్మాత్తుగా ఏ లోతుల్లోనో ఒక మెరుపు. లోపలా బయటా, చావు పుట్టుకా, మంచీ చెడూ ద్వంద్వాలన్నీ మాయమయ్యాయి ఆ క్షణం. హిమబిందుకి అవధుల్లేవు. ప్రకృతిని ఉన్నదున్నట్టు చూస్తుంది. తర్కంతో ముక్కలు ముక్కలుగా కోసి చూడదు. అసలు ఆమే ప్రకృతి వేరు కాదు. సకల జగత్తులోనూ ఆమే నిండి ఉంది... పువ్వులు, పక్షులు, సెలయేళ్ళు, ఆకాశం, హిమబిందు.. అంతే.. బుద్ధిజంలో చెబుతారు.. "Expand the I in you to fill the entire universe"అని..

ఈ భావాలన్నీ ఒక చోట చేర్చి "Non - Duality" and "one" are not synonymsఅని నేను రాసిన article చూసి ఒకరోజు సడన్‌గా ఫోన్ చేసింది. చాలా చక్కగా రాసారని. తను కావేరీ వెళుతోందట.

"మిమ్మల్ని చూస్తే నాకు ఈర్ష్యగా ఉంటుంది బిందు. ఒక నదిలో ఉన్న వైరుధ్యాలూ, మలుపులూ మీ జీవితంలో కూడా ఉన్నాయి" అంటే "ఈర్ష్య", "అసూయ" మొదలైన పదాలని తుడిచెయ్యాలన్న ప్రయత్నంలో ఉన్న మీరు అనవసరంగా వాటిని గుర్తుకు తెచ్చుకోకండి "The path is without any difficulty.. go on.. just like a ball in the mountain stream"మీరు ఆర్టికల్లో రాసిన విషయాలే" అని నవ్వేది.

ఇలా ఎన్నో జ్ఞాపకాలు.. ఆమెని చూస్తే చదివేకొద్దీ పేజీలొచ్చే నవలలా కనిపిస్తుంది.. ఇంతకీ ఇప్పుడు ఇంత అర్జంటుగా ఎందుకు కలవాలందో? ఆమెను అర్థం చేసుకోవడం కష్టం. మిగతా వాళ్ళకి అతి సాధారణంగా కనిపించే విషయాలు ఆమెకి చాలా పెద్ద విషయాలు. మిగతా వాళ్ళకి చాలా గొప్పగా కనిపించే విషయాలకి ఆమె అస్సలు

ప్రాధాన్యం ఇవ్వదు. ఒకసారి ఇలాగే ఫోన్ చేసి "ఇవాళొక గొప్ప పని చేసా తెలుసా" అంది. "ఏమిటని" అడిగితే "తెల్లవారు ఝామున గులాబీ పువ్వు మీద కూచుని నన్ను నేను ఫోటో తీసుకున్నా" అంది.

What an expression! అప్రయత్నంగా మాటలు నా నోట్లోంచి వెలువడ్డాయి..

ఏమీ తెలీనట్టు మాట్లాడకండి.. నేను ఇదంతా చేస్తుంటే మీరు దూరం నుంచీ చూస్తున్నారు అంది..

నేనెప్పుడు చూసానా అనుకుంటుంటే, తమరు అప్పుడే నిద్రలేచి ఆకాశంలో మార్నింగ్ వాక్ కి వచ్చారు.. గుర్తు లేదా అని నవ్వింది..

అప్పటికి గానీ నాపేరు రవి అని నాకు గుర్తు రాలేదు.. నేను నవ్వి ఐతే ఆ ఫోటో డెవలప్ చేయించి, కింద కేప్షన్ రాయండి, "గులాబీ పువ్వు మీద హిమబిందు.. మీద నుంచీ చూస్తున్న సూరీడు" అని అంటే... మళ్ళీ అదే నవ్వు.

ఎల్లుండి కలిసినప్పుడు కూడా ఇలాంటి మంచు బిందువు స్టోరీ ఏదో చెబుతుందని నిర్ధారణకి వచ్చేసి, ఆ విషయం గురించి ఎక్కువ ఆలోచించడం మానేసి కాన్ఫరెన్సులో నిమగ్నమయ్యాను. అది ఐపోగానే బెంగుళూరులో కలవాల్సిన ఇద్దరు, ముగ్గురు ఫ్రెండ్స్‌ని కలిసి, మరికొన్ని పనులు పూర్తి చేసుకుని రాత్రి భోజనం చేసి పదకొండు కల్లా బెంగుళూరు సెంట్రల్ స్టేషన్‌కి చేరుకున్నాను. గౌహతి ఎక్స్‌ప్రెస్ అప్పటికే ప్లాట్‌ఫాం మీద ఉంది. అందులోకి ఎక్కి నా బెర్తు చూసుకుని కూలబడ్డాను. చాలా అలసటగా ఉండటంతో వెంటనే నిద్రపట్టేసింది.

తెల్లారేసరికి రైలు చెన్నై చేరుకుంది... మొహం కడుక్కుని, కాఫీ తాగి కాసేపు పేపర్ చదివి, పక్కన పెట్టేసాను. అదేంటో కిటికీ పక్క కూచుంటే ఏదీ చదవాలనిపించదు. అలా బయటికి చూస్తూ గంటలు గంటలు గడిపెయ్యొచ్చు. ఇదే కిటికీ పక్కన ఎంతో మంది కూచుని ఉంటారు. ఏ ఒక్కరి ఆలోచనలూ ఒకేలా ఉండవు. అయినా కిటికీ మాత్రం అమాయకంగా ఎవరికయినా ఒకే దృశ్యం చూపుతుంది. "అందరిలాగే "నేను" కూడా రైలు కిటికీలోంచీ అనంతంలోకి విస్తరిస్తుంటాను" డిసెంబరు చలి రాత్రి రాజమండ్రిలో నాకు వీడ్కోలివ్వడానికి వచ్చి, నేను కిటికీ పక్కన కూచున్నప్పుడు ప్లాట్‌ఫాం మీద నిలబడి హిమబిందు అన్న మాటలు ఎందుకో జ్ఞాపకం వచ్చాయి. అక్కడ "నేను" అనడంలో ఎంత అర్థం ఉంది. కిటికీలోంచీ దూరంగా ఏవో శిఖరాల మీద ఆమె ఒక్క క్షణం కనిపించి మాయమైంది.

ఇంతకీ ఇంత అర్జంటుగా ఎందుకు కలవాలందో? వైజాగ్ చేరేవరకు మళ్ళీ అవే ఆలోచనలు. వైజాగ్ చేరేసరికి రాత్రి తొమ్మిది అయింది. ట్రైన్ దిగ్గానే తనకి ఫోన్ చేసాను. భద్రాచలంలో అప్పుడే బయలుదేరుతున్నా, ఉదయానికల్లా వైజాగ్‌లో ఉంటా అని చెప్పింది. మర్నాడు సాయంత్రం 6 గంటలకి ఆర్.కె.బీచ్ లోని రామకృష్ణ ఆశ్రమంలో కలవాలని నిర్ణయించుకున్నాం

నేను కొంచెం ముందుగా వెళ్ళాను. ఆశ్రమంలో చాలా మంది ధ్యానం చేసుకుంటున్నారు. నేను కూడా ఒక చాప తీసుకుని కూచున్నాను. కొంతసేపటికి ఆమె వచ్చింది.. కొంచెం సేపు మౌనంగా కూచున్నాక లేచి అలా ఆర్.కె.బీచ్‌లోకి నడిచాం.

బీచ్‌లో కూర్చున్నాక చెప్పండి ఇంత సడన్‌గా ఎందుకు కలవాలన్నారు అని అడిగాను.

"గోదావరికి వరదలొచ్చాయి" అంది.

"వరద రావడానికి కారణం?"

"ప్రతీదానికీ కారణాలుండాలనుకోవడం అమాయకత్వం"

"కానీ ఇంత అకస్మాత్తుగా వచ్చిందంటే బలమైన కారణం ఉండాలి కదా"

"వరదలంటేనే అకస్మాత్తుగా వచ్చేదని. అకస్మాత్తుగా రాని వరద కూడా ఉంటుందేమిటి?"

"మీతో వాదించలేను గానీ విషయం చెప్పండి. ఎందుకు అర్జంటుగా కలవాలన్నారు?"

"అలా రండి దారికి" అని నా కళ్ళలోకి వెర్రిగా చూస్తూ, నా చేతులు పట్టుకుని "నన్ను పెళ్ళి చేసుకోండి" అంది.

నేను స్థాణువునైపోయాను ఒక్క క్షణం. ఆమె జీవితంలో ఎవరినీ పెళ్ళి చేసుకో(లే)దని నా ప్రగాఢ విశ్వాసం. ఆనకట్ట కట్టడం ప్రవాహానికి ఇష్టం ఉండదు. ఇదే విషయం ఆమెతో అంటే,

"ఇది ఆనకట్ట అని ఎందుకనుకుంటున్నారు? సాగరసంగమం అనుకోవచ్చుకదా"

"కానీ ఆ సముద్రం నేనే అని మీకెందుకు అనిపించింది?"

"నిజం చెప్పండి... మీలో సంగమించే నది ఏమిటన్నది మీకు మాత్రం తెలీదా? మీరు నన్ను ప్రేమించలేదా" అంది...

కెరటాలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి... చీకటి వెలుగులు సముద్రంతో దోబూచులాడుతున్నాయి.. అల్లంత దూరంలో అవని, ఆకాశం కలిసిపోయినట్టు భ్రమ..

ఆమెకు చెప్పగలను.. "ఆమె సమక్షంలో నా హృదయం లయ తప్పుతుందని. నా మాటలు చెల్లాచెదురౌతాయని. ఆంక్షల్లేని ప్రేమలో నేను పూర్తిగా కరిగిపోతానని... నాలో ఒక సముద్రం పొంగి ఆ అలలు ఆమె పాదాల్ని స్పృశించడానికి మౌనంగా పరవళ్ళు తొక్కుతాయని... ఆమె సమక్షంలో నేను ప్రతి క్షణం మరణించి మళ్ళీ కొత్తగా జన్మిస్తానని.. "

"మీరు నన్ను ప్రేమించలేదా" అని అడిగింది... నాకామెతో చెప్పాలనుంది "నేను" "ఆమె" "ప్రేమ" వేరు కాదని...

కానీ ఆమెకెలా చెప్పగలను? రెండేళ్ళ క్రితం నాకు చనిపోయినట్టు వచ్చింది కల కాదని.. త్వరలో నిజమవబోతుందని.

రేపు మృత్యువు నా తలుపు తడుతుందన్నది ఊహ కాదని..

నిజమని...

నేనిక ఎన్నాళ్ళో బ్రతకనని...

ఆమెతో...

ఎలా..?




"ఆయనకి తలకొరివి నేను పెట్టను" ఖచ్చితంగా చెప్పాడు శివ.

అందరూ అవాక్కైపోయారు. కన్నతండ్రిని కనీసం 'నాన్నా' అనడంకూడా ఇష్టం లేనట్లు 'ఆయన' అన్న అబ్బాయి కేసి వింతగానూ, విస్మయంగానూ చూశారు.

"హవ్వ! నీకేం పోయేకాల మొచ్చిందిరా? కన్న తండ్రిపోతే చుక్క కన్నీరు రాలేదు సరే! అంత మాటంటావా? అంతా ఆ మహాతల్లి పెంపకం మరి!" కోడల్ని ఈసడిస్తూ మనవడిని ఆడిపోసుకుంది కాంతమ్మ.

శివ ఆవేశాన్ని అణచుకున్నాడు. సమాధానం చెప్పాలని ఉన్నా తల్లి నేర్పిన సంస్కారం అడ్డు వస్తోంది.

"తప్పు బాబూ! అలా అనకూడదు. ఎంతైనా..." ఎవరో పెద్ద మనిషి పెద్దరికం వహించబోయి శివ చూపులకి ఆగిపోయాడు.

పినతండ్రి అతన్ని దగ్గరకు తీసుకుని, "శివా! అతడెలాంటి వాడైనా నీ తండ్రి! నలుగురిలో గొడవ చేసి కుటుంబ గౌరవాన్ని రచ్చకెక్కించకు. నా మాట విను. దయచేసి... "అంటూ నచ్చ చెప్పబోయాడు.

"నన్ను క్షమించు బాబాయ్! నేను ఈ విషయంలో ఎవరి మాటా వినదలచుకోలేదు" అని అక్కడినుండీ వెళ్ళబోయాడు.

"ఒరేయ్! ఎక్కడికి పోతావురా? కొడుగ్గా అది నీ బాధ్యత! అలా మూగ దెయ్యంలా చూడకపోతే మాట్లాడవేమే? ఇలాంటి వాళ్ళను ఎక్కడా చూడలేదు. అంతా నా ఖర్మ!" కాంతమ్మ గుండెలు బాదుకుంటూ, ముక్కు చీదుతూ కోడల్ని, మనవడిని నానామాటలు అంది.

నిర్మల నిర్వికారంగా అలాగే కూర్చుని ఉంది. లోకం కోసం కంటతడి పెడదామన్నా కన్నీరంతా ఏనాడో ఇంకి పోయింది. కొడుక్కి నచ్చచెబుదామన్నా ఏమని చెబుతుంది? ఏనాడన్నా కన్నబిడ్డలా ఆదరించాడా? ముద్దు చేశాడా? కోరినవి కొనిపెట్టాడా? అసలు తండ్రిలా ప్రవర్తించాడా?

తాగొచ్చి తల్లిని కొడుతుంటే ఆ పసిమనసు ఎంత తల్లడిల్లి పోయిందో? కొంత పెద్దయ్యాక అడ్డుపడి ఎన్ని దెబ్బలు తిన్నాడో? ఎంత ఆవేదన చెందాడో?

"చదువుకుంటానయ్యా!" అని కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలినా, 'నిన్ను డాక్టర్లా, ఇంజినీర్లా చదివించే తాహతు నాకు లేదు. ఏ డిగ్రీయో చదివినా ఆ గాడిద చాకిరీయేగా! అంతకాడికి డబ్బు తగలేసి చదవడమెందుకు?' అని మెకానిక్ పనిలో పెట్టాడు.

'బాల కార్మికుల్ని చేస్తే జైలూ, జరిమానాలు వాడిని చదువుకోనీయమ'ని తను నయానా, భయానా చెప్పినందుకు, 'నేను జైలుకు పోవాలని ఉందన్నమాట! ఏం? ఎవడినన్నా మరిగావా?' అని బెల్టుతో చావగొట్టాడు.

ఎవరైనా పిల్లలు చదువుకుని బాగుపడాలనికోరుకుంటారు కానీ అని తను అంత బాధలోనూ అనబోతే 'బాగుపడడానికి చదువే అక్కరలేదు! చదువుకున్నవాళ్ళందరూ బాగుపడ్డారా? బాగుపడ్డవాళ్ళలో చదువుకోని వాళ్ళు లేరా? నోరుమూసుకుని పడుండు! నోరెత్తితే చంపేస్తాను' అని వాణ్ణి బలవంతంగా పనిలో పెట్టాడు ఆ జనకుడు.

వాడి సంపాదనంతా తనే తీసుకునేవాడు. త్రాగుడు, తిరుగుడికీ ఖర్చుపెడుతుంటే శివకి కడుపు మండిపోయేది. తన కష్టార్జితం తండ్రికివ్వద్దని యజమానికి చెప్పాడని వాడిని చావగొట్టాడు. వాడికో కూతురు పుట్టలేదుకానీ లేకపోతే దాన్నీ తార్చి, డబ్బు సంపాదించేవాడు. అటువంటి దుర్మార్గుడికి తలకొరివి పెట్టమని కొడుకుతో ఏ ముఖం పెట్టుకుని చెబుతుంది?

"ఒక్కసారి గట్టిగా ఏడవవే నిమ్మీ! లోకం కోసం కాక పోయినా గుండెలో బరువు తగ్గుతుంది" కూతురి గురించి నలుగురూ నాలుగు మాటలూ అనుకుంటుంటే వినలేక అంది తల్లి.

'గట్టిగా ఏడవడం కాదమ్మా! పగలబడి నవ్వాలని ఉంది. అలా నవ్వినా 'పిచ్చెక్కింద'ని సానుభూతి చూపిస్తారు పిచ్చి జనం! అతని విషయంలో సానుభూతిని కూడా భరించడం తనవల్లకాదు.' మనసులోనే అనుకుంది నిర్మల.

పినతండ్రే కర్మ,కాండ చేస్తుంటే తనకు పట్టనట్లే మౌనంగా ఉండిపోయాడు శివ. వేళకు తింటున్నాడు, పనికి పోతున్నాడు కానీ అతనిలో ఏదో తెలియని కసి!

పదోరోజు తల్లికి జరిపే కార్యక్రమానికి అడ్డుపడ్డాడు. 'బొట్టు, గాజులూ, పూలూ ఏమీ తీయడానికి వీల్లేదు. కావాలంటే ఆయన కట్టిన తాళి, మెట్టెలు తీసేయండి.' అంటూ అరిచాడు శివ.

నిర్మల కొడుకుకేసి కృతజ్ఞతో, అభినందనో, ఆనందమో అలాగే చూస్తుండిపోయింది. మంగళసూత్రాలు, నల్లపుసలూ మెట్టెలు తనే తీసిచ్చేసింది. అడ్డు చెప్పబోయిన కొందరు పెద్ద ముత్తయిదువల్ని పట్టించుకోకుండా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"ఇదెక్కడి చోద్యమే? ఈ కొంపకేదో శని పట్టుకుంది. పెద్దల్ని లెక్కచేయని తల్లీ, కొడుకూ ఈ ఇంట్లో పడి తినడమెందుకో?" కాంతమ్మ శివాలెత్తింది.

"అమ్మా! బయలుదేరు." అన్నాడు శివ తల్లి దగ్గరకు వచ్చి. అతనిలో ఏదో తెలియని పట్టుదలా, పంతం!

"ఆవేశపడకు బాబూ! ఈ నాలుగురోజులూ ఆగు. వెళ్ళిపోదాం" నిర్మల నెమ్మదిగా అయినా నిక్కచ్చిగా అంది.

తల్లి మాటను కాదనలేనట్లు మౌనంగా అక్కడినుండీ వెళ్ళిపోయాడు శివ. నాలుగురోజుల్లో ఒక చిన్న ఇల్లు చుశాడు. అడ్వాన్సు ఇచ్చి, ఇంటికి అవసరమైన వస్తువులు కొన్నాడు యజమాని దగ్గర అప్పుచేసి. అతని స్వాభిమానం, స్వయంకృషి తెలిసిన యజమాని అభినందనగా భుజం తట్టాడు.

❖❖❖❖

నిర్మల నాలుగిళ్ళలో వంటమనిషిగా చేరింది. ఆమె వంట బాగా చేయడం, జాగ్రత్తగా, పొదుపుగా చేయడం అడపాదడపా ఆమె పనిచేసే ఇళ్ళలో డబ్బో, వస్తువో ఏదో బహుమానం ఇస్తూ ఉండేవారు. ఇల్లు ఆమె మీద వదిలేసి వెళ్ళినా నమ్మకమైన మనిషిని ఇంట్లో మనిషిలా కష్టసుఖాలు పంచుకునేవారు.

మెకానిక్‌గా పనిచేస్తూనే సాయంత్రం ట్యూషన్లో చేరి మెట్రిక్ పాసయి, ఐటిఐ చేసి ఒక పెద్ద కంపెనీలో సూపర్‌వైజరుగా చేరాడు. అంత చిన్న వయసులో కష్టపడి పైకొచ్చిన అతన్ని తెలిసినవాళ్ళు అభినందించినా నాయనమ్మ తిట్టిపోసేది.

ఎలాంటివాడైనా కన్నతల్లికి కొడుకుపోతే కడుపుకోతేగా! దానికి తోడు కోడలూ, మనవడూ ఏ బాధాలేకుండా తమను పట్టించుకోకుండా సుఖంగా ఉండడం తట్టుకోలేకపోయింది.

నిర్మలా, శివా మళ్ళీ ఆ గుమ్మం తొక్కలేదు. బంధువులెవరైనా పలకరించినా, వచ్చినా కాదనలేదు.

శివ పనిచేసే చోట అతనికి శ్యామ్‌తో స్నేహం ఏర్పడింది. అలాగని వాళ్ళు ఒక వయసువాళ్ళు కాదు శ్యామ్‌కి నా అన్నవాళ్ళు ఎవరూ లేరు. అనాధశరణాలయంలో పెరిగిపెద్దవాడై కష్టపడి చదువుకుని, ఈ ఉద్యోగం సంపాదించాడు. వయసు పెరిగినా అతని గురించి పట్టించుకుని, పెళ్ళి చేసేవాళ్ళు లేక పెళ్ళి చేసుకోలేదు. బ్రహ్మచారిగానే మిగిలిపోయాడూ. అలాగని చెడు అలవాట్లు లేవు.

తన తల్లి తండ్రితో ఎన్ని కష్టాలు పడిందో చూసిన శివ, 'తల్లి జీవితాంతం ఏ సుఖం లేకుండా ఎందుకలా మిగిలిపోవాలి? ఇప్పుడు ఏదో గడిచిపోయినా కొంచెం వయసువచ్చాక 'ఒక తోడు ఉంటే బావుండేది' అని తల్లి బాధ పడకూడదు.' అనుకున్నాడు.

ఒక కొడుకుగా ఆమెని ఆదరించగలడు కానీ తన తల్లికి కావలసిన సుఖసంతోషాలు ఎందుకు దూరం చేయాలి?

"అమ్మా! ఈయన శ్యామ్ అని మా కంపెనీలోనే మాకు సీనియర్‌గా చేస్తున్నారు." తల్లికి పరిచయం చేశాడు.

"నమస్కారం" అంది నిర్మల మామూలుగా.

"నమస్కారమండి! మీరు వంటలు బాగా చేస్తారని శివ ఎప్పుడూ చెప్పటమే కానీ తినే భాగ్యం కలగలేదు" శ్యామే నవ్వుతూ చనువుగా అన్నాడు.

"దానికేం భాగ్యం? భోంచేసి వెళ్ళండి" అని అతనికి ఏం ఇష్టమో కనుక్కుని, చేసి కడుపునిండా పెట్టింది.

శ్యామ్ చాలా సంతోషించాడు. అనాధగా పెరిగిన అతను ఇంతవరకూ ఎవరి అభిమానాన్ని చవిచూడలేదేమో. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. శివ అతని ఫీలింగ్స్ గమనిస్తూనే ఉన్నాడు. తల్లితో మాట్లాడాక అతన్ని అడగాలనుకున్నాడు.

"అమ్మా! శ్యామ్ ఎలా ఉన్నాడు?"

నిర్మల వింతగా చూసింది ఎందుకలా అడుగుతున్నాడో అర్థంకాక "బాగానే ఉన్నాడు. ఎందుకడిగావూ?" అంది.

"పాపం అతనికి పెళ్ళి చేసేవాళ్ళేవరూ లేరట!"

"నువ్వు చేస్తావా? చేసుకుంటాడా ఈ వయసులో?"

"ఎందుకు చేసుకోడూ? నువ్వు ఒప్పుకుంటే..."

"అతనిష్టం! మధ్యలో నా అంగీకారమెందుకు?"

"నువ్వు సరేనంటే అతన్ని అడుగుతాను - నీ జీవితం ఎండమావిలా, ఎండిన మ్రోడులా ఎందుకు కావాలి?"

"శివా! నీకేమైనా మతిపోయిందా? చిన్నపిల్లాడివి చిన్నవాడిలా ఉండు. ఊరుకుంటున్నాను కదాని నీ ఇష్టం వచ్చినట్లు..." నిర్మలకి ఉక్రోషంతో మాటలు రావడంలేదు.

"అమ్మా! నిదానంగా ఆలోచించు. నీకిష్టం లేకుండా ఏదీ జరగదు. నువ్వు ఒప్పుకున్నాకే అతన్ని అడుగుతాను. అతను నీకన్నా కొంచెం చిన్నవాడు కావచ్చు. అదేమీ ఈ రోజుల్లో అభ్యంతరం కాదు. లోకం ఏదో అంటుందని అసలు ఆలోచించనక్కరలేదు. నువ్వు నాన్నతో పడిన కష్టాలనీ, కన్నీళ్ళనీ పట్టించుకోని లోకానికి, నీ సుఖాన్నీ, సంతోషాన్నీ కాదనే హక్కు లేదు."

తన కళ్ళముందే, తన కడుపున పుట్టిన కొడుకు తనకన్నా ఎదిగిపోయినందుకు సంభ్రమంగా చూసింది నిర్మల. అతనికి సమాధానం చెప్పలేకపోయింది కానీ భర్తతో పడిన బాధలు తలచుకుని ఆమె మనసు విరక్తిగా మారిపోయింది.

"శ్యామ్‌కి ఎవరైనా మంచిపిల్లని, కట్నం ఇచ్చుకో లేక పెళ్ళికాక వయసుముదిరిన అమ్మాయిని చూసి పెళ్ళి చేద్దాము శివా! నాకెందుకో పెళ్ళి మీద మోజు..."

"అతనికి అమ్మాయిలు దొరకరనికాదు" శివ మధ్యలోనే ఆవేశంగా అన్నాడు.

"సరే! అతన్ని అడిగి చూడు. అప్పుడాలోచిద్దాంలే"

తల్లి ఆమాత్రం అవకాశం ఇచ్చినందులే శివ తల్లికేసి అభిమానంగా చూస్తుంటే నిర్మలకి సిగ్గనిపించింది...

శ్యామ్ శివ చెప్పింది విని మనసులో ఎగిరి గంతేసినా "మీ అమ్మగారు ఒప్పుకున్నారా?" అన్నాడు పైకి.

"ముందు మీ అభిప్రాయం చెప్పండి. మానాన్నగారి సంగతి చెప్పాను. మీ వయసు తేడాలు నాకు తెలియవు. మీ మంచితనం చూసి నాకు తోచింది చేశాను. ముందే బాగా ఆలోచించుకోండి. తప్పయితే క్షమించండి"

"శివా! ఇందులో తప్పేముంది? మనసులు కలిస్తే వయసు ఆటంకంకాదు. మీ అమ్మగారికి అభ్యంతరం లేకపోతే నాకూ అభ్యంతరం లేదు. అలాంటి దేవత అందరికీ దొరకదు" శ్యామ్ ఆనందంగా చెబుతుంటే శివ అతనికాళ్ళమీద పడ్డాడు.

"ఛఛ నువ్వు కాళ్ళ మీద పడటమేమిటి? చిన్నవాడివైపోయావు కానీ నీ పెద్ద మనసుకు నేనే నీకాళ్ళమీద పడాలి" కృతజ్ఞతగా కౌగిలించుకుని అభినందించాడు.

ఇద్దరికీ రిజిస్టరు ఆఫీసులో పెళ్ళి చేసి, గిఫ్ట్‌గా ఊటీ ఏ.సీ.కోచ్ టికెట్లు అందిస్తున్న శివకి ఎలా కృతజ్ఞతలు చెప్పాలో అర్ధంకాలేదు ఇద్దరికీ.

పున్నామ నరకం నుండీ తప్పించేవాడు కొడుకంటారు కానీ తల్లి జీవితంలో పున్నమి వెన్నెలలు కురిపించిన శివలాంటి వాళ్ళని చూసి అవాక్కయ్యారా?

❖❖❖

# ఆమె ఎవరు?

## - గవరసాన సత్యనారాయణ

"ఎండిపోయిన శవం - హత్యా? ఆత్మహత్యా??" బోస్టన్ హెరాల్డు పత్రికలో పెద్ద అక్షరాలతో పతాక శీర్షిక, బెడ్‌ఫర్డు నగరంలో పోలీస్ డిటెక్టివ్ చెప్పిన విషయాలను ప్రకటించింది.

9 - 11 టెర్రరిస్టు దాడితో మేల్కొన్న అమెరికాలో, అన్ని బస్సుల్లో, రైళ్ళల్లో "ఇఫ్ యూ సీ సంథింగ్, సే సంథింగ్" అనే నినాదాలు విన్పిస్తున్నాయి. హెచ్చరిక ప్రకటనలు కనిపిస్తున్నాయి. ఈ హెచ్చరికను సీరియస్‌గా తీసుకున్న మెయిల్ కేరియరు పోలీసులను పిలిచాడు. మేసచూసెట్సు రాష్ట్రంలో బెడ్‌ఫర్డు నగరం ప్రశాంతంగా ఉంటుంది. ఎల్మ్‌బ్రూక్ వీధిలో మెయిల్ డెలివరీ చేయటానికి మెయిల్ కేరియర్ రోజూ వెళుతున్నాడు. తొమ్మిదవ నంబరు ఇంటి ముందు పడి ఉన్న వ్యాపార ప్రకటనలు, నిండిపోయిన మెయిల్ బిల్సును గమనించాడు. గత నెల రోజులుగా ఇంటిలో జనసంచారం తనకు కనిపించలేదు. ఏదో అనుమానం వచ్చింది. వెకేషన్‌కు పోయేవారు "మెయిల్‌ను హోల్డు" చెయ్యమని కాగితం రాసి పోస్ట్ ఆఫీసులో ఇస్తారు. కానీ తొమ్మిదవ నంబరు ఇంటి నుండీ అటువంటి అభ్యర్ధన లేదు. ఇంటి ముందు చిందరవందరగా పడిన కాగితాలు, నిండిన మెయిల్‌బాక్సును చూసి, "ఇఫ్ యూ సీ సంథింగ్..." నినాదం గుర్తుకు వచ్చి, బెడ్‌ఫర్డు పోలీసులకు ఫోను చేసాడు. మరో పదినిముషాలలో రెండు పోలీసు కార్లు వచ్చి తొమ్మిదవ నంబరు ఇంటి ముందు నిలబడ్డాయి. నలుగురు పోలీసులు కార్లనుండీ దిగారు. మెయిల్ కేరియర్ తనకు తెలిసిందంతా చెప్పాడు.

పోలీసులు ఇంటి తలుపు కొట్టారు. కాలింగ్ బెల్ మోగించారు. ఎవ్వరూ తలుపులు తెరవలేదు. టెలిఫోన్ కంపెనీవారికి ఫోను చేసి ఇంటిలో ఉన్న టెలిఫోను నంబరు తెలుసుకుని ఫోను చేసారు. ఎన్నిసార్లు ఫోను చేసినా సమాధానం రాలేదు. తలుపులు పగలుగొట్టి లోనికి వెళ్ళాలి. పోలీసులు వెంటనే కోర్టుకు వెళ్ళి జడ్జీగారిచ్చిన సెర్చివారెంట్‌తో తిరిగి వచ్చి ఇంటి తలుపులు తీసి లోనికి ప్రవేశించారు. అది రెండు పడక గదుల ఇల్లు. వీధి గుమ్మం తలుపు తీయగానే హాలు, హాలులో ఒక మూలన వంటకు అవసరమయిన గేస్ రేంజి, ప్రక్కనే గిన్నెలు కడగటానికి కిచెన్ సింక్, ఆ ప్రక్కనే డిష్‌వాషర్ ఉన్నాయి. ఓ మూలన ఆవరించి ఉన్న నిశ్శబ్దాన్ని చీలుస్తున్న, రిఫ్రిజిరేటరు. అది పడక గదేకానీ, లైబ్రరీలో ఉన్నట్లు బీరువానిండా పుస్తకాలు ఉన్నాయి. రెండో పడకగది తలుపులని తీసారు పోలీసులు. "ఓ మైగాడ్!" అన్నాడు పోలీస్ పాల్. ఇంట్లో మరోచోట సోదా చేస్తున్న పోలీస్ మేన్ క్రిస్ "ఏమిటి?" అని కేక వేసాడు.

"కం హియరే!" ఇద్దరు పోలీసుల ఎదురుగా ఉన్నది మంచం మీద నిద్ర పోతున్న పోజులో స్త్రీ శవం. ఎండిపోయి ఉన్నట్లు కనిపిస్తోంది. ఏదో వాసన ఉన్నా, గదిలో ఎయిర్ కండిషనర్ పనిచేస్తుండటం వల్ల కాబోలు శవం కుళ్ళిన వాసన రాలేదు. దగ్గరగా, వచ్చి పరిశీలిస్తే యాభై లేక అరవై సంవత్సరాలు పై బడ్డ స్త్రీ, నల్ల చర్మం గలది, ఇండియానుండో పాకిస్తాన్ నుంచో వచ్చి ఉండవచ్చన్న అభిప్రాయం కలిగింది.

"చీఫ్! ఉయ్ ఫౌండ్ ఎ డ్రైడ్ డెడ్ బాడీ!"

"ఒకె. పోలీస్ క్రైం యూనిట్‌ను, కారనర్‌కు తెలియచేస్తాను. సీల్ ది హౌస్" అని పోలీస్ ఛీఫ్ ఆర్డరు వేసాడు.

క్రైం పోలీస్ డిటెక్టివ్ రూబిన్ మధ్య వయస్కుడు. ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ కేస్‌ను "సాల్వ్" చేస్తే తనకు ప్రమోషను రావచ్చు. కేస్ ఫైలును తిరగవేసాడు. చనిపోయిన వ్యక్తి యొక్క శారీరక చిత్రంతో పాటు, మనో చిత్రాన్ని కూడా తయారు చేస్తేనే కానీ "ఇది హత్యా? లేక ఆత్మహత్యా" అన్న విషయం తేలదు.

పేరు లలిత, తోటి పనివారు "లల్లీ" అని పిలుస్తారు. బోస్టన్ పబ్లిక్ లైబ్రరీలో 30 సంవత్సరాలు పని చేసి ఆరునెలల క్రితం వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకుంది. డిటెక్టివ్ రూబిన్, బోస్టన్ పబ్లిక్ లైబ్రరీకి వెళ్ళి లలిత పనిచేసిన విభాగం సూపర్‌వైజరును కలుసుకున్నాడు. సూపర్‌వైజరు చెప్పింది విని ఆశ్చర్యపోయాడు. "లల్లీ, ప్రతి రోజూ లైబ్రరీలో టైంకు వచ్చి, పనిగంటలు ముగిసిన తరువాత కూడా మరోగంట పనిచేసేది. బోయ్ ఫ్రెండ్స్ లేరు. గర్ల్‌ఫ్రెండ్సు కూడా లేరు. ఆమెకు బయటనుండీ ఎప్పుడూ ఫోన్‌కాల్స్ వచ్చేవి కావు. తోటి పనివారితో వైరం లేదు. ఇటీవలే వాలంటరీ రిటైరుమెంటు తీసుకునే ముందు ,తనకు ఆరోగ్యం సరిగ్గా ఉండటం లేదు అందువల్లనే రిటైరు అయిపోతున్నాను" అని చెప్పింది సూపర్‌వైజరుతో.

డిటెక్టివ్ రూబిన్ ఫైలులో లలిత ఫోటో ఉంది. అరవై సంవత్సరాల స్త్రీ, నల్లటి చర్మం కలది, స్థూలకాయం. ఇల్లీగల్ డ్రగ్స్ వాడినట్లులేదు, బెడ్‌ఫర్డు నగరం నుండీ బస్‌లో "ఏల్‌వైఫ్" రైల్వేస్టేషనుకు పోయి "టీ" (అండర్ గ్రౌండ్ రైల్ సిస్టం)లో ప్రయాణం చేసి బోస్టన్ పబ్లిక్ లైబ్రరీ చేరుకునేది. ట్రాఫిక్ వయొలేషన్స్ ఉన్నాయా అని కంప్యూటర్ సెర్చ్ చేసాడు. డ్రైవింగ్ లైసెన్సు ఉంది కానీ మూవింగ్ వయొలేషన్స్ గానీ పార్కింగ్ ఫైన్సుగానీ లేవు.. వాటెనీట్ రికార్డ్ ! " అనుకున్నాడు రూబిన్.

"సీక్రెట్ లవర్" ఎవరైనా ఉన్నారా? ఆ సీక్రెట్ లవర్ గానీ హత్య చేసాడా? హత్యకు ప్రేరణ ఏమిటి? ప్రేమా? అసూయా? డబ్బా? డిటెక్టివ్ రూబిన్‌కు మరికొంత పని కలిగింది. బోస్టన్ పబ్లికి లైబ్రరీలో పని చేస్తున్న "మేల్ కొలీగ్సు"ని ఇంటర్‌వ్యూ చేసాడు. ఆ మగ వారందరూ చెప్పింది ఒక్కటే - "ఎవ్వరినీ శారీరకంగా గానీ, మానసికంగా గానీ దగ్గరకు రానివ్వలేదు." పురుషద్వేషి అయిఉంటుంది అనుకున్నాడు. స్త్రీలంటే ప్రేమా? లెస్బియన్ అయిఉండవచ్చునని "లైబ్రరీలో పనిచేస్తున్న స్త్రీ ఉద్యోగులను వాకబు చేసాడు. "హలో అంటే హల్లో" అనుకోవటమే తప్ప తోటి స్త్రీ ఉద్యోగులతో స్నేహం చెయ్యలేదు "మోసపోయిన ప్రేమవల్ల జరిగిన హత్యకాదిది" అని తీర్మానించుకున్నాడు డిటెక్టివ్ రూబిన్.

"డబ్బు కోసం ఆశపడి ఎవ్వరైనా హత్య చేసారా?" ఇదీ డిటెక్టివ్ రూబిన్ వేసుకున్న ప్రశ్న. లైబ్రరీ ఆఫీసునుండి సేకరించిన సమాచారం ప్రకారం ఆమె జీతం డైరెక్టు డిపాజిట్టుగా "బేంకు ఆఫ్ అమెరికా"కు వెళుతుంది. జడ్జిగారి ఆర్డరు సంపాదించి "బేంక్ ఆఫ్ అమెరికా" వారిది, బోస్టన్ ఆఫీసుకు వెళ్ళి లలిత తాలూకు ఎక్కౌంట్లు స్టేట్‌మెంట్లు

తీసుకున్నాదు, పరిశీలించాడు. జీతం ప్రతి రెండు వారాలకు జమ అవుతోంది. ప్రతినెలా వెయ్యి డాలర్లు చెక్కును భారత దేశంలో ఉన్న ఒక ధర్మ సంస్థకు డొనేషన్‌గా పంపుతోంది. ఆశ్చర్యం! ప్రతీనెలా వెయ్యి డాలర్ల డొనేషన్? ధర్మ సంస్థ గురించి ఆరా తీసాడు. అది భారతదేశంలో ఉన్న ధర్మ సంస్థ. అనాధ బాలికలకు అనాధ స్త్రీలకు రక్షణ కల్పిస్తోంది. అయితే ఈమెకు ఆ సంస్థకు సంబంధం ఏమిటి?

డిటెక్టివ్ రూబిన్ దగ్గర పాత చెక్కుల కాపీలతో పాటు లలితకు వచ్చిన ఉత్తరాల కట్ట ఉంది. ఆ ఉత్తరాలు సగం ఇంగ్లీషులో, సగం ఇండియన్ లేంగ్వేజిలో ఉన్నాయి. ఇంగ్లీషులో రాసిన ఉత్తరాలలో ఆమె పంపిన విరాళాలు ఎలా అనాధ బాలికల చదువుకు వినియోగించారో, ఎంత మంది అనాధ స్త్రీలకు ఆశ్రయం కల్పించారో వివరాలు ఉన్నాయి. ఇండియన్ లేంగ్వేజిలో ఉన్న ఉత్తరాలను పట్టుకుని ఎఫ్‌బిఐ వారి లేంగ్వేజి లేబరెటరీకి వెళ్ళాడు. క్రైం ఇన్‌వెస్టిగేషన్ బట్టీ ఎఫ్‌బిఐ వారు సహకరించారు. ఆ ఉత్తరాలు తెలుగులో రాసినట్లు కనుక్కున్నారు.

ఎఫ్‌బిఐ ఏజంటు రావ్ ఈ మధ్యనే తెలుగు లాంగ్వేజ్ ట్రాన్సులేటర్‌గా చేరాడు. ఆంధ్రప్రదేశ్ రాజధాని హైదరాబాదులో పాకిస్తానీ ఏజంట్లు ఆల్‌ఖైదాకు మద్దత్తు ఇస్తున్నారని ఎఫ్‌బిఐ కి తెలిసిన తరువాత తెలుగు భాష తెలుసున్న ఏజంటును రి క్రూట్ చేసారు. ఏజంటు రావ్‌ను డిటెక్టివ్ రూబిన్ తన దగ్గరున్న తెలుగు ఉత్తరాలను ఇచ్చి, "ఆమె ఎవరు? ఆమెకు 'నా' అన్నవారు ఎవరూ లేరా? ఆమె ఎందుకు చనిపోయింది?" అన్న ప్రశ్నలకు సమాధానాలు ఉన్నాయేమో చూడమన్నాడు.

"అలాగే చూస్తాను. వారం పోయిన తరువాత రండి" అన్నాడు ఏజంట్ రావ్.

డిటెక్టివ్ రూబిన్ శ్రద్ధగా వింటుంటే ఏజంట్ రావ్ చెప్పుకు పోతున్నాడు. "చిన్ననాటి స్నేహితురాలు రాసిన ఉత్తరాల ప్రకారం లలిత తల్లిదండ్రులు ఆమె చిన్నతనంలో చనిపోయారు. అనాధాశ్రమంలో చేరి చదువుకుని విజయవాడలో ఉద్యోగం చేసింది. పెళ్ళి చేసుకుందామనుకుంటే కట్నం ఇచ్చుకోలేని స్థితిలో ఉండటం వలన పెళ్ళి కాలేదు. విజయవాడ నగరంలోని జిల్లా గ్రంధాలయ సంస్థలో పని చేస్తుండగా అమెరికాలో లైబ్రరీ సైన్సు చదవడానికి స్కాలర్ షిప్పు ప్రకటనను ఇంగ్లీషు దిన పత్రికలో చూసింది. తను అనాధ కావటం వలన, శరీరం నల్లగా ఉండటం వలన భారతదేశంలో ఉంటే పెళ్ళి కాదు, జీవితంలో ఎదుగూ బొదుగూ ఉండదని అమెరికా వచ్చి లైబ్రరీ సైన్సులో మాస్టర్సు డిగ్రీ సంపాదించింది. అమెరికాలో పని చేస్తున్న తెలుగు వారు కూడా కట్నం ఆశించడంతో పెళ్ళి ప్రయత్నం విరమించుకుంది. తనను పెంచి పెద్ద చేసిన అనాధ శరణాలయానికి అండగా ఉండాలని నిర్ణయించుకుంది. ఎందుకు చనిపోయిందో ఈ ఉత్తరంలో క్లూలు లేవు" అన్నాడు ఏజంట్ రావు.

డిటెక్టివ్ రూబిన్ తన రిపోర్టును తయారు చేసే ప్రయత్నంలో ఉన్నాడు. పోస్ట్‌మార్టం రిపోర్టును చదివాడు. 'శరీరం మీద గాయాలు లేవు. శరీరంలో మాదకద్రవ్యాలు లేవు. విషపదార్థాల అవశేషాలు లేవు. గుండెలోని రక్తనాళాలలో రక్తపు గడ్డ ఉంది. దాని వల్ల గుండె కండరం చెడిపోయింది. ఇది హత్య కాదు. ఆత్మహత్య అంతకన్నా కాదు. మాసివ్ హార్టు ఎటాక్ వల్ల లలిత చనిపోయింది' అని రిపోర్టులో ఉంది.

డిటెక్టివ్ రూబిన్‌కు "కట్నం" అంటే ఏమిటో తెలియలేదు. ఇంటర్నెట్ సెర్చ్ చేస్తే భయంకరమైన సమాచారం తెలిసింది. కట్నం పూర్తిగా ఇవ్వని పెళ్ళికూతురులను అత్తమామలు, కొన్ని సందర్భాలలో భర్తలు ఎలా వేధించారో కిరసనాయిలు పెళ్ళికూతురిపై పోసి ఎలా నిప్పు అంటించారో మొదలగు ఘటనలను చదివి ఆశ్చర్యపోయాడు. "కట్నం అనే పిశాచి కోరల నుండీ తప్పించుకోటానికే భారతదేశం నుండీ పారిపోయింది లలిత" అని తీర్మానించుకున్నాడు.

"లలిత సహజ మరణం వల్లనే చనిపోయింది. అనాధగా పెరిగిన లలిత తన అనురాగంతో కరుణ హృదయంతో, ధన సాయంతో, ఎంతో మంది అనాధ బాలికల ప్రగతికి తోడ్పడింది. ఏ గ్రేట్ డోనర్! ఏ కైండ్ నోట్!"అని రిపోర్టును ముగించాడు. నెక్స్ట్ ఆఫ్‌కిన్ ఎవ్వరూ లేకపోవడం వల్లన, ఏ ధర్మ సంస్థకు లలిత డొనేషన్లు పంపిందో, వారికి మాత్రం లలిత మరణ వార్తను తెలియచేస్తూ ఉత్తరం వ్రాసాడు.

❊❊❊❊❊

# "రెస్టు ఏరియా కథలు : స్వాన్ రివర్"

– నిర్మలాదిత్య

గ్రాంట్ వుడ్ చిత్రం లాగ ఉంది అనుకున్నాను. ఎందుకుండదు. ఆ మైదానాన్ని నిలువుగా చీలుస్తున్న రోడ్డు. రోడ్డున ఇరువైపుల రకరకాల వన్నెలతో ఉన్న ప్రయరీ పువ్వులు. వాటి పక్కనే ఎకరాల కొద్దీ వేసి ఏపుగా పెరుగుతున్న మొక్కజొన్న, సోయా పంటలు. ఆ పొలాల మధ్యలో కొన్ని మైళ్ళ కొక గాదెతో పాటు ఉన్న ఫార్మ్‌హౌసు, నేను ప్రయాణిస్తున్నది గ్రాంట్‌వుడ్ పెరిగిన మిడ్ వెస్టు ప్రాంతంలోనే.

అబ్బాయి కావాలనుకొని ముగ్గురు కూతుళ్ళకు తండ్రినయ్యిపోయాను. కానీ అబ్బాయి లేడన్న లోటు లేకుండా ముగ్గురు కూతుళ్ళూ పోటీ పడి మరీ పై చదువులు చదివేసి, పెళ్ళి చేసుకుని ఈ U.S వచ్చేసారు. ఇక వాళ్ళని చూడ్డం కోసమని, వాళ్ళ పురుళ్ళకని నేను, మా ఆవిడ తరచుగా అమెరికా వస్తూనే ఉన్నాం. ఈ మధ్య రెండో కూతురు వాళ్ళు 'సిన్సినాటికి' ఉద్యోగరీత్యా మూవ్ అయ్యారు. పెద్దమ్మాయి సీడర్ రాపిడ్స్‌లో ఉంటుంది. పెద్దమ్మాయి దగ్గర ఓ రెండు నెలలున్నాక రెండో అమ్మాయి పురుడు దగ్గర పడే సరికి దానికి సహాయానికని నన్ను మా ఆవిడ్ని తీసుకుని పెద్దమ్మాయి బయలుదేరింది. అల్లుడు అమ్మాయి ముందు సీట్లలో కూర్చున్నారు. నేను మా ఆవిడ మధ్య వరుసలో కూర్చోగా చివరి వరుసలలో ఇద్దరు మనవళ్ళు కూర్చున్నారు. మా అమ్మాయికి ఇద్దరు అబ్బాయిలు. అమ్మాయి పుట్టలేదని తనకో లోటు.

మెలీన్ రావటంతో అల్లుడు I- 80 నుంచీ I- 74 కు మళ్ళించాడు వేను. ముందు కూర్చుని అల్లుడు కూతురు మా ఆవిడతో మాట్లాడుతూనే ఉన్నారు. నేను అప్పుడప్పుడు వాళ్ళ సంభాషలతో పాలుపంచుకుంటూనే ఉన్నాను. కానీ బయట కనిపిస్తున్న దృశ్యాలు నా ఆలోచనా స్రవంతిని మరింత వేగంగా ఎక్కడెక్కడో మెదడులో దాక్కున్న జ్ఞాపకాలను వెదికి పట్టుకుని ఓ వెల్లువలాగా ప్రవహింపచేస్తున్నాయి. మూడో తరగతి జాగ్రఫీలో నేర్చుకున్న ది ప్రయరీ మైదానాలివేనా? దూరము, సమయం డైరక్టు ప్రపోర్షనా లేక ఇన్వర్షనా? కారు వేగం గంటకు 70 మైళ్ళు అయితే 400ల మైళ్ళు ఎన్ని

గంటలలో ప్రయాణం చేయవచ్చును? ఈ లెక్కలు ఆరో తరగతిలోనా నేర్పించింది? 'నీలిమబ్బుల నీడలోన' ఏ సిన్మాలో పాట అది? బారులగా ఆకాశంలో ఎగురుతున్న పక్షులు హంసలా, బాతులా? పిట్టల దొరంటే డిక్‌చేయినీనా? ఇదేంటి. "స్వాన్ రివర్", స్వాన్ రివర్.. స్వాన్ రివర్ చాల పరిచయమైన పేరులాగా ఉంది, కానీ గుర్తుకు రావటం లేదేంటి? ఎక్కడ విన్నానట ఆ పేరు? నాలుక చివర్న ఉన్నట్టుంది. కానీ గుర్తుకు రావటం లేదేంటి? ఎక్కడ విన్నానట ఆ పేరు? నాలుక చివర్న ఉన్నట్టుంది. కానీ గుర్తుకు రావటం లేదు. టు...టు..టు..టు....

"నాన్నా రెస్టు ఏరియా వచ్చింది ఆగుదామా అంది. అది 'స్వాన్ రివర్' రెస్ట్ ఏరియాలోనే. ఆగితే నా మనస్సును పీడిస్తున్న ఈ ప్రశ్నకు సమాధానం దొరుకుతుందని పించింది. "సరే ఆగుదామమ్మా' అన్నాను.

'ఏమండీ రెస్టు ఏరియాలోకి తీసుకోరా" అని అమ్మాయి అల్లుడికి చెప్పింది.

వేను ఆగాక పిల్లలు హడావిడిగా దిగి బయటకి పరిగెత్తసాగారు. రెస్టు ఏరియా కొంత సందడిగా ఉంది. కొంత దూరంలో ట్రక్కులు బారులు తీరి పార్కు చేయబడ్డాయి. మరో ప్రక్క, దగ్గర్లో పది కార్లు పార్కు చేసి ఉన్నాయి. మైదానంలో పల్లంగా ఉన్న చోట రెస్టు ఏరియా కట్టారు. కొంచెం పైగా ఎదురుగా రోడ్డుపైన హైవేలో కార్లు, ట్రక్కులు, వేన్లు పరుగులు తీస్తున్నాయి. పార్కు చేసిన ట్రక్కులు, కార్లకు, హైవే మధ్య ఉన్న ప్రదేశంలో లాండ్ స్కేప్ చేసిన పచ్చటి లాన్. అక్కడక్కడ పూలమొక్కలు. పార్క్ చేసిన కార్ల ఇటువైపు రెస్టు తీసుకోవాలనే వారికి ఓ పెద్ద హాలు రెస్టు రూములు, వెండింగు మిషనులు హాలు కిరువైపుల అక్కడక్కడ పార్కులో బెంచీలు, రిలాక్సు అవడానికని, కుక్కలను నడిపించడానికి కాను, చెట్ల మధ్య నుంచీ మల్పులు తిరుగుతూ వేసిన కాలిబాట. ఆ బాట అలా వెళ్ళి స్వాన్ రివర్ మీద ఓ చిన్న వంతెనతో అంతమౌతుంది. ప్రకృతి అందంలో పడి పరిసరాలు మరిచిపోయే ప్రమాదంలో పడేరు, కావలిస్తే ఆదుకోవడానికి మేమున్నాం అంటూ 911, పోలీసులను పిలవడానికి కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న అలారం సిస్టంలు. మనస్సుకు ఆహ్లాదకరంగా, శరీరాలకి బడలిక తీరేలాగా కట్టిన ఈ పార్కుల లాంటి రెస్టు ఏరియాలలో ఆగడం నాకు సరదానే. కానీ నా ఆలోచన చిక్కుముళ్ళలో ఇరుక్కుపోయిన "స్వాన్‌రివర్" ఆ పరిసరాలను నేను అనుకున్నంత సంతోషంగా ఉంచలేకపోతున్నాయి.

'గ్రాంపా' గ్రాంపా' అంటూ నన్ను లాక్కెళ్ళి వాళ్ళకు కావలసిన కండెలు కొనుక్కున్నారు పిల్లలిద్దరు. రెస్టుఏరియా నుంచీ అప్పుడే వచ్చిన అల్లుడు "పిల్లల్ని బాగా స్పాయిల్ చేస్తున్నారు మామయ్య" అని వాపోయాడు.

'అల్లుడు స్వాన్ రివర్ అంటే ఏమైనా గుర్తొస్తోందా' అని అడిగాను.

'అబ్బే అది ఇక్కడ పారుతున్న ఏరు పేరై ఉంటుందండి" అన్నాడు. అల్లుడు కంప్యూటర్ మీద పని చేయడంలో మేధావి అని విన్నాను. కానీ అతనికి ఇతర విషయాలపైన ఆసక్తి జ్ఞానం బొత్తిగా శూన్యం. అతనికి జవాబు తెలిస్తే ఆశ్చర్యపడేవాణ్ణే.

"ఏమండీ ఏమిటీ ఆ చూపులు. ఎక్కడో మీ ఆలోచనలు. కాఫీ ఏమైనా తీసుకుంటారా?" అంది మా ఆవిడ." అబ్బే వద్దు. ఇక్కడ చూసావా - ఈ ప్రమరీ మైదానాలలో పెరిగే పూల బొమ్మలు, పేర్లు ఎంత బాగా ఈ పోస్టర్లో వేసారో. ." అని నేను మా ఆవిడ హాలులో తగిలించిన పోస్టర్ చూసి వాటి పేర్ల మేచ్ చేసి పూలు చూసి సాగాము." ఇది చూసావా కాశీ రత్నం పూల లాగా లేదు. దాని పేరేం అంటావు" అని నేనంటే

"ఇది చూసారా రోడ్డు ప్రక్కన కొన్ని వేల కొద్దీ పూలు పిచ్చగా పెరుగుతున్నాయి. దీని పేరు 'బ్లాక్ సూసన్'అట" అంది మా ఆవిడ. అలా పూల పేర్లన్నీ చదివి హాలు బయటకి దారి తీసాము. అల్లుడు అమ్మాయి

తలుపు దగ్గరున్న టీవీ మానిటర్‌పైన వాతావరణం అప్‌డేట్సు దాని పక్కనే పెద్ద మేపును చూస్తున్నారు. పిల్లలకోసం చూసాను. వాళ్ళు అప్పుడే బయట పార్కులోకి పరుగెత్తుతున్నారు.

పిల్లలు అలా లాన్లలో పరుగెత్తి ఆడుకుంటుంటే - నేనూ మా ఆవిడ అక్కడే ఎక్కడైనా కూర్చుందామా అని పార్కులోని బెంచీల కోసం వెదకసాగాము. చాలా ఖాళీ బెంచీలు కనిపించాయి. కుడివైపు ఓ మూల ఓ కుటుంబం బెంచీల పైన కూర్చుని ఏదో తింటున్నట్టున్నారు. సమ్మర్ కాబట్టి సాయంత్రం ఆరు అయిన ఇంకా మధ్యాహ్నం మూడు గంటల లాగానే ఉంది. ఇక్కడ అలవాటు ఆరుకంతా డిన్నర్లు చేసేస్తారు. 'స్వాన్ రివర్ రెస్టు ఏరియా' చక్కటి బోర్డు కనపడడంతో మళ్ళీ మెదడు స్వాన్ రివర్ గురించి ఆలోచించసాగింది. ఓ చిన్న బొచ్చు కుక్కను నడిపిస్తున్న ఒకావిడ, కొంచెం పెద్దగా ఎత్తుగా ఉన్న గ్రేహౌండు కుక్కను నడిపిస్తున్న మరో పర్వతాకారానికి దూరంగా పోవడానికి ప్రయత్నిస్తున్నది.

మరో వైపు ఉన్న పార్కు బెంచీల పైన ఏదో మనవాళ్ళు కూర్చున్నట్లనిపించింది. అప్రయత్నంగా నేను మా ఆవిడ అటువైపు అడుగులు వేసాం. ఇండియాలో అస్తమానం వాళ్ళతో వీళ్ళతో మాట్లాడడానికి అలవాటుపడి ఇక్కడికి వచ్చాక రోజుల తరబడి అమ్మాయి, అల్లుళ్ళతోనే వుండటం వల్ల అవకాశం వస్తే కొత్తవారితో పరిచయం చేసి మాట్లాడుకోవడం సహజమేనేమో!

దగ్గరకు పోయి చూస్తే దాదాపు దాదాపు నా వయస్సే ఉన్న ఒకతను, వాళ్ళావిడా కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఏదో పళ్ళరసం బాటిల్ లో నుంచీ త్రాగుతున్నారు. ఆయన ముఖం చాలా సుపరిచితం అనిపించింది. 'స్వాన్‌రివర్' మిస్టరీ ఆలోచనలు అక్కడ పక్కన పెట్టేసి, నా మెదడు ఎదురుగా ఉన్న ముఖాన్ని నా జ్ఞాపకాలలో దాక్కున్న అనేక ముఖ ప్రతిబింబాలతో మేచ్ చేయడానికి మెఱుపు వేగంతో మొదలు పెట్టింది. గుర్తొచ్చేసింది. అచ్చు విచ్చుమామయ్య లాగానే ఉన్నాడు. విచ్చు మామయ్య. జ్ఞాపకాలను వెదుక్కుంటూ క్షణంలో నేను ఓ 40 ఏళ్ళ వెనక్కు వెళ్ళిపోయాను. అప్పుడు నేను ఆరోతరగతి చదువుతున్నాననుకుంటా. మా పక్కింటిలోనే మాకు దూరపు బంధువులుండేవారు, మా తాతయ్యకు అన్నదమ్ముల వరసనుకుంటా. వాళ్ళకు ఓ నలుగురు అమ్మాయిలు మరో నలుగురు అబ్బాయిలు. ఎప్పుడూ ఈ అబ్బాయిలు, అమ్మాయిల వాళ్ళ కుటుంబం రాకపోకలతో ఇళ్ళు పండుగ సందడితో కళకళలాడుతూనే ఉండేది. విచ్చు మామయ్య అందరిలో చిన్నవాడు చూడటానికి బాగా ఉంటాడు కూడా. అతడు మంచి తెలివైన వాడని పై చదువులకి అమెరికాకి వెళ్ళి అక్కడే స్థిరపడిపోయాడని తెలుసు. విచ్చు మామయ్య అమెరికా నుంచీ ఇంటికి వచ్చాడంటే మా కందరికి కూడా చాక్‌లెట్లు అవి తెచ్చి ఇస్తూండటంతో విచ్చు రాకకు మా పిల్లలు కూడా తెగ ఎదురు చూసేవాళ్ళం. ఇక పక్కింటి తాత, అవ్వలు కూడా విచ్చు దూరంగా ఉన్నందువల్ల నేను వెళ్ళినప్పుడల్లా విచ్చు గురించి కబుర్లే చెబుతూ ఉండేవారు. అలాంటిది ఓసారి విచ్చు వస్తూ వస్తూ తనతోబాటు ఓ అమ్మాయిని తీసుకొచ్చాడు. అమ్మాయి విచ్చుకు తగిన జోడీయే అనిపించింది. అందంగ, సన్నగ నాజూకుగా ఉంది. తను అక్కడే విచ్చుతో బాటు 'యూనివర్శిటీ'లో చదివిందని వాళ్ళు పెళ్ళిచేసుకోబోతున్నాడని విన్నాను. కానీ విచ్చు వాళ్ళ రాక ఈసారి చిన్న సైజు దుమారం రేపింది. ఆ అమ్మాయి తమిళ అమ్మాయి. దానితో బ్రాహ్మలమ్మాయి. మన కులం కాదు అని తాత, అవ్వలు మొదట బుజ్జగించి, అటు తరువాత తోడబుట్టినవారితో చెప్పి చూచి చివరకు తిట్లు తిట్టి పంపించేసారు. విచ్చు వాళ్ళింట్లో వారి చర్యకు బాగా నొచ్చుకున్నాడు. కానీ తన నిర్ణయం మార్చుకోలేదు. తరువాత అమెరికా వెళ్ళిపోయి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడని విన్నాను.

విచ్చుని అటు తరువాత చూడలేదు. కానీ తాత అవ్వలు మా ఇంటికి వచ్చినా నేను వాళ్ళింట్లోకి వెళ్ళినా విచ్చు ప్రసక్తి రాని క్షణం లేదు. విచ్చుని తిట్టిన తిట్టు లేదు. 'ఈ ముసలితనంలో మాకు ఇంత శిక్ష వేసాడు. మమ్మల్ని ఇంత క్షోభ పెట్టి సుదూరతీరాలకి వెళ్ళిపోయాడు. వాడికీ ముసలితనం వస్తుంది. మేం పడ్డ బాధకు పదింతలు వాడు పడతాడు' అని శపిస్తూనే ఉన్నారు. చిన్నవాడవటం వల్ల విచ్చుని తిట్టినా.. వాళ్ళిద్దరికీ అపరిమితమైన ప్రేమ అనుకుంటా. అదే చివరితనంలో ద్వేషంగా మారింది. విచిత్రం ఏమంటే విచ్చు అన్నలు అక్కలు కూడా హైదరాబాదు, విజయవాడ అంటూ దూరంగానే ఉన్నా వాళ్ళు పండుగలకు సెలవుల్లో వచ్చినా ముసలివారికి వయస్సు మళ్ళి ఆరోగ్యం బాగా కృంగిపోయిన సమయంలో ఎవ్వరూ పట్టుమని ఓ పదిరోజులుండలేక పోయారు. ఉద్యోగం, పిల్లల చదువులంటూ వాళ్ళిద్దరిని ఒంటరిగానే ఉంచేసారు. అలా విచ్చు వెళ్ళిపోయిన సంవత్సరంలోనే ఆరోగ్యం బాగా చెడిపోవడం వల్ల కొద్ది నెలల తేడాతో ఇద్దరూ చనిపోయారు. విచ్చు ఆ విషయం తెలిసి దినాలకని వచ్చాడు. కానీ తనే వాళ్ళ చావుకి కారణం అయినట్లు అతని తోబుట్టువులు, చుట్టుపక్కల వారూ ముఖం మీదే తిట్టిపోసారు. 'నీకు నీ ముసలి తనంలో, నీ పిల్లలకోసం తపించి పోతావు' అని మూకుమ్మడిగా శపించి వేసారు. అదే విచ్చు మామయ్యని నేను చివరిసారిగా చూడటం.

విచ్చు మామయ్యలాగే ఉన్నాడితను. కానీ విచ్చు మామయ్య ఈనాటికి బాగా వయస్సు మళ్ళి ఉండాలే. ఇతను చూస్తే నాకంటే కొంచెం చిన్నవాడిలాగానే ఉన్నాడు. విచ్చుగురించి మా ఆవిడకు నేనే ఒకటి రెండుసార్లు చెప్పాను. మా అమ్మాయిలు కూడా అమెరికాలో సెటిల్ అయిన తరువాత విచ్చు విషయాన్ని గురించి మాట్లాడుకున్నాం. మా ఆవిడతో అతను విచ్చు మామయ్యలాగా ఉన్నాడు. నేను చిన్నప్పుడు చూసిన విచ్చు మామయ్య పోలికలు కొట్టిచ్చినట్లు కనిపిస్తున్నారు అన్నాను. 'హలో' అన్నాను నవ్వుతూ నేను. ఆ విచ్చు పోలికలున్నతన్ని చూసి. అతను 'హలో' అన్నాడు. పలకరింపు నవ్వుతో. వారికెదురుగా ఉన్న బెంచీలో కూర్చున్నాము.

విచ్చు పోలికలున్నాయన పక్క వాళ్ళావిడనుకుంటా షర్టు, జీన్స్‌పాంట్‌లో ఉంది. ఆవిడా నవ్వింది.

నేను మా ఆవిడ పక్కనున్న బెంచీపైన కూర్చున్నాము. "మీరు ఇండియా నుంచేనా" అన్నాను.

"అపును మా అమ్మా నాన్నలు ఇండియా నుంచీ వచ్చారు. నేను ఇక్కడే పుట్టి పెరిగాను. నా పేరు మోహన్. అతని మాటలు, చేష్టలు ఇక్కడ అమెరికన్‌లాగానే ఉంది. ఏమాత్రం మన యాస లేదు. పక్కన తన భార్యగా పరిచయం చేసిన ఆవిడ సంగతీ అంతే.

మమ్మల్ని పరిచయం చేసుకుని ఒకటీ రెండు మాటలు చెప్పి నా మనస్సులో ఉన్న సందేహాన్ని బయట పెట్టాను.

"నిన్ను చూస్తే నాకు మా మామయ్య విచ్చు గుర్తుకొస్తున్నారు. అచ్చం అలానే ఉన్నావు" అన్నాను

"విశ్వనాథా? ఆశ్చర్యంగా ముఖం పెట్టాడు" మోహన్.

"హా అవును ఆయన పూర్తి పేరు విశ్వనాథ్ అనుకుంటా కాని నాకు విచ్చు మామయ్యే. "

"ఓ అతను మా నాన్నే. మనం బంధువులన్నమాట. నాన్న ఎలా తెలుసు మీకు"

విచ్చు గురించి నాకు తెలిసిన విషయాలు చెప్పాను. కానీ విచ్చుకు వాళ్ళ తల్లితండ్రులకు జరిగిన గొడవల గురించి చెప్పలేదు. విచ్చు వాళ్ళమ్మా, నాన్న విచ్చు కూడా ముసలి తనంలో అతని పిల్లలకు దూరం అయ్యి, బాధపడి మరీ కృంగి నశించాలి అని శపించిన సంగతి చెప్పలేదు. మోహన్ వాళ్ళావిడను చూస్తూనే మంచి అభిప్రాయం

కలిగింది. మోహన్ కన్సల్టింగ్, వాళ్ళావిడ డాక్టర్ అని విన్నాను. ఇద్దరి ముఖంలో ప్రసన్నత, మంచితనం ప్రస్ఫుటిస్తున్నాయి. వారెలాంటి వారైనా ఆ విషయం చర్చించడం అనవసరం అనిపించింది.

"విచ్చు మామయ్య ఎలా ఉన్నాడు" అన్నాను.

"ఓ డాడీ! ఆయన పోయిన సంవత్సరమే పోయారు. ఎనభై పైనే వయసైంది కదండి" అన్నాడు. ముఖంలో ప్రసన్నత ఉన్నా విషాద ఛాయలు పులుముకున్నాయి.

"ఓ సారీ.. ఎలా పోయారు మోహన్." ఇది కొంచెం షాకింగ్‌గానే ఉంది.

"సరిగ్గా తెలియదండి. నిద్రలోనే పోయారని విన్నాను.

"మీరు దగ్గర లేరా? ఒక్కడే కొడుకన్నారు" అన్నాను.

"లేదండి, ఆయన 'ఓల్డ్ఏజ్‌హోం' లోనే పోయారు. "

విచ్చుమామయ్య శాపం తప్పించుకోలేక పోయారన్నమాట. మనస్సు కొంచెం చివుక్కుమంది.

'నాన్న చివరి క్షణం వరకూ సంతోషంగా, ఆక్టివ్‌గానే ఉండిపోయారండి' అన్నాడు.

కొంచెం షాక్ అయ్యాను. ఇది నేను ఓ క్షణం క్రితం అనుకున్న అంచనాలను తారుమారు చేసేసాయి. విచ్చు మామయ్య, ఆయన వలచి పెళ్ళి చేసుకున్న భార్య ఓ రెండేళ్ళ ముందువరకు ఇండిపెండెంటుగానే ఉన్నారట. వాళ్ళతో బాటు వాళ్ళకి తెలిసిన స్నేహితుల కుటుంబాలతో కలిసి ఫ్లోరిడాలో కాండో తీసుకుని అక్కడే గడిపారట. విచ్చు మామయ్య భార్య రెండేళ్ళ క్రితం పోవడంతో విచ్చు మామయ్య తనే రీసెర్చి చేసి ఓ ఓల్డ్ఏజ్ హోంకు మారిపోయాడు అని చెప్పాడు.

"డాడీ, ఆయన చివరి వరకు ఆక్టివ్‌గానే ఉండి ఉన్నారు" అన్నాడు.

"మీ దగ్గర ఉండాలని ప్రయత్నించలేదా" అన్నాను.

"అబ్బే తను చాలా ఇండిపెండెంట్ నేను చేసేపని టెలీకమ్యూటింగ్ చేయవచ్చు. మా పిల్లలు కాలేజీకి వెళ్ళిపోయారు మా దగ్గర ఉండండి లేకపోతే మేమే మీదగ్గర వచ్చి ఉంటాం అని చాలాసార్లు చెప్పాను. ఏదో లాంగ్‌వీకెండ్స్ చూడటం తప్పితే తన వ్యాపకాలు తనకుండేవి. మా అమ్మకు పెద్ద ఫ్రెండ్స్ సర్కిల్ ఉంది. కాబట్టి వారికి ఒంటరితనం సమస్యే లేదు. వారికి రోజులో 48 గంటలున్నా సరిపోవేమో. రిటైర్ అయిన తరువాత వారు అదో గొప్ప అవకాశంగా భావించి వారికి కావలసిన విధంగా వాళ్ళ జీవితాలను గడిపారు. మాతో పాటు 24 గంటలుండి మా జీవితంలో ఇమిడిపోవడం వారి ఉద్దేశ్యం కాదనుకుంటా."

"అంటే అచ్చు అమెరికన్ల జీవన విధానానికి అంకితం అయ్యిపోయాడన్నమాట."

"అమెరికా, ఇండియా జీవన విధానాలున్నాయనుకోండి "

"మనిషి ఎలా జీవించాలి అన్నదానికి చాలా ఆప్షన్లు ఉన్నాయి. మా నాన్న అమ్మలలాగా జీవితాన్ని ప్రేమించి అనుక్షణం ఆ అనుభవాన్ని ఆస్వాదించి ఆనందించాలనుకునే వారికి జీవితకాలం సరిపోదు. వాళ్ళకి అన్ని విషయాలపైనా ఆసక్తి. అలా వారికి జీవితమంటేనే ఓ అడ్వెంచర్, అన్వేషణ అయ్యింది. వాళ్ళలాగా ఉండగలనా అన్నదే నా సందేహం" అన్నాడు.

మోహన్ వాళ్ళావిడతో, నేను మా ఆవిడ అలా కబుర్లు చెప్పుకున్నాం. వాచీ చూసుకున్నాను. మరో అయిదు నిమిషాలు ఉన్నాయనుకుంటాను. బయలుదేరాలని అల్లుడు, అమ్మాయిని తొందర చేయడం మొదలుపెట్టాడు.

ఆడుతున్న పిల్లల నుంచీ దృష్టి మళ్ళి, రెస్ట్ఏరియా పేరు మీద పడింది. మెటల్ ప్లేటో పైన 'స్వాన్‌రివర్' రెస్ట్ఏరియా అని చక్కగా అక్షరాలు ఎంబాస్ అయ్యి ఎక్కువ లాండ్‌స్కేప్‌తో ఇమిడిపోయాయి.

మోహన్ చూస్తే ఇక్కడ పెరిగి పెద్దవాడయ్యాడు. తెలివైనవాడే నా మదిలోను ఇంతవరకు తొలుస్తున్న సందేహాన్ని తీర్చగలడనిపించింది! స్వాన్‌రివరంటే నాకు ఎందుకో పరిచయమైన పేరనిపిస్తుంది. ఈ రెస్ట్ఏరియాకు రావడం ఇదే మొదటిసారి. 'నీకేమయినా స్వాన్ రివర్ గురించి తెలుసా' అన్నాను.

"ఇదో చిన్న వంక.. అంతకంటే ఏముందండి"

ప్రక్కన మా ఆవిడ. మోహన్ వాళ్ళావిడ వాళ్ళ సంభాషణలో పడిపోయారు.

"మీకు ఇంగ్లీష్ లిటరేచర్ అంటే ఇష్టమా?" మోహన్ ముఖంలో మెరుపుతో అన్నాడు.

"ఆ ఇష్టమే. తెలుగు, ఇంగ్లీషు ఏ సాహిత్యమైనా తెగ ఇష్టం. నీకు తెలుసా. నాకు సాహిత్యం పైన ఆసక్తి కలిగించింది మీనాన్నే. తన దగ్గర బోలెడన్ని పుస్తకాలుండేవి. వాటి గురించి మా పిల్లలకి చెప్పేవాడు కూడా" అన్నాను.

"అవునండి చిన్నప్పుటి నుండి మా ఇంట్లో పుస్తకాలు పిచ్చిగా ఉండేవి. ఆయన అరవై ఐదు ఏళ్ళకి రిటైరయ్యిన తరువాత ఇంగ్లీషు లిటరేచర్ పై డాక్టరేట్ చేసారు తెలుసా."

ఆశ్చర్యం వేసింది నాకు. కానీ విచ్చు మామయ్య అలాంటి వారే అనిపించింది.

"నాన్నగారి దగ్గర బోలెడన్ని పుస్తకాలు ఆ రిసర్చ్‌కని ఉండేవి. నేను నాన్న దగ్గరకి సెలవులకు వెళ్ళినప్పుడు అలా టేబుల్ మీద పడేసిన పుస్తకాలు తీసుకుని చదివేవాడ్ని. అందులో ఒకటి 'స్వాన్‌రివర్ అంథాలజీ.."

"ఎడ్గర్ మాస్టర్స్ రాశాడు కదా ఆ పుస్తకాన్ని.." మోహన్ మాటలు పూర్తి చేశాను నేను. మిస్టరీ ఒక్క క్షణంలో విడిపోయింది. పెద్ద రిలీఫ్ అనిపించింది. అందుకే ఈ పేరు ఇంత పరిచయంగా ఉంది.

"అవునండీ. ఆ పుస్తకం చదివి నేను ఆశ్చర్యపోయాను. కథ చాలా వైవిధ్యంగా ఉండి ఓ 90 ఏళ్ళ క్రితం అలాంటి ఆలోచనలతో అప్పటికే ఓ పుస్తకం వచ్చేసిందంటే నమ్మ బుద్ధి కావడంలేదు. "

మోహన్ చెప్పింది నిజమే స్వాన్‌రివర్ గ్రామంలో చనిపోయిన వారి సమాధులపైన చెక్కిన పేర్లుగల 242 మంది పద్యాలతో తమ జీవిత కథలను పాఠకునికి వివరిస్తారు. చనిపోయారు కాబట్టి వారి కథలు సూటిగా నిర్మొహమాటంగా ఉంటాయి. ఆ పద్యాలలో ఒక జీవికి మరో జీవితో ఎలా బ్రతుకు ముళ్ళు పడ్తాయో తెలుస్తుంది. ఒకాత్మకు తనకు జీవితంలో కలిగిన ప్రశ్నకు మరో ఆత్మ జీవన కథలో దొరకడం, సంతోషం, దుఃఖము, మోసం, దగా, మంచితనం, గొప్పతనం, హుందాతనం అన్ని రకాల నవరసాలు గురించిన పుస్తకం అని.

మేము అలా సాహిత్యం మీద మరికొన్ని నిమిషాలు మాట్లాడుకుని అమ్మాయి అల్లుడు దూరం నుంచే చెయ్యి ఊపడంతో మోహన్ దగ్గర ఫోన్ నెంబర్లు తీసుకుని వీడ్కోలు తీసుకున్నాము.

ఈసారి అమ్మాయి డ్రైవ్ చేస్తున్నది. అల్లుడు పిల్లల దగ్గర ఆడుకోవాలని వెనక సీటుకి వచ్చేసాడు. అమ్మాయికి కంపెనీకని డ్రైవర్ పక్క సీట్లో కూర్చున్నాను. అమ్మాయి కబుర్లు చెపుతూనే ఉంది. రెస్ట్ ఏరియాలో చీకట్లు కమ్ముకున్నాయి. రోడ్లు పక్కనున్న పూలు పిచ్చిగా పూసి గడ్డి పచ్చదనాన్ని ఊదా రంగుతో మార్చేసాయి. మధ్య మధ్యలో మేము ఉన్నామంటూ ఎరుపు, పసుపు రంగు పూలు ఏపుగా ఎదిగిన మొక్కల చివర, తండ్రి భుజాల పైన కూర్చున్న చంటిపిల్లలలాగే సంతోషంగా పలకరిస్తున్నాయి. మాకు వీటన్నిటితో సంబంధం లేనట్టు కార్లు శరవేగంతో వీటి నుండీ పారిపోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

మోహన్ ఈ ప్రాంతంలోనే సెటిల్ అయ్యాడని విన్నాను. విచ్చు మామయ్య అంత్యక్రియలు ఇక్కడే జరిగాయా? ఆయనకి ఈ 'స్వాన్‌రివర్' స్మశానంలో కథలో ఉన్న 242 మందితో పాటు ఓ సమాధి కట్టించారా?.. ఇప్పుడు మాట్లాడింది మోహనా, విచ్చు మామ్మయ్యనా? లేక మోహన్‌ని మీడియంగా తీసుకుని నా మెదడులో ఇన్ని ఏళ్ళు పొదిగి ఉన్న ప్రశ్నకు విచ్చు మామయ్య సమాధానం ఇచ్చాడా? మీడియం అంటే గుర్తొచ్చింది "గోస్ట్ సినిమాలో వూఫి గోల్డ్ బర్గ్" ఎంత చక్కగా నటించింది కదూ - నా ఆలోచనా తరంగాలకి చెలియలి కట్ట లేదు....

# వినాయక వ్రతకల్పము

## ప్రియ ఆరిరాల



**ఫోను మ్రోగింది. ఎవరూ ఆన్సరు చేయలేదు.** ఆన్సరింగ్ మెషిన్‌కి కాల్ డైవర్ట్ అయింది. "యు హేవ్ రీచ్డ్ అయ్యలాస్, ప్లీజ్ లీవ్ ఏ మెసేజ్ ఎండ్ వీ విల్ గెట్ బేక్ టు యు సూన్" అనే లోపునే అవతల వ్యక్తి ఫోన్ పెట్టేసాడు. ఇదేనండి అయ్యల సోమయాజులవారి కుటుంబం. ఫోను ఎందుకు ఎత్తలేదంటే వారందరూ వినాయక వ్రతం చేసుకోవడనికి సిద్ధపడుతున్నారు కాబట్టి. ఇంటాయన పేరు సేమీ. అదే తాను ఎంచుకున్న వ్యవహారిక నామం. తల్లిదండ్రులు పెట్టిన పేరు అయ్యల సోమయాజుల హరి హర హిరణ్య గర్భ త్రిమూత్యాత్మక వీరవేంకట సత్యనారాయణ స్వామి. ఎన్నో నోముల వ్రతాల వలన పుట్టాడు కాబట్టి ఎంతో మంది దేవుళ్ళ పేర్లు, ఇంకా తాతగారి పేరు కలిపి చాంతాడంత పేరు కుదిరింది.

సేమీ ముస్తాబయి లక్షణంగా పంచ కట్టుకున్నాడు. తన కొడుకు, వేస్, అదే! శ్రీనివాస్‌ను పంచ కట్టుకోమని బ్రతిమలాడుకుంటున్నాడు. చివరకు లుంగీకి పంచకి మధ్యరకం కట్టుకు ఒప్పుకుని వేయించుకున్నాడు తండ్రి చేత. ఈ తతంగం అంతా అయ్యాక సేమీ వంట గదిలోకి వెళ్ళి కుడుము, ఉండ్రాళ్ళు తయారయ్యేనా అని చూడటానికి వెళ్ళాడు. అక్కడ పులిహోర, దద్దోజనం, పటేల్ వాడి స్టోరు నుంచీ తెచ్చిన కొన్ని ఉత్తరభారత స్వీట్లు తప్ప ఇంకేమీ లేవు. వెంటనే గబగబా సతీమణీ దగ్గరకు వెళ్ళాడు. "కుడుములు, ఉండ్రాళ్ళు లేకుండా వినాయక చవితేవిటి? నీకు తెలీదా?", అని అడిగాడు ఆవేశంగా. "వాటెవర్‌ర్ర్." అంది మీనా వినీ వినిపించకుండా, లంగాకి జారుముడి జారిపోయేలా వేసుకుంటూ. "నీ కర్థం కావటంలేదు. ప్రతీ పండుగకు కొన్ని పిండివంటలు ప్రత్యేకించి ఉంటాయి. ఎందుకంటే ఇలాగైనా నాలాంటి వాళ్ళు ఏడాదికి ఒక్కసారైనా ఆయా వంటలు రుచిచూసే భాగ్యం దక్కుతుందని," అని ఆవేశంగా వివరించుకుంటున్నాడు భార్యతో.

"ఇఫ్ **యూ** వాంట్ ఇట్, **యూ** డూ ఇట్," అంది కోపంగా కట్టుకున్న చీర బొడ్డు కిందకి సవరించుకుంటూ. ఒక్కసారిగా విజయనగరానికి సేమీ మనసు మళ్ళింది. పూర్వం గుర్తుకొచ్చింది. చిన్నప్పుడు అమ్మ చుట్టూ తిరుగుతూ, అమ్మ ఎక్కడికెళితే అక్కడికి వెంట తిరుగుతూ, వంటింట్లో అమ్మ వండుతూంటే వేరుసెనగ పప్పులు తింటూ అక్కడే కూర్చుంటే, నాన్నగారు "వంటింట్లో నీకేం పనిరా! ఆడంగి వెధవా!" అన్న తిట్లు జ్ఞాపకం

వచ్చింది. తన మీద తానే జాలి పడుతూ "ఇక్కడే పుట్టి పెరిగిన నిన్ను పెళ్ళి చేసుకుని నేను చాలా తప్పు చేసాను. ఇదే పరిస్థితి వేస్‌కు రాకుండా జాగ్రత్త పడాలి!" అనుకున్నాడు తనలో తాను. సరే, పూజా పునస్కారం ముందు ముఖ్యం అనుకుని పూజకి అందరూ కూర్చున్నారు. పెళ్ళైన కొత్తలో ఏదైనా పండుగ వస్తే సేమీ ఇంటికి ఫోన్ చేసి, స్పీకర్ ఫోనులో పెట్టి, వాళ్ళ నాన్నగారు వ్రతం చదువుతూంటే ఇక్కడ వీళ్ళు పూజ చేసుకునేవారు. కానీ, తరువాత ఇంటర్నెట్‌లోనే పూజలు వ్రతాలు వచ్చేశాక, పూజ డౌన్‌లోడ్ చేసుకుని పూజ చేసుకునేవాళ్ళు ప్రతీపచ్చానికి. గత ఏడాదే, ఏడేళ్ళ తరువాత ఇండియా వెళ్ళినప్పుడు అన్ని వ్రతాల పుస్తకం ఒకటి కొని తెచ్చుకున్నాడు సేమీ. కాబట్టి ఈ పండుగకు మాత్రం తానే వ్రతం చదువుకుని చేసుకుందామనుకున్నాడు. ఆ ముందు రోజే నర్సరీకి వెళ్ళి పూజకు కావలసిన పుష్పాలు పత్రి కొనుక్కుని వచ్చాడు. చిన్నప్పుడు వాళ్ళ నాన్నగారితో తోటలోకి వెళ్ళి పూజకు కావలసినవి కోసుకోవడం సేమీకి బాగా గుర్తుంది. పూజకు కావల్సిన అన్ని సామాగ్రీ తయారు చేస్తోంది. "ఉండ్రాళ్ళు లేక పోతే ఎలా?" అన్నట్టు మీనా వైపు ఏదో తప్పు చేస్తున్నట్టు చూశాడు సేమీ. మీనా కూడా తన వంతు సాయం చేస్తోంది. సొణుక్కుంటూ గొణుక్కుంటూ ఇంటర్నెట్‌లో రెసిపీ కోసం వెతికి కుడుములకి ఉండ్రాళ్ళకి కావలసిన సామాన్లు సిద్ధం చేసింది. వేస్ సాయంతో ప్రసాదం సిద్ధమైంది.

అందరూ పూజకు కూర్చున్నారు. సేమీ పుస్తకం పట్టుకుని పూజా విధానం మరియు నామాలు చదువుతూంటే మీనా, వేస్‌లు పత్రి, పుష్పం అక్షింతలతో పూజ చేస్తున్నారు. మధ్య మధ్యలో వాచీ చూసుకుంటున్నాడు వేస్. సేమీకి ఒళ్ళు మండిపోతోంది. అయినా పూజ సాగిస్తున్నాడు. పూజ మొదలైన పావుగంటకే మీనా కాళ్ళు నొప్పెడుతున్నాయంటూ కాళ్ళు మడవడం, జాపడం చేస్తూనే ఉంది. మధ్యలో వేస్ సేమీసెల్ ఫోన్ తీసుకుని ఏదైనా గేమ్ ఆడుకోబోయాడు. గబుక్కుమని ఫోను లాగేసుకున్నాడు సేమీ, వేస్ చేతిలోంచి. "ఈ అమ్మా కొడులులు తిన్నగా ఒక గంట సేపు కుదురుగా ఉండలేరు!" అని అనుకుంటూ నామాలు చదవడం పూర్తిచేశాడు. ఇంతలో వినాయక వ్రత కథ సమయమాసన్నమైంది. వేస్ ముఖం కొంచెం వికసించింది. "వినాయక వ్రత కథా సమయం అంటే అర్థం పూజకు ఆఖరు ఘట్టం అని తెలుసు భడవకి" అని తనలో తాను నవ్వుకున్నాడు సేమీ. ఇంతవరకు గ్రీకు లాటిన్ లా అనిపించిన పూజా పునస్కారాలు, ఇప్పటినుంచీ తెలుగులో ఉంటుందని, కొద్దో గొప్ప అర్థం అవుతుందని వేస్ ఉత్సాహం. గంటన్నర సేపు పూజ కదా అని, ధూపం ఎక్కువయితే అలారమ్ మ్రోగి ఎక్కడ ఫయిర్ ఇంజిన్ వస్తుందోనని ఏసి ఆపేసి, కిటికీలు తెర్చి పూజ చేసుకుంటున్నారు. అందుకు మీనా చెమటలు కక్కుకుంటూ కస్సు బుస్సు అంటోంది వినీవినిపించకుండా. అదంతా తాను వినపడనట్లు పూజ, కథ యధాప్రకారం సాగిస్తున్నాడు సేమీ, తన నాన్నగారిని, వారి పద్ధతిని జ్ఞప్తియందుంచుకుంటూ. ఇందాక "పత్తితో దీపం వెలిగించవలెను" అని సేమీ చదివితే, మీనా, "సేమీ! రా, నువ్వూ ఒక చెయ్యి వెయ్యి" అంది. "పత్తి అంటే దూది, భర్తకాదు" అని చెప్పిన తంతు సేమీకి మళ్ళీ ఇప్పుడు గుర్తొచ్చి అమాయకురాలైన తన భార్య వైపు ప్రేమగా చూసి నవ్వుకుని కథ చదువుతున్నాడు. ఇంతలో విఘ్నేశ్వరుని శిరఃఖండన గురించి చదవగానే వేస్ ఒకసారిగా సావధానంగా వినడం మొదలు పెట్టాడు. తరువాత ఏనుగు ముఖం తెచ్చి అతికించడం, పాములతో కడుపు కుట్టడం వంటి ఘటనలు కూడా ఎంతో జాగ్రత్తగా విన్నాడు. సేమీకి అర్థమవట్లేదు వేస్‌కు ఇంత బుద్ధి ఎప్పుడొచ్చిందా అని.

పూజంతా అయ్యాక మీనా వచ్చి, "ఈ చెమట పట్టి వర్క్ అవుట్ చేసినట్టుంది నాకు. ఐ ఫీల్ రియల్లీ రిలాక్స్‌డ్ మనం గుడికి తరచు వెళదాం ఇకనుంచీ" అంది సేమితో ఓ ముద్దుపెట్టి. వేస్ తరవాత ప్రసాదం

తింటున్నప్పుడు, "డేడ్‌గారు, ఐ విల్ నోట్ ఈట్ లైక్ వినాయక. ఐడోంట్ వాంట్ మై స్టమక్ టు బి సూడ్ విత్ స్నేక్స్" అని చెప్పి ప్రసాదాన్ని మొట్టమొదటిసారి ప్రసాదం మోతాదులో సేవించేసరికి, సేమీకి తెలియని ఆనందం కలిగింది. తాను దేవుడి దగ్గర చదివిన చాంతాడంత కోరికల లిస్ట్‌లోంచీ అప్పుడే రెండు తీరిపోయాయి అని ఎంతో ఆనందించాడు.

వాళ్ళు ఓ మోస్తరుగా చేసుకున్న పండుగ గురించి. ఇంకా ఇండియాలో వాళ్ళ అమ్మగారింట్లో అక్క, చెల్లి వచ్చి కుటుంబ సమేతంగా ఎలా జరుపుకున్నారో అన్న కుతూహలం ఎక్కువైపోయి ఇండియాకి ఫోను చేశాడు సేమీ. వాళ్ళ నాన్నగారు, ఇంకా అందరూ హైదరాబాదులోనే ఉంటారు. సీనియర్ అయ్యల సోమయాజులగారింట్లో ఫోను మ్రోగింది.

ఫోను ఎత్తుతూనే," అబ్బాయ్! ఇప్పటికి ఆరుసార్లు ఫోను చేశావ్. చేసిన ప్రతిసారీ మీవీధి చివరే ఉన్నాం అంటున్నావు. ఏవిటి సంగతి? అసలేం జరుగుతోంది?" అన్నారు నాన్నగారు. సేమీ, "నాన్నగారు, నేను స్వామిని! అమెరికా నుంచీ" అన్నాడు సేమీ. "ఓ నువ్వట్రా! ఎదోలా ఉన్నావు?" అని అడిగారు నాన్నగారు." బాగానే ఉన్నామండి. ఇప్పుడే పూజ చేసుకుని ప్రసాదం కూడా సేవించాం" అన్నాడు. సేమీ. "షికాగోలో డెవాన్ స్ట్రీట్‌లో అందరం మనరకం బట్టలు కొనుక్కుని వేసుకుని పూజ చేసుకున్నాం. పొద్దున్నే లేచి ప్రసాదం కూడా ముగ్గురం కల్సి చేసుకున్నామండి. వేస్ అయితే పంచె కూడా కట్టుకున్నాడు. ఏదో మీరు నా చిన్నతనంలో చేయించినంత బాగా కాదనుకోండి గానీ ఓ మాదిరిగా మేమూ ఇక్కడ వినాయక చవితి పండగ బాగానే చేసుకున్నాం. సాయంత్రం మాలాంటి భారతీయులందరం కలసి గుడిలో పూజచేసుకుంటాం మళ్ళీ. అప్పుడు అక్షింతలు వేసుకుని చంద్రుణ్ణి చూస్తాం. ఇదీ ఇవాల్టి ప్రోగ్రామ్. ఈ పండుగ శనివారం పడినందుకు చాలా బాగా కుదిరింది అంతా!" అన్నాడు సేమీ తండ్రితో, "ఇంతకీ మీ పూజ అయిందా? అందరూ ఏం చేస్తున్నారు?" అని అడిగాడు.

"అదా! నీకు చాలానే చెప్పాలి. నిన్న రాత్రి మీ అక్కా, చెల్లీ, బావగార్లు, పిల్లలూ అందరూ కలిసి సెకండ్ షోకి వెళ్ళారు. అదయ్యాక తాజ్‌లో మిడ్‌నైట్ బిరియానీ బఫే ఉంటే వెళ్ళి తెల్లవారు ఝామున రెండు గంటలకి వచ్చారు. అదే మాపున మూడు గంటలకి మంచినీరు వస్తుంది కదా కొళాయిలో, బిందెలు అన్నీ నింపేసి మూడున్నరకు పడుకున్నారు. ఉదయం అందరూ లేచేసరికి పదిన్నర అయింది. మీ అమ్మ ఉండ్రాళ్ళు చేసింది ఉదయాన్నే లేచి. వీళ్ళందరూ లేచి తయారై స్నానాలు చేసేసరికి పన్నెండైంది. ఇంతలో ఈటీవీ వాళ్ళు "ఇలియానా"తో ఇంటర్వ్యూ ప్రసారం చేశారు. ఒక్కరూ కదల్లేదు టీ.వీ ముందునుంచీ. అందరూ అతుక్కుపోయారు, మీ అమ్మతో సహా. నేను మరీ షంటడం మొదలు పెడితే ఒంటిగంటకు బాధగా సిద్ధపడ్డారు పూజకు. తీరా చూస్తే మూడు వరకు వర్జం ఉంది. అందరూ ఎగిరి గంతేసి మళ్ళీ టీ.వీకి అతుక్కుపోయారు. సినిమా రౌండప్, టాప్‌టెన్ సినిమా, కొత్త సినిమా గురూ, ఇలాగ అన్నీ చూసుకుని మూడుకు కూర్చున్నాం పూజకు. తీరా పూజంతా అవకుండానే ఆకలి అందరికీ బాగా ఎక్కువైపోయి "కట్టె, కొట్టె, తెచ్చె, అన్నట్టు కథ చదివేసి ఏదో అయిందనిపించేశాం. మళ్ళీ వీళ్ళందరూ జెమినీ టీవి వారు "స్టేట్‌రౌడీ" సినిమా వేస్తే టీ.వీ.కి అతుక్కుపోయారు. ఉదయం పూజే సాయంత్రం నాలుగుకు అయిందంటే, వీళ్ళతో పెట్టుకుంటే సాయంత్రం చదవాల్సిన కథ ఇంకెప్పుడు పూర్తవుతుందోనని, నేనే చేసేసి వాళ్ళ మీద అక్షింతలు మాత్రం జల్లుదామనుకున్నా." అని నాన్నగారు చెప్పారు.

సేమీకి అసలు ఏమీ అర్థం కాలేదు. "పోనీ లెండి వచ్చే ఏడాది బాగా శాస్త్రోక్తంగా చేసుకోవచ్చు. ఈ ఏడాదికి అయిపోయింది కదా!" అన్నాడు. దానికి నాన్నగారు, "ఏదీ ఎక్కడయింది? అప్పుడు అయిదు గంటలకు స్నానం చేసి

సాయంత్రం కథ చదువుదామనుకుంటే నీళ్ళు కాస్తా అయిపోయాయి. వాటర్ టాంక్‌ను ఫోను చేసి పిలిపించాం. వాడు ఇదిగో వస్తా. అదిగో వస్తానంటున్నాడు తప్ప ఇప్పటికింకా రాలేదు. రాత్రి తొమ్మిది కావస్తోంది. ఇంకా కథ చదవలేదు. వాడు ఇంకో మూడు గంటలు ఆలస్యం చేస్తే కథ చదవనే అక్కర్లేదు. చవితి కాస్తా వెళ్ళిపోతుంది. నీలాపనిందల బాధ ఉండదు." అన్నారు.

సేమీ అవాక్కయ్యాడు. ఏమిటిదంతా అనుకున్నాడు. ఏమందామా అని అనుకునేలోపల అమ్మ, అక్క, చెల్లి, బావగార్లు, పిల్లలూ ఫోను మీద పడి లాక్కుని, "స్వామి, ఎలా ఉన్నావు, నాకు ఈసారి నువ్వు వచ్చినపుడు మంచి చెవి మిషన్ తేవాలిరా, టీవీలో మాటలు సరిగ్గా వినిపించట్లేదు." అని అమ్మ, ఇంతలో అక్క అమ్మ చేతిలోంచి లాగేసుకుని, "ఒరేయ్! బావున్నావా! ఇక్కడ ఒక సీరియల్‌లో హీరోయిన్ అయితే అచ్చు మన మీనాలా ఉంటుందిరా. ఎప్పుడు చూసినా మీనాయే గుర్తొస్తుంది" అని అంటుంటే చెల్లి ఫోను లాగేసుకుని, "అవునురా మన మీనాలాగే ఈవిడకు కూడా వంట చేయటంరాదు." "అబ్బ, నువ్వేమాట్లాడేస్తావా? బావగారు, ఎలా ఉన్నారు? ఎప్పుడు చెప్పానండి డిజిటల్ కెమేరా పంపమని, ఇంతకీ ఎప్పుడు పంపడం వీలవుతుంది?" అని పెద్ద బావగారు, "నాకు కూడా! బావగారు" అని చిన్న బావగారు, ఒక తుఫానులా మాట్లాడేసి అందరూ వెళ్ళిపోయారు. సేమీకి అర్థంకావట్లేదు.

"నాన్నగారు, ఇంకా మాట్లాడమనండి, అప్పుడే ఫోను మీకిచ్చేశారేంటి?" అని ఆతృతగా అడిగాడు. "సినిమా మధ్యలో కమర్షియల్ బ్రేకు వస్తే నీతో మాట్లాడడానికి వచ్చారు. సినిమా మళ్ళీ మొదలైపోయింది కదా, చూడటానికి టీ.వీ చుట్టూ మూగారు. ఇంకో పదిహేను నిమిషాలు నువ్వు మాట్లాడితే మళ్ళీ వస్తారు మాట్లాడటానికి" అన్నారు నాన్నగారు.

సేమీకు చిర్రెత్తుతోంది వాళ్ళ వాలకం వింటుంటే. "సరే అయితే, నేను ఇంక ఉంటా మరి. టీ.వీ ఛానెల్స్ స్కెడ్యూలు చూసుకుని మీకు వీలైనప్పుడు మళ్ళీ పిలుస్తాలే. స్టేట్‌రౌడీ చూసుకోండి" అన్నాడు చిరాకుగా.

"స్టేట్ రౌడీయా పాడా! జెమినీ టీ.వీ వాళ్ళు పోటీగా ముఠామేస్త్రి వేస్తున్నారు. మాటీవీ వాళ్ళు కొండవీటి దొంగ వేస్తున్నారు. లోకల్ కేబుల్ ఛానల్ వారు ఏకంగా జైచిరంజీవ వేస్తున్నారు. ఈ ఛానల్ నుంచీ ఆ ఛానల్‌కు మారుస్తూ ఏదీ చూడకండా అన్నీ చూసేస్తూ మా ప్రాణాలు తోడేస్తున్నారు. ఇందాక నీ అదృష్టవశాత్తు నాలుగింట్లో ఒకేసారి బ్రేకు రావడం వల్ల అందరూ వచ్చి మాట్లాడారు." అని అనేసరికి సేమీ మొహం తెల్లబోయింది. షాక్ తిన్నట్టు కూర్చున్నాడు. స్పీకర్ ఫోన్ ఆపేసి నవ్వుకుంటూ మీనా వెళ్ళిపోయింది. ఇదంతా పట్టించుకోకుండా వేస్ టీవీలో బాస్కెట్‌బాల్ గేమ్ చూస్తూ "గో స్పర్స్ గో" అని అరుస్తున్నాడు ఆటలో లీనమై.

***

# కౌగిలి కార్పణ్యం...

సి. స్వర్ణకుమారి



రుణగ్రస్తుడు ముఖానికి పులుముకున్న పల్చటి, దుర్భలమైన అభిమానం నిలదీసే రుణదాత ముందు ఇగిరిపోతున్నట్టు - పొగమంచు పొర ఎక్కి వస్తున్న పొద్దును చూసి నెమ్మది నెమ్మదిగా కనుమరుగవుతోంది. పేరు మోసిన తెలుగు టీవీ ఛానెల్‌లో జన్మదిన శుభాకాంక్షలు కార్యక్రమం వస్తోంది. ఒకే కప్పు కింద బతికే వాళ్ళయినా పెళ్ళాం మొగుడికీ, తల్లి బిడ్డకీ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలపడానికి చిత్ర విచిత్ర యాంత్రికాభినయాల యాంకర్లను ఆశ్రయించే దరిద్రాన్ని చూసి నాకు కంపరమెత్తుతుంది. అయినా నా కిష్టమైన పాట వస్తుండటంతో వింటూ కూర్చున్నాను. వంటింట్లోంచి ‘ఠంగు‘ మంటూ గిన్నెలు నేలపై పడ్డ చప్పుడు వినిపించింది. చటుక్కున వెళ్ళి చూసేసరికి గ్యాస్ స్టౌవ్ పక్కన వంట దిమ్మెపై ఉండాల్సిన పాల గిన్నె కింద పడి ఉంది. ఒలికిన పాలను నాకుతున్న నల్ల పిల్లి బయటి కురికింది. లీటర్ పాలు నేలపాలయ్యాయి. ఉసూరు మంది. ఆదివారం కావడంతో మా అమ్మాయి మహిజ ఇంకా నిద్ర మంచం మీదే ఉంది. అది పాలు తాగనూ లేదు, మేము టీ నీళ్ళు తాగనూ లేదు. ఆ పిల్లి నా చెమటనూ, నెత్తురునూ జుర్రుకోవడానికి శపథం చేసి సాధించి చూపుతున్న శత్రువులా దాపురించింది.

"ఏం చేస్తాం, పాల ప్యాకెట్ తేక తప్పదు. ఏడు రూపాయలు దండగ. ఎవరు తిన్నట్టు?" అనుకుంటుండగా - స్నానం చేస్తున్న  లక్ష్మి అరుపు బాత్‌రూమ్‌లోంచే వినిపించింది "ఏమైందండీ?" అంటూ.

"ఏముంది - నల్ల పిల్లి మళ్ళీ నిర్వాకం చేసింది. పాలగిన్నె పడగొట్టింది"

"చూస్తూ ఉండండని చెప్పానా - మీరేం చేస్తున్నారు? ఆ పిల్లి ముండ కొంపకి శనిలా దాపురించింది. ఈ పీడ ఎప్పుడు విరగడవుతుందో?" బాత్‌రూమ్‌లోంచే ఆక్రోశించింది లక్ష్మి.

"మందు పెడదామంటే  పాతకం చుట్టుకుంటుందన్న భయం. దీని ఆగడాలు ఇంకెన్నాళ్ళు భరించాలో?" బయటికి వస్తూనే అంది లక్ష్మి. ఇంట్లో ఏ మూలైనా చీమలు గుంపుగా కనిపిస్తే గుప్పెడు మందు గుమ్మరించి సామూహికంగా హతమార్చేస్తుంది. బొద్దింక కనిపిస్తే చాలు - ముతక చీపురుతో ఒక్క బాదు బాది చంపేస్తుంది. చేపల పులుసన్న మాట వింటేనే తన నోట్లో నీళ్ళూరుతాయి. అలాంటి మనిషి నిత్యం చీకాకు పెడుతూ, మనసుకు కుదురు లేకుండా చేసే పిల్లి విషయానికి వచ్చేసరికి పాతకమంటూ భీతిల్లుతుంది. ఈ పిల్లి వల్ల మా నెల బడ్జెట్ పరోక్షంగా పెరిగిపోతోంది. ఎన్నిసార్లు పాలను నేల పాలు చేసిందో, ఎన్నిసార్లు గిన్నెల మీది మూతలు పడగొట్టి ఎంగిలి చేసి వండిన వాటిని పెంటపై పారేసేలా చేసిందో! నేను ఒకసారి మందు పెట్టడానికి తయారైతే కాళికావతారమెత్తి చర్రున లేచింది.

"ఏమనుకుంటున్నారు మీరు? మీకు నమ్మకాల్లేకపోవచ్చు. ఈ ఇంట్లో మాత్రం అలాంటి పాపిష్టి పనికి నేను ఒప్పుకోను గాక ఒప్పుకోను. ఒకళ్ళు చేసింది మరొకరికి కొడుతుందంటారు." కలవరపాటుతో మా అమ్మాయిని పొదివి పట్టుకుంటూ ఖండితంగా చెప్పింది. మనుషుల ఆలోచనల్ని, పనుల్నీ సాంప్రదాయకమైన విశ్వాసాలు ఎంతలా శాసిస్తాయో కదా! ఈ విడ్డూరపు జీవ కారుణ్యానికి మూల కారణమదే కదా! నిజానికి పిల్లిని మందు పెట్టి చంపినా - అది మన పెరట్లోనూ, ఇంటి వాకిటో పడి చస్తే తొలగించాల్సిన చీకాకు తప్ప - చట్టపరంగా గానీ, మరోరకంగా గానీ ఎలాంటి తంటా ఉండదు. గుడి కట్టించినా పిల్లిని చంపిన పాపం నివృత్తి కాదని నమ్ముతారు. మరదే పిల్లులు బొద్దింకల్లా, చీమల్లా వందలు, వేలుగా పెరిగిపోయి ప్రాణాంతకంగా మారినా ఇంతే సహనం వహించగలరా మనుషులు? విరక్తిగా నవ్వుకుంటూ సైకిలేసుకుని పాల ప్యాకెట్ తేవడానికి బయల్దేరాను. ఏడు రూపాయలిచ్చి ప్యాకెట్ తీసుకుంటుంటే - 'ఆ నల్లపిల్లి ఈ పాలబూత్ వాడి అమ్మకాల్ని పెంచే ఏజెంటులా పని చేస్తోంది కదా!' అనిపించింది. ఓ ప్రైవేట్ కంపెనీలో అత్తెసరు జీతానికి క్లర్క్‌గా పని చేసే నాలాంటి వాడి కళ్ళకు నల్లపిల్లి భుతంలాగా, దాని కారణంగా బేరం పెరిగిన పాలబూత్ వాడు దాని నీడలాగా కనిపించడంలో  సబబేముంది?

వేసవి వచ్చేసింది. ఫసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినోల గురించి నాకు తెలీదు, మా రాజమండ్రిలోని అయిదు లక్షల మందిలో 99 శాతం మందికీ తెలీదు. బంగాళాఖాతంలో సునామీ భూకంపం ఎందుకు వచ్చిందో, అది భూమి రూపురేఖలను ఎలా మార్చేసిందో, దాని ప్రభావం వాతావరణంపై ఎలా ఉంటుందో కూడా తెలీదు. పర్యావరణ పరిరక్షణ గురించి గొంతులు చించుకుని మాట్లాడే నాయకులు ఆనక మినరల్ వాటర్ బాటిల్ ఖాళీ చేసి దాన్ని రోడ్లపై పారేసి పోతున్నంత కాలం ఆ లక్ష్యం ఎలా నెరవేరుతుందో కూడా తెలీదు. అటవీ శాఖాధికారులూ, మంత్రులే కలప దొంగలకు అభయమిస్తున్నంత కాలం పచ్చదనం ఇగిరి పోకుండా ఎందుకుంటుందో తెలీదు. భూమి కడుపులోని తడిని జలగల్లా పీల్చేసే, నేల మీది నీటి వనరుల్ని మురుగు కాలువలుగా మార్చే పరిశ్రమల జోలికి పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ శాఖలు ఎందుకు పోలేకపోతున్నాయో కూడా తెలీదు. మార్చి గడిచీ గడవకుండానే ఎండలు మాత్రం మండిపోతున్నాయి. ఆ వేడీ, ఉక్కపోతా మాత్రం ప్రతి ఒక్కరూ అనుభవిస్తూ 'ఉస్సు అస్సు' అంటూ ఆపసోపాలు పడుతున్నారు. ఇళ్ళు పగటి వేళ పొగముంతల్లా మారిపోయాయి. రాత్రులు అరటి పళ్ళను కావు వేసే గదుల్లా కుతకుతలాడిస్తున్నాయి. ఆరుబయట మడత మంచాలు వేసి పడుకుందామంటే దొంగల భయం, దోమల బెడదా.

నానాటికీ దొంగతనాలు ఎందుకు పెరుగుతున్నాయో, అసలు దొంగలు లేని, దొంగతనాలకు తెగించాల్సిన అగత్యం లేని సమాజం ఎందుకు సాధ్యం కావడం లేదో కూడా మాకు తెలీదు. దోమల నిర్మూలనకు నగర పాలక సంస్థ వెచ్చిస్తున్న బోలెడు సొమ్మూ ఏమవుతుందో గానీ, దోమలు మాత్రం ఆల్జీబ్రా హెచ్చవేతలా తామర తంపరగా ఎందుకు పెరిగిపోతున్నాయో తెలియదు - మా రక్తనాళాల్లోని నెత్తుటిని వాటి తొండాలకు నిస్సహాయంగా నైవేద్యంగా అర్పించటం తప్ప. ఋతువేదైనా నిత్యం దోమల బిళ్ళలకూ, చుట్టలకూ, లిక్విడ్ బాటిళ్ళకూ ఎంతో కొంత ఖర్చు పెట్టి బడ్జెట్లను బరువు చేసుకోవడం తప్ప.

ఋతువులు మారినా నల్లపిల్లి పీడ మాకు తప్పలేదు. వాతావరణం ఎంతగా ఉక్కబోస్తున్నా ఇంట్లోనే పడుకుని కిటికీలు తెరుచుకుని కాస్త ఊరడిల్లుదామంటే ఏ వేళప్పుడు నల్లపిల్లి చొరబడి ఏమి నష్టం కలిగిస్తుందోనని జంకాల్సి వస్తోంది. 'ఈ పిల్లి ముండతో వేగలేం గానీ, వంటింటి గోడలకు అరలు చేయించి మెష్ తలుపులు బిగించమనండీ ఓనర్ని' లక్ష్మి సలహా ఇచ్చింది. అయితే అడగ్గానే సదుపాయాలు సమకూర్చడానికి మా ఇంటి ఓనర్ అంత ఉదారుడేమీ కాదు. ఏటా అద్దె పెంచడానికి ఖచ్చితమైన గడువులు పాటిస్తాడు. కానీ, ఇంటికి అవసరమైన పనులూ, మరమ్మతులూ చేయిస్తానని హామీ ఇచ్చిన గడువులను మాత్రం హాయిగా మరిచిపోతుంటాడు. 'బాత్‌రూమ్ తలుపు తుప్పు కన్నాలు పడింది, కొత్తది వేయించం'డంటే వడ్రంగికి కబురు పెట్టానంటాడు. ఒకటి రెండు రోజుల్లో చేయిస్తానంటాడు. ఆ కబురు ఏళ్ళు గడిచినా వడ్రంగికి అందిన దాఖలాలు కానరావు. గట్టిగా నిలదీస్తే ఇళ్ళు ఖాళీ చేయమంటాడేమోనని భయం. ఎందుకంటే ఏటా యాభై రూపాయల అద్దె పెంచుతున్నా, సదుపాయాల మాటెలా ఉన్నా - మా కాలనీలో కెల్లా తక్కువ అద్దె చెల్లిస్తున్నది నేనే. అంతే కాదు - విశాలమైన పెరడు, పచ్చ పచ్చగా బోలెడు మొక్కలు. నాకు మొక్కల పెంపకమంటే ప్రీతి. ఇల్లు మారాల్సి వస్తే అద్దె ఎక్కడ రెట్టింపవుతుందోననీ, ఇలాంటి పెరడూ, పచ్చదనం ఉన్న ఇల్లు ఇంత చవగ్గా దొరకదనీ - రాజకీయనాయకునిలా మా ఓనర్ ఇచ్చే హామీలను అమాయక పౌరుడు నమ్మినట్టు నటిస్తుంటాను. 'అలాగేనండీ' అంటూ విధేయత కనబరుస్తుంటాను.

ఎండలు ఎంత ముదిరినా, రాత్రివేళల్లో డాబా గదులు - నిప్పులు కక్కే చైనా డ్రాగన్ మూసిన గుప్పిళ్ళలా ఎంతగా ఉక్కపోత పెడుతున్నా - ఇంట్లోనే పడకలు తప్పడం లేదు. నల్లపిల్లి బెడదతో కిటికీలు మూసుకుంటే మమ్మల్ని మేమే మగ్గబెట్టుకున్నట్టవుతోంది. భరించలేక కిటికీలు తెరిచి ఒకింత చల్లగా ఓ కునుకు తీద్దామంటే - ఆ అవకాశం కోసమే పొంచి ఉన్నట్టు వంట గదిలోంచి దాని దాడి సవ్వడి వినిపించేది. కనిపించని గుదిబండలా నిద్రమత్తు ఒంటిని ఆవరించి ఉన్నా - దిగ్గున లేచి వెళ్ళేసరికితోడు పెట్టి ఉంచిన పెరుగునో, రాత్రికి తినగా మిగిలిన అన్నాన్నో ఎంగిలి చేయనే చేసేది. చద్దన్నంలో పెరుగు కలుపుకుని తినడం మాకలవాటు. ఆ అలవాటులో ఆరోగ్యసూత్రం మాటెలా ఉన్నా ఆర్థికసూత్రం ఇమిడి ఉంది. బడ్జెట్లోంచి పొద్దుటి టిఫిన్ ఖర్చు తప్పుతుంది మరి!

పేదవాడి కోపం పెదవికి చేటంటారు. మానవ సమాజంలో ఇది ఎలాగూ వర్తిస్తుంది. కొందరు యజమానులూ, పోలీసులూ, రాజకీయ నాయకులూ, అధికారులూ దగుల్బాజీలని తెలిసినా, లోలోపల వారిని చూసి ఉమ్మేయాలనిపించినా ఎలాంటి ప్రతిఘటనా కనబరచలేం. పైపెచ్చు అలాంటి వాళ్ళు ఎదురైతే 'నమస్తే సార్!' అని వెన్నెముకను వంచేస్తుంటాం. అలాంటప్పుడు నాకు అనిపిస్తుంటుంది - 'మాలాంటి వాళ్ళ కన్న మహానటులింకెవరుంటారు? అసలు ఉత్తమ నటనకు ఇచ్చే అతి గొప్ప అవార్డుకు సామాన్యుల కన్న అర్హులెవరు?' అని. నీచులైనా శక్తివంతులు గనుక తోటి మానవుల ముందు నిస్సహాయంగా ఉండిపోక ఎలాగూ తప్పడంలేదు. చివరికి

అల్పజీవి అయిన నల్లపిల్లి ముందు కూడా నాలాంటి వాడు నిశ్చేతనంగా ఉండిపోవాలా? నాకు ఉక్రోషంతో ఒళ్ళుడికిపోయేది. ఎంత సామాన్యుడినైనా దాని అంతు చూడడం నాకు దుస్సాధ్యం కాదు. కానీ, మార్జాల హత్యా మహాపాతకం అంటూ మా ఆవిడ చూపే పాపభీతే నాకు ముందరి కాళ్ళ బంధంలా అడ్డుపడుతోంది. ఆ నల్లపిల్లికి రక్షాకవచంలా అభయమిస్తోంది.

పుట్టిన రోజు కావడంతో మా పాప మహిజను రోజూకన్న ముందే లేపి తలంటు పోసింది లక్ష్మి. తడి జుట్టుకు సాంబ్రాణి పొగవేసి చిక్కు తీసి రెండు జడలేసింది. జడల నిండా పూలదండలు తురిమింది. ముందు రోజే బూజులు దులిపి, ఇల్లూ వాకిలీ కడిగి ముగ్గులు పెట్టిందేమో ఇంటికి పండగ కళ వచ్చింది. 'నాన్నా! నా పుట్టిన రోజుకు నువ్వు సెలవు పెట్టాల్సిందే. డ్యూటీ అన్నావంటే ఊరుకోను.' ఎనిమిదేళ్ళ మహిజ కొన్ని నెలలకు ముందు నుంచే హెచ్చరిస్తూ రావడంతో మా యజమానిని ఏదో సాకు చెప్పి ఒప్పించి సెలవు తీసుకోగలిగాను. మా అమ్మాయి పుట్టిన రోజున ఇంటి పట్టునే గడపాలని నాకు మాత్రం ఉండదూ - అయితే నేను ఉద్యోగం చేసే చోట కార్మిక చట్టాల ఊసే ఎత్తరాదు. క్యాజువల్ లీవులూ, ఎర్నడ్ లీవులూ, బోనస్‌లూ, పి.ఎఫ్.లూ అసలే వర్తించవు. జీవితానికి భరోసానిచ్చే స్థిరమైన ఉద్యోగం సంపాదించలేని వాడిగా నేను మరో బిడ్డను కనదలచుకోక మహిజతో సరిపుచ్చుకున్నాను. లక్ష్మిని ఒప్పించడానికి నాకు చాలా కాలం పట్టింది.

"ఏమండీ! ఒకతే బిడ్డ అయితే ఒంటరితనంతో బాధ పడుతుందండీ. వాళ్ళ వెనకాల ఏమి ఎస్టేట్లున్నాయని మన పెద్దవాళ్ళు అయిదుగురినీ, ఆరుగురునీ కని పెంచలేదు? మనం ఇద్దరిని పెంచి పోషించలేక పోతామా? నాకూ ఇంకో బిడ్డ కావాలనుందండీ!' అంటూ బలహీనంగానే నన్ను ఒప్పించడానికి ప్రయత్నించేది. లక్ష్మి అలా అన్నప్పుడల్లా ఆమె వాదన సబబేననిపించేది. ఆమె మాతృత్వంపై నిషేధం విధించడానికి నేనెవరిని అనిపించేది. చెల్లో, తమ్ముడో కావాలనే మహిజ ఉబలాటాన్ని అణగదొక్కే హక్కు నాకెక్కడిది అనిపించేది. అయితే మరోవైపు - నా బాల్యంలో మా నాన్న పడ్డ పాట్లు విశ్వరూపంలో గుర్తుకు వచ్చేవి. ఆరుగురు సంతానం. ముసలి తల్లితండ్రులు. రెండెకరాల పొలం. వారపు సంత రోజున పిల్లలకు మిఠాయి కొనుక్కోమని రూపాయి ఇచ్చేందుకే కటకటపడే వాడు. ఏదైనా తిరణాలకు ఇంటిల్లపాదినీ తీసుకు వెళ్ళాలంటే గండం ఎదురైనట్టు కలవర పడిపోయేవాడు. ఆట వస్తువు కొనాలన్నా ఆరు కొనాల్సి రావడంతో మా ముచ్చట్లను చీవాట్లతో అణిచివేసేవాడు. ఎప్పుడైనా అరకిలో మాంసం తెచ్చినా పదిమందికీ తలో ముక్కా రావడం గగనమయ్యేది. మరో ముక్క తినాలన్న మా యావను మాలోనే చంపుకోవలసి వచ్చేది. పాపం, మా అమ్మకు ఒకోసారి ఆ ముక్క కూడా మిగిలేది కాదు. మా మహిజకు చికెన్ అంటే మహా ఇష్టం. అదొక్కతే పావుకిలో చికెన్ తినగలుగుతోంది. గతం గుర్తుకొచ్చినప్పుడల్లా ఒక్క పిల్లతో సరిపెట్టిన నా నిర్ణయం సబబేననిపిస్తోంది.

మహిజకు ఇష్టమని లక్ష్మి సేమ్యా పాయసం చేసింది. కిలో చికెన్‌తో కూరా, ఫ్రై చేసింది. వాటిని వండుతున్నంతసేపూ మహిజ వంటింట్లోనే తచ్చాడింది. "అమ్మా! ఇంకెంత సేపటికి పాయసం తయారవుతుందీ? చికెన్ కూర ఇంకా ఉడకలేదా?" అంటూ వాళ్ళమ్మను పదే పదే సతాయించింది.

"ఇంకెంతమ్మా - అయిపోవచ్చింది. ఇవి వండేశాక, నిన్ను సాయిబాబా గుడికి తీసుకెళ్ళి పూజ చేయించగానే వచ్చి తిందువుగాని" అంటూ లక్ష్మి మహిజను సముదాయించింది.

పాపకు కొత్త గౌను వేసి ముస్తాబు పూర్తి చేయగానే ముగ్గురం కలిసి కాలనీలోని సాయిబాబా గుడికి వెళ్ళాం. మహిజ పేరిట అర్చన చేయించి, దాని చేత కొబ్బరికాయ కొట్టించి, పూజారికి దక్షిణా, హుండీలో డబ్బులూ వేయించి ఇంటికొచ్చాం.

వంటింట్లోని భీభత్సాన్ని చూడగానే నిశ్చేష్టులయ్యాం. పాయసం గిన్నె కింద పడి ఉంది. చికెన్ కూరా, ఫ్రైలుండాల్సిన గిన్నెలపై మూతలు తొలిగి ఉన్నాయి. అంటే నల్లపిల్లి మళ్ళీ చొరబడిందన్న మాట. లక్ష్మి గొల్లుమంది. పాయసం జుర్రుకుని, తనవి తీరా తిందామన్న ఆత్రంతో ఉన్న మహిజ బిక్కమొహంవేసింది. నేను నిస్సహాయంగా పళ్ళు నూరుకున్నాను. పిల్లి ముండను బూతులు తిట్టుకున్నాను. అన్ని తలుపులూ, కిటికీలు బిగించే వెళ్ళామే, ఆ దెయ్యం పిల్లి ఎలా లోపలికి వచ్చిందీ అనుకుంటూ చూసే సరికి వంటింటి కిటికీ తలుపు చేరవేసి, గడియ వేయడం మరచిపోయామన్న మాట. ఇంకేముంది అదను కోసం కాచుకున్న నల్లపిల్లి తలుపు తోసుకుని లోపలికి వచ్చి వండినవన్నీ ఎంగిలి చేసి వెళ్ళింది. నా కూతురి పుట్టిన రోజు ఆనందంలో నిప్పులు పోసింది. లక్ష్మి వెక్కెక్కి ఏడుస్తూ శాపనార్థాలు పెట్టింది.

"నా ఇంటికి పట్టిన ఆ భూతాన్ని చంపెయ్యాలి. పాపం, పుణ్యం లేదు. దానికి మందు పెట్టాల్సిందే నా కూతురుకి ఎంతో ఇష్టం కదాని పాయసం చేసిం చికెన్ వండితే అది తినడానికి లేకుండా చేసిన ఆ పాపిష్టి పిల్లిని చంపెయ్యాల్సిందే" రోదిస్తూనే లక్ష్మి శపథం చేసింది.

నాకేం చేయడానికీ పాలు పోలేదు. మహిజను దగ్గరకు తీసుకుని, లక్ష్మిని ఓదారుస్తూ అన్నాను - 'సరే, చేయగలిగిందేముంది - మళ్ళీ చికెన్, పాల ప్యాకెట్ తెస్తాను. ఓపిక చేసుకుని తిరిగి వండు." కళ్ళు తుడుచుకుంటూ సరేనంది లక్ష్మి. చెప్పొద్దూ - విచ్చుకుంటున్న మొగ్గ పశువు గిట్టల కింద పది నలిగిపోయినట్టు ఇష్టంగా లొట్టలు వేసుకుంటూ తినాల్సిన వంటకాలు పిల్లి ప్రతాపంతో పనికి రానివిగా మారిపోవడంతో నిరాశతో చిన్నబోయిన మహిజ ముఖం చూస్తే నాకే కళ్ళు చెమ్మగిల్లాయి. దాని బెంగను తగ్గించడానికని నా వెంట బజారుకు తీసుకెళ్ళాను.

ఆ మరునాడు కాలనీకి దగ్గరలోని థియేటర్‌లో రెండో ఆట సినిమా చూసి ఇంటికి వచ్చాం. సమయం పన్నెండున్నర దాటింది. మహిజ మేం చూసిన సినిమానే మరోసారి కళ్ళకు కట్టినట్టు వర్ణిస్తూ చెపుతోంది. నేను ఆసక్తిని నటిస్తూ సైకిల్ పైకి ఎక్కిస్తున్నాను. నా వెనుకనే వీధి గేటు వెయ్యబోతున్న లక్ష్మి 'కెవ్వు'మంది. ఏమైందో తెలియక నేను బెంబేలెత్తిపోయాను. మహిజ అయితే ఒక్కుదుటున వచ్చి నా కాళ్ళకు చుట్టుకుంది. ఏమైందని లక్ష్మిని అడిగే లోపే పిల్లి కీచుమంటూ అరిచిన సవ్వడి వినిపించింది. మూడు కుక్కలు నల్లపిల్లిపై దాడి చేసి రోడ్డుకు అటువైపున్న ఖాళీ స్థలంలోకి ఈడ్చుకుపోతున్నాయి. వీధి లైటు వెలుగులో వాటి వేగమూ, వేట తమకమూ భయానకంగా కనిపిస్తున్నాయి. వాటికి చిక్కిపోయిన పిల్లి ప్రాణ భయంతో కీచుమంటూ అరుస్తోంది. ఆ అరుపు అలనాటి గజేంద్రుని మొరలా హృదయ విదారకంగా ఉంది.

"ఏమండీ! కర్ర పట్టుకెళ్ళి వాటిని తరిమెయ్యండీ!" కళ్ళ ఎదుట జరిగిపోతున్న ఆదిమ ఆటవిక బీభత్సానికి వణికిపోతూ వెర్రిగా అంది లక్ష్మి. మహిజ భీతితో నా కాళ్ళను వదలడం లేదు. దాన్ని విడిపించుకుని, చేతి కందిన ఊచను పట్టుకుని గట్టిగా అరుస్తూ కుక్కలను అదిలించాను. అంతవరకు కాలయముని అపరావతారాల్లా విజృంభించిన

మూడు కుక్కలూ నన్నూ, చేతిలోని ఊచనూ చూసేసరికి తోకలు ముడిచాయి. పారిపోయి దూరంగా నిలబడి అక్కడి నుంచే చూడసాగాయి.

నేను వెళ్ళేసరికే కుక్కలు నల్లపిల్లిని చీల్చి చెండాడాయి. దాని కంఠం సగం వరకు తెగిపోయింది. వళ్ళంతా గాయాలు. కంఠం నుంచీ, గాయాల నుంచీ నెత్తురు ధారలు కడుతుండగా పిల్లి దుర్భరమైన బాధతో మూలుగుతోంది. నా వెనుకే వచ్చిన లక్ష్మి నల్లపిల్లిని చూసి విలవిలలాడి పోయింది. "అయ్యో! అయ్యో! భగవంతుడా! కిరాతకపు కుక్కలు ఎంతలా కరిచేశాయో! ఏమండీ - కాసిన్ని నీళ్ళు పోస్తే ఏమన్నా బతుకుతుందేమో చూడండి" పిల్లి అవస్థను చూడలేక దాని ప్రాణం ఎలాగైనా నిలపాలని తపిస్తోంది లక్ష్మి. కళ్ళ ఎదుట క్షణాల్లో జరిగిన మారణకాండను చూసి తట్టుకోలేక పసిది మహిజ సన్నగా ఏడుపు లంకించుకుంది.

ఎవరు ఏడ్చినా, ఎవరు ఏ దేవుడిని ప్రార్థించినా నల్లపిల్లి ప్రాణం కొడిగడుతోంది. దాని వ్యథను తగ్గించి, మరణాన్ని నిరోధించడానికి చేయాల్సింది ఒకటే - దాన్ని తక్షణం పశువుల ఆసుపత్రికి తీసుకువెళ్ళడం. పిల్లి ప్రాణానికి పూచీ పడేదెవరు? దానికయ్యే వైద్యానికి బిల్లు కట్టేదెవరు? 'నాకు ప్రాణ భిక్ష పెట్టండి' అంటూ చేతులు జోడించి వేడుకుంటున్నట్టు - వెల్లకిలా పడి కాళ్ళు నాలుగూ పైకెత్తి గిలగిలా తన్నుకుంటున్న నల్ల పిల్లిని దాని మానాన దాన్ని చావనివ్వడం ఎందుకో దారుణమనిపించింది. అయితే నేను మాత్రం చేయగలిగిందేముంది? పశువైద్యుని సంతృప్తి పరిచే శక్తి నాకెక్కడిది? పిల్లిని ఆటో మీద వేసుకుని ఆసుపత్రికి తీసుకు వెళ్ళాలంటేనే కనీసం వంద రూపాయలైనా అడుగుతాడు. ఆ కిరాయే నా గుమస్తా జేబుకు బరువాయె.

లక్ష్మి చెప్పినట్టు ఇంట్లోకి వెళ్ళి బకెట్‌తో నీళ్ళు తెచ్చి నెమ్మదిగా పిల్లి మీద గుమ్మరించాను. అది ఒక్క పెట్టున మరింత బిగ్గరగా ఆర్తనాదం చేసింది. ఆపరేషన్ అవసరమైన రోగికి మాత్రతో వ్యాధి నయం కాదు. ఒళ్ళంతా ఛిన్నాభిన్నమైన పిల్లి ప్రాణం నీటి స్పర్శతో గండం నుంచీ గట్టెక్కదు. కాసేపటికి పిల్లి మూలుగు మూగపోయింది. చావుతో దాని పెనుగులాటా ఆగిపోయింది. ప్రాణాన్ని ఎలాగైనా దక్కించుకోవాలన్న తపనతో కానరాని దేవుడిని ప్రార్థిస్తూ జోడించిన చేతులు ఆ ప్రాణమే వీడిపోవడంతో విడిపోయినట్టు అంతవరకు ఒకదానికొకటి పెనవేసుకుని ఉన్న పిల్లి ముంగాళ్ళూ, వెనుక కాళ్ళూ దేనికదిగా విడివడ్డాయి. రక్తంతో తడిసిన దాని శరీరం వెల్లకిలా నిశ్చలంగా మారింది. కొన్ని క్షణాల క్రితం వరకు మా దృష్టిలో ఆ నల్ల పిల్లి మా కుటుంబంపై పగబట్టిన ప్రబల శత్రువు. అయినా దాని మరణయాతననూ, మరణాన్నీ కళ్ళారా చూశాక మా కళ్ళు చెమ్మగిల్లాయి. ఒక జీవి ప్రాణం పట్ల కలిగే ఆర్తి ముందు మా మునుపటి ద్వేషం ఆవిరైపోయింది. బరువెక్కిన హృదయాలతో ఇంట్లోకి నడిచాం. లక్ష్మి మరీ చలించి పోయింది. ఆ రాత్రి తనకు నిద్రే పట్టలేదు. నాకు రెండు మూడుసార్లు మెలుకువ వచ్చి చూసినప్పుడు పొడి కళ్ళతో మేలుకునే కనిపించింది.

"ఏమండీ! పాపం - నల్లపిల్లిని ఆ కుక్కలు పీక్కుని తినేసుంటాయేమో?" జాలి జాలిగా అంది. విచిత్రంగా గోడమీదున్న దేవుడి పటానికి నమస్కరించి చెంపలు వేసుకుంది.

"చచ్చిపోయాక పీక్కు తింటేనేం, ఇంకేం చేస్తేనేం. ఇక ఆ పిల్లి ధ్యాస మరచి నిద్రపో పిచ్చి ముఖమా!" అనునయించాను.

మర్నాడు తెల్లారకుండానే నాకు మెలుకువ వచ్చింది. లక్ష్మి ఎప్పుడూ నాకన్నా ముందే నిద్ర లేస్తుంది. అయితే కలవరంతో జాగారం చేసీ చేసీ ఎప్పుడు రెప్ప వాల్చిందో - గాఢ నిద్రలో ఉంది. ఎండలు ముదిరిపోయాక పెరట్లో మొక్కలు వాడిపోతున్నాయి. దాంతో నిత్యం నీళ్ళు పోస్తున్నాను. లేవగానే సంప్‌లోంచి బకెట్‌తో నీళ్ళు తోడే పని మొదలు పెట్టాను. సన్నజాజి అంటుకు నీళ్ళు పోసేందుకు సందులోకి వెళ్ళాను. పక్కనే పేపర్ మీద అన్నం పోగు కనిపించింది. 'ఇదేంటబ్బా - అన్నం ఇలా పేపర్లో పెట్టి ఉంది?' అనుకుంటూ చెత్తకుప్పలో పారేయడానికి తీశాను. ఘాటైన వాసన గుప్పుమంది. అది పురుగుల మందు కలిపిన అన్నం! నేను మొక్కలను ఆశించే చీడల నివారణకు తెచ్చిన మందు వాసన! ఆ సందు సాధారణంగా నల్లపిల్లి మా ఇంట్లో దాడి చేయడానికి పొంచి ఉండే తావు! అంటే లక్ష్మి రాత్రి సినిమాకి బయల్దేరడానికి ముందే నల్లపిల్లిని చంపడానికి అన్నంలో పురుగు మందు పెట్టిందన్న మాట! కన్న కూతురి పుట్టిన రోజు ఆనందాన్ని భగ్నం చేసిన నల్ల పిల్లిని ఆమె తల్లి హృదయం ఇంకెంత మాత్రం సహించలేక పోయిందన్న మాట! మార్జాల హత్యా పాతక భీతి సైతం ఆమెను అడ్డుకోలేక పోయిందన్న మాట! మందు పెడుతున్న విషయం నాకు చెప్పకుండా గుట్టుగా దాచిందన్న మాట! రాత్రి నల్ల పిలి మరణ యాతనను చూసి లక్ష్మి అంతలా ఎందుకు వణికిపోయిందో నాకిప్పుడర్థమైంది. అయితే లక్ష్మికి ఆ పాపం చుట్టుకోకుండా కుక్కలు అడ్డం పడ్డాయి. తాను మందు పెట్టిన గుట్టు రట్టయిందని లక్ష్మికి తెలిసి నా ముందు దోషిలా, పాపిలా తలదించుకోకూడదని సన్నజాజికి నీళ్ళు పోయకుండా, అన్నం పెట్టిన పేపర్‌ను యధాస్థానంలో ఉంచి సందులోంచి వచ్చేశాను.

తూర్పున పొద్దెక్కి వస్తోంది. రోడ్డుకటువైపు పిల్లి కళేబరం అలాగే పడి ఉంది. వేలాదిగా చీమలు దానిపై పాకుతున్నాయి. వేట వినోదం తప్ప పిల్లిని విందు చేసుకునే ఆలోచన కుక్కలకు లేనట్టుంది. నేను ఆలోచనలో పడ్డాను. పిల్లి చావు రాత్రి చూసినంతగా బీభత్సంగా అనిపించడం లేదిప్పుడు. లక్ష్మి దాన్ని చంపడానికి తెగించడం మీదే ఆలోచనలు తిరుగుతున్నాయి. రాత్రి దాని చావును చూసి లక్ష్మి ఎంతగా కలవర పడ్డా - బహుశా, తన చేతికి పాపం అంటకుండానే దాని పీడ విరగడ అయినందుకు ఇక నుంచీ నిశ్చింతతో ఉంటుంది. చిల్లర చిల్లరగా బడ్జెట్ బరువు పెరగదన్న సంతోషం నాకూ దక్కుతుంది కదా! నెమ్మదిగా మేము - మాచే కాగల క్రౌర్యాన్ని తాము కానిచ్చిన కుక్కలకు రహస్యంగా కృతజ్ఞతలు చెప్పుకుంటాంనేమో! ఎందుక్కాదు - వయసు మళ్ళిన తల్లితండ్రులను బడ్జెట్లను బరువు చేసే పీడగా ఎందరు బిడ్డలు భావించడంలేదూ! వారు కాలం చేసినప్పుడు బుడిబుడి ఏడ్పులు ఏడ్చి, ఖర్చు భరించి కర్మకాండలు చేసినా తరువాత మనసు లోలోతుల్లో తమకే తెలియరానివ్వనంత గుట్టుగా 'హమ్మయ్య!' అనుకోవడం లేదూ!

# ఆకాశానికి గుంజలు

శారద



సాయంత్రం ఆరు గంటల సమయం. పిల్లలంతా గోలగా వీధిలో ఆడుకుంటున్నారు. అలసిపోయినట్టున్న మొహంతో సూర్యుడు డ్యూటీదిగిపోతున్నాడు. అంతే అలసిన మొహంతో విమల కాళ్ళని చుట్టేస్తున్న పిల్లల్ని తప్పించుకుని ఇంట్లోకి అడుగుపెట్టింది.

ఎదురుగా వచ్చిన తల్లిని చూసి విప్పారిన మొహంతో, "నువ్వెప్పుడొచ్చావమ్మా?" అంది.

"ఇందాకే గంటన్నరయింది. తాళం చెవి పక్కవాళ్ళనడిగి తీసుకున్నాను. కొంచెం కాఫీ తాగుతావా?" అంటూ ఆమె సమాధానం కోసం చూడకుండానే లోపలికి వెళ్ళింది.

ఇప్పుడింటికెళ్ళి వంట చేయాలిరా దేవుడా అనుకుంటూ వచ్చిన విమలకి తల్లిని చూడగానే ప్రాణం తెరిపిన పడినట్టయింది. ఆమె అనుకున్నట్టుగానే కాఫీ తాగి స్నానం చేసి వచ్చేసరికి తల్లి, "వంటయింది నాన్నా! నువ్వు తినేస్తావా? పొద్దున్న ఎప్పుడనగా తిన్నావో ఏమో! మొహమంతా పీక్కుపోయింది చూడు" అంది.

"పిల్లలని కూడా పిలిచి, అందరం తినేద్దాం."

భోజనాలయాక తల్లి పక్కనే పడుకుని కళ్ళు మూసుకుంది విమల. ఆమె చెంపలు సవరిస్తూ, అలసిపోయిన మొహాన్ని చూస్తూ ఉంది తల్లి. తను ప్రయాణంలో ఎంత అలసిపోయినా, తన ఇల్లు కాకపోయినా, ఇంట్లోకిరాగానే వంటచేసి కడుపునిండా తిండి పెట్టి సేద తీర్చటం ఒక్క అమ్మ వల్లే సాధ్యం. అమ్మ పక్కన పడుకుని, ఆమె పొట్టపై చేయి వేసి, ఒక రకమైన భద్రతా భావాన్ని పొందుతూ ఉంది విమల.

"నాన్నా! కమల మొన్న ఆదివారం ఇంటికొచ్చింది."

"అంతా బాగున్నారా వాళ్ళింట్లో?"

"ఆ ఏం బాగులే! తను నిన్ను అడిగిన విషయం గుర్తు చేసింది. ఆలోచించావా?" లేచి కూర్చుంది విమల. ఆమె మొహం కఠినంగా మారిపోయింది. "ఒకసారి కాదు వంద సార్లు ఆలోచించాను. నా నిర్ణయంలో మార్పు లేదు. నేను స్వాతిని పెంపకానికివ్వను. ఉన్న ఇద్దరు బిడ్డల్లో ఒకళ్ళని పెంపకానికిచ్చి నేనెలా ఉంటానమ్మా?" ఉన్నట్టుండి ఆమె బేలగా మారిపోయింది.

"అవును నాన్నా! కానీ నీ పరిస్థితి కొంచెం చూసుకో. ఒంటరిగా ఇద్దర్నీ ఎలా పెంచుతావు? ఆడపిల్లని పెంచి, పెళ్ళి చేసి, ముద్దూ ముచ్చట్లు తీర్చాలంటే మాటలా? స్వాతిని కమలకి పెంపకానికిచ్చేసావంటే, చిన్నవాడు కిరణ్‌ని పెంచటం ఏమంత కష్టం కాదు. కమల నీకు పరాయిదా? నీ చెల్లెలే కదా. అందుకే అది, ఆడపిల్లని పెంచుకుంటే అక్కకి ఒక సమస్య తీరుతుంది, తనకి బిడ్డలు లేని కొరతా తీరుతుందని నిన్ను బతిమాలుతుంది."

"అవునమ్మా, కానీ నేను స్వాతిని విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేను. ఇంకెప్పుడూ ఈ ప్రసక్తి తేవొద్దు." చిరాగ్గా లేచి వెళ్ళిపోయింది విమల.

ఒక్క సంవత్సరంలో తన జీవితం ఎంత మారిపోయింది! హాయిగా అందరిలాగే ఏ చీకూ చింతాలేని జీవితం, ఉన్నట్టుండి భర్త అనంత్ ఆక్సిడెంట్‌లో కన్ను మూయటంతో, నది మధ్యలో తల్లక్రిందులయిన పడవలాగయింది. అతని ఇన్సూరెన్సు డబ్బులు వగైరాలు పిల్లలు పెద్దయినప్పుడు వాళ్ళ అవసరాలకొస్తాయని దాచిపెట్టి, తను ఉద్యోగంలో చేరింది. చుట్టూ ఉండే వారి జాలి మాటలూ, చూపులూ, భర్త పక్కన లేడన్న బెంగా అన్నిటినీ పక్కన పెట్టి ఆ ఇద్దరు పిల్లల భవిష్యత్తు గురించి మాత్రమే ఆలోచించటం అలవాటు చేసుకుంది.

చెల్లెలు కమల, పాపం దాని సమస్యలు దానికున్నాయి. పెళ్ళయి పదేళ్ళు దాటుతున్నా పిల్లలు కలగక విపరీతమైన డిప్రెషన్‌తో బాధపడుతుంది. సైక్రియాట్రిస్టు దగ్గరికెళితే, వీలయితే ఎవరినయినా పెంచుకోమని సలహా ఇచ్చాడు. అప్పటినుంచీ అది స్వాతిని పెంపకానికివ్వమని బ్రతిమాలుతుంది. చెల్లెలి పైనా, దాని భర్త ఆనంద్ పైనా తనకెలాంటి అపనమ్మకమూ లేదు. కానీ, తన స్వాతిని వదిలి తనెలా ఉండగలదు. అందరమూ ఒక్క దగ్గరే ముత్యాలముగ్గు ఉందామంటుంది కమల. అది తనకిష్టం లేదు. ఇప్పుడు సరే, ఏ పొరపొచ్చాలూ లేవు. కానీ, మనుషులు ఎప్పుడూ ఒకేలాగుండరు కదా! ఏదయినా తను స్వాతిని పెంపకానికిచ్చేస్తే తన బరువు కొంత తగ్గుతుంది నిజమే, కానీ స్వాతీ కిరణ్‌ల మధ్య సంబంధం ఏమవుతుంది? "అమ్మకి తమ్ముడంటేనే ప్రేమ, అందుకే వాణ్ణి తన దగ్గరుంచుకొని నన్ను పెంపకానికిచ్చేసింది" అని స్వాతి అనుకోవచ్చు. కిరణ్ కూడా. "అమ్మకి అక్కంటేనే ప్రేమ ఎక్కువ. అందుకే అక్కనేమో బాగా డబ్బున్న పిన్నికిచ్చేసి దాని భవిష్యత్తు భద్రపరచింది," అనుకుంటే? అసలే తండ్రి లేని పిల్లలు, వాళ్ళిద్దరి మధ్యా ఆప్యాయతా అనురాగాలు కరువైతే! వద్దు, ఉన్నదేదో తింటాం, ఎలాగో సర్దుకుంటాం, కమల ఇంకెవరినైనా పెంచుకుంటుంది.

తన మొండి వైఖరి చెల్లెల్ని ఎంతో బాధపెడుతుందని తెలుసు, కానీ తప్పదు. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు. ఆలోచనలతో ఎప్పుడో అలసిపోయి నిద్రపోయింది విమల.

"అక్కయ్యా! నేను అనాధాశ్రమం నుంచీ ఒక పాపాయిని పెంపకానికి తెచ్చుకుందామనుకుంటున్నానే," ఫోన్‌లో చెప్పింది కమల.

"వెరీ గుడ్ చాలా మంచి పని చేస్తున్నావు. ఇంతకీ పాపాయి వయసెంత? మేం చూడ్డానికి ఎప్పుడు రావాలి?" సంతోషంగా అడిగింది విమల.

"పసిపాప. పుట్టి పది రోజులే అయినట్టుంది. వదిలేయటానికి తల్లికి మనసెలా ఒప్పిందో! ఇంతకీ తల్లీ తండ్రి తెలియని పాపని పెంచుకోవటం మంచిదేనంటావా? వాళ్ళెలాంటి వాళ్ళో! ఎందుకలా పసిపిల్లని బాధ్యత లేకుండా వదిలేసారో! ఇలా పెంచుకుంటే అందరూ 'ఏమనుకుంటారో" అనుమానంగా అంది కమల.

"ఛీ! నువ్వలాంటి పిచ్చి ఆలోచనలని మనసులోకి రానివ్వకు. పసిపిల్లకి పాపమేమిటి? ఇలాంటి అనుమానాలకి మనసులో కొంచెం చోటిచ్చినా, చుట్టు పక్కల వాళ్ళు ఇంకా ఎక్కిస్తారు. ఆ పాప తల్లితండ్రులు మీరే! మనస్ఫూర్తిగా ఆ పాపని ఇంటికి తీసుకురా. మనం చేసే పని మీద మనకి నమ్మకం ఉన్నప్పుడు అంతా 'ఏమనుకుంటారోనన్న భయమే వద్దు", చెల్లెలికి నచ్చ చెప్పింది విమల.

"సరే, అయితే. ఇంకొక నెలరోజుల్లో పాపాయిని మా ఇంటికి తీసుకొస్తాను. చిన్న పార్టీలాటిది ఏర్పాటు చేసాను. వస్తావు కదూ?"

"తప్పకుండా వస్తానే, పిచ్చి దానా! ఆల్ ది బెస్ట్"

బుల్లి బుల్లి ఎర్రని పెదిమల్తో, నల్లని జుట్టుతో ముద్దులు మూటగడుతున్న పాపని ఆప్యాయంగా హత్తుకుంది విమల.

"అక్కయ్యా! నీకు నా మీదేమీ కోపం లేదు కదా?" సందడంతా సద్దుమణిగాక అడిగింది కమల.

"ఛీ! నాకెందుకే కోపం. చాలా సంతోషంగా ఉంది, నీ ఒడి నిండా చక్కటి చందమామలాటి పాపాయి ఉన్నందుకు. నువ్వు స్వాతిని పెంపకానికి అడిగినప్పుడు కొంచెం బాధగా అనిపించిన మాట నిజమే. అనంత్ బ్రతికుంటే ఇలాటి ప్రసక్తి వచ్చేదా అని కూడా అనిపించింది. ఇప్పుడిదంతా ఎందుకు గానీ, నువు మాత్రం పాపాయికి వేక్సినేషన్ అవీ జాగ్రత్తగా వేయించు" అంటూ చంటి పాపల పెంపకం గురించి సలహాలిచ్చింది విమల.

చెల్లెలు అనాథ పాపాయిని పెంచుకుంటుందే ఆమె డబ్బంతా తమది కాకుండా పోయిందే అన్న బాధ ఆమె మొహంలో చూడాలని చాలా ఆశతో చాలా దూరం నుంచీ వచ్చిన బంధువులంతా నిరాశగా వెళ్ళిపోయారు.

జీవితం చాలా విచిత్రమయినది. కావాలని ఏడ్చినప్పుడు అది మనకేమీ ఇవ్వదు. ఇంక నాకేమీ అక్కర్లేదనుకునేవేళ వరాల జల్లు కురిపిస్తుంది. పదిహేనేళ్ళుగా పిల్లలు పుట్టక ఇక మాకింతే అని మనసు దిటవు చేసుకుని, తల్లీ తండ్రి లేని పాపాయిని పెంచుకుంటూ సంతోషపడుతుండగా, కమల నెల తప్పింది. ఆశ్చర్యం,

ఆనందంలో మునిగిపోయారందరూ. పాప మా ఇంట్లో అడుగుపెట్టిన వేళ అని, కమలా, ఆనంద్‌లిద్దరూ పాపని నెత్తిన పెట్టుకుని చూసుకుంటున్నారు. నెలలు నిండి కమల బంగారం లాంటి బాబుని ప్రసవించింది. పిల్లలు లేరని ఏళ్ళ తరబడి రాత్రిళ్ళు ఏడ్చిన తనకు ఇద్దరు రత్నాల్లాటి పిల్లలు. కమలకి తలచుకుంటే చెప్పలేనంత గర్వంగా ఉంది.

"ఆరోజు నువ్వే కనక ఎంకరేజ్ చేయక పోయి ఉంటే ఈనాడిలా ఉండేదాన్ని కాదు, చాలా థాంక్స్ అక్కయ్యా," ఫోన్‌లో చెప్పింది విమలతో. నవ్వేసింది విమల.

దేవుడు తమకి ఇచ్చిన ఇద్దరు బిడ్డల్నీ కళ్ళల్లో పెట్టుకుని చూసుకుంటున్నారు, కమలా ఆనంద్‌లిద్దరూ.

"వదినా! కమలకి చాలా సీరియస్‌గా ఉంది. మీరు వెంటనే రండి," ఏడుపు గొంతుతో అంటున్నాడు ఆనంద్.

"మొన్ననే ఫోన్‌లో మాట్లాడానే, ఇంతలో ఏమయిందో", గాభరాగా అనుకుంటూ బయల్దేరింది విమల.

నాలుగంటే నాలుగే రోజుల్లో, పిల్లలిద్దర్నీ గుండెకి హత్తుకుని ఎవరి సహాయమూ అక్కరలేని ప్రపంచానికి వెళ్ళిపోయింది కమల. "అమ్మా" అంటూ ఏడుస్తున్న పిల్లలనీ, భార్యని తలచుకుని తల్లడిల్లిపోతున్న ఆనంద్‌నీ సముదాయించలేక పోతుంది విమల.

అర్థరాత్రి ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్న చప్పుడు. బాల్కనీలోకొచ్చి చూసింది విమల. ఏడేళ్ళ పాప మోకాళ్ళలో తలదాచుకుని ఏడుస్తుంది. తల్లడిల్లిపోయింది విమల.

"ఎందుకమ్మా పాపా ఏడుస్తున్నావు? నువ్వేడిస్తే తమ్ముడింకా భయపడిపోడూ?" మెల్లిగా పాపని ఓదార్చసాగింది.

"ఆంటీ, అమ్మ మా అమ్మ కాదటకదా? నన్ను ఎక్కడినుంచో తెచ్చి పెంచారనీ, ఇప్పుడు మళ్ళీ పంపించేస్తారనీ అంటున్నారు తాతగారూ వాళ్ళు. నన్ను పంపొద్దాంటీ. ఇక్కడే ఉంటాను," వెక్కుతోంది పాప. కొయ్యబారిపోయింది విమల. ఈ పసిదానికీ సంగతులన్నీ చెప్పటానికి ఇదా సమయం? అయినా వాళ్ళ కుటుంబ విషయం, తనేమని పట్టించుకోగలదు? మరునాడే పిల్లల భవిష్యత్తు చర్చకి పెట్టారు ఆనంద్ తల్లితండ్రులూ, అన్నదమ్ములూ.

"ఇందులో పెద్ద ఆలోచించటానికేమీలేదు. ఆ పాపని మళ్ళీ ఏదో అనాథాశ్రమంలో చేర్పిద్దాం. పిల్లాణ్ణి మేమెవరమయినా పెంచుతాము." నిర్మొహమాటంగా చెప్పారు ఆనంద్ నాన్నగారు. భార్యతో పాటే తనలో ఉండే ధైర్యమంతా ఇగిరిపోయినట్టు ఖిన్నవదనంతో కూర్చున్నాడు ఆనంద్.

"మీరలాగంటే ఎలా మావయ్యగారూ? ఎంతో ప్రేమతో వాళ్ళా పాపని పెంపకానికి తెచ్చుకున్నారు. ఇప్పుడు మళ్ళీ వదిలేస్తామనటం న్యాయమేనా? ఆ పసి మనసెంత బాధ పడుతుందో ఊహించండి", జంకుగా అంది విమల.

"నువ్వు చెప్పేది నిజమే అయినా మా పరిస్థితి కూడా ఏమీ బాగాలేదమ్మా విమలా! మా ఇద్దరికీ ఆరోగ్యాలు చెడిపోయాయి. వాడా, ఒక్కడే పిల్లలని పెంచలేడు. మళ్ళీ పెళ్ళిచేసుకున్నా, వచ్చే అమ్మాయి వీళ్ళని ఎలా చూస్తుందో చెప్పలేం. మీ అమ్మకీ వయసైపోయింది, మీకూ ఇంకెవరూ తోబుట్టువులు లేరు. ఇప్పుడు మరి వీళ్ళనెవరు చూస్తారు

చెప్పు. పిల్లవాడంటే, మా వంశానికి వారసుడు, వాణ్ణి మేమో, లేకపోతే మా పిల్లలో పెంచుతారు, కానీ ఆ దిక్కూ మొక్కూ లేని పిల్లని కూడా మేమే పెంచాలనటం ఏరకమయిన న్యాయమో నువ్వే చెప్పు," మృదువుగానే అన్నాడు ఆనంద్ తండ్రి.

"అసలలాంటి పిల్లని పెంపకం వద్దూ, అంటే ఇద్దరికిద్దరూ వినలేదు నువ్వేమో నీ బిడ్డనొదలనంటివి", నిష్టూరంగా అంది ఆనంద్ తల్లి.

"ఇప్పుడు పాత విషయాలెందుకులే తోడటం," ఆమెని మందలించాడు పెద్దాయన.

వాళ్ళ మాటలూ, వాదనా సరిగ్గానే ఉన్నా, ఏదో దిగులేసింది విమలకి. నిజమే, మగపిల్లవాడు, వాణ్ణి పెంచుకోవటానికి ఎవరికీ పెద్ద అభ్యంతరం ఉండదు. తల్లి కూడా అక్కర్లేదని అవతలికి పారేసిన ఆడపిల్ల, దాన్నెవరు చూస్తారు? ఆ బాధ్యత నెవరు తలకెత్తుకుంటారు? ఆమెకి రాత్రంతా నిద్ర పట్టలేదు. అందరూ కల్సి తన భవిష్యత్తు గురించి ఏం తీర్పు చెప్తారోనని గడగడా వణుకుతూ తలుపు చాటున నక్కిన పాప మొహమే గుర్తొస్తుంది. ఒకేసారి ఎంత జ్ఞానం పాపం దానికి. చచ్చిపోయింది తన పెంపుడు తల్లనీ, తనొక అనాథననీ తెలిసి ఆ పసి మనసు ఎన్ని ప్రశ్నలు వేసుకుంటుందో! ఆమెకి జాలేసింది.

బస్సు పరుగెడుతోంది. స్వాతి, కిరణ్‌ల పక్కనే కూర్చుని నిశ్చింతగా నిద్రపోతుంది పాప. కళ్ళు మూసుకుని ఆలోచిస్తుంది విమల. తల్లి హెచ్చరికగా అన్న మాటలే మళ్ళీ మళ్ళీ గుర్తొస్తున్నాయి. పాపని అనాథలా వదిలేయొద్దనీ, తన పిల్లలతో పాటే పెంచుతాననీ చెప్పింది కానీ, తను చేయగలదా? అమ్మ చెప్పినట్టు, అది చిన్న విషయమేమీ కాదు. చదువు చెప్పించి, పెళ్ళి చేసి పంపాలి. తన చిన్న జీతంతో, తన పిల్లల బాధ్యతతో పాటు ఈ అదనపు బాధ్యత నెరవేర్చగలదా? ఆవేశంలో శక్తికి మించిన పని నెత్తినేసుకోలేదు కదా! తనదసలే ఒంటరి బ్రతుకు.

తనని చేయి మీద ఎవరో తట్టటంతో కళ్ళు తెరిచింది. పదహారేళ్ళ స్వాతి విమల వంకే చూస్తూ చెప్పింది.

"అమ్మా! నువ్వేం భయపడకు. నేను బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగం తెచ్చుకుని నీకు సహాయం చేస్తాగా." కూతుర్ని ప్రేమగా దగ్గరకు లాక్కుంది విమల. ఒక్కసారిగా అన్ని భయాలూ పోయి మంచి నిద్ర పట్టిందామెకు.

**మానవత్వం పరిమళిస్తే ఎంత బాధ్యతైనా బరువు లేనిదే.!**

# నగరళం



జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

"సర్... దిసీజ్ బ్లడీ మేరీ..."

వెయిట్రెస్ అందించిన మగ్‌లోని కాక్‌టైల్‌ని సిప్ చేసి' వెరీ నైస్... లాస్ ఏంజెల్స్ టు లండన్ ఎక్కడా చూళ్ళేదీ టేస్టు" అంటూ జేబులోంచీ ఓ నోటు ఆమె చేతిలో పెట్టాడు మదన్.

థ్యాంక్స్ చెప్పి వెనక్కి తిరిగింది వెయిట్రెస్.

ఆ గెస్ట్‌లనే గమనిస్తున్న రామ్లా చెవిలో రహస్యంగా చెప్పింది," అందులో అరపెగ్గు గుడుంబా కలిపిన సంగతి తెలిస్తే గురుడికి గుడ్లు పేల్తాయ్"

ఆమె మాటలు విని కిసుక్కున నవ్వాడు రామ్లా.

అది సప్తవ్యసనాల్నీ కలుపుకున్న అధునాతనమైనపబ్... "రైన్‌బో" లైసెన్సున్నది బార్ అండ్ రెస్టారెంట్‌కి మాత్రమే అయినా అందులో లేనిది లేదు. డబ్బుతో ఎన్ని విధాలుగా పతనం కావచ్చో అన్ని విధాలుగానూ అదఃపాతాళపు అంచుల్ని చేరవచ్చు.

ఈ పక్క థెక్‌లో తైథెక్క...

ఆ పక్క ఆడిందే ఆట... లక్షల్లో స్టేకులు!

మధ్యలో ఇంత పొడుగున ర్యాంప్... అంగాంగ ప్రదర్శనం! గెస్టుల్లో కైపెక్కిన కన్యామణుల క్యాట్‌వాక్!!

మధ్యలో తైన్‌బో రిచ్ రిచ్ స్యాండ్ విచ్‌లు... అంటే రామనవమి పందిట్లో రంగనాయకి రికార్డింగ్ డాన్సుల్లాంటి విన్యాసాలు.

ఆ వెనుక స్పెషల్ గెస్టులకోసం వెరీ ప్రైవసీ పాక్స్... అక్కడ ఇష్టపడినవాళ్ళు ఇష్టం వచ్చిన వాళ్ళతో తనివి తీరా కష్టపడచ్చు! కసితీరా నష్టపడచ్చు!

డాలర్లు...పౌండ్లు... అన్నీ రూపాయల్లోనే!

ఈజీ మనీ... క్రేజీ ఫ్లో!

నో బ్లాక్ మనీ అంతా తెల్లడబ్బే... తెల్లగా... తెల్ల తెల్లగా.. వాళ్ళు పగలు కొనుక్కుంటున్నవాటినే వీళ్ళు రాత్రుళ్ళు అమ్మి పెడతారు. వాళ్ళ పగటి సమస్యలకి వీళ్ళ రాత్రి సమాధానాలు. ప్రకృతికి విరుద్ధంగా రాత్రి పని... పగటి నిద్ర.

స్వదేశంలోనే స్వాతంత్ర్యాన్నమ్ముకునే కాల్ సెంటర్‌ని నిశాచరులూ సాఫ్ట్‌వేర్ దాసాను దాసులూ రాత్రి పని చేస్తే చాలు .. తెల్లారేసరికల్లా లక్షల్లో జీతాలు. డబ్బోడబ్బు అంతా తెల్లడబ్బే.

సైబరాబాద్ శివార్లలో అరెకరం అమ్మకానికి పెడితే చాలు తెల్లారేసరికల్లా కోటీశ్వరులైపోవచ్చు. డబ్బో డబ్బు... అంతా తెల్లడబ్బే.

ఈజీ మనీ... క్రేజీఫ్లో!

అలాంటి క్రేజీఫ్లోకి కట్టిన ఆనకట్టలే ఇలాంటి రైన్‌బోలు.

అందులో బౌన్సర్‌గా పని చేస్తున్నాడు రామ్లా.

కల్చర్ బలిసిన కష్టమర్లంతా అతన్ని స్టైలిష్‌గా "ర్యామ్" అని పిలుస్తూంటే మొదట్లో అతనికి చిరాగ్గా అనిపించేది. వాళ్ళంతా తనని పల్లెగొర్రె అని వెక్కిరించడానికే అలా పిలుస్తున్నట్లు వినిపించేది. తరువాత్తరవాత అందమైన మినీ స్కర్టులూ మిడ్డీలూ హస్కీగా ఒక్కోసారి సెక్సీగా "ర్యామ్" అని పులకించిపోయేలా పలకరిస్తూంటే... అలా పిలిపించుకోవడం అలా అలా అలవాటైపోయింది.

రామ్లా పూర్తి పేరు రామ్లానాయక్. అతనుండే సుగాలీ తాండాలో అందరూ అందగాళ్ళే. - అయినప్పటికీ అతను మాత్రం అందగాళ్ళకి అందగాడు. ఆరడుగుల కండలు తిరిగిన శరీరం. అతను చదివిన మదనపల్లె కాలేజీలో రెండేళ్ళ క్రితం వరకూ అతనే మిస్టర్ బీటీ కాలేజ్. అతనే మిస్టర్ మదనపల్లె కూడా.

ఉద్యోగార్థం సైబరాబాద్ వచ్చి ఓ చిన్న కంపెనీలో క్లర్కుగా చేరాడు.

అప్పటికి రైన్‌బోలో పెరుగుతున్న అవసరాలకి అనుగుణంగా కొత్త కొత్త హంగులూ ఆర్భాటాలూ... ఇంద్రియలోలురకి ప్రత్యేక ఆకర్షణలూ ఏర్పాటు చెయ్యడం జరిగింది. వాటినిర్వాహణ కోసం కొత్త కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. వెయిట్రెస్‌లు... డాన్సర్లు... బౌన్సర్లు... ఫిక్సర్లు...

రామ్లా ఆకర్షణీయమైన విగ్రహాన్నీ, చురుకుదనాన్నీ చూసి అతని మిత్రుడు రైన్‌బోకి తీసుకెళ్ళాడు. అంతకు ముందున్న జీతానికి రెట్టింపు జీతం కావడంతో రామ్లా కూడా ఆనందంగా చేరిపోయాడు.

అంతలో బ్లడీ మేరీ ఫెస్ట్ మదన్ లేచి పాటందుకున్నాడు.

ఆ వెంటనే అతని ఫ్రెండ్స్ డాన్స్ మొదలు పెట్టారు.

ఆ వెర్రికేకలూ ఈ పిచ్చి గంతులూ అంతా కలసి గందరగోళం  సంతగోలగా తయారైంది.

ఆ గోల అలాగే కొనసాగితే మిగిలిన గెస్టులకి చిరాకు కలగొచ్చు.

లేదా వీళ్ళని చూసి వాళ్ళూ వాళ్ళని చూసి ఇంకొకళ్ళూ తింగిరి డాన్సులు మొదలు పెట్టొచ్చు..

అందుకే రంగంలోకి దిగాడు రామ్లా. ముందు వాళ్ళతో బాటు తనూ రెండు స్టెప్పులు వేశాడు. ఆ తరువాత "కమాన్ ఫ్రెండ్స్ మీలాంటి వారికోసమే స్పెషల్ ర్యాంప్ ఏర్పాటు చేశాం పదండి లెటజ్ ప్రూవ్ అవర్ టాలెంట్" అంటూ ఒకతని చెయ్యిపట్టుకుని ఎంకరేజ్ చేశాడు. అతనికి డాన్స్ ఎంత మాత్రం రాదు. ఏదో ఫ్రెండ్స్ ఎగుర్తుతూంటే ఊపు ఆపుకోలేక తనూ లేచి గెంతాడంతే. అందుకే రామ్లా చెయ్యి విడిపించుకుని సిగ్గుపడుతూ సెట్‌రైటయిపోయాడు.

అయితే రియాల్టర్ రాజు మాత్రం నిటారుగా నిలబడి 'అయితే పద' అన్నాడు.

ఆ రియాల్టరుడికి డాన్స్‌మాట దేముడెరుగు తిన్నగా నడవడం కూడా రాదు. వాడిని అలాగే వదిలేస్తే అంతా రసాభాస అయిపోతుందని సాఫ్టు వేర్ సురేంద్రకి తెలుసు. వాడికెలాగూ డీసెంట్‌గా బిహేవ్ చెయ్యడం రాదు. వాడివల్ల అందరికీ ఇండీసెంట్‌ఫెలోస్ అనే చెడ్డపేరు వస్తుంది. అందుకే అతణ్ణి వారించాడు.

ఆ విధంగా అక్కడి అల్లరి సద్దుమణిగింది.

దాంతో మదన్ వైపు చూసి "యూ ఆరె గుడ్ సింగర్" అనేసి వెనక్కి తిరిగాడు రామ్లా.

అతని చెయ్యిపట్టుకుని ఆపాడు మదన్. ఆ తరువాత అతను తన పాటని పొగడినందుకు మొహమాట పడిపోతూ ఒకనోటు అతని చేతిలో పెట్టి; 'థ్యాంక్స్ ఫర్ దికాంప్లిమెంట్. బట్ ఐ నో దట్ అయామ్ బ్యాడ్ సింగర్' అన్నాడు.

ఆ తరువాత రామ్లాకి ఏమనాలో అర్ధంకాలేదు. అందుకే సైలెంటుగా నిష్క్రమించాడు.

అతనికెదురు వచ్చాడు ఫిక్సర్ సన్నీ, ఎదురొచ్చి అభినందించాడు; ఇలాంటి వాళ్ళని డీల్ చెయ్యడంతో నీ తరువాతేనయ్యా ఎవరైనా.

రామ్లా నవ్వేసి వెళ్ళిపోతూంటే; నీతో కొంచెం పనుంది" అన్నాడు.

"ఒకే. నెక్ట్ ఐటం నాదే.. అదయిపోగానే మాట్లాడదాం" అని చెప్పేసి వెళ్ళిపోయాడు.

మరో ఐదు నిముషాలకి మొదలైంది రామ్లా బల ప్రదర్శన.

అతని కండలు తిరిగిన శరీరాన్నీ, అతను చేస్తున్న విన్యాసాల్నీ అబ్బురంగా చూస్తున్నారు గెస్టులు. రైన్‌బోలో ప్రతీ అరగంటకీ బౌన్సర్ల బలప్రదర్శనలుంటాయి.

అక్కడ బలప్రదర్శన చేసిన బౌన్సర్లే మరికాసేపటికి గెస్టుల మధ్యన తిరుగుతూ కనిపిస్తారు. అంతకు ముందే వారి దేహదారుఢ్యాన్ని, చూసిన గెస్టులు వారి ఎదురుగా అల్లరి చెయ్యడానికిగానీ తమలో తాము అల్లరిపడటానిగ్గానీ జంకుతారు.

ఆవిధంగా ఆ ప్రదర్శనలు, అమ్మాయిలకి ప్రత్యేక ఆకర్షణ! అబ్బాయిల అల్లరినుంచీ రక్షణ!!

తన ఐటంని ముగించుకుని వస్తున్న రామ్లాకి మళ్ళీ ఎదురొచ్చాడు సన్నీ.

అతను, కోరినవాళ్ళకి కోరుకున్న వాళ్ళని కుదిర్చిపెట్టే ఫిక్సర్. ప్రైవసీఫాక్స్‌లో స్పెషల్ గెస్టులకి వెరీ స్పెషల్ అరేంజ్‌మెంట్స్ చేసి పెడుతూంటాడు.

రామ్లాని పక్కకి లాగి రహస్యంగా అన్నాడు; "ఐ హేవ్ ఎ గుడ్ న్యూస్ ఫర్‌యూ"

అతనామాట అనగానే రామ్లాకి విషయం అర్థమైపోయింది, "ఏంటీ మళ్ళీ అదే కేసా?"

"నోనో... ఇట్సెడిఫరెంట్ కేస్... ఆలోచించుకో, బంగారు గుడ్లు పెట్టే బాతు. లైఫ్‌లాంగ్ హేపీగా గడిపెయ్యొచ్చు". ఊరించాడు సన్నీ.

రామ్లా ఏమాత్రం బెసక్కుండా, "మేబీ... బట్ ఐ డోంట్‌లైక్ దిస్" అన్నాడు.

అంతలోనే తూలుకుంటూ అటుగా వచ్చిన ఓ అమ్మాయి, 'వ్వావ్ ర్యామ్' అంటూ అతన్ని వాటేసుకోబోయింది. కానీ రామ్లా లాఘవంగా తప్పించుకున్నాడు. దాంతో తూలిబడబోయి తమాయించుకున్న ఆమె 'యూనాటీ' అంటూ గాల్లోకి ఓ ఫ్లైయింగ్ కిస్ విసిరేసి వెళ్ళిపోయింది.

"నువ్వు కాబట్టే వదిలేశావు గానీ... అదే నేనయితేనా.. సర్లే, ఇప్పుడివన్నీ ఎందుగ్గానీ ముందు నీ విషయం చెప్పు... మళ్టీ మిలియనీర్.. నువ్వంటే పడి చచ్చిపోతుంది." అన్నాడు సన్నీ.

"బట్ నా కిష్టం ఉండాలిగా?"

"దీనికి ఇష్టంతో ఏం పనయ్యా బాబూ... జస్ట్ ఇట్స్ బిజినెస్. వాళ్ళక్కావల్సింది నువ్విస్తావ్. నీక్కావలసింది వాళ్ళిస్తారు. దట్సాల్. దీనికి ఇష్టాలూ ప్రేమలూ పాతివ్రత్యాలతో పని లేదు. సింప్లీ ఎంజాయ్ ద లైఫ్."

"అయాం సారీ నేను నమ్ముకున్న వాళ్ళకి అన్యాయం చెయ్యలేను."

రామ్లా ఈ మాట అనగానే సన్నీ ఇంకేం మాట్లాడలేకపోయాడు. అందుకే అతని పట్ల తనకున్న అభిప్రాయాన్ని చెప్పాడు, 'ఎనీ హౌ, నీలూ ఈజె వెరీ లక్కీ గాళ్. నీలాంటి సిన్సియర్ లవర్‌ని సంపాయించుకుంది. నేను చెప్పగలిగిందొక్కటే... యు బెటర్ టు రిజైన్ దిస్ జాబ్.'

అతనలా చెప్పేసి వెళ్ళిపోతుంటే రామ్లాకి అనిపించిందొక్కటే... రిజైన్ చెయ్యడం, రిజైన్ చెయ్యమన్నంత సులభం కాదు. తను సంపాదించకపోతే అమ్మకి డబ్బు ఎవరు పంపిస్తారు?

తను నీలూని పెళ్ళి చేసుకోవాలన్నా, తాళీ, నెక్లెస్సూ కావాలి.

నీలూ అంటే నీలూ బాయి. స్వంత మేనత్త కూతురే. తనతోనే పెరిగింది. తన తోనే చదివింది. తనతో బాటే డీఎస్సీ కూడా రాసింది. తనకి వచ్చినా రాకపోయినా ఆమెకి మాత్రం తప్పకుండా వస్తుంది.

అతని చుట్టూ అన్ని అందమైన ఆకర్షణలూ... అందుబాటులోనే అందుకోగలిగినన్ని అవకాశాలూ ఉన్నప్పటికీ అతనింకా కడిగిన ముత్యంలాగే ఉండటం వెనక ఉన్న నైతిక బలమే నీలూ.

రైన్‌బోలో ఎవరూ ఆమెని చూడలేదుగానీ... ఆమె గురించి మాత్రం అందరికీ తెలుసు. ప్రైవసీ పాక్స్‌లో విచ్చలవిడి శృంగారానికి అలవాటు పడిన ఎంతో మంది అమ్మాయిలు అతనికోసం ప్రయత్నించి విఫలమైన సంగతి కూడా తెలుసు. అందుకే అతనంతగా ప్రేమించే నీలూ అంటే అందరికీ ఆసక్తి, గౌరవం. కొంత మంది అమ్మాయిలకైతే అసూయ కూడా. సన్నీకి మాత్రం పూజనీయ భావం. అయినా సరే రామ్లాని ఒప్పించే ప్రయత్నం చేస్తూనే ఉంటాడు. ఓడిపోతూనే ఉంటాడు. అలా ఓడిపోయిన ప్రతీసారీ తను ఓడిపోయినందుకు గర్వపడతాడు.

అంతలోనే వెయిట్రెస్ చెయ్యిపట్టుకుని అల్లరిపెడుతూ కనిపించాడు మదన్. వెంటనే అటువైపు వెళ్ళాడు రామ్లా. ఈసారి మదన్ అంత సులభంగా లొంగలేదు. రియాల్టర్ రాజు, సాఫ్ట్‌వేర్ సురేంద్ర, విక్కీల అండ చూసుకుని చెలరేగిపోయాడు. దాంతో రామ్లాకి కాస్త కఠినంగా వ్యవహరించాల్సి వచ్చింది. కొంచెం గట్టిగా వార్న్‌చెయ్యడం తప్పలేదు.

బ్లడీమేరీ కిక్కంటే సామాన్యమైంది కాదు. తాగినకొద్దీ తాగాలనిపిస్తుంది. మదన్ మరో కాక్‌టైల్ తెప్పించుకున్నాడు. పార్టీ మరో అరగంట జోరుగా సాగింది.

మదన్‌కి ఎదురుగా ఓ స్టన్నింగ్ బ్యూటీ స్టైల్‌గా స్టెప్పులేసుకుంటూ వస్తూ కనిపించింది. ఆమె దగ్గరకి రాగానే "హాయ్ స్వీటీ హౌ ఆర్యూ' అన్నాడు. ఆమె అతనివైపు చాలా కసిగా చూస్తూ ఇంకా చాలా ప్రేమగా అంది, "స్టుపిడ్"

అలా అన్న వెంటనే విసవిసా ఈసడించుకుంటూ వెళ్ళిపోయింది.

అతనూ ఆమెని అనుసరించాడు.

ఆమెకీ అడుగులు తడబడుతున్నాయి.

ఆమె ఎడం వైపు తిరిగి టాయిలెట్‌లోకి వెళుతూంటే మదన్ కూడా వెళ్ళబోతున్నాడు.

ఆ దృశ్యం రామ్లా కంటబడింది. వెంటనే పరిగెత్తుకుంటూ వెళ్ళాడు.

అప్పటికి లోపల్నించీ తలుపు బోల్ట్ వెయ్యబోతున్న మదన్..., బయటనుంచీ రామ్లా బలంగా తొయ్యడంతో వెల్లకిలా పడిపోయాడు.

పడ్డవాడు పడ్డట్లే పైకి లేచి రామ్లా కాలర్ పట్టుకున్నాడు, 'ఏంట్రా, ఆఫ్టాల్ కోన్‌కిస్కాగాడివి నన్నే తోస్తావా" అంటూ చెంప పగలగొట్టబోయాడు. ఆ చేతిని గాల్లోనే పట్టుకుని టేబుల్‌దాకా ఈడ్చుకు వెళ్ళి అతడిని సీట్లో కుదేశాడు రామ్లా.

మదన్‌తో రామ్లా రూడ్‌గా బిహేవ్ చెయ్యడాన్ని చూసిన విక్కీ కోపంగా పైకి లేచాడు, 'ఏయ్ రామ్, వదులు వాడి చెయ్యి. యూనో... అయాం సన్నాఫ్ సర్కిల్ సదాశివరావ్... నేను తలచుకుంటే అరనిముషంలో అరెస్టు చేయించగలను.'

"ఎస్సర్. నాకు తెలుసు. ఈయన చేసింది తెలిస్తే నన్ను కాదు, ముందీయన్ని అరెస్టు చేయిస్తారు. మీ ఫ్రెండయివుండీ లేడీస్ టాయిలెట్‌లో దూరి అల్లరి పెట్టాడని తెలిస్తే డిపార్ట్‌మెంట్‌లో మీ కెంత అవమానం? అందుకే లాక్కొచ్చాను" అన్నాడు రామ్లా.

"యూ ఆర్ రైట్" అంటూ అతని చేతిలో ఓ నోటు ఉంచి తన స్నేహితులవైపు తిరిగాడు! "హి ఈజె నైస్ జెంటిల్‌మేన్... అందుకే ఐ లైక్ హిమ్" అన్నాడు.

అతనా మాట అనగానే మదన్‌కి మండుకొచ్చింది. "నా మీద చెయ్యేసినోడు నీకు నైస్ జెంటిల్మేనా... " అంటూ మొదలు పెట్టాడు దాంతో మిత్రుల మధ్య వాదోపవాదాలు మొదలై చివరికి ఏదో ఒక విధంగా రామ్లాగాడికి బుద్ధి చెప్పాలనే ఏక గ్రీవ తీర్మానానికి వచ్చేసరికి పబ్ కట్టేసే సమయం అయింది.

రామ్లాకిలాంటి తలతిక్క బేరాలు రోజుకి కనీసం రెండు మూడైనా తగుల్తానే ఉంటాయి. ఒకళ్ళు ఫేసటు ఫేస్ చూసుకుందాం రమ్మని సవాలు చేస్తే ఇంకొకళ్ళు నిన్నూ నీ రైన్‌బోనీ నిలబెట్టి కొనేస్తాం జాగ్రత్త అంటూ మొదలు పెడతారు. మరొకళ్ళు ఈ మదన్ ఎండ్ పార్టీలా రామ్లా లాంటి వాళ్ళని క్లోజ్ చెయ్యడానికి పథకాలు వేస్తారు. ఎక్కింది దిగ్గానే అన్నీ మామూలే.

ఆనాటికి డ్యూటీ ముగించుకుని బయట పడ్డాడు రామ్లా.

అతనికీ రైన్‌బోలో చేరాక ఎన్నో కొత్త విషయాలు తెలిసాయి.

ముఖ్యంగా డబ్బు....

*మనిషి చెమటోడ్చి డబ్బుని సంపాదిస్తే... తరువాత ఆ డబ్బే డబ్బుని సంపాదిస్తుంది... ఆ డబ్బే మళ్ళీ చెమటోడ్చే మనుషుల్ని సంపాదించి పెడుతుంది. ఆ విధంగా డబ్బుకి కూడా రక్త మాంసాలు సమకూరతాయి. రాగద్వేషాలూ ఏర్పడతాయి.*

కానీ అదే డబ్బు హఠాత్తుగానో నడమంత్రంగానో వచ్చి పడితే?

ఆ డబ్బే ఉత్ప్రేరకంగా పని చేస్తుంది! ఉన్మాదాన్ని రెచ్చగొడుతుంది!

అలాంటి ఉన్మత్తులను సంతృప్తిపరచడానికి... ఇలాంటి రైన్‌బోలు పుడతాయి.

అమ్మే వాళ్ళున్న చోట కొనే వాళ్ళుంటారు.

కొనే వాళ్ళున్న చోట అమ్మేవాళ్ళూ ఉంటారు.

కానీ తను మాత్రం అమ్ముడు పోడు.

అలా అనుకోగానే అతని మనసుని నీలూ బాయి కమ్ముకుంది.

అతనికి ఒంటరిగా నడుస్తూ నీలూబాయిని తలచుకోవడం చాలా ఆనందాన్నిస్తుంది.

నీలూ... అందానికి అందం మాత్రమే కాదు. ఆ అందానికి మించిన ఆకర్షణ. ఆమెతో మాట్లాడటం ఎంత తియ్యగా ఉంటుందో ఆమె పక్కన నడవటం అంత గర్వంగా ఉంటుంది.

ఇద్దరూ కలసి కాలేజీకి వెళ్ళటం. కాలేజీలో తామిద్దరూ మాట్లాడుకోవటం, తామిద్దరూ ఏం మాట్లాడుకున్నారో అన్న విషయాన్ని గురించే అందరూ మాట్లాడుకోవటం, ఏటా కనీసం రెండుమూడుసార్లయినా తమ పేర్లు గోడలకో బోర్డులకో ఎక్కడం.... సందు దొరికింది కదా అని లెక్చరర్లు క్లాసులు పీకడం... తలచుకోవాలే గానీ తవ్వుకున్న కొద్దీ తేనెకన్నా తీయని చెలమలు...

అసలు బీటీ కాలేజీ చరిత్రలోనే తమంత విచ్చలవిడిగా తిరిగిన ప్రేమికులు లేరు.

అతనలా నీలూ జ్ఞాపకాల్లో లీనమై నడుస్తుండగా అతని పక్కనుంచీ దూసుకుపోయిందో కారు. దాన్ని నడుపుతున్నది ఓ అందమైన పాతికేళ్ళ అమ్మాయి. ఏ రామ్లా మీద కోపంతో తాగగలిగినదానికంటే రెండు పెగ్గులు ఎక్కువ తాగిందో అదే రామ్లా ఒంటరిగా కనిపించగానే ఒళ్ళు మరిచిపోయేంత ద్వేషం రోషం కమ్మేశాయి.

అంతే... కారుని రివర్సు తీసుకుని అమాంతంగా వేగం పెంచింది.

అతన్ని గుద్దెయ్యడానికే అంత వేగం...

కానీ తనకి తెలియకుండానే ఆరడుగుల దూరంలో సడెన్ బ్రేకు వేసింది.

ఆ కారు కీచుమనే శబ్దంతో రామ్లాకి సరిగ్గా అడుగుదూరంలో ఆగింది.

రామ్లా ఒక్కసారి అదిరిపడి వెనక్కి దూకాడు. అదే ఊపులో శత్రువు మీద ఎదురు దాడి చెయ్యడానికి సిద్ధమయ్యాడు.

అతను ఊహించినట్లుగా కార్లోంచీ ఎవరూ డాడికి దిగలేదు సరికదా, డ్రైవర్ సీట్లోంచీ ఎవరో అమ్మాయి నవ్వులు... విలాసంగా.... వెక్కిరింతగా... మత్తు మత్తుగా... ముద్దు ముద్దుగా నవ్వులు!

అతను అనుమానంతో దగ్గరకి రాగానే ఎంత ఆకస్మికంగా మొదలయ్యాయో అంతే హఠాత్తుగా ఆగిపోయాయి నవ్వులు.

ఉన్నట్లుండి తెరుచుకుంది డోరు. అందులోంచీ ఒక కాలు కింద పెట్టి రెండో కాలు కారులోనే ఉంచి కారుకి ఆనుకుని నిలబడింది, ఓ అమ్మాయి. ఎంత స్టైల్‌గా దిగిందో అంతే స్టైల్‌గా అంది, 'నేనెవరో తెలుసా? చావునుంచీ నిన్ను... జస్ట్ ఒకే ఒక్క అడుగు దూరంలో నిలబెట్టిందాన్ని... అనుకుంటే చాలు ఏం కావాలన్నా చెయ్యగలిగిందాన్ని.... అలాంటి నన్నే ఇన్సల్ట్ చేస్తావా?'

రామ్లాకి ఆమె ఏం మాట్లాడుఉందో ఎంత మాత్రం అర్ధం కావట్లేదు.

'బట్ నువ్వు కాదన్నా నీతో అవుననిపించుకోవడం ఎలాగో నాకు బాగా తెలుసు" అనేసి ఎంత వేగంగా వచ్చిందో అంతే వేగంగా వెళ్ళిపోయింది.

బౌన్సర్‌గా రామ్లా ఎన్నో రకాల బెదిరింపుల్ని చూశాడు. కానీ ఇంతగా భయభ్రాంతుల్ని చేసే కసి నిండిన ప్రేమపూర్వకమైన బెదిరింపు మాత్రం... ఇదే మొదలు!

ఆమె ఎవరో తెలియదు. అంతకు ముందెప్పుడూ చూసిన గుర్తు కూడా లేదు.

కానీ ఆమె మాటల్ని బట్టీ పబ్‌లో సన్నీ ఆమె గురించే అయి ఉంటుందన్న విషయం అర్ధమైంది.

అంత ఆవేశంలో కూడా ఎంత ఆకర్షణీయంగా ఉందో...

అంత మత్తులో కూడా ఎంత షార్ప్‌గా కారుని కంట్రోలు చెయ్యగలిగిందో...

ఆ మత్తే లేకుంటే ఆ వేగం... ఆ పౌరుషం... అంతగా రెచ్చగొట్టేవి కావేమో!

రామ్లా ఆమె మనఃస్థితిని అర్ధం చేసుకోగలడు! తను ఆమెని ఎంతగా హర్ట్ చేసి ఉంటాడో ఊహించగలడు.

కానీ అతనిప్పుడు ఆలోచిస్తున్నది ఆమె గురించి కాదు.

తన గురించి...

తాను తానుగా మిగలాలంటే... తనని కాని తళుకు బెళుకులనుంచీ దూరంగా... తనదైన వెన్నెల్లోకి వెళ్ళిపోవాలి.

అతనికి సన్నీ ఇచ్చిన సలహా గుర్తుకొచ్చింది.

నిజమే... తనీ ఉద్యోగానికి రాజీనామా చెయ్యడమే మంచిది.

ఇదే ఆఖరు.

ఈ క్షణాన్నుంచీ రంగు రంగుల రైన్‌బో హంగులకీ తనకీ ఎంత మాత్రం సంబంధం లేదు.

అతని ఆదాయపు సంకెళ్ళు తెగి పడగానే మనసు తేలిక పడింది.

ఆలోచనల్లోంచీ బయటపడి చుట్టూ చూసుకుంటే.. అప్పటికే తన రూము దాటి చాలా దూరం వచ్చేశాడు.

ఎదురుగా ట్రాఫిక్ ఐలాండ్‌లో ఒత్తుగా పెరిగిన పచ్చగడ్డి.

దాన్ని చూడగానే ప్రాణం లేచివచ్చినట్లనిపించింది. ఫెన్స్ దూకి పచ్చికలో వెల్లకిలా పడ్డాడు.

పైన నీలాకాశం! మిలమిలా నక్షత్రాలు! నిండు పున్నమి చంద్రుడు! చుట్టూ వెండి వెన్నెల!

అలా ఆ ప్రశాంత ప్రకృతిలో పరవశించిపోతూండగానే అక్కడొకటీ ఇక్కడొకటీ తెగిపడే ఉల్కల్లా ఆలోచనలు. ఎక్కడో మొదలై... ఎక్కడెక్కడో తిరిగి... మళ్ళీ అక్కడే తలలు పైకెత్తుతున్నాయి.

తను ఏం చెయ్యాలనుకున్నాడు?

రాజీనామా!

ఎందుకు?

తన్ని తాను రక్షించుకోవడానికి!

ఎవరినించీ?

తనవి కాని పరిసరాలనుంచీ! తనకు తగని వ్యక్తుల నుంచీ! ముఖ్యంగా తన మనసుని నీలూ నుంచీ మళ్ళించడానికై పొంచి ఉన్న అవకాశాలనుంచీ.. ఆకర్షణల నుంచీ ... అన్నింటికీ మించి ప్రైవసీ షాక్స్‌లో బరితెగించిన అమ్మాయిల్నించీ..

బరితెగించినవాళ్ళా? మనసులోని కోరికల్ని మనసులోనే అదిమేసుకుని మానసిక వ్యభిచారానికి పతనం కాకుండా ధైర్యం చేసి నిజాయితీగా బయట పెట్టి హుందాగా అనుమతి కోరితే... వాళ్ళు... వాళ్ళు బరితెగించినవాళ్ళు?

వాళ్ళయినా ఎంతమంది?

లెక్కపెడితే చేతివేళ్ళని సైతం దాటనంత మంది.

వాళ్ళనుంచే తనని తాను రక్షించుకోలేక పారిపోయే నిర్ణయం తీసుకుని అదే గొప్పనుకుని మురిసిపోతున్నాడే..

మరి ఆడవాళ్ళు?

ఎలిమెంటరీ స్కూలు మేష్టారి నుంచీ వరసైన మేనబావల దాకా దారినపోయే దానయ్యలందరినుంచీ తమ ఆత్మ గౌరవాన్నీ, అస్థిత్వాన్నీ కాపాడుకోవడానికి యుగయుగాలుగా తరతరాలుగా అవిశ్రాంతంగా పోరాడుతూనే ఉన్నారే...

వారి గురించి తనెప్పుడైనా ఆలోచించాడా?

ఛెళ్ళున చెర్నాకోలతో కొట్టినట్లు అదిరిపడి లేచి కూర్చున్నాడు.

# నన్నురేప్ చేయవూ?

కాకాని చక్రపాణి



"పంతులుగారూ"

పిలుపు విని పంతులు సాంబశివుడు ఇంటి బయటకు వచ్చాడు.

కాళింది వసారా స్తంభానికి ఆనుకుని నిలబడి ఉంది.

"ఏఁవిటిలా వచ్చావు?" అనడిగాడు సాంబశివుడు.

ఆమె జవాబు చెప్పకుండా జడ ముందేసుకుని అల్లుకుంటూ నుంచుంది. సంధ్య చీకటులు అలుముకుంటున్నాయి. కరెంటులేదు. ఎప్పుడు వస్తుందో

ఎప్పుడుపోతుందో ఎవరికీ తెలీదు. భార్య కాన్పుకు పుట్టింటికి పోయింది. లోపలి గదిలో కూడు ఉడకేసుకుంటున్నాడు సాంబశివుడు. తనక్కడ లేకపోతే అన్నం మాడి మసి బొగ్గవుతుందేమోనని అతడు భయపడ్డాడు. 'ఈ పిల్లతో తను మాట్లాడుతూ కూర్చుంటే, జనం ఏమనుకుంటారో? తనకే ప్రమాదం. పిల్ల కను, ముక్కు కుదిరిగ్గానే ఉంటుంది. పాపం!' అనుకున్నాడు.

"ఏఁవిటంటే మాట్లాడకుండా మూగి మొద్దులా నుంచుంటావేం?" అన్నాడు విసుగ్గా.

"మరే.. మరే.." నసిగింది కాళింది.

"ఏం కావాలి? ఇంట్లో బియ్యం నిండుకున్నాయా? "

"కాదు. మా ఇంట్లో బోలెడు డబ్బులున్నాయి. తిండికేమీ కొదువ లేదు."

అవును, కదూ! అనుకున్నాడు సాంబశివుడు. "సర్లే, వెళ్ళు. ఇప్పుడు నీతో కబుర్లు చెప్పే తీరిక నాకు లేదు" అని లోపలకు వెళ్ళి పోయాడు.

పొయ్యి మీద పెట్టిన గిన్నె మూత తీసిచూశాడు. ఇంకా అన్నం ఉడుకుపట్టలేదు. పొయ్యిలో మంట చూస్తుంటే సాంబశివుడికి జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది.

కాళిందికి తండ్రి లేడు. తాగి తాగి చచ్చాడు. ఉన్నప్పుడూ ఇంటికి పైస తెచ్చేవాడు కాదు. భార్య బంగారే పొలంలో కూలికి పనిచేసి, నాలుగు డబ్బులు ఇంటికి తెస్తే, అవీ ఊడబెరుక్కుని, ఇవ్వకపోతే పెళ్ళాన్ని చితకబాదేవాడు. మొగుడు 'లివర్ సిర్రోసిస్'తో తీసుకుని చనిపోయినప్పుడు తన కులం వాళ్ళు ఏడ్చుకు పోతారని తనూ ఏడ్చింది కానీ, మనసులో పీడా వదిలిందన్న స్వాంతన కలిగింది బంగారుకు.

కాళింది పెద్ద పిల్ల. తండ్రి పోయేనాటికి పదమూడేళ్ళుంటాయి. కొడుకు రాముడు అవిటివాడు. పుట్టిన నాలుగేళ్ళకు పోలియో సోకి కాళ్ళు చచ్చు బడ్డాయి. వాడే పనీ చేయలేడు. తల్లి రెక్కల కష్టంతోనే రోజులు గడవాలి. కూలీ దొరికీ, దొరక్కా పస్తులు కూడా ఉండేవాళ్ళు. మరీ గడవని రోజు తనే సాయం చేసేవాడు. తనూ ఉన్నవాడు కాదు. లేకపోతే ఈ ఏకోపాధ్యాయ బడికి పంతులుగా వచ్చి ఉండేవాడు కాదు. పల్లెలో బతుకు ముళ్ళకంప మీద కప్పిన బట్టని తనకు తెలుసు. పళ్ళెటూళ్ళిప్పుడు ప్రకృతి ఆవాసాలు కావు. ప్రజలూ అంత అమాయకులు కాదు. రాజకీయాల్లో నిష్ణాతులు. తినతిండి లేకపోయినా గ్రూపులు కట్టి కొట్టుకు ఛస్తూ ఉంటారు.

సోమయాజుల పల్లెలోనే బండి రామస్వామికి నాపరాళ్ళు పాలిష్ పట్టే చిన్న కార్ఖానా ఉంది. అతనితో పరిచయమయ్యాక, "పంతులూ! మా కార్ఖానాలో లెక్కలు చూసిపెట్టరాదూ? నీ కష్టం నేనుంచుకోను. సాయంత్రం ఓ గంట పని" అనడిగాడు.

వేణ్ణీళ్ళకు చన్నీళ్ళతోడని తనూ అంగీకరించాడు. ఇంత ఇస్తానని రామస్వామి అనలేదు. తనూ అడగనూ లేదు. ఎప్పుడో రెండు మూడు నెలలకు చేతిలో డబ్బున్నప్పుడు ఏడెనిమిది వందలు చేతిలో పెట్టేవాడు. అకౌంట్లు చూడటం తన ప్రధాన ఉపాధి కాదు కనుక తనూ ఇంత ఇవ్వమని ఖరాఖండీగా అడగలేకపోయాడు. పరిచయం పెరిగింది. రామస్వామికి తనంటే అభిమానమూ కలిగింది. ఊరి రాజకీయాల్లోకి తన్నూ లాగటానికి ప్రయత్నించాడు కానీ తను విముఖత ప్రదర్శించటంతో మిన్నకుండిపోయాడు. ఆమేరకు సజ్జనుడే అతను.

ఇలాంటి పరిస్థితుల్లో ఓ రోజు బంగారు వచ్చి తనకాళ్ళ మీద పడింది.

"అయ్యా! కూటికి లేక చచ్చిపోతుండాం. నా కూతురికేమయినా నౌకరీ ఇప్పించు. నీ బళ్ళో గది సుబ్రం చేసి,

కళ్ళాపి చల్లి, ముగ్గు వేసే పనయినా ఇప్పించు. దేవుడు నిన్ను చల్లగా చూస్తాడు"

"ఆపని మరెవరికో  అప్పు చెప్పాడు ప్రెసిడెంటు. నౌకరీలు ఇప్పించ గలిగే స్థాయి నాకుంటే కర్నూలు వదిలి ఇంత దూరం ఎందుకువస్తాను" అన్నాడతను.

"ఆ కార్ఖానాలో అయినా నౌకరీ ఇప్పించు. ఆడు చచ్చినాక, నా బతుకు బుగ్గయినాది."

ఆ మాట ఆమె చెప్పాల్సిన పనిలేదు. మొగుడు బతికి ఉన్నప్పుడూ ఆమె బతుకింతకంటే మెరుగ్గా లేదని తనకు తెల్సు. అయితే, బండి రామస్వామిని ఈ పిల్ల నౌకరీ కోసం ప్రాధేయపడటం తనకు ఇష్టం లేదు. మనిషిని అడగనంత వరకే గౌరవం.

"రామస్వామి మీ ఊరివాడేగా? నువ్వే అడుగు."

"ఆయన ఊరి పెత్తందారు. నాబోటి దిక్కుమాలింది అడిగితే ఇస్తాడంటయ్యా! ఆయన్ని చూస్తేనే బయమవుతాది నాకు. సాయం చెయ్యి. పుణ్ణెం ఊరికే పోదు."

తను ఆమెకేమి వాగ్దానం చెయ్యలేదు. ఓరోజు బండి రామస్వామిని బంగారు కూతుర్ని పనిలో పెట్టుకోమని అడిగాడు. ఆ కుటుంబ పరిస్థితులను గూర్చి వివరించాల్సిన పనిలేదు. అతనికి తెల్సు. "ఆడోళ్ళని పనిలో పెట్టుకుంటే పేచీలొస్తయయ్యా! సర్లే, నువ్వు చెప్తున్నావుగా, పంపించు" అన్నాడు రామస్వామి.

సుమారుగా రెండేళ్ళు పని చేసింది కాళింది రామస్వామి కార్ఖానాలో. కుటుంబం దారికి వస్తుందనుకుంటున్న తరుణంలో ప్రమాదం ముంచుకు వచ్చింది. యువజన సంఘం, బాలకార్మికుల కడుపు కొట్టి రామస్వామి దోచుకుంటున్నాడని ప్రచారం చేసింది. ఊళ్ళో మరో పెత్తందారు పగిడయ్య. బండిరామస్వామి ఒకప్పుడు పగిడయ్య అనుయాయుడే అయితే, వ్యాపారంలో స్థిరపడి, పుంజుకున్నాక తనూ రాజకీయాల్లోకి దిగాలని తలచి, ఊరు పంచాయతీ ప్రెసిడెంటు పదవికి పోటీ చేశాడు. అంతదాకా ఊరుని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన పగిడయ్యకు అది నచ్చలేదు. 'తనతో మాట మాత్రం చెప్తే తను రామస్వామికి అవకాశం ఇచ్చి ఉండేవాడు కదా! తనకెలాగూ గ్రామ పరిధులు చాలటం లేదు. మండలానికి ఎగబాకాలని చూస్తున్నాడు. తన సీటు అతనికి కేటాయించేవాడుగా!' అలా పంతం ఏర్పడింది పగిడయ్య మనసులో. 'తనేం చేసినా పెద్దాయన అభ్యంతర పెట్టడులే' అనుకున్నాడు రామస్వామి. అదే పొరపాటయింది. పంచాయితీ ప్రెసిడెంటు పదవికి రామస్వామి నిలబడ్డాక తను అతనికి పోటీగా దిగటం నామర్దాగా బావించి, ఓ అనామకుడిని ఎన్నికల్లో నిలబెట్టి, డబ్బూ, మద్యం ప్రవహింపచేసి అతన్ని నెగ్గించాడు పగిడయ్య. అది తన కవమానంగా భావించాడు రామస్వామి. ఇద్దరూ ఒకర్ని ఒకరు ఎదురుబడి తిట్టుకోలేదు గానీ, మనసులో వైరం ప్రారంభమయింది. ఈ కలహంలో తను ఇంధనమయ్యే పరిస్థితి వచ్చింది.

ఓ రోజు తన్ను పగిడయ్య పిలిచి "ఏం, పంతులూ? బయటోడివి నీకూ మా ఊరి రాజకీయాలు కావల్సి వచ్చినయ్యా?" అని అడిగాడు.

"రెండు సంపాదనలూ చాలకేమోలే! గవర్నమెంటు నౌకరీ చెయ్యాల్సినోడిని, మిగతా యవ్వారాల్లో తలదూరిస్తే నేనూరుకోను. పిల్లలకు పాఠాలు చెప్పటం మానేసినావంట! నీ ఒంటికి మంచిదికాదు వినుకో. గవర్నమెంటోళ్ళ జీతం చాలదనుకుంటే, అదికూడా పొయ్యే పరిస్థితి వస్తాది."

తనకు పగిడియ్య చెప్పదలుచున్నదేమో అర్ధమయింది. ప్రభుత్వోద్యోగి మరో పార్ట్‌టైం ఉద్యోగం చెయ్యరాదు. అది తనకు తెల్సు. రామస్వామి దగ్గర పనిచేస్తున విషయం అధికారులకు రిపోర్ట్ చేస్తానని పరోక్షంగా పగిడయ్య తనకు

హెచ్చరిక చేశాడు. ఈ రాజకీయాల్లో పడటం తనకిష్టం లేదు. అందుకే ఓ రోజు రామస్వామిని కల్సి, తనతని దగ్గర నౌకరీ చేయలేనని చెప్పాడు.

"ఏం ఏమయింది, పంతులూ? నా వల్లేమయినా పొరపాటు జరిగిందా?" అనడిగాడు బండి రామస్వామి.

"ఆయ్యో, ఆ మాటనకండి. మీవల్ల పొరపాటు ఎప్పుడూ జరగదు. నేనే మానెయ్యాలనుకుంటున్నాను. వయోజనులకు రాత్రి పాఠశాల నడుపుదామనుకుంటున్నాను".

"సరే, ఆలోచించి రేపు చెప్తాను" అన్నాడు. ఊళ్ళో ఏదీ రహస్యంగా ఉండదు. పగిడయ్య తన్ను పిల్చి బెదిరించిన విషయం రామస్వామి చెవికి చేరింది. అతనసలే అవేశపరుడు. సీదా పగిడయ్య దగ్గరకు వెళ్ళాడు.

"పెద్దాయనా! పంతుల్ని నా దగ్గర నౌకరీ మానెయ్యమన్నావంట!" అని అడిగాడు నిర్మొహంటంగా.

"అట్ల పంతులు చెప్పిండా నీకు?"

"పంతులు చెప్పకపోతే నేను తెల్సుకోలేనేంది? నీకు నా మీద మనసులో కష్టమేమన్న ఉంటే నన్ను సీదా అడుగు గానీ, నా వాళ్ళని సతాయించ వద్దు. అది నీకూ మంచిది కాదు, నాకూ మంచిది కాదు. ఒకూళ్ళో ఉండే వాళ్ళం. మా నాయన కాలం నుండీ నువ్వంటే నాకు గౌరవం ఉండాది. అది పోగొట్టుకోమాక. పంతులుకేమన్నా ఇబ్బంది కలిగిందా, రామస్వామి సంగతేందో నీకు తెలుస్తాది."

అందుకు పగిడయ్యఏమీ సమాధానం చెప్పలేదు. మర్నాడు రామస్వామి తనకు జరిగింది చెప్పాడు. "పంతులూ, నాకు నమ్మకంగా పనిచేసేటోళ్ళు కావాలి. నువ్వు మంచోడివి. అట్లని నిన్ను నీ కిష్టం లేని పని విషయాల్లోకి దింపను. నువ్వు ఎప్పటిలా వచ్చి పని చెయ్యి" అన్నాడు.

తను నసిగాడు "పగిడయ్యగారు అన్నాడని కాదు. వయోజన విద్యా కేంద్రం నడిపితే సార్థకత ఉంటుంది కదా అనుకున్నాను" అని.

"నడపవయ్యా, కాదన్నదెవరు? రాత్రిగ్గదా నీ వయోజన పాఠశాల! మూడింటికి నీ స్కూలు అయిపొయ్యాక, సాయంత్రం ఒక గంట ఇక్కడ పనిచెయ్యి. ఊళ్ళో పనేముంటాది. అన్నింటికీ తీరికే. బయపడమాకు. ఇంక పగిడయ్య నీ జోలికి రాడు"

తనకు రామస్వామి కొలువు తప్పలేదు. వయోజన విద్యాకేంద్రం నిర్వహించాలని ప్రారంభించాడు కానీ అది సరిగ్గా సాగలేదు. అలా ముఖం మీద నిర్మొహమాటంగా రామస్వామి చెప్పాక, పగిడయ్య ఇంక తన జోలికి రాలేదు. అయితే, మార్గాంతరం వెతుక్కున్నాడు రామస్వామిని సాధించటానికి. బాలకార్మికుల చేత పనిచేయించటాన్ని ప్రభుత్వం నిషేధించింది. బాలకార్మికులను నియమించుకున్న యజమానికి జుర్మానాలు కూడా విధిస్తుంది. చట్టాలుంటాయి కానీ, స్వప్రయోజనాలకోసమే అవి అమలవుతుంటాయి. రామస్వామి బాలకార్మికుల జాబితా రాసుకున్నారు. ముప్పైవేల జుర్మానా విధించి వెళ్ళిపోయారు.

సాయంత్రం ఎప్పటిలా కార్ఖానాకు వెళ్ళిన తనకు ఈ విషయం తెల్సింది. రామస్వామి ఇంటికి వెళ్ళాడు తను. "నేను చెప్పానని కాళిందిని పనిలో పెట్టుకోబట్టే, మీకీ సంకట పరిస్థితి దాపురించింది. నన్ను క్షమించాలి" అన్నారు తను. రామస్వామి నవ్వాడు. "ఆ పిల్లే కాదులే, ఇంకా ఇద్దరున్నారు. నువ్వనవసరంగా బాధపడకు. రెండు రోజుల్లో విషయం సరిచేస్తా. 'అమ్మ పెట్టదు - అడుక్కోనివ్వదు' అన్న పద్ధతి మన ప్రభుత్వానిది. పిల్లల్ని పనిలోకి పెట్టుకోకూడదు. అది ఆదర్శం ఆచరణాత్మకమా అని ఆలోచించదు ప్రభుత్వం. రాజకీయనాయకులు ఆలోచించరు. మరి పెద్దవాళ్ళకు ఉపాధి

కల్పించు. పిల్లల్ని పనిలోకి పంపకుండా సంసారం గడిచిపోతే, ఏ తల్లీదండ్రీ అయినా పిల్లల్ని పనిలోకి పంపుతారా?! నువ్వు భోజన పథకం స్కూల్లో సక్రమంగానే నిర్వహిస్తున్నావు. మరి హాజరు అంతంత మాత్రంగానే ఉంటోందెందుకూ?"

"అలా అని ఆదర్శాలు లేకపోతే సమాజం పురోగతి సాధించలేదు" అన్నాడు తను.

"నిజమే. కానీ ఆదర్శాలు ఆకాశంలో విహరించుకూడదు. నేల మీద నడవాలి. సరే, ఈ చర్చలెందుకు గానీ, ఈ యువజన సంఘం కంప్లయింట్ వెనుక ఎవరున్నారో నాకు తెల్సు. పెద్దాయన్ను వదిలిపెట్టను."

అతనన్నట్టుగానే రెండు రోజుల్లో మళ్ళా కార్ఖానా తెరచుకుంది. జుర్మానా చెల్లించాడో లేదో తనకు తెలియదు కానీ, బాలకార్మికులకు మాత్రం ఉపాధిపోయింది. బంగారు బతుకు మళ్ళా యథాస్థితికి చేరుకుంది. తల్లికే కూలి దొరకటం ఇబ్బందిగా ఉంటే, కూతురికీ దొరకటం కష్టమయింది. డబ్బున్న రోజుల్లో ఓ గేదను కొన్నది బంగారు. ఊరిశివారు బంజరులో గేదను మేపటానికి గడ్డి కోసుకువస్తుంది కాళింది.

ఓ రోజు సాయంత్రం ఆమె గడ్డికోసి నెత్తిన పెట్టుకు వస్తుంటే, వెంకటేశం ఆమె వెంట పడ్డాడు. అతను బండి ఆత్మకూరు కాలేజీలో ఇంటర్మీడియట్ వెలగబెట్టి, అది పూర్తి చేయలేకపోయాడు. అతను పగిడయ్య నాలుగో సంతానం. కొడుకుని పైకి చదివించి పెద్ద ఉద్యోగం చేయిద్దామన్న అతని ఆశలు అడియాసలయ్యాయి. తండ్రిని అల్లించీ బెల్లించీ బండి ఆత్మకూరుకో, నంద్యాలకీ, కర్నూలుకో వెళ్ళి, రెండు రోజులు జల్సా చేసి, సినిమాలు చూసి, డబ్బయిపోయాక ఇంటికి తిరిగి వచ్చేవాడు. కొడుకును వ్యవసాయంలో పెట్టాలన్న పగిడయ్య ఆశలు సాకారం కాలేదు. సుఖం మరిగిన అతని శరీరం కాష్టానికి ఓర్చుకోలేదు. డబ్బు విలువా అతనికి తెలియదు.

అలా పైలాపచ్చీసుగా తిరుగుతున్న వెంకటేశం దృష్టి కాళింది మీద పడింది. అప్పుడే ఒంపులు తిరుగుతున్న శరీరం. కులమేదయినా అనుభవించటానికి అడ్డేముంది! కాస్తంత రోమాన్సు ఆమెతో సాగిద్దామని అతనికనిపించింది. అయితే, తను ఎప్పుడు పలకరించినా ఛీకొట్టి వెళ్ళిపోయేది కాళింది.

ఓ సారి మిత్రుడు ఏసోబు కూడా తనని ఎగతాళి చేశాడు "ఏందిరోయ్, దానెంటపడుతున్నావు?" అని.

"ఎట్టుంది, మన పసందు?" అనడిగాడు వెంకటేశం

"ఏందీ, దాన్ని పెళ్ళి చేసుకుంటావా? మీ నాయనకు తెలిస్తే నీ మక్కెలిరగదంతాడు."

"మా నాయనకేం తెలుస్తుంది, బే! పెళ్ళిగిళ్ళీ అని పెద్దమాటలెందుకు చెప్తావు?"

"మరిదానెంటెందుకు పడుతున్నావు?"

"ఓరి, బుర్ర తక్కువ నాయాలా! బతుకన్నాక కాస్తంత రోమాన్సుండాలిరా!"

"కూలి నాలి చేసుకు బతికేదిరా, దాన్నొదిలెయ్యి. కొత్త సినిమా వచ్చిందట. బండి ఆత్మకూరు ఎళ్దామా?"

"సరే పద, దాన్ని మాత్రం నేను వదల్ను పగిడయ్యగారి కొడుకు పట్టేందో నీకు తెలవదు."

ఆ పట్టు ఆ రోజు చిక్కించుకునే ప్రయత్నం చేశాడు వెంకటేశం.

"ఏందే, కాళిందీ. గీర్వాణం ఎక్కువైంది నీకు. పలకరిస్తే ముఖం చిటముటలాడిస్తవు!"

"నాతో నీకు మాటలేంది. నీ తోవన నువు వెళ్ళు" అంది కాళింది.

"నాతోవలోనే వెళ్తుండా. నువ్వు కనిపించాక, నీతో కబుర్లాడాలనిపించింది"

కాళింది మాట్లాడకుండా వడివడిగా నడవసాగింది. ఆమె పొగరు చూసిన వెంకటేశానికి మండింది. ఆమెను

దాటి ముందుకు వెళ్ళి, అడ్డంగా నిలబడ్డాడు.

"ఏందీ, అడ్డంగా ఆంబోతులా నిలబడ్డావు, అడ్డులే" అంది కాళింది.

"నాతో మాట్లాడందే నిన్ను పోనివ్వను"

"ఏందో చెప్పు"

"ఇక్కడ కాదు. ఆ దేవుడమ్మ గుడికాడ కూర్చుని మాట్లాడుకుందాం, పద"

"నేను రాను, మా అమ్మకు తెలిస్తే నా ఒళ్ళు చీరేస్తాది."

"మీ యమ్మకెట్లా తెలుస్తాదే, నువ్వు చెప్పకపోతే"

"నన్ను పోనీమన్నానా?"

ఇంక మాటలతో పనిలేదని తెల్సిపోయింది వెంకటేశానికి. ఆమె చెయ్యిపట్టుకుని బరబరాలాక్కు వెళ్ళాడు దేవుడమ్మ గుడికి. ఊరిశివారుల్లో ఉన్న గ్రామదేవత గుడి అది. సందర్భాల్లో తప్ప జనమెవరూ అక్కడికి రారు. అక్కడికి ఆ గుడి ఎంతో దూరం లేదు. కాళింది గుంజుకున్నా వదల్లేదు వెంకటేశం. "సచ్చినాడ! నీ జిమ్మడ!" తిట్టింది ఆమె అతన్ని.

"మరిమంచిగా రమ్మంటేరావు. కూర్చో, మాట్లాడుదాం." అన్నాడతను పళ్ళికిలిస్తూ.

"నీతో ఊసులాట్టానికి నాకు టైంలేదు. నీకేంది, అచ్చోసిన ఆంబోతులా తిరుగుతుండవు. నిన్ననేవాళ్ళు లేరు. అదుపు చేసేవాళ్ళు లేరు" అని తిరుగు ప్రయాణం కట్టింది కాళింది.

దేవుడమ్మ గుడి ముందున్న పెద్ద మర్రి చెట్టు, ఊడలు దిగి ఆ అసుర సంధ్యలో దయ్యంలా చేతులు చాచి విస్తరించినట్లుగుపించిందామెకు. కాళింది కేదో భయమేసింది. అంతే, గబాగబా అడుగులేయసాగింది.

తన్ను పట్టించుకోకుండా వెళ్తున్న కాళిందిని చూసి మంటలేచింది వెంకటేశానికి. ఒక్క గంతువేసి, వెనకనుండీ ఆమెను వడిసి పట్టుకున్నాడు. ఆమె అతన్ని వదిలించుకోవాలని గట్టిగా ప్రయత్నం చేసింది. నెత్తికున్న గడ్డిమోపు కింద పడిపోయింది. భారం దించుకున్న ఆమె గడ్డపారతో అతని భుజం మీద ఓ దెబ్బ వేసింది. తనచేతులు కదలకుండా వెనక్కి వడిసి పట్టుకున్నందువల్ల ఆమె గడ్డపార దెబ్బకు అతని భుజం గీరుకుపోయి రక్తం కారసాగింది. ఇంక పిచ్చి కోపం వచ్చింది వెంకటేశానికి. పిచ్చావేశం అతన్ని ఆవహించింది. ఆమెను ఎత్తుకు వెళ్ళి గుడి ముందరి మండపంలో పడేసి, ఆమె మీద పడ్డాడు. అతన్నుండీ తప్పించుకోవాలని ఆమె శాయశక్తులా ప్రయత్నించింది. అతని చేతుల తాకిడితో ఆమెలోనూ ఏదో బలహీనత ప్రారంభమైయింది. అతనామెను పూర్తిగా ఆక్రమించాడు. ఆఖరి ప్రయత్నం చేసి దెబ్బలు తింది. నిస్త్రాణగా కిందపడి ఉన్నా కాళిందిపై అతని పురుషాహంకారం ప్రతీకారం తీర్చుకుంది. కోరిక తీర్చుకుని లేచి నిలబడ్డ వెంకటేశం " ఈ రేప్ సంగతి మీ అమ్మగ్గానీ, ఊళ్ళోమరెవరిగ్గానీ చెప్పినావంటే నీ ప్రాణం తీస్తా" అన్నాడు.

దిగ్భ్రమలో ఉన్న ఆమె "రేపేంది? మళ్ళా రేపు కూడా ఇట్టా చేస్తావా?" అని అడిగింది.

"రేపంటే ఇప్పుడు నేను చేసిందేనే, పిచ్చి మొహమా?" అతనికిప్పుడు ఆమె పట్ల ప్రేమ కలిగింది.

"మళ్ళా కలుద్దాం!" అని కాలరెగరేసుకుంటా వెళ్ళిపోయాడు వెంకటేశం.

ఓ క్షణం తియ్యగా, హాయిగా ఉన్న అనుభూతి కలిగింది కాళిందికి. మరుక్షణం కంపరం కలిగింది. ఒళ్ళంతా కాలుష్యం పాకినట్లయింది. లేచి గడ్డిమోపెత్తుకుని, గడ్డపార చేతిలో పట్టుకుని ఇంటికి పోయింది. గుడిలో దేవుడమ్మ

నిరోమయంగా ఆమె వంక చూసింది, పోతూంటే. అవును, దేవత మాత్రం అన్ని అన్యాయాలు, అక్రమాలు ఆపగలదా!.

"ఏందే, ఇంతసేపెక్కడ సచ్చినావే?" అనడిగింది తల్లి.

కాళింది మాట్లాడలేదు. వచ్చి, తల్లి వంట చేస్తుంటే పక్కన కూలబడింది. పైట సరిచేసుకుంటుంటే రొమ్ములపై వెంకటేశం చేతులు కదలాడినట్లయింది. రేపు వాడు మళ్ళా ఇట్లా చేస్తేనూ? చెయ్యనీ –

"రేపటినుండీ నేను గడ్డి కోయటానికి ఎళ్ళను. నువ్వే ఎళ్ళు" అంది

"ఏమయిందే నీకు?"

'అవును, ఏమయింది తనకు. ఇట్లా మొగాడూ, ఆడదీ కలిస్తే పిల్లలు పుడ్తారంట! తనకూ కడుపొస్తుందా?'

"పిల్లలెట్టా పుడ్తారే, అమ్మా?"

"ఎట్టాగో పుట్టి సత్తారు. ఇప్పుడు నీకు ఆ ఆరాలెందుకు?"

"మరే, ఆ పగిడయ్యగారి ఎంకటేశం లేడూ, ఆడునన్నేదో చేసిండు"

"ఏంచేసిండు"

అందుకామెకు ఏం సమాధానం చెప్పాలో తెలియలేదు. వెళ్ళి, గుడిసెలో ఓ మూలపడుకుంది. బంగారుకు మనసులో గుబులయింది. పొయ్యిమీద గిన్నె దింపి, కూతురి పక్కన కూర్చుని, ఆరా తియ్యటం మొదలెట్టింది. కూతురి సమాధానాలు విన్న బంగారుకు శివమెత్తినట్లయింది. ఉన్న బాధలు కాక ఇప్పుడిదో బాధ! వెంటనే పరుగెత్తుకుంటూ తన ఇంటికి వచ్చింది. ఇది తన శక్తికి మించిన సమస్య పగడయ్యను ఎదుర్కోగల మనిషి రామస్వామి. తామిద్దరూ రామస్వామి ఇంటికి వెళ్ళారు.

ఆ సమయానికతను స్నానం చేసి, భోజనానికి ఆయుత్తమవుతున్నాడు. వెళ్తూనే అతని కాళ్ళ మీద పడిపోయింది బంగారు.

"అయ్య! నువ్వే నన్ను కాపాడాలి. ఆ పగిడయ్యగారి ఎంకటేశం నాకూతుర్ని చెరిపేసినాడు. బంజరులో గడ్డి కోసుకొస్తా ఉండినాది అది. దారి కాచి, దాని బతుకు బుగ్గ చేసినాడు, నాయనో! నేనేం చేతురా నాయనో!!" అని శోకాలు పెట్టసాగింది.

ప్రశ్నలు వేసి సంపూర్ణంగా విషయాన్ని రాబట్టాడు రామస్వామి. ఓ క్షణం ఆలోచనలోపడి, తలపంకించాడు. అతని మనసులోని ఆలోచనలు తను పసిగట్టగలడు. పగిడయ్యను సాధించడానికి ఎప్పటినుండో ఎదురుచూస్తున్న తరుణం లభించినట్లయింది అతనికి. ఊళ్ళో రెండు బ్రాహ్మణ కుటుంబాలుండేవి. అందులో ఒకాయన కరణం. మండల వ్యవస్థ వచ్చి గ్రామాధికారి పదవి కోల్పోయాక ఆయన ఎక్కువ కాలం బతకలేదు. ఆయన పిల్లలు చదువుల నిమిత్తం వాళ్ళూ ఊరొదిలి వెళ్ళిపోయారు. వాళ్ళకిప్పటికీ ఊళ్ళో పొలాలున్నాయి. వాటిని కౌలుకిచ్చి ఎప్పుడో సంవత్సరానికొకసారి ఊరూ, ఇల్లూ చూసుకోవటానికి రావటమే కానీ, గ్రామాన్ని గురించి వాళ్ళకేం పట్టదు. కాపులున్నారు, బలిజులున్నారు. కానీ మోతుబరు లెవ్వరూ లేరు. ఊరిలో అధిక సంఖ్యాకులు పంచాణం వారే. ఊరి పెత్తందార్లు పగిడయ్య, రామస్వామి ఆ కులాలకు చెందినవాళ్ళే. ఊరి శివారు పల్లెలో మాలలు, మాదిగలు నివశిస్తుంటారు. దుర్మార్గం చేసింది పంచాణం వారి పిల్లవాడు. వాడిని బయట పడేయడం ఇష్టంలేదు రామస్వామికి. అయితే పగిడయ్యను సాధించాలి. వ్యవహారం గుట్టు చప్పుడు కాకుండా నిర్వహించాలి. పంచాణం వారిలో ఐదు కులాలవారున్నా, డబ్బు, హోదా, చదువు వాళ్ళల్లో వర్గదృక్పథాన్ని ప్రవేశపెట్టాయి. డబ్బున్న వాళ్ళ కులాలు పెద్ద కులాలయ్యాయి. బంగారు కుటుంబమూ పంచాణం

కుటుంబానికి చెందిందే కానీ, డబ్బు లేని పేదరాలవటం వల్ల గ్రామంలో హీన కులజరాలయింది. కులాల వృత్తులందరూ మానేశారు. లాభసాటి అయిన వృత్తిని చేపట్టారు. గ్రామంలో అధిక సంఖ్యాకుల వృత్తి వ్యవసాయమే.

"ఏడవకు, పగిడయ్య కొడుకుతో నీ పెళ్ళి జరిపిస్తా, అయితే, విషయం మరో చెవికి చేరనివ్వకు" అని తమని వెంటబెట్టుకుని పగిడయ్య ఇంటికి వచ్చాడు. పగిడయ్య ఇంట్లో లేడు, పని మీద కర్నూలుకి వెళ్ళాట్ట.

అయితే, రామస్వామి చేతులు ముడుచుకు కూర్చోలేదు. తమని ఇంటికి వెళ్ళమని చెప్పి, పంచాణం కులపెద్దలను పిల్చి తన ఇంట్లో మీటింగు పెట్టాడు. సహజంగానే డబ్బున్నవారంటే పేదవారికి పడదు. అవకాశం దొరికినప్పుడల్లా ధనికులు పేదలను తక్కువగా చూస్తారు. వీలయినప్పుడు అన్యాయం చెయ్యటానికీ, దోచుకోవటానికీ వెనుకాడరు. ధనికుడిని సాధించే ధైర్యం లేక అణిగి ఉంటారు పేదలు. దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుల పెద్దలందరికీ ఆశ కలిగింది. పగిడయ్య పడే ఇబ్బందిని తల్చుకుని మనసులో సంబరపడిపోయారు. ఇందులో కాళిందికి జరిగిన అత్యాచార ప్రమేయమేం లేదు. అది వాళ్ళకు ఒక అవకాశం మాత్రమే.

మర్నాడు పొద్దున పదిగంటలకు పగిడయ్య ఊరికి చేరాడన్న వార్త తెలిసి, రామస్వామి పంచాణం కుల పెద్దలతో కలిసి పగిడయ్య ఇంటికి వెళ్ళి పంచాయితీ పెట్టాడు. పగిడయ్య అంత తేలిగ్గా బెదిరిపోయే రకం కాదు. పెద్దలు చెప్పినదంతా ప్రశాంతంగా విన్నాడు. "మావాడు అట్టాంటివాడు కాదు." అన్నాడు చివరకు.

"ఇంటర్మీడియట్ గట్టెక్కటం చేతకాక బలాదూరు తిరుగుతున్న వాడి సంగతి, కొడుకు మీద ప్రేమలో నీకు తెలియక పోవచ్చు గానీ, వాడెట్టాంటి వాడో జనాలకు తెలుసు. మాటలెందుకు పెద్దాయనా! వాడిని పిలిచి అడుగు. తేలిపోతుంది." అన్నాడు రామస్వామి.

"పేదరాలిని అన్యాయం చెయ్యకయ్యా! దేవుడు చూస్తూ ఊర్కోడు" అన్నాడు సాలె జంగమయ్య.

"దేవుడి సంగతులు అట్టా ఉంచు. ముందు ఆడు పోలీసుల చేతుల్లో నుండీ బయటపడ్డే కదా!" అన్నాడు కంసాలి విఠలాచారి.

పోలీసులన్నాక కాస్తంత గుబులు పుట్టింది పగిడయ్యకు. కొడుకును పిల్చి అడిగాడు, "ఏందిరా, నువ్వేదో ఆ బంగారు కూతుర్ని ఏదో చేసినావంట!" అని

"ఏంచేసినా! నేనేం చెయ్యలేదు. అదే బలవంత పెట్టింది" అన్నాడు వెంకటేశం.

కొడుకు బెదురు చూపులు చూసిన పగిడయ్యకు విషయం నిర్ధారణ అయింది, మనసూ కరిగిపోయింది. అయితే అందరిముందూ కాఠిన్యం ప్రదర్శించ తప్పదు. "ఛీ!పో!! తప్పుడు నాకొడకా! చెడబుట్టావురా!!" అని వాడి చెంపలు వాయించి వాడిని పంపేశాడు.

ఆ తర్వాత "ఇంతకీ జరగాల్సిందేమిటో చెప్పండి. కుర్రనాయాళ్ళు తెలివి తక్కువతో ఏదో చేస్తుంటారు. పెద్దమనసు చేసుకుని మనం పరిష్కారం ఆలోచించాలి." అన్నాడు పగిడయ్య

"జరగాల్సిందేంది? ఆ పిల్లని నీ కొడుక్కిచ్చి పెళ్ళి చెయ్యి" అన్నాడు విఠలాచారి.

"నీ కొడుకే ఆ పని చేస్తే నువ్వు దాన్ని కోడలుగా చేసుకుంటావా?"

"చావచితగ్గొడతాను. నేనేవాడి మీద పోలీసు కంప్లైంటు ఇస్తాను"

"పోలీసుకు కంప్లైంట్ ఇచ్చి చూడు నేనేం గాజులు తొడుక్కుకూర్చోలేదు. పోలీసులు నాకేం కొత్తకాదు. ఆ దౌర్భాగ్యురాలిని కోడలుగా చేసుకోవటం కంటే పోలీసు కంప్లైంటు ఇస్తేనే మంచిది". ఎంతో కాలం సర్పంచిగా

చేసినవాడు పగిడయ్య. ఒకటి, రెండు మర్డరు కేసుల్లోనూ ఇరుక్కుని బయటపడినవాడే మండలంలోనే ఎగబాకి ప్రాబల్యం పెంచుకుంటున్న మనిషి. వీళ్ళంతా ఇప్పటిదాకా తన ముందు నోరు తెరిచేవారు కారు. ఇవ్వాళ నోరు తెరుస్తున్నారంటే జరిగిన ఛిద్రంలో ఒనగూడే లాభాన్ని మింగటానికే అని అతనికి తెల్సు. పోలీసు కేసు మాఫీ చేయగలిగిన సత్తా తనకున్నా, పోలీసుతో పెట్టుకోటం కొరివితో తల గోక్కోవటమే. అంతకంటే ఈ నక్కలతో బేరం కుదుర్చుకోవటం శ్రేయస్కరం. విషయం తెల్సిన వెంటనే వాళ్ళు పోలీసు కంప్లైంటు చేయలేదంటే వాళ్ళలో ధర్మాగ్రహం ఎంతపాటిదో అంచనా వెయ్యగలిగాడు పగిడయ్య. మానభంగం జరిగిన వెంటనే అందుకు గురయిన స్త్రీని డాక్టరు పరీక్షకు పంపాలి. కాలం గడుస్తున్న కొద్దీ ఆ సాక్ష్యాలు కనుమరుగవుతాయి. అప్పుడు పోలీసులూ తన్నంతగా బాధపెట్టలేరు. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షులెవరూ లేరు. కనుక వాయిదా వెయ్యటం, కాలం గడపడం మంచిదన్న ఆలోచనకు వచ్చాడు పగిడయ్య. కాళిందిని తన కొడుక్కు చేసుకోవాలన్న ఆలోచన అతనికి కలలో కూడా కలగదు. అసలాభావనే అతనికి కంపరం కలిగిస్తుంది. దాన్ని కోడలుగా చేసుకోవటం అంటే దరిద్రపు పెద్దమ్మను ఇంట్లో తెచ్చిపెట్టుకోవటం. కొడుకు దుశ్చర్య కూడా అతడికి ఉడుకు రక్తపు ఆవేశంలో చేసినదుడుకు చర్యే గానీ, దుర్మార్గమనిపించలేదు పగిడయ్యకు. రెండు గంటలు వాడిగా, వేడిగా పంచాయితీ జరిగాక, వాళ్ళందరికీ నమస్కారం పెట్టి, "నేను మా ఇంట్లో కూడా సంప్రదించి రెండురోజుల్లో మీతో మాట్లాడుతాను" అన్నాడు.

పగిడయ్య ఆలోచనలను చదివాడు రామస్వామి. "అట్లాగే, మేం పోలీసు కంప్లైంట్ చేస్తాం, మెడికల్ ఎగ్జామినేషనూ అవీ అయాక తీరిగ్గా పంచాయితీ పెట్టుకుందాం" అన్నాడు.

వాయిదా వెయ్యటం కుదరదని తేలిపోయింది పగిడయ్యకు "పోనీ, సాయంత్రం దాకా టైమివ్వు" అన్నాడు.

పగిడయ్య దిగివచ్చాక, సాయంత్రం వరకూ అతనికి సమయమివ్వటానికి సిద్ధపడ్డారు పెద్దలు. అయితే పగిడయ్య ఆ విషయం భార్య దగ్గర ఎత్తలేదు. ఆమె బయట జరిగిన రచ్చ విషయం అడిగినా, "ఆడముం...లకు అన్నీ కావాలి. ఏదో ఏడ్చాడు నీ కొడుకు దాన్ని.. నేను సరి చేస్తాగా! నువ్వనవసరంగా ఇట్లాంటి విషయాల్లో కల్పించుకోకు" అని కసిరాడు. మధ్యాహ్నం భోజనం చేసి, కాస్తంత కునుకు తీసి, మూడు గంటల ప్రాంతంలో రామస్వామి ఇంటికి వెళ్ళాడు. ఎప్పుడూ తన ఇంటికి రాని పగిడయ్య రావటం చూసి రామస్వామికి ఆనందమే కలిగింది. అది పగిడయ్య పతనానికీ, తన ఉత్థానానికి సంకేతమనుకున్నాడు అతను.

ఇద్దరి మధ్యా మాటలయ్యాయి. చివరిగా అడిగాడు పగిడయ్య "చూడు మనిద్దరం ఊరి పెత్తందార్లం. మనం తగువులాడుకుంటే ఊరు సంతోషిస్తుంది. పనికిరాని వెధవలంతా నోరు విప్పటం మొదలెడతారు. నీకేం కావాలో చెప్పు. సమస్య పరిష్కరిద్దాం" అని

"నువ్వు పెద్దాయనవు, నాకు గురువని చెప్పి నిన్నింతకాలం గౌరవించాను. బాలకార్మికుల విషయం ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి నాచేత జుర్మానా కట్టించావు. 'ఇందులో నాహస్తం లేదు. అంతా యువజన సంఘం వాళ్ళు చేసిందే' అని నువ్వు చెప్పినా నేను నమ్మను. వెనుక నీ అండదండలు లేకుండా వాళ్ళా పని చేయరు. నిన్న జరిగిన సంఘటన విషయంలో నేనూ యువజన సంఘం వాళ్ళను ఎగేసేవాడినే. నీమీద గౌరవంతో ఊరుకున్నాను. దీనికి ప్రచారం కల్పించకుండా గుట్టు చప్పుడు కాకుండా పనిపూర్తి చేసుకోటం మంచిది" అన్నాడు రామస్వామి.

"ప్రభుత్వం జుర్మానా వేసిన ఆ ముప్పైవేలు నేనిస్తాను"

"కుదర్దు. లక్షకు పైన తగ్గదు"

"ఆ మాటనకు. నువ్విప్పటికే కులపెద్దలనేసుకొొచ్చి రచ్చ చేసావు. ఆ నాయాళ్ళూ చేతులు తడపకపోతే ఊరుకోరు."

"సరే. నాకు ఎనభై వేలివ్వు. కొంత యువజన సంఘం వాళ్ళకు కూడా ఖర్చు పెట్టాల్సి ఉంటుంది"

"చివరిమాట! నువ్వు యాభై తీసుకో. కులపెద్దలను తలా ఐదువేలతో సరిపెట్టు. నేను పిల్చి మాట్లాడితే నిక్కీనీలుగుతారు. నువ్వే మాట్లాడి సెటిల్ చెయ్యి. యువజన సంఘం వాళ్ళ సంగతి నేను చూసుకుంటాను. రెండు క్రికెట్ కిట్లు కొనిస్తే, వాళే నోర్మూస్తారు."

"ఆ బంగారుకూ ఇరవైవేలివ్వు. ఇంతయాక దానికేం ఇవ్వకపోతే, సెటిల్‌మెంటు కుదర్దు. అది నోరు విప్పితే నీ పరువు పోతుంది. మనం మనం కుమ్మక్కయి నేరం మాఫీ చేస్తున్నామనుకుంటుంది"

"ఇరవైకాదు, పదిహేను. మరి మాట్లాడకు. రాత్రికల్లా అందర్నీ  కలిసి, విషయం సెటిల్ చేసి, నాదగ్గరకు తీసుకురా. విషయం ఫైనల్ చేద్దాం."

బంగారుకు ఎంతిచ్చినా అభ్యంతరం లేదు రామస్వామికి. తన నష్టం పూడటమే కాక ఊళ్ళో తన పలుకుబడి పెరగటం రామస్వామికి కావాల్సింది. కులపెద్దలకు వట్టి పుణ్యాన ఒళ్ళోపడే డబ్బు చేదు కాదు. పగిడయ్యకూ నష్టం లేదు. కొడుకు దుర్కర్చులకు పెట్టుబడి పెట్టేవాడు ఎవడో పుట్టే ఉన్నాడు. కట్నం రూపేణా కొడుకు పెళ్ళిలో భారీ మొత్తమే గుంజుతాడు. అంత డబ్బు కళ్ళజూస్తే బంగారు మనసూ కరిగిపోతుంది. నష్టపోయేదెవరయినా ఉంటే కాళిందే ఆమె లెక్కలోని మనిషి కాదు.

రామస్వామి ఊరి పెద్దలు నలుగుర్నీ పిలిచి, పగిడయ్య చెప్పిన మొత్తానికి బేరం సెటిల్ చేశాడు. పైకి నీతీ - న్యాయం మాట్లాడినా, పచ్చకాగితం రెపరెపలకు వాళ్ళు తట్టుకొలేకపోయారు. అందరికీ సామాజిక న్యాయం జరిగేటప్పుడు ఒక్క మనిషిది లెక్కా? నీతీ - న్యాయాలు భూస్థాపితమయ్యాయి.

రాత్రి బంగారు, కుల పెద్దలను వెంటబెట్టుకుని పగిడయ్య ఇంటికి రామస్వామి వచ్చాడు. బంగారును చూడగానే పెద్ద ఎత్తున ఎగిరిపడ్డాడు పగిడయ్య.

"ఏందే, ఒళ్ళు బలిసి కొట్టుకుంటున్నావంట! నామీద ఫిర్యాదు చేస్తావంట! నీ బతుకేంది, నువ్వేంది. నేను తల్చుకుంటే క్షణంలో బుగ్గయిపోతావు. పెద్దింటోడి కొడుకు అట్టాంటి తప్పుడు పని చేస్తాడా? గుడిసేటిది నీ కూతురే ఆడిని ప్రలోభ పెట్టిందంట! కండకావరమెక్కింది దానికి. విరగబొడుస్తా. దాని సంగతి నేను పోలీసోళ్ళకు కంప్లైంటు చెయ్యబోతున్నా. ఆళ్ళు నిన్నూ, నీ కూతుర్ని బొక్కలో తోసి తోలు వలిస్తే గానీ, నీ కళ్ళు తెరిపిళ్ళు పడవు."

"ఇదేంది నాయనో! ఎద్దురంకు కడుతున్నావు" అనిగోల పెట్టింది బంగారు.

"కుర్రనాయాళ్ళు ఊళ్ళో కులాసాగా తిరిగే ఊసే కరువైంది. నీ కూతుర్ని కట్టడి చేసుకోకుండా ఆ కుర్రాడి మీదపడి ఏడుస్తావేందే! నోర్మూసుకో" అన్నాడు విఠలాచారి.

"సర్లే, పిల్లగాళ్ళేందో తెలీక పొరపాటు చేశారు. దానితప్పుందో, ఈడితప్పుందో, విచారిస్తూ పోతే ఎటూ తేలం. పెద్ద మనసు చేసుకుని సమస్యకు పరిష్కారమేందో చూడు" అన్నాడు రామస్వామి.

"దాన్ని నా కొడుక్కిచ్చి పెళ్ళిచేయటం కల్ల. తిరుగుబోతు దాన్తో నా కొడుకు సంసారం చెయ్యలేడు. మరింకేమయినా పరిష్కారముంటే మీరు చెప్పండి" అన్నాడు పగిడయ్య

"తప్పెవరిదయినా నష్టపోయింది ఆ పిల్ల. నీ కొడుకుగాదు. నష్టపరిహారంగా దానికో ఇరవైవేలు ఇప్పించు"

అన్నాడు జంగయ్య.

"నీకేంది, నువ్వెంతయినా ఇవ్వమంటావు. నాదగ్గర అంత డబ్బు లేదు."

"పోనీ పదిహేను"

"ఏందయ్యా, నా కూతురి మానానికి ఎల కడుతున్నారా?" అని హీన స్వరంతో మొత్తుకుంది బంగారు. డబ్బు కళ్ళబడే ఆశ ఆమె నోరునప్పటికే నొక్కేసింది.

"నా కొడుక్కూ పరువూ, ప్రతిష్ఠాపొయ్యాయి. దానికి నువ్వేం ఇస్తావే. పదివేలివ్వు. నేనేం మాట్లాడను"

"నా దగ్గరెక్కడున్నది డబ్బు! కూటికి గడవటమే కష్టమవుతుంటే."

"అందుకే జాలిపడి, నేనిస్తున్నది తీసుకో."

"సరే, రేపు కడుపో కాలో వస్తే" అడిగాడు కాళింది మంచిని భుజస్కందాల మీద భరిస్తున్న రామస్వామి.

"అది తీయించే బాధ్యత నాది, సరేనా?"

బంగారుకు వేరు మార్గం కనిపించలేదు. పగిడయ్య తన కూతుర్ని కోడలుగా చేసుకుంటాడన్న ఆశ ఆమెకు లేదు. పోలీసుల దగ్గరకు వెళ్ళే సత్తా తనకు లేదు. వెళ్ళినా తనకు న్యాయం జరుగుతుందన్న భరోసా లేదు. పైన పరిహారంగా పైకం కనపడుతోంది.

ఆమె ఏం మాట్లాడక పోవటం చూసి "ఏమంటావో చెప్పు, నాకు పడుకునే టైమవుతున్నది. సమయానికి పడుకోబోతే నాకు నిద్ర పట్టదు" అన్నాడు పగిడయ్య.

"సరే" అంది బంగారు.

"రేపొచ్చి తీసుకెళ్ళు"

"రేపంటే కుదర్దు. ఇప్పటికిప్పుడు ఆమెకు డబ్బిచ్చి పరిష్కారం చెయ్యి" అని తన నిర్మోహమాటత్వాన్ని వ్యక్తపరిచాడు రామస్వామి.

పగిడయ్య లోపలకు కెళ్ళి ఆమెచేతిలో పన్నెండు వేలు చేతిలో పెట్టాడు. ఇస్తూ, "ఆడు మొగాడయి పొయ్యాడు కనక నాకే నష్టం తప్పటం లేదు. ఏమీ జరగలేదు. మరెవరి చెవికన్నా విషయం చేరిందో, నీ ప్రాణం తీస్తా" అన్నాడు పగిడయ్య.

అలా విషయం గుట్టుచప్పుడు  కాకుండా నడిపించాడు రామస్వామి. జనం చెవులు కొరుక్కున్నారు గానీ, పెద్దోళ్ళ విషయం కనుక బయటపడలేదు. క్రికెట్ కిట్లూ, షటిల్ కాకులూ చూసి మురిసిపోయింది యువజన సంఘం. యువతకు ప్రోత్సాహమిచ్చే ఉదారుడు పగిడయ్య! నిర్భాగ్యురాలు కాళింది సంగతి ఎవరికీ పట్టలేదు.

ఆ మర్నాడు రామస్వామి కార్ఖానాకు వెళ్ళినప్పుడు తను అతన్ని అడిగాడు " ఆ ఆడపిల్ల శీలం ఖరీదు పన్నెండువేలని పెద్దలు నిర్ధారించారట! అది నాకు న్యాయమనిపించలేదు" అని.

"ఏం చేయమంటావు పంతులూ! అన్యాయమే. కానీ, తప్పలేదు. ఆ పాపిష్టోడు దాన్ని కొడుక్కు చేసుకోనని మొండికేసి కూర్చున్నారు. పోలీసులకు తెలిస్తే రచ్చవుతుంది. మానభంగానికి గురయిన ఆడదానికి పెళ్ళవుతుందా? అది మాఫీ చేయగలిగిన డబ్బు బంగారు దగ్గరుందా? అందుకే చచ్చిన వాడికి వచ్చిందే కట్నమని అంగీకరించాల్సి వచ్చింది" అన్నాడు.

"అవును. మీ పరిష్కారం వల్ల అందరికే లాభమే కలిగిందిగానీ, ఎవరికీ నష్టం లేదు" అన్నాడు తను.

"నువ్వు పంతులివి కదూ, అలాగే మాట్లాడతావు! ఓ మాట. అసలు శీలమంటే ఏంది? శరీరానికి సంబంధించిందా, మనసుకు సంబంధించిందా? దానికి ఏక్సిడెంటులో గాయమైంది. రెండు రోజుల్లో మానిపోతుంది. దానికిష్టం ఉండి, వాడితో చరించింది కాదు అది. కనుక శీలం పోలేదు. నువ్వసరపు అర్థాలు తీస్తున్నావు ఆ విషయం మర్చిపోవటం మనందరికీ ఆరోగ్యకరం."

అవును. అందరూ మర్చిపోయారు. ఆర్థిక అవసరాలు మనుషులను వివశులను చేస్తాయి!

అలా ఆలోచనల్లో మునిగిన సాంబశివుడికి అన్నం మాడిన వాసన వచ్చింది. ఒక్కసారిగా ఉలిక్కిపడి, గిన్నె తీసి కింద పెట్టాడు. 'మాడో, పాడో తినక తప్పదు. కూడు దొరికినందుకు భగవంతుడికి ధన్యవాదాలర్పించక తప్పదు' అనుకుంటూ బయట వసారాలోకి వచ్చాడు.

ఇంకా అక్కడే కాళింది నుంచుని ఉంది.

"ఏంకావాలి? ఇంకా ఇక్కడే నిలబడ్డావు?"

"నన్ను... నన్ను.." నసిగింది కాళింది.

"ఊఁ నిన్ను... నిన్ను..."

"నన్ను రేప్ చెయ్యవూ, పంతులూ?"

దిమ్మతిరిగి పోయింది సాంబశివుడికి.

"ఛీ,పో...! ఇంకా ఇక్కడ నిలబడ్డావంటే చావగొడతాను" అని పెద్దగా అరిచాడు సాంబశివుడు.

కాళింది భయపడి వెళ్ళిపోయింది.

మాడిన అన్నమే తిని, పక్క మీద పడుకున్న సాంబశివుడికి కళ్ళంబట నీళ్ళు వచ్చాయి. రెండు కారణాలు కనిపించాయి సాంబశివుడికి ఆమె అభ్యర్థనలో.

ఒకటి బంగారు ఇదో సంపాదనా మార్గంగా ఎంచుకుందా? కూతురుచేత వ్యభిచారం చేయించి, డబ్బులు సంపాదించాలని ఆలోచిస్తుందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు తను తెలుసుకోలేడు. రెండు ప్రకృతి కూడా కాళిందికి అన్యాయం చేసింది. ఆమెను ఆమె హితానికి వ్యతిరేకంగా రెచ్చగొడుతోంది. వాడాపిల్లలో కామాగ్నిని జాగృతం చేశాడు. ఆమె అనుభవానికి తపన పడుతోంది. విషయం చూచాయగా తెల్సిన ఊరి యువకులెవరూ ఆమెవంక చూట్టానికి కూడా ధైర్యం చెయ్యటం లేదు. తాము ఎక్కడ ఏ కేసులో ఇరుక్కోవలసివస్తుందేమోనన్న భయం! వెంకటేశాన్ని తండ్రి కర్నూలులో ఉంచి, ట్యూషన్ పెట్టి ఇంటర్మీడియట్ పూర్తి చేయిస్తున్నాడు. ఊరికి రాకూడదన్నది తండ్రి తాఖీదు. ఒకవేళ వచ్చినా అతడాధైర్యం చేయలేడు. పట్నంలో విచ్చలివిడి తనానికి బోల్డంత అవకాశం ఉంది. పల్లెపిల్ల కోసం ఆరాటపడాల్సిన అవసరం అతనికి లేదు. తాను మొదటి నుండీ బంగారు కుటుంబానికి చేతనయిన సాయం చేస్తున్నాడు. ఏ అవసరమొచ్చినా తల్లీ కూతుళ్ళు తన దగ్గరకు వస్తారు. ఈ అవసరమూ తీరుస్తానని వచ్చిందా పిల్ల?!!!

కాళింది భవిష్యజ్జీవితం అతనికి భయంకరంగా కనబడింది. రాత్రి ఎంతసేపటికో గానీ అతనికి నిద్రపట్టలేదు.

*****

# మధ్యతరగతి - మందు భాగ్యం



వెల్చేము - చంద్రశేఖర

"ఇఫ్ రేప్ ఈజ్ ఇనెవిటబుల్, వైనాట్ ఎంజాయ్ ఇట్" అన్నాడో మహానుభావుడు.

ఆరోజు అలాగే జరిగింది. చిన్నన్నయ్య మనవడి అన్నప్రాసన కని చేరిన మా కుటుంబ సభ్యులు, చిన్నన్నయ్య దూకుడికి గురయ్యారు. చిన్నన్నయ్య మృదుభాషి, కానీ ఆ రోజు మందుకొట్టాడు. కొంత తాగాక నాకింక చాలు "ఫలహారం చేసి పడుకుంటా!" అంటూ వసారాలోకి వెళ్ళాడు. అక్కడ అందరూ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఆ సమయంలోనే సాయంకాలం పాలవాడి పిలుపు చిరాకు కలిగించింది. చిన్నగా తూలుతూ వీధి గుమ్మం దగ్గర కెళ్ళి పాలవాడికి చూపుడు వేలు చూపిస్తూ "ఎందుకా అబద్ధపు అరుపులు నిజం చెప్పు పాలు అనకు నీళ్ళపాలు అని అరు" అన్నాడు

పాలవాడు కంగు తిన్నాడు "అదేమిటి బాబూ మంచిపాలే ఇస్తున్నాగా" అన్నాడు.

"మళ్ళీ అదే. పాలు అనకు తెల్లనీళ్ళు అను. పాలు అన్నవెప్పుడేనా సప్లైచేసావురా. కలిపేవేవో మంచినీళ్ళు కలపవోయ్... రాబోయే కాలంలో మనవడు స్ట్రాంగ్‌గా ఉండాలా? నీ విచ్చేపాలు తాగితే, వాడు పెద్దయ్యాక క్వార్టరు బాటిలుకే పడిపోతాడు. ఎంత అప్రతిష్ట! ఇంటిపేరు ప్రతిభావారు! ఆ మాత్రం ప్రతిభలేదా అని ఆడిపోయరూ? వెళ్ళు వెళ్ళు" అన్నాడు

ఆ సమయంలో పాలు తీసుకోవడానికి బైటకెళ్ళిన వదిన పాలవాడితో అన్నయ్య తాగాడని సైగ చేసింది. పాలవాడు మౌనంగా ఉండిపోయాడు. కానీ వదిన చేసిన సైగని అన్నయ్య పసిగట్టేసాడు.

"ఏం నేను ముసలాడ్ని అయిపోయాననా ఊళ్ళోవాళ్ళందరికీ సైగ చేస్తున్నావ్. ఎంత ముసలాడ్నయినా పదివేల రూపాయల జీతగాడ్ని... వదిలెయ్యకు మట్టిగొట్టుకు పోతావ్ " అన్నాడు హాస్యంగా.

"తాగుబోతు మాటలు మాట్లాడి నాకు కోపం తెప్పించకండి" అంది విసురుగా.

"ఏమిటీ నావి తాగుబోతు మాటలా, నాకు తాగుడు మైకం అయితే నీకు ఇన్‌స్టాల్‌మెంట్ల మీద పట్టుచీర పట్టుకురావాలా? ఎవడి బాబుగారి సొమ్మెట్టి తీరుస్తావ్! నా అరనెల జీతం కష్టార్జితం మట్టి కలిపెయ్యాలా! ఇప్పుడా

పట్టుచీర కట్టుకోకపోతే వచ్చే నష్టం ఏమిటి? ఎవడు నిన్ను చూసెయ్యాలి? మురిసిపోవాలి? చెప్పింది వినవుకదా! ఫ్రిజ్, కలర్ టీ.వీ ఆఖరికి ఇల్లుకూడా ఇన్‌స్టాల్‌మెంట్ల మీద కొందామని ప్రయత్నించావు! ఏమయింది? ఇన్‌స్టాల్‌మెంట్లు కట్టలేక ఇల్లు అమ్మిన వాడికే ఇచ్చుకోవాల్సి వచ్చింది. నాకూ వున్నాయి తెలివి తేటలు మిమ్మల్ని చేసుకున్నాను కాబట్టే ఇలాపడి వున్నా అంటావు. నీ శ్రాద్ధం తెలివితేటలు ఈ ఇల్లు చక్కబెట్టలేక పోయావు గానీ దేశాన్ని ఉద్ధరిస్తానంటావు. నీలాంటిది రాజకీయాల్లోకి వెళితే ఆంధ్రదేశాన్ని ఇన్‌ష్టాల్‌మెంట్ల మీద అమెరికా వాడికి అమ్మేయడం ఖాయం!"

ఆ మాటతో వదినకి కోపం వచ్చింది. "అలాంటి దాన్ని ఇన్నాళ్ళూ ఎందుకు భరించారు." అంది.

"సతి దగ్గర కొస్తే వున్న మతిపోయిందట" అన్నాడు చిన్నన్నయ్య వదిన్ని ఉబ్బేస్తూ...

"మతి పోగొట్టే పతి ఉన్నందుకు సంతోషించండి" అంది వదిన కోపాన్ని వదిలి... చిన్నన్నయ్య విచారంగా మొహం పెట్టి 'శోభనం నాడు సంతోషం, పురిటినొప్పుల్లో ఏడుపు తప్పలేదు నాకు" అన్నాడు.

వదిన చిరాగ్గా "మీకు పురిటి నొప్పులేంటి? మందెక్కువయింది" అంది.

"ఏడుపు పురిటినొప్పులకి కాకపోతే ఇన్‌ష్టాల్‌మెంట్లు కట్టలేక, నే చెప్పింది లోకోక్తి... వెర్రిమొహమా!" అన్నాడు చిన్నన్నయ్య తనని తాను సపోర్టు చేసుకుంటూ. "పోనీ కదా అని ఊరుకుంటుంటే, మరీ రెచ్చిపోతున్నారు. ఊరుకుంటారా? లేదా?" అంటూ వార్నింగ్ ఇచ్చింది వదిన... తనని పట్టుకు వెర్రిమొహం అనడం ఆవిడకి నచ్చినట్టులేదు.

"రెచ్చిపోవడం ఏమిటి? నేచెప్పింది పచ్చి నిజం. ఇంకో ఏడుపోతే గవర్నమెంటు వాడు నా ఉద్యోగానికి మంగళం పాడేస్తాడు. మనం ఎన్నేళ్ళు సర్వీసు చేసినా అద్దెకొంపలంట ముడ్లరగదీసుకు తిరుగుతున్నాం అంటే దేనివల్ల? నీ ఇన్‌ష్టాల్‌మెంట్ల వల్లకాదూ? పోనీ నీ సంగతొదిలెయ్! సుపుత్రులనతగ్గ వాళ్ళిద్దరున్నారు. జయవిజయుల్లా! కానీ ఏం లాభం నాలుగో జన్మ మనింటిలోనే జన్మించినట్టున్నారు. ఆలిపోషకం పెద్దవాడి నిత్యకర్తవ్యం, ఈరోజు చేసిన ఉద్యోగం రేపు చెయ్యడు. ఏదేనా అంటే ప్రతిభావారి ప్రతిభకే చేటు అంటాడు. రాత్రయే సరికి పెళ్ళాం పక్కలోకి దూరినంత తంచనుగా, ఏనాడేనా ఉద్యోగానికి వెళ్ళాడా? ఈ అప్రాచ్యుడు నోరిప్పితే అన్నీ అబద్ధాలే! వెనకెవడో చెప్పినట్టు హరిశ్చంద్రుని నోట అబద్ధమూ రాదు. నానోట నిజమూ రాదని పనిచ్చిన వాడికీ వీడు పనికి రాడు. ఇటుకన్న వాళ్ళకీ పనిరాడు. ఉద్యోగం పురుష లక్షణం అన్నారు... కానీ వీడికి అవలక్షణంగా కనిపిస్తోంది కాబోలు!

అర్ధరాత్రి పెళ్ళాం పక్కలో చేరి జీడిపప్పు పకోడీలు చప్పరించ చేతనైన వాడికి, పెంచి పెద్ద చేసిన అమ్మకీ నాన్నకీ వొక గుడ్డముక్క కొందాం అన్న ఇంగిత జ్ఞానం ఏమైనా ఉందా? వాడుద్దేశం ఏమిటంటే చీరపెడితే చిరిగిపోతుంది... అన్నం పెడితే అరిగిపోతుంది. బ్రెవాత పెడితే బతికినన్నాళ్ళూ వుంటుంది. అన్నట్టుగా వుంది......

సరి ఈ జయుడిలా తగలడితే ఇంకా విజయుడుగారు ఎప్పుడూ డేటాకలెక్షన్‌లో వుంటాడు. ఏ అమ్మాయి ఏ రంగువోణీ వేసింది? ఏ అమ్మాయి నడక ఎలా వుంటుంది? అన్నడేటా కలెక్షన్! పొద్దున్నే తయారై పెన్నూ పుస్తకం పట్టుకు వీడు సెంటర్లో హాజరు... అటుగావెళ్ళే అమ్మాయిలు బేజారు! ఆ సెంటర్లో బీటెయ్యకపోతే కాలేజీకి వెళితే పాసవడూ? పాసైతే ఉద్యోగం చెయ్యాలేమో అన్న భయం!

పోనీ ఆ సెంటర్లో అలా నిలబడే బదులు బజ్జీల కొట్టు పెట్టుకోకూడదూ? కాస్త ఆదాయమైనా వుంటుంది. దానికి నామోషీ! సొమ్మొకడిదీ షోకొకడిదీ అన్నట్టు బుర్రకో అక్షరమ్ముక్క లేదు. గానీ కాళ్ళకి మాత్రం ఐదొందలు పెట్టి

"షూ" కావాలి! నోట్లో సిగరెట్ కావాలి! ఇదీ రెండో వాడి ఫండమెంటల్ హిస్టరీ... వీడన్న ఆకుల మీద నడిస్తే వీడు చిగుళ్ళ మీద నడిచే రకం. వీళ్ళేరకాలైనా నాకు మాత్రం మారకగ్రహాల్లా తయారయారు."

"అందుకే ఆడపిల్లలు నయం. పెళ్ళి చేస్తే చక్కగా అత్తారింటికి పోతారు" అంది వదిన ఏదో పాయింట్ కొట్టేద్దామన్న ఉద్దేశంతో....

చిన్నన్నయ్య పగలబడి నవ్వాడు. "ఇంక వీళ్ళ గురించి చెప్పవలసి వస్తే పెద్ద కథే చెప్పచ్చు! ఈ దేశంలో కన్యాకుమారి నుండీ కాశ్మీరం వరకూ ఎన్నటికీ కంచికిపోని కథల్లో అల్లుళ్ళ కథొకటి. వెనకటి కెవర్తో "తేలు తేలు" అని అరిచిందట. మగాళ్ళని పిలవ్వే అన్నాడట దాని మొగుడు. "మీరు మగవారు కాదా?" అందిట ఆ ప్రతివ్రత "సమయానికి బాగా గుర్తుచేసావ్ కర్రతెమ్మన్నాడట!" అలా వుంటుంది. అల్లుళ్ళ తంతు.... మావగారి ఇల్లంటే స్టేట్‌బాంక్ అనుకుంటాడో, ఏమో? అవసరమైనప్పుడల్లా ఎమౌంట్ చెప్పి, అల్లుడు అన్న షాంపొకటి అఘోరించి, విత్ డ్రాయల్ ఫారమ్‌ని పంపినట్టు పెళ్ళాన్ని పుట్టింటికి పంపేయడమే! ఇంక ఈవిడ పెద్ద కూతురుగారు చిల్లరచీర కొనకపోయినా అలగడమే! చీదర సినీమాకి తీసుకెళ్ళకపోయినా సణగడమే...

ఇంక చిన్న కూతురుగారేమో మొగుడే సర్వస్వం అనుకుంటుంది. వాడు యాభై రెండుముక్కలూ సర్వస్వం అనుకుంటాడు. అందులో తనకున్నది హరాయించుకుపోతే లోటు భర్తీ చేసుకోడానికన్నట్టు, మామగారింటికి చేరుకుంటాడు వీడిదింకో రకం తెలివి! వెనకటి కెవడో చెప్పినట్టు "చింతకాయలకైతే ఆఙ్ఞానీ గుటకలకి ఆఙ్ఞ ఎందుకు?"

ఫలానా టీ.వీ బావుందనో, ఫ్రిజ్ బావుందనో డిస్కషన్. ఈ డిస్కషను ఎంత వరకూ వెళుతుందంటే ఈ చవకరోజుల్లోనే కొనివ్వగలరు. మావగారు రిటైరైతే ఆయనకొనిస్తారా? మేమడుగుతామా? అన్న లాజిక్‌తో బుర్రతినేసి ఆ వస్తువు పట్టుకెళ్ళేవరకూ వాడికి నిద్ర పట్టదు. ఆ తర్వాత ఆ వస్తువు కోసం చేసిన అప్పు తీరే వరకూ నాకు నిద్ర పట్టదు..."

చిన్నన్నయ్య అలా అల్లుళ్ళని దులిపేస్తుంటే, వదినకి కోపం వచ్చింది. వున్న చిక్కులు చాలక ఈ రోజు కొత్తవి వస్తాయేమోనని "జగడమెలా వస్తాది జంగమయ్యా అంటే బిచ్చం పెట్టవే బొచ్చుముండా" అన్నాడట వెనకటికెవడో... మీవాలకం చూస్తోంటే ఈ రోజు సరిగా గడిచేటట్టులేదు వూరుకోండి, అయినా అంతగా తాగడం ఎందుకు - అడ్డూ, ఆపూ లేకుండా వాగడం ఎందుకు?" అంది.

"దీన్ని వాగడం అనరే వైపూ... మాయబజార్ సినీమాలో ఆఖర్న శకునిమావ "సత్యపీఠం" ఎక్కుతాడు చూడూ అదే ఇది! ఈ రోజుల్లో "సత్యపానం" అంటున్నారు. అదీతేడా.... అయినా నిజం చెప్పడానికి ఎన్ని దమ్ములుండాలి ఎవరో మహానుభావుడన్నట్లు 'లక్షవుక్కు గుండెలు - వేలకొలదీ ఇన్పనాలికలూ కావాలి వొక్క నిజం పలకడానికి. "కానీ ఈ రోజుల్లో వొక్క పెగ్గు చాలు మొత్తం పగ్గాలన్నీ తెంచుకోడానికి! అయినా ఎందుకా భయం, అల్లుడింట్లో హాజరయాక రేజరు పడని మామెవడుంటాడు చెప్పు! నువ్వెంత కోతలు కోసినా... ప్రతిభావారి మిరియాలు తాటికాయలంత వుండవు. అల్లుడు - అల్లరి జంట పదాలు తెలియకపోతే రాసుకో?"

"సర్లెండి రెండొందలు తగలేసి, ఆ చేదు విషం తాగి, వాగకపోతే..అందరూ చేరారు కదా కబుర్లు చెప్పరాదూ.." అంది వదిన విసుగ్గా.

"ఏమిటీ రెండొందలు తగలేసానా? ఎవరేనా అదర్ ఎండ్ ఆఫ్ మౌత్‌తో నవ్వుతారు... ఎందుకంటే గుమ్మడికాయలు గుమ్మాలంట పోతోంటే.... నువ్వుగింజ మోకాల్నెట్టి నొక్కిందట నీలాంటిదే! ఇంతవరకూ నువ్వెంత తగలేసావో లిస్టు చెప్పనా?" అన్నాడు చిన్నన్నయ్య ఆవేశంగా..."

వదిన ఏదో సమాధానం చెప్పబోయింది. కానీ పెద్దన్నయ్య నిషాలో మాట్లాడుతున్నాడు ఊరుకో అని సైగ చేసాడు. అది కాస్తా చిన్నన్నయ్య చూసేసాడు.

"ఏరా అన్నయ్యా నాకు మందు నిషా, నీకు క్రికెట్టు నిషా, నా చిన్నప్పటి నుండీ చూస్తున్నా. వాడెవడో వంద కొట్టాడు. వీడు తొంభై తొమ్మిది దగ్గర అవుటయ్యాడు. అంటూ నువ్వు రిటైరయ్యావు గానీ ఈ రోజు ఇండియా గెలిచింది అంటూ ఎప్పుడేనా మందు కొట్టించావా? నువ్వెప్పుడూ రేడియో పట్టుకు కిచకిచలాడ్డమే కానీ ఇండియా గెలిచిన పాపాన పోలేదు! ఒరేయ్ అన్నయ్యా నేనిలా అంటే నీకు కోపం వస్తుంది గానీ బి.పి.కి కారణం ఆ ఇంజినీరూ, వడేకరూ, పకోడీ, జీడీ... వీళ్ళు కాదూ!" అంటూ పెద్దన్నయ్య మీద దాడి చేసాడు.

కానీ పెద్దన్నయ్యకి తన హీరోలని చిన్నన్నయ్య చిన్న చూపుచూడడం నచ్చలేదు అందుకే... "ఒరెయ్ చిన్నా నిషాలో అలాగే అనిపిస్తుంది కానీ... క్రికెట్‌లో పటోడీ వున్నాడు గానీ పకోడీ లేదు. అలాగే జీడీకాదు వాడి పేరు బేడీ" అన్నాడు.

చిన్నన్నయ్య తప్పు దిద్దుకుంటూ 'ఆ!ఆ!అవును ఆ తర్వాత గభాస్కరు, కపిలదేవుడు వగైరా వగైరా ఒరెయ్ అన్నయ్యా నాకు తెలీకడుగుతాను, అంత మంచి పేరు? భాస్కరు' అని ఉండగా ఆ పేరు ముందుర 'గ' ఎందుకు పెట్టుకున్నాడురా?" అన్నాడు. అమాయకంగా మొహం పెట్టి...

పెద్దన్నయ్య చిన్నన్నయ్యని దీర్ఘంగా చూసి "రేపొద్దున్న చెప్తాను అప్పుడర్థం అవుతుంది. ఇప్పుడేం చెప్పినా బుర్రకెక్కదు, అయినా చిన్నా, తప్పులెన్నువారు తమ తప్పులెరగరు అని... అన్నీ మా గురించే చెపుతున్నావ్, నీ గురించి చెప్పుకునేదేదేనా ఉందా?" అన్నాడు. చిన్నన్న వాగ్ధారకి అడ్డేద్దామన్న ఉద్దేశంతో....

"హాహా" అంటూ కళ్ళెగరేసాడు చిన్నన్నయ్య. "నాదేముందిరా అన్నయ్యా పొద్దున్నే పోతాను. వో పది సుద్దముక్కలు బోర్డుమీద అరగదీస్తాను. సాయంకాలం ఇంటికొచ్చి జేబులో చిల్లరుంటే వో పెగ్ కొడతా, లేకపోతే "వంట" అంటూ మా ఆవిడ చేసిన పదార్ధాల్లో లేని రుచులు వెదికి, అవి కనబడితే సరి... లేకపోతే "బెటర్ లక్ టుమారో అని సర్దిచెప్పుకు బెడ్ ఎక్కుతా! అంతే ప్రతి ఉద్యోగస్థుడి ఇంట్లో ఉన్న "షో" ఇదేకదా" అన్నాడు.

"చిన్నా పతివ్రత కబుర్లు చెప్పకు స్కూలు లీవింగ్ సర్టిఫికెటుకి, పదేసి రూపాయలు వసూలు చెయ్యడం లేదూ?" అన్నాడు పెద్దన్నయ్య కసిగా.

"నో అదా ఏదో ఏడాదికోసారి స్కూలు లీవింగ్ సర్టిఫికెటు పిల్లలకిచ్చినప్పుడు, వాళ్ళ సంతోషం కొద్దీ, నా లివింగ్ కని వాళ్ళ దగ్గర పదో పరకో పుచ్చుకుంటాను. ఆ మాత్రానికే నేను గబ్బర్ సింగ్ అన్నట్టూ ప్రపంచాన్ని దోచుకుతింటున్నట్టూ మాట్లాడతావేమి? అయినా కలియుగ ప్రథమ పాదంలో ప్రతి మనిషిలోనూ పాతిక శాతం కుళ్ళు అంటే సెల్ఫ్ ఉండాలి? అది యుగధర్మం దాన్ని తప్పుగా అర్థం చేసుకోకూడదు. నే మాట్లాడేది సెంట్‌పెర్సెంట్ కుళ్ళుగాళ్ళ గురించి." అన్నాడు చిన్నన్నయ్య గుక్క తిప్పుకోకుండా...

"నువ్వు పదుచ్చుకున్నా, బుల్లోడు వందుచ్చుకున్నా ఒకటే!" అంటూ తనలో తను గొణుక్కున్నాడు పెద్దన్నయ్య. కానీ ఆ గొణుగుడు కాస్తా చిన్నన్నయ్య పట్టేసాడు.

"అలా గొణక్కురా పెద్దోడా, ఏరీ మన తమ్మయ్యగారు?" అంటూ నన్ను చూసి "వీడు చూడు వున్నది ఇద్దరు! మొగుడూ, పెళ్ళాం, గవర్నమెంటు వారిచ్చిందే ఎక్కీ తొక్కీ! పిల్లా జెల్లా ఎవరూ లేరు. వెనుకటి కెవర్తో చెప్పినట్టు 'నిలబడి దంపినా అదే పిండి ఎగిరెగిరి దంపినా అదే పిండి' అయినా కక్కుర్తి! ఎవడేనా అందించే డబ్బుల కోసం టేబులు కింద చేతులు పెట్టి నలిపేసుకోడం ఏముంది? ఆ ఎ.పి.బి వాడు టేబులు కింద నుండీ పెష్పాలు అందించాడు. వీడు అదే గడ్డిని కరిచేవాడూ. రుచి తెలిసే సరికి, సస్పెండయి ఇంట్లో కూర్చున్నాడు" అన్నాడు చిన్నన్నయ్య.

చిన్నన్నయ్య ఆగడానికి నాకు బలే కోపం వచ్చింది. అయినా ఏం చెయ్యలేక "అదేం కాదురా అన్నయ్యా కోర్టులో కేసేసాను. తీసుకోలేదని నిరూపిస్తా" అన్నా సీరియస్‌గా.

"వొరేయ్ అమ్మ పుట్టిల్లు మేనమామ దగ్గరా" అన్నట్టు కబుర్లు చెప్పకు మీ ఆఫీసరేమన్నాడూ, 'నావాటా నాకివ్వకుండా, వాడిలా ఎన్ని డబ్బులు కొట్టేసాడో? వాడెలా తిరిగి డ్యూటీలో జాయిన్ అవుతాడో చూస్తాను' అన్నాడట కదా ఇంక నువ్వు మీ ఆవిడకి తోడుగా ఇంటి దగ్గర కూర్చోవాల్సిందే" అన్నాడు చిన్నన్నయ్య.

పొద్దున్న ఎంత సానుభూతిగా మాట్లాడాడు. అసలు మనసులో ఉన్న ఆలోచన్ని, మనసుని వదిన పట్టేసింది. "ఇంక అయిన పంచాయితీ చాలుగానీ ఫలహారం తిని పడుకోండీ" అంది.

కానీ చిన్నన్నయ్య అది వినిపించుకోలేదు. "ఈ పంచాయితీలో చివర్న వీడియోల విషయింపు ఉండాలే..." అంటూ మొదలుపెట్టాడు.

ఆ మాటకి అంత సీరియస్‌గా ఉన్న పెద్దన్నయ్య, నేనూ చిన్నన్నయ్య కొడుకులిద్దరూ పకాలున నవ్వాం! ఎందుకంటే ఏ ఫంక్షనుకేనా ఆ కుటుంబం కుటుంబం అంతా ఒకచోట చేరితే, వీడియో తెప్పించుకు చూడ్డం అలవాటు, దాన్నే చిన్నన్నయ్య దెప్పుతున్నాడు మా నవ్వులు ఆగగానే...

"ఏమ్రా ఏ తెలుగు సినిమా తెచ్చుకున్నారు. అయినా ఆ సినీమాల్లో ఏముందని అలా చూస్తారు? ఎప్పుడూ ముణుకుల విదిలింపూ, గుబ్బల కదిలింపూ హీరోయిన్ పులి పిర్రల మీద మద్దిలదరువూ... పాటలు మన ప్రారబ్ధం అన్నట్టు వుంటే! మాటలు మన శ్రాద్ధం అన్నట్టు వుంటాయి. ఇంక మీ సంగతేమిటంటే మూడు గంటల సినిమా చూసినా కుతితీరదు మీకు....వి.సి.ఆర్ తేరగా వచ్చిందని అబ్బాయిదో, అమ్మాయిదో పెళ్ళి కేసెట్టెట్టుకు చూసెయ్యాలి. పెళ్ళి కేసెట్టు చూస్తున్న వాళ్ళు చూస్తూ ఊరుకుంటారా? పక్కవాళ్ళకి రన్నింగ్ కామెంటరీ వినిపిస్తారు. "వీడు మా జడ్డి వియ్యంకుడండి. వీడు మా వెర్రి తమ్ముడండి. ఆ వెనక్కి తిరిగి నిలుచున్నాడే వాడే మా వేలు విడిచిన చిన్నాన్నగారి రెండో కొడుకండి, అల్లవొంగున్నాడు చూసారూ వాడు మా అన్నయ్యకి కాలో వేలో ఏదో వేలు విడిచిన మేనల్లుడండి. అల్ల పక్కనే ఉంది చూసారూ మొగుడ్ని వదిలేసిన రెండో ఆడబడుచండి. ఆ పక్కనే ఉన్నాడు చూసారూ మా రెండో ఆడబడుచుని వదల్ని నాసిరకం కాశీబావగారండి" అంటూ హిస్టరీ చెప్పుకుని మురిసిపోరా!" అన్నాడు చిన్నన్నయ్య దీర్ఘంగా.

"కూతురి పెళ్ళి కేసెట్టు చూస్తే బావగారికి లక్షరూపాయల ఖర్చు జ్ఞాపకం వస్తుంది గావల్ను" అంది మా ఆవిడ దీని ఉద్దేశం బావగార్ని వేళాకోళం ఆడదామని, కానీ చిన్నన్నయ్య వేళాకోళం పట్టేశాడు.

"ఏమేవ్ నీకు నన్ను వేళాకోళం చేసేంత నాలెడ్జి పెరిగిందా? నీ పెళ్ళి కేసెట్టు చూసినా నీ బాబు నాలాగే భోరుమంటాడు. ఈ పెళ్ళిళ్ళూ డబ్బు తగలేసుకోడాలూ అన్నీ సాంప్రదాయాన్ని నిలబెట్టటానికే ప్రతిభావారింట వెలిసిన చిరుదీపం ఈ బొట్టెడు. ఈ రోజు అన్నప్రాసన... వో ఇరవై ఏళ్ళ తర్వాత మందుప్రాసన" అంటూ చిన్నన్నయ్య మనవడి మీద దాడి చేసాడు.

"వొసేవ్ పిచ్చి బామ్మా - నేను వాడ్డేం అనడం లేదు... ప్రతిభావారి వంశోద్ధారకుడి మైల్ స్టోన్స్ చెపుతున్నా... అంతే విను. వాడు మూడ్నెల్లకి బోర్లాపడ్డాడా? పడ్డాడు. అయిదు నెల్లకి పాకడం మొదలు పెట్టాడా? పాకాడు...., అందుకే అన్నప్రాసన చేసేసాం.. ఇంక, ఫ్యూచర్లో ఏడునెల్లకి అడుగులేస్తాడు! పదినెల్లకల్లా, అత్త అత్త అంటూ వాళ్ళ అత్తగార్ని తలుచుకుంటాడు. ఏడాది కల్లా చకచక నడిచి, చేతికి దొరికినవి ఎత్తుకెళ్తాడు. వీడికి నాలుగో ఏడు వచ్చేసరికల్లా వీపు మీద చిన్న గోనె బస్తాల్లాంటి పుస్తకాల సంచీ పెట్టి, రంగు చెడ్డీ జుబ్బా వేసి కాన్వెంటుకి తోలేస్తాం. వీడు కాన్వెంటులో జాయిన్ అవడం ఊరోళ్ళ ఖర్మ అన్నట్టు, ఇంటికొచ్చిన ప్రతీవాడి ముందూ "జాక్ అండ్ జిల్" పద్యం చెప్పరా అని మన గుంటడి ప్రాణాలు తోడేస్తే వాడా పద్యం పాడి ఎదుటివాడి సహనం పరీక్షిస్తాడు. అంతేగానీ వీడ్ని బడిలో వేసి వీడి చేత దసరా పద్యం చదివించడం మనకి నామోషీ! వీడి తెలుగు తనం ఎదుటివాళ్ళ దగ్గర ప్రదర్శిస్తే వాళ్ళు మనల్ని లేకివాళ్ళనుకుంటారేమోనని భయం! అంతే కాదోయ్...

ఆంధ్రులము మేము
అన్నదమ్ములము
చరితలో పేరున్న
జాతివారలము
తెలుగువారము మేము తీపి బెల్లాలం
తెచ్చి పెట్టండమ్మ తెగువతో మాకు
మాకోటి చాలుగా మాసూరలడ్డూ
మాష్టారిగారి కొక మాడయే చాలు
మళ్ళీరా పోయిరా వెళ్ళి రమ్మనక
మనసార మాకిచ్చి సాగనంపండి!

అని ఇంటింటికి వెళ్ళి పాడితే, అడుక్కునే వాళ్ళన్న అపోహపడే అవకాశం ఉంది.

పువ్వులు విరజిమ్మే దసరా బాణాలని వదిలేసి ప్లాస్టిక్ స్టెన్‌గన్‌తో "డుష్ డుష్" అని అరుస్తూ.... ఆడుకుంటే మనం మోడ్రన్!

అయితే ఈ జాక్ అండి జిల్‌ల భాగోతం ఎన్నాళ్ళూ, ఫీజులు కట్టగలిగినంత వరకూ, ఆ తర్వాత ఫీజులు కట్టలేక చతికిలబడి, ఐదోక్లాసు కొచ్చేసరికి, మునిసిపాలిటీ మురికిబడే గతి! ఈ మైలు స్టోన్లన్నీ దాటి, వాడు పదోతరగతి కొస్తే, అక్కడ పబ్లిక్ పరీక్షలో పబ్లిగ్గా తప్పడం తప్పదు. అప్పుడు ఏడు చేపల కథలోలా వాడ్ని.... ఏరా ఏరా ఎందుకు తప్పావు?" అంటే

"చిరంజీవి సినిమా అడ్డొచ్చింది"

"చిరంజీవి చిరంజీవి సినీమాలోకెందుకొచ్చావు?"

"మా నాన్న చిరంజీవి సాంప్రదాయం నిలబెట్టడానికి"

"చిరూ చిరూ నీ సాంప్రదాయమేమిటి?"

"నీ యమ్మ అదీ తెలీదా పంబలేయ్యడం హె"

"సినీరచయితా సినీరచయితా పంబంటే ఏమిటి?"

"లేపెయ్యడానికి తేలికైంది లేచిపోయేది."

ఆ విధంగా వీడి పంబలేచిపోతుంది. ఇంక పరీక్ష ఎలాగూ పోయింది కదా అని వీడు అయిదేళ్ళ పాటు శ్రీదేవి కూతురు జాహ్నవిని, హేమమాలిని కూతురు ఈషనో ఆరాధించి వొకానొక సమయంలో జాహ్నవా? ఈష? తెలుసుకోలేక, బి ఆర్ నాట్ టు బి? అన్నట్టుగా డైలమాలో పడతాడు! ఇంకా తర్వాత మైలు స్టోన్లన్నీ మనకి తెల్సినవే" అంటూ ఊపిరి తీసుకోడానికి ఆగాడు చిన్నన్నయ్య.

చిన్నన్నయ్య చెప్పినదాంట్లో అతిశయోక్తి ఏం లేదు అనిపించింది. జీవితాన్ని మార్చుకోగల శక్తి ఉండీ, ఈ గానుగెద్దు జీవితానికి అలవాటు పడ్డ మధ్య తరగతి మందభాగ్యులకి, ఈ మందే భాగ్యం అనుకున్నా...

వదిన "ఫలహారం చెయ్యండి" అన్నడానికి సమాధానంగా... "చత్ బంచత్ ఫలహారం? ఈరోజేనా సుఖంగా ఉండనీ" అంటూ హాలులోంచీ తన గదిలోకి వెళ్ళి మంచం మీద పడుకున్నాడు.

చిన్నన్నయ్య పడుకున్న రెండు నిముషాలకి "గుర్రు" వినిపించింది. చిన్నన్నయ్యకి సౌండ్ స్లీప్ లేక చాలా రోజులయింది! ఇప్పుడున్నది స్లీపింగ్ సౌండే!

# అంతరంగం

## అరుణ కాంతి

**"ఆ రెండవ వీధిలో ఆకుపచ్చ గేటు వద్ద ఆపుబాబూ!"** ఆటోడ్రైవరుతో అన్నాను. ఇంతసేపు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయాను. ఈ సిటీలో బయటకు వెళ్ళిన మనం మరలా ఇంటికి ఎప్పుడు వస్తామో తెలియదు. ఈ ట్రాఫిక్ వల్ల సాధారణంగా ఈ టైంలో అంతగా ఇబ్బంది ఉండదు. ఈ రోజెందుకో నా అంతరంగంలానే ట్రాఫిక్ కూడా అస్తవ్యస్తంగా ఉంది. కోడలు ప్రియ ఆఫీస్ నుంచీ ఇంటికి వచ్చే టైం అయ్యిందీ.. ఆలస్యం అయ్యింది వచ్చేసి ఉంటుందేమో. ఆలోచనలనుంచీ బయటకు వచ్చేసరికి ఇల్లు రానే వచ్చింది. వేసిన తాళం వేసినట్లే ఉంది. ప్రియ రాలేదనుకుంటా. ఎందుకో లోపలికి వెళ్ళాలనిపించలేదు. సన్నని జల్లు పడింది కదా! గేటు వద్ద నుంచీ నేలంతా చెమ్మగా ఉంది. డాబాపై ఆరేసిన బట్టలు జ్ఞాపకం వచ్చాయి. మెట్లెక్కి పైకి వచ్చాను. అలవాటుగా కొబ్బరి చెట్లవైపు చూశాను. ఏ చిత్రకారుడి కుంచెకు అందని రంగుల కలయికతో సూర్యబింబం నెమ్మదిగా చెట్లమధ్య ఒదిగిపోవడం రోజూ చూడటం నాకు చాలా ఇష్టం. ఈ రోజు ఆ అందాన్ని ఆస్వాదించే మనసు లేదని ముందే తెలుసుకుంది కాబోలు. మబ్బు పట్టిన ఆకాశం దర్శనం ఇచ్చింది. బట్టలు తీసుకుని క్రిందకి నడిచాను ఏదో గుర్తుకువచ్చినట్లుగా వడివడిగా మెట్లపక్క నుంచీ

వెనుకగా అడుగులు వేసాను. హరిత, నీలిమ, అరుణ, శ్వేత, పారిజాతం నాకోసం ఎదురుచూస్తున్నారు. ఈనాటి స్నేహమా మరి స్కూలు టీచరుగా రిటైరు అయిన ఈ 5 సంవత్సరాలుగా మా స్నేహం ఎంతగానో పెనవేసుకుపోయింది. ప్రతిరోజూ సాయంత్రం ఆరోజు జరిగిన విషయాలు మనసులోని భావాలు, ఆనందం, ఆవేదన ఒకటేమిటి అన్ని విషయాలు వాళ్ళతో చెప్పుకుని స్వాంతన పొందుతుంటాను. ఈరోజు ఆలశ్యమైనందుకు క్షమాపణ చెప్పుకుంటూ వాళ్ళముందు కూర్చుని మధ్యాహ్నం జరిగిన సంఘటన చెప్పసాగాను.

మధ్యాహ్నం కూరలు కొందామని మార్కెట్‌కు వెళ్ళిన నాకు దారిలో గౌరమ్మ కనబడి విషయం చెప్పబట్టి అటునుంచీ అటే రామనాధంగారి ఇంటికి వెళ్ళాను. గౌరమ్మ ఈ ఇంటి కొత్త పనిమనిషి. నెలరోజులనుంచే వస్తోంది. తన పన్నెండేళ్ళ కొడుకుకు జ్వరంగా ఉంది ఒక రోజు రానమ్మా అని చెప్పింది. కానీ మూడు రోజులుగా రావడంలేదు.

''పిల్లాడికి జ్వరం ఎలా ఉంది గౌరమ్మా?'' అని అడిగాను.

''జ్వరం లేదు గిరం లేదమ్మా. మొన్న మీరిచ్చిన జీతం తీసుకుని నా కొడుకు ఇంట్లోనుంచీ పారిపోయాడు. ఎలాగొలా ఈ రెండురోజులూ ఎతికి లాక్కొచ్చాం. ఏదైనా పనిలో పెడతానంటే ఎల్లనంటాడు. పోనీ చదువుకోరా అంటే వీధిబడికి ఎల్లడంట పెద్ద స్కూల్లోనే చదువుతాడంట. ఇప్పటికే రెక్కలు ముక్కలు చేసుకుంటున్నాను. నేనెలా పెద్దస్కూల్లో సదివించగలను? నా కూతురు కూడా అలాంటిదేనమ్మా. వాళ్ళ అయ్యలానే సెప్పిన మాట వినదు. మొండిది. వాడు తాగుబోతువాడు. నాకష్టంతోనే ఇల్లుగడవాలమ్మా'' అంటే కన్నీళ్ళు పెట్టుకుంది. ఏమిటో ఈ కాలం పిల్లలు వాళ్ళ పట్టుదలే తప్ప పెద్దవాళ్ళ కష్టాన్ని అర్థంచేసుకోరు కదా! అనిపించింది. మళ్ళీ తనే అంది ''రామనాధంగారు పోయారమ్మా ఈ గొడవలో పడి మీకు చెప్పలేకపోయాను'' అంది. మనసంతా ఏదోలా అయిపోయింది. ''ఎంతపని జరిగింది గౌరమ్మా నీకు వీలుకాలేదంటే ఎవరితోనన్నా కబురు చెయ్యవచ్చుకదా!'' అంత బాధలోనూ మందలింపుగా అన్నాను. ఇంక కాలు నిలువలేదు. అటునుంచే ఆటో పిలిచి రామనాధంగారి అడ్రస్ చెప్పాను.

తన భర్త బ్రతికి ఉన్న రోజులలో ఆయన, రామనాధంగారు మంచి స్నేహితులు. ఆరోజులు ఇంకా గుర్తున్నాయి. ఒకసారి ఆఫీస్ వాళ్ళంతో ఫ్యామిలీస్‌తో కన్యాకుమారి టూర్ వెళ్ళాం. అప్పుడే ఆయనను నేరుగా చూడటం. చాలా స్నేహశీలి. ఎంతో కలుపుగోలుతనంతో అందరితో నవ్వుతూ తుళ్ళుతూ ఉండేవారు. ఆ టూర్‌కు వాళ్ళ అమ్మాయి రాణి, అల్లుడు కూడా వచ్చారు. కొడుకుకు అప్పటికింకా పెళ్ళికాలేదు. కూతురంటే ఎంతో ఇష్టం ఆయనకు. చాలా ఆప్యాయంగా చూసుకునేవారు. ఆ వారంరోజులు ఆ కుటుంబం ఎంతో దగ్గరైపోయింది. ఆ తరువాత క్రమంగా పెరిగిన రాకపోకలు భర్త పోయిన తరువాత కొంచెం తగ్గుముఖం పట్టాయి. వాళ్ళ ఇల్లు గౌరమ్మ ఇంటికి కొంచెం దగ్గరగా ఉండటం వలన ఈ మధ్య వాళ్ళ విషయాలు కొంచెం కొంచెం తెలుస్తున్నాయి. ''ఎంత మంచి మనిషి ఇలా హఠాత్తుగా?'' కన్నీళ్ళు ఆపుకోవడానికి ప్రయత్నించాను.

రామనాధంగారి ఇల్లు రానే వచ్చింది. బంధుమిత్రులు చాలామంది ఉన్నట్లుగా ఆ ఇంటి వాతావరణమే చెపుతోంది. ముందు గుమ్మంలో చాలామంది ఉండటంతో వెళ్ళడానికి వీలులేకుండా ఉండటంతో పెరటివైపు నడక సాగించాను. ''ఇప్పుడేగా అందరికీ కాఫీలు ఇచ్చాను మళ్ళీ పదిహేను మందికా? ఉన్న డబ్బంతా ఇలా ఖర్చయితే మరి మనసంగతేమిటి?'' ఎంతో విసురుగా రామనాధంగారి కోడలు అంటున్న మాటలు నా చెవిన పడ్డాయి. '' ఈ కార్యక్రమం గట్టెక్కనివ్వవే మిగిలిన సంగతులు తరువాత చూద్దాం.'' అతి నెమ్మదిగా అంటున్నాడు రామనాధంగారి అబ్బాయి. నన్ను అక్కడ చూడటంతో స్థాణువులా నిలబడిపోయారిద్దరూ. ముందు అతనే తేరుకున్నాడు.

"ఆంటీ! నాన్నగారు..." అంటూ తల విదుల్చుకున్నాడు. నేను మౌనంగా లోపలికి నడిచాను.

గదిలో ఒకమూల కూర్చున్న ఆవిడ దగ్గరగా వెళ్ళి ఓదార్పుగా ప్రక్కన కూర్చున్నాను. ఆవిడను ఓదార్చటం నావల్ల కాలేదు. ఇంతలో నేను వచ్చానని తెలిసినట్లుంది రాణీ వచ్చి నన్ను చుట్టేసింది. తండ్రికి గుండెనొప్పి రావటం, హాస్పటల్లో చేర్చడం, ఆపరేషన్ చెయ్యాలని డాక్టర్ చెప్పడం అంతలోపే ఆయన పోవడం మొదలయిన విషయాలు పూసగుచ్చినట్లు చెబుతోంది. మళ్ళీ తనే అంది. "ఆపరేషన్ చెయ్యకుండానే పోయారాంటీ! కనీసం ఆపరేషన్ బెడ్ మీద పోయినా సరే ఇంకో లక్ష కట్టవలసి వచ్చేదట" అంది. ఆ మాటల్లో అంతరార్థం నాకు అర్థం అయ్యింది. రాణీ అన్నమాటలు వినిపించకుండా ఉంటే ఎంతో బావుండేది అనిపించింది. చుట్టూ చూసాను. డబ్బు తప్ప ఈ లోకంలో ఇంకేమీ లేదా? మానవ సంబంధాలు ఎంతగా పలుచబడిపోతున్నాయి అనిపించింది. చుట్టూ చూసాను. ఎవరి ధోరణిలో వారు. కొంతమంది వాళ్ళు నెలకు ఖర్చులు పెడుతున్న మందుల గురించి గొప్పగా చెప్పుకుంటూ ఉంటే, మరి కొంతమంది ప్రస్తుత డాక్టరు - హాస్పటళ్ళ గురించి, అవసరం లేకున్నా డాక్టర్లు రాస్తున్న మందుల గురించి వాళ్ళకు తెలిసి వచ్చేలా చురకలు, మరికొంత మంది ఈ విషయాలతో సంబంధమే లేనట్లు ఎవరెవరి ఇళ్ళల్లో జరగని మర్యాదలగురించి ఎత్తిపొడుపులు, అప్పుడప్పుడూ సానుభూతిగా ఓదార్పులూ, మరుక్షణం నవ్వుతూ మాట్లాడటం ఏదో నాటకీయంగా అనిపించింది. ఇంక ఎక్కువసేపు అక్కడ ఉండాలనిపించలేదు. వెంటనే బయలుదేరి వచ్చేసాను."

భారంగా ఉన్న నా అంతరంగాన్ని స్నేహితురాళ్ళు ముందు విప్పాను. మనసు కొంచెం తేలిక పడింది. ఇంతలో గేటు శబ్దం వినిపించింది. ప్రియ వచ్చింది. "ఈరోజు ఇంత ఆలశ్యం అయిందేమిటమ్మా?" అనేలోపే "అర్జెంట్ ప్రాజెక్టు వర్క్ ఉంది అత్తయ్యా అందుకే లేటయ్యింది" అంది. "ఒక కప్పు కాఫీ ఇస్తారా? అత్తయ్యా తలనొప్పిగా ఉంది" అంటూ సోఫాలో కూలబడిపోయింది. మొహం ఎండిపోయి ఉంది. జాలేసింది. ఏం ఉద్యోగాలో ఏమిటో అనుకుంటూ కిచెన్‌లోకి వెళ్ళాను. కాఫీ తీసుకొచ్చేసరికి తను అక్కడ లేదు. రూంలో పడుకుని ఉంది. కాఫీ అక్కడికే తీసుకెళ్ళి ఇచ్చాను. తాగి మళ్ళీ నిద్రకు ఉపక్రమించింది. ఇంకేం మాట్లాడగలను. మళ్ళీ వెళ్ళి స్నేహితురాళ్ళ ముందు కూర్చుని చెప్పసాగాను.

"రోజూ ఇదే వరుస వాడెప్పుడో వస్తాడు. వస్తూనే టీ.వీ ముందో కంప్యూటర్ ముందో కూర్చుంటాడు. ఇక తనతో మాట్లాడేవాళ్ళు ఎవరు? ఈ యాంత్రిక జీవితం మనిషిని ఎంతగా మార్చేసింది. మనుష్యులు కూడా యంత్రాలుగా మారిపోతున్నారు. ఉదయం వేళ ఎంతో బావుంటుంది. వంట పని, ఇద్దరికీ లంచ్ బాక్స్ సర్దడంలాంటివి. రోజంతా అదే హడావుడి ఉంటే ఎంత బావుంటుంది కానీ ఏం లాభం. ఇల్లంతా నిశ్శబ్దం రోజులు బోర్. నేను కూడా ఉద్యోగం చేసినదాన్నే. కానీ ఈ నాటి ఒత్తిడులు అప్పుడు లేవు. ఇంట్లో పని, పిల్లల పెంపకం, ఉద్యోగం అన్ని బాధ్యతలూ కష్టంగా అనిపించినా అందులో ఏదో ఆనందం ఉండేది. ఇంట్లో ఉన్నంత సేపు అందరం కలిసి గడిపేవాళ్ళం. పండుగలకు బంధువులంతా కలుసుకోవడం ఎంతో సందడిగా ఉండేది. ముఖ్యంగా స్నేహితులకు ఉత్తరాలు వ్రాయడం నిత్యజీవితంలో ఒక భాగం. జీవితం బోర్ కొట్టేదికాదు. వయస్సు పైబడే కొద్దీ స్నేహితులతో సంబంధాలు కొంచెం సన్నబడ్డాయి. ఎవరి సంసారాలు వాళ్ళవి ఇప్పుడైతే పూర్తిగా తెగిపోయాయి. నేను మాత్రం అమ్మాయి సుజాతకు పెద్ద పెద్ద ఉత్తరాలు రాస్తుంటాను. అవి చదివే తీరిక దానికుంటుందని నేననుకోవడం లేదు. కానీ నా అలవాటుని నేను వదులుకోను. సుజాత ఈ వారాంతంలో రావలసి ఉంది. పిల్లలకు సెలవలు ఎప్పుడు వస్తాయా అనే స్టూడెంట్స్ తాపత్రయం ఒక టీచరుగా నాకు బాగా తెలుసు కానీ ఇప్పుడు ఆ సెలవుల కోసం, ఇంటికి రానున్న

మనుషుల కోసం నా మనసు పడే తాపత్రయం మీకు తెలుసుకదా! సుజాత ఎప్పుడు వచ్చేదీ చెప్పలేదు. ఒకవేళ మెయిల్ పంపిందేమో చూస్తాను. అంటూ లోపలికి నడవబోతూ 'సారీ పది నిముషాలలో వచ్చేస్తా' అంటూ సంజాయిషీ ఇచ్చాను అప్పటికే వాడిన నీలిమ ముఖాన్ని చూసి.

పది నిముషాల్లో తిరిగివచ్చి స్నేహితురాళ్ళ మధ్య కూర్చున్నాను. నిరుత్సాహంగా ఉన్న నా ముఖాన్ని చూసి వాళ్ళు కనిపెట్టేసారులా ఉంది. వాళ్ళ ముఖాలు కూడా డల్‌గా అయ్యాయి. "అమ్మాయి రావడం లేదు. తనకు లీవ్ లేదట. పిల్లాడికి వచ్చే సంవత్సరం పబ్లిక్ కదా! ఇప్పటినుంచే కోచింగ్ ఉండాలట. పాపను కూడా డ్రాయింగ్ క్లాస్, టెన్నిస్‌లో జాయిన్ చేసేసిందట. మారుతున్న పరిస్థితులకు అందరూ మారాలి. ఈ యాంత్రిక జీవితంలో ఇప్పటి తరం మానసికంగా ఏదో కోల్పోతున్నారనిపిస్తోంది. వారి భవిష్యత్తుకు నేను ఆటంకం కాను. నా అంతరంగాన్ని పంచుకోవడానికి స్నేహితులు మీరు ఉన్నారుగా!" ఉబికి వస్తున్న కన్నీళ్ళను ఆపుకుంటూ వాళ్ళతో అన్నాను.

నాకు ఆహ్లాదం కలిగించాలని కాబోలు చల్లని గాలితో పాటు తన మల్లెపూల సుగంధాన్ని నా ముక్కుపుటాలకి తాకించింది శ్వేత. సింధూరపు రంగు రేకులతో విడిచి రెండురోజులైనా చెదరని చిరునవ్వుతో నన్నే చూస్తోంది అరుణ. పచ్చని రేకులతో సంపెంగ పరిమళాలు అందిస్తూ చల్లగాలికి తన ప్రక్కనున్న మిత్రులను తన కొమ్మలతో ఊపుతోంది హరిత. ***రిటైర్ అయ్యిన నాటినుంచీ ఈ మొక్కలేగా తన స్నేహితులు. పూచే పువ్వులు వాటి రంగుల ననుసరించి తాను పేర్లు పెట్టుకుని సృష్టించుకున్న స్నేహలోకం ఇది. కొంచెం వీక్‌గా అనిపించినా వాటిమధ్య చేరిపోతాను. తనను చూసి నవ్వుతాయి, పలుకరిస్తాయి తన అంతరంగాన్నంతా శ్రద్ధగా వింటాయి.***

అంతకుమునుపే చిన్న జల్లుపడటం వలన ఆకులపై నీళ్ళు ఆ గాలి తాకిడికి నా తలపై పడ్డాయి. నా బాధ చూడలేక అవి కూడా కన్నీరు కారుస్తున్నాయా! అనిపించింది. అవును మరి నిజమైన స్నేహితులు బాధల్లో కూడా పాలుపంచుకుంటారు కదా! ఒక్క రోజులో వాడిపోయే నీలి గోరింట పువ్వు మాత్రం ఆ గాలికి కింద రాలిపోయింది. చేతిలోకి తీసుకున్నాను ఆ నీలిమను. ఉదయం నుంచీ ఎంత అందంగా ఉంది. నేల రాలిపోయింది. ఈ మల్లెపూవు కూడా అంతే రేపటికి ఇలానే అవుతుంది. ఆ ఎర్రగులాబీ కూడా మరో రెండు రోజులకు ఇదే పరిస్థితి. కానీ నేలరాలే వరకూ చిరునవ్వుతో చూస్తాయి. పరిమళాన్నిస్తాయి. ఆహ్లాదకరమైన ప్రకృతికోసం తన వంతు సహకరిస్తాయి. మరి నేనేం చేస్తున్నాను? రోజూ నవ్వుతూ నా అంతరంగం వినే నా స్నేహితులు ఈ రోజు మౌనంగా నాకు సందేశం ఇస్తున్నట్లు అనిపించింది. అవును మరి టీచర్‌గా రిటైర్ అయినా ఇంకా పిల్లలకు చదువు చెప్పే ఓపికా ఉత్సాహం నాలో ఉన్నాయిగా. దిగజారిపోతున్న మానవ సంబంధాలను మెరుగు పరుస్తూ పిల్లలను మంచి పౌరులుగా, సంస్కారవంతులుగా తీర్చిదిద్దగల శక్తి ఒక టీచరుగా నాకు ఉంది. బోర్ కొడుతుంది అంటూనే 5 సంవత్సరాలు ఎంతగా వృధా చేసాను. నాకళ్ళు తెరిపించారు నా స్నేహితురాళ్ళు. ఈ ఆలోచన ఆశయంగా మారి మరింత ధ్రువపడింది. నా ఈ ఆశయం గౌరమ్మ పిల్లలతోనే మొదలు కావాలి. భారమైన హృదయం కాస్తా దూదిపింజలా తేలిపోసాగింది. ఒక సన్నని గాలి తెరను తలలు ఊపుతున్నారు. నా స్నేహితులు తమ ఆమోదం తెలుపుతున్నట్లుగా.....




నేను చాలా ఆవేశపడ్డానేమో అనిపించింది.

అయితే నా ‘అహం’ నాకు అడ్డువస్తూనే ఉంది.

నేను ఇంతకు ముందు మనిషిని కాదేమో. ఎవరైనా ఎప్పుడూ ఒకేలా ఎలా ఉంటారు.

‘దేశానికి వెన్నెముక రైతు’ అన్నప్పుడు నాకు చాలా కోపం వచ్చింది.

అది నిజమా!

ఆ మాటకొస్తే ‘కూలి’ జనం వెన్నెముకలు కదా. వాళ్ళ గురించి ఎవరూ ఎందుకు మాట్లాడరు. అయినా రైతులు ‘వెన్నముకలో’ ‘అన్నదాత’లో ఎలా అవుతారు?

నేను దళితుడ్ని. దళితుల్ని ఈ సమాజం ఎన్ని రకాలుగా అవమానించిందో అవమానిస్తుందో నాకు తెలుసు. స్వయంగా నేను అవన్నీ అనుభవించాను. రైతులు ఆత్మహత్యలు చేసుకోవచ్చు. ఒక్క రైతులేనా ఆత్మహత్యలు చేసుకునేది.

సభలో అందరూ రైతుని కీర్తిస్తుంటే నేను తట్టుకోలేకపోయాను. నాలో నా జనం తాలూకూ రక్తం మరిగింది. నేను వెళ్ళి మాట్లాడగానే అప్పటిదాకా జరుగుతున్న సభ స్వరూపమే మారిపోయింది.

నిజానికది ఓ సంఘీభావ సభ.

‘నువ్వలా మాట్లాడాల్సిందికాదు. అది సందర్భం కాదు’ అన్నాడు మురళి. వాడూ అగ్రకులం వాడే

రైతులంతా ఆ మాటకొస్తే అగ్రకులాలవాళ్ళే. కూలీల శ్రమను దోచుకునేవాడు ‘అన్నదాత’ ఎలా అయ్యాడు. అందుకే నేను మురళీతో అదేమాట అన్నాను.

‘నువ్వు అంతకు మించి ఆలోచించలేవు. అది నీ కుల పరిమితి’

'అదే నిజమైతే నువ్వు కూడా నీ కుల పరిమి తిలో ఉన్నావా.... అసలు ఏ కులానికైనా పరిమితి ఎలా ఉందో చెప్పు. అన్ని కులాల్లోని మనుషులు ఒక రకంగా ఆలోచిస్తున్నారా. '

'జాన్ నీలో కుల చైతన్యంకంటే కుల ద్వేషం పెరిగిపోతుంది. నన్ను నువ్వు ఓసారి పరిశీలించుకోవటం మంచిది' అని వెళ్ళిపోయాడు.

అంతకంటే ఏం మాట్లాడతాడులే అనుకున్నాను. ఇప్పుడు నాలో ఆవేశం లేదు. నేను వెనక్కు తిరిగి చూసుకుంటే ఎక్కడో కలుక్కుమంటూనే ఉంది.

దేనికయినా సందర్భం ముఖ్యం. ఇది నా దృష్టిలో ఉంది. నేను ఆవేశపడిన సందర్భం ఏమిటి? నామీదగాని - నా కులం మీదగాని ఎవరన్నా దాడిచేసారా- లేదే అయితే నాలో ఎందుకంత అశాంతి కలగాలి.. నేను ప్రాణంగా ప్రేమించిన "మురళి"ని నేను శత్రువుగా ఎందుకు చూస్తున్నాను!

ఒక కులానికి ఎందుకు పరిమితం చేస్తున్నాను!

ఆలోచించాల్సిన విషయమే!

జాన్...

నీకు నేను రాస్తున్న లేఖ ఇది. దీన్ని నువ్వు ఏ రకంగా అర్థం చేసుకున్నా నేను బాధపడను. నువ్వు ఓ కులంలో పుట్టావు. ఓ ప్రాంతంలో పుట్టావు. అది మీ ఊరు కావచ్చు. కానీ నువ్వు మీ ఊర్లోనే బతికావా... బతుకుతున్నావా. నీ కులం వారితోనే బతికావా - స్నేహం చేసావా - ఇప్పుడు చేస్తున్నావా!

నాకు సిద్ధాంతపరమైన సమాధానాలు వద్దు. హృదయం నుండీ వచ్చే జవాబు కావాలి.

నువ్వు ఓ కులానికి చెందిన వ్యక్తివయినప్పుడు అణగారిన కులాలకీ - వెనకబడిన కులానికో నువ్వు ప్రతినిధివి ఎలా కాగలుగుతావు? అలాగే నువ్వు పుట్టిన ఊరుని వదిలినప్పుడు ఓ ప్రాంతానికి ప్రతినిధివి ఎలా అవుతావు. అయినా 'ప్రాంతం' ఎప్పుడు వచ్చింది. మనం ఏ ప్రాంతానికయినా గీసుకున్న గీతలు ఎప్పటివి. అవి ముందు నుండీ ఉన్నాయా? కొన్ని దశాబ్దాలు - శతాబ్దాలకు చెందిన చరిత్రను ఆధారం చేసుకుంటున్నావు. వర్తమానంలో కూడా నువ్వు వలస వచ్చినవాడివి. నీ ఊరికి నువ్వు పరాయివాడివి. నీకులానికి నువ్వు పరాయివాడివి.

అవునా కాదా అనేది నా ప్రశ్న. నువ్వు చైతన్యవంతుడివి కావటానికి తొలి బీజం వేసిన వ్యక్తులు ఎవరు? నువ్వు మాట్లాడటానికి వెనక ఎవరి త్యాగం ఉంది. వాళ్ళు ఎన్ని నిరసనల్ని ఎదుర్కొన్నారు. ఎంత నిర్బంధం భరించారు. అదంతా నీ నుండీ ప్రయోజనం పొందాలనా... అదే నిజమయితే నిన్ను అజ్ఞానంలో ఉంచటమే వారికి లాభం కాదా. నాటి సందర్భం ఏమిటి. అది మరిచిపోదగిందేనా... అయితే రేపు ఇలా ఉంటుంది.

నీ చదువు నిన్ను జ్ఞానవంతుడ్ని చేసింది. నీకు ప్రశ్నించడం నేర్పింది అది నిన్ను అభివృద్ధి చేసింది.

నువ్వు కీర్తి సంపాదించినా - డబ్బు సంపాదించినా అది నీకూ - నీ కుటుంబానికి ఉపయోగ పడింది తప్ప నీకులాన్ని మార్చలేకపోయింది. నీ కుల కష్టాల్ని తీర్చలేకపోయింది.

నువ్వు 'కులం' పేరు చెప్పుకుని నీ అస్థిత్వం నిలబెట్టుకున్నావు. నువ్వు వారిని చైతన్యవంతుల్ని చేయటమే ఓ కుట్ర.

నిన్నటి కుట్రను నువ్వు కొనసాగించావు.

నువ్వూ పెట్టుబడిదారుడివయ్యావు.

నువ్వూ శ్రమను దోచుకుంటున్నావు. అప్పుడూ - ఇప్పుడూ నువ్వు ఉపయోగపడింది ఎవరికో ఆలోచించుకో ఈ ప్రశ్నలు వేసేది అగ్రకులాల వారుకాదు. నీవాళ్ళు నీ స్వంత మనుషులు.

సమాజంలో తాత్కాలిక సందర్భాలుంటాయి.

అదే సమయంలో దీర్ఘకాలానికి చెందిన సందర్భాలుంటాయి. ఇవి విడివిడిగా కనిపించినా ఒకటే. వీటిని సమన్వయం చేస్తున్నావా? నువ్వు నిజంగా బాధపడుతున్నావా?

ఒక్కసారి నీ ఆచరణని పరిశీలించుకో. నీ దగ్గరకు వస్తున్న ప్రతి రూపాయి ఎక్కడిదో నువ్వే చెప్పు. నీలోపలి మనిషి - బయటి  మనిషి ఒకరేనా...

నీలోనే ఇన్ని వైరుధ్యాలున్నప్పుడు - వాటిని ఏ మాత్రం సరిచేసుకునే ప్రయత్నం చేయని నువ్వు నిన్ను మోసం చేసుకోవటం లేదా... చరిత్రకు ఇవేం పట్టవని నువ్వనుకుంటాన్నావా...నాకు సమాధానం చెప్పకపోయినా నీకు నువ్వు సమాధానం చెప్పుకో.

నీ

\- జాన్

నాకు, నేను రాసుకున్న లేఖ అది.

నిజమే నాకు చెదలు పట్టాయి. నన్ను నేను ప్రశ్నించుకున్న ప్రతిసారీ లోకం మీద నేను ప్రశ్నలు లేవనెత్తాను. సమాజంలో ఓ అలజడికి కారణం అయ్యాను. నన్ను సమాజం గుర్తించి, గౌరవించిన కొద్దీ నన్ను నేను మోసం చేసుకున్నాను.

ఇది నా గది.

నాగదిలో నేను బందీని

ఇక్కడ నేను దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తాను. ఏడుస్తాను.

నన్ను స్కాన్ చేయండి. ద్వేషంతో నాకళ్ళు మూసుకుపోయాయి.

నన్ను గౌరవించిన, నన్ను దగ్గరకు తీసుకున్న, నన్ను లాలించినవారినందరినీ దూరం చేసుకుని....

నేను ఎవరికి దగ్గరయ్యానో తెలుసా... మీకు తెలియదు... ఈ గది శబ్దాల్ని బయటకు పోనివ్వదు.

‘నాయనా జాన్ - నువు చదువుకున్నావు. నీ చదువుకి సాయం చేసింది ఈ ఊరి మోతుబర్లుకాదు. నాతో కాయకష్టం చేసిన రైతులు. ఇప్పుడు నువ్వుకూడా పట్నంలో భూమికొన్నావు తప్ప మా ఊర్లో భూమెందుకు కొనలేదురా‘

‘భూమిలో పంట పండుతాది అది చేతికీ - నోటికీ వస్తాదో లేదో తెలియదనేగా - పట్నంలో భూమి నీకు బంగారు గుడ్లు పెడుతుందనేగా.... పంట పండిన - ధర రాకపోయినా రైతు మళ్ళా మళ్ళా ఎందుకు పండిస్తాడురా జానూ... అదీ యాపారమే అంటావా....!

బాబూ... మూడేళ్ళుగా పంటలు చేతికి రాలేదు.

పనులు లేవు. నీళ్ళులేవు. అందుకే కూలోల్లు పొట్ట చేతబట్టుకుని వలసలు ఎల్లినారు. ఊరు వల్లకాడయినా ఊరిని వదిలిరానిదెవరు జానూ....

రైతు.... రైతు మాత్రమే ఊరికి దిక్కుగా ఉన్నాడు. కూలోల్లకి రెక్కల కష్టం చేసుకునే ఓపిక ఉంటే ఎక్కడికయినా వలస పోతారు.

మడి చెక్కనొదిలి రైతు, ఎల్లగలడా... దాన్ని అమ్ముకోవాల.

లేదంటే కురవని మబ్బుల్లోకి నేరుగా విరయిపోవాల

ఇన్ని వేలమంది రైతులే ఎందుకు చచ్చిపోతున్నారో చెప్పగలవా జానూ... కాయకష్టం చేసేవాల్లు ఎన్నడూ చావలేదు. తిన్నా - తినకపోయినా వాళ్ళని అడిగేవోడు లేడు.

ఎప్పుడయితే భూమి ఉంటాదో - దానిమీద బాకీ ఉంటాది.

అయినా మేం కష్టవొచ్చినప్పుడు ఒకరికొకరు తోడయ్యాం - మేమూ అరచుకున్నాం. కానీ అది చిన్నపిల్లల తగాదాలాంటిది జానూ...

ఇప్పుడు కూరగాయలు పండించేవాళ్ళు తగ్గుతున్నారు. పాలకోసం పశువుల్ని పెంచేవారు తగ్గుతున్నారు... ఊరిని అంటిపెట్టుకునేవారు తగ్గుతుండారు.

రానుంది రైతు రాజ్జెం కాదు. రైతులేని రాజ్జెం.

నువ్వు కూడా చచ్చిపోయిన రయితుకోసం ఒక్క కన్నీటి బొట్టుని రాల్చలేదు జాను...

మంచినీ - సెడ్డనీ కలిపి చూసే పెద్దోడివయ్యావు.

నీ అంతచదువుకోలేదుగానీ జానూ మాగ్రామం నేర్పిందొకటే బాధలు పడేవారంతా ఒకటే....

నిన్న ఆ కులంలో పుడితే బాగుండేదని మనం అనుకున్నాం. ఇప్పుడు మన కులంలో పుడితే బాగుండేదని వాళ్ళనుకుంటున్నారు ఏది శాశ్వతం జానూ...

‘ఎన్నెముకో‘ ‘దాతో‘ ఎవిరికి పట్టింది.

నన్ను అలా పిలువమని ఏ రైతు చెప్పినడు జానూ...

అన్ని మాటలూ మీవే - అన్ని పాటలూ మీవే...

చివరాకరికి అన్నదమ్ముల్లా ఉండాల్సిన మమ్మల్ని ఇడదీసేది

మీరేనా జానూ...

ఇదా మేం కోరుకున్నది.

నీ చదువుకోసం సాయం చేసిన రైతు నిన్ననే తనన్ని తాను చంపుకున్నాడు

నీ బాకీ కట్టలేదుగానీ కాటికి నా అన్నని మోసినాను జానూ.... ఏనాడూ మా మద్దెన పొరపొచ్చెం రాలేదు జానూ

కుమిలి కుమిలి ఏడ్చినాను జానూ...

నువ్వు మాటాడే ప్రతిమాటా నా గుండెలో గాయమవుతోంది జానూ...

ఎవరు మిత్రులో - ఎవరు శత్రువో తెలుసుకోలేనివాడు

గాయాలే చేసి పోతాడు జానూ...

ఇప్పుడు పల్లెకి గాయమయినది

భూమికి గాయమయినది. పోరాటానికి గాయమయినాది... పలకలైన బట్ట మనిషి వొంటిమీదకు పనికిరాదు జానూ.... గాయాలకు కట్టుకట్టటానికి కూడా చాలనన్ని పీలికలు పీలికలయ్యాయి.. అయ్యో నా జానూ... నువ్వు పెద్దోనివయ్యావా - ఊరు ఇంక బావురుమంటూనే ఉంది జానూ...- నువ్వు అయ్యను - అమ్మను బాధలు పడే అందరిలో చూసుకోవాలని మాకోరిక జానూ.. మా జానూ

నేను సైతం విధ్వంసానికి సమిధనొక్కటి

ఆహుతిచ్చాను

నేను సైతం

నేను సైతం...

నేను సైతం... ఎందుకిలా మారిపోయాను..?

సందర్భం వచ్చింది

నన్ను నేను సంస్కరించుకోవాలి



మిత్రులెవరో - శత్రువెవరో

తెలుసుకునే సందర్భం వచ్చింది. తేల్చుకోవాల్సిన సందర్భం వచ్చింది

నన్ను నేను పునాదుల్లో వెతుక్కోవాలి. ఆ పని చెయ్యగలనా?

***

# మేఘున

వారణాసి నాగలక్ష్మి

**ఆఫీసు** డ్యూటీ మీద మూడురోజుల కోసం విశాఖపట్నం వచ్చింది సరోజ. ఆఖరి రోజు పదకొండు గంటలకే పని పూర్తయిపోయింది. ట్రైనుకు చాలాటైముంది. తను బసచేసిన హోటల్లో 'సృజనాత్మక రచన' మీద వర్క్‌షాపు జరుగుతోందంటే ఎలా ఉంటుందో చూడాలని వచ్చింది. రాయడం ఇప్పటి వరకు అలవాటు లేకపోయినా మంచి సాహిత్యం పట్ల మక్కువ ఉండటంతో, వర్క్‌షాపులోని డెమాన్‌స్ట్రేషన్ లెక్చర్లు ఆమెని ఆకట్టుకున్నాయి. వర్క్‌షాపు నిర్వహిస్తున్న సుధీర్ సంజయ్ పేరున్న రచయిత. సృజనాత్మక రచనలో చెప్పదలచిన విషయాన్ని మొహాన కొట్టినట్టుగానో, లేదా అరటిపండు వొలిచి చేతిలో పెట్టినట్టుగానో చెప్పగూడదనీ, అలా అని నారికేళపాకంలానూ ఉండకూడదనీ... పాఠకుడిలో ఆలోచన రేకెత్తించేలా, చిరునవ్వు మొలిపించేలా, నిద్రపోతున్న వ్యక్తిని వెచ్చని సూర్యకిరణం మేల్కొలిపినట్టుగా, ఒంటరిగా ఉన్నప్పుడు మనసుని గిలిగింతలు పెట్టినట్టుగా, మనసు ఆర్ద్రమై కళ్ళు చెమర్చేలా - సూచనప్రాయంగా, దృశ్యాదృశ్యంగా రచన సాగాలని చెప్పాడాయన! కొన్ని మంచి కథలని ఉదహరించి, చదివిన చాలాకాలం తర్వాత కూడా ఆ కథల తాలూకు సుగంధం మనసులో ఎలా పరిమళిస్తూ ఉంటుందో చక్కని వాక్చాతుర్యంతో ఆయన వివరిస్తుంటే, ఆసక్తిగా వింటూ, ఇన్నాళ్ళ జీవితంలో ఏదో ఒక సంఘటన గురించైనా ఓ కథో, కవితో రాయలేనా అనుకుంది సరోజ. సుధీర్ సంజయ్ చమత్కారాలకి నవ్వులు కురిశాయి. సమయం త్వరగా గడిచిపోయింది. ట్రైన్ టైమ్ దగ్గర పడటంతో చివరిదాకా ఉండకుండా తనగదికి వచ్చేసింది సరోజ.

ఆలోచనల మధ్య సామాను సర్దుకుంటున్న సరోజకి కూతురు మేఘున గుర్తొచ్చింది. తను ముద్దుగా 'గానా' అని పిలుచుకునే మేఘునకి నాలుగేళ్ళు. సన్నగా చామనఛాయలో ఉంటుంది. చూడగానే ఎత్తుకుని ముద్దులాడాలనిపించక పోయినా, ఆ స్వచ్ఛమైన తెల్లని కళ్ళూ, నల్లగా మిలమిలలాడే కనుపాపలూ, వత్తైన కనురెప్పల మీది వెంట్రుకలూ... మరోసారి తనవైపు చూసేలా చేస్తాయి. ఎక్కువ మాట్లాడకపోయినా, అపుడపుడు మేఘాల మధ్య మెరుపులా తళుకుమనే మాట ఒకటి అంటూ ఉంటుంది. విన్నపుడు మురిసిపోవడమే గానీ ఆ మాటలు సరోజకి గుర్తుండవు.

సరోజ ఉద్యోగంలో ఇంతకుముదెపుడూ వేరే ఊరు వెళ్ళాల్సిన అవసరం రాలేదు. ఈసారి ఆమె భర్త నిరంజన్ కూడా కాంప్‌కి వెళ్ళి ఉండడం, తనూ తప్పనిసరిగా ఆఫీసు పని మీద విశాఖపట్నం వెళ్ళాల్సి రావడంతో నాలుగేళ్ళ కూతుర్ని 'ఎక్కడ ఉంచాలా' అనే మీమాంసలో పడింది. అత్తమామలు కూడా హైదరాబాదులోనే ఉన్నా ఊరికి ఒక మూల, సొంత ఇంట్లో, రిటైర్డ్ జీవితం ప్రశాంతంగా గడుపుతున్నారు. ఊరికి మరోమూల ఆఫీసులకి దగ్గరగా సరోజా

నిరంజన్‌ల నివాసం. అందంగా అమర్చిన వస్తువులతో అద్దంలా తుడిచినట్టుండే అత్తగారింట్లో చిన్నపిల్లతో అడుగుపెట్టాలంటే భయంగా ఉంటుంది సరోజకి - ఏ వస్తువు పాడుచేస్తుందో అని. దానికి తగినట్టే పిల్ల ఏది ముట్టుకోబోయినా, ఎటు వెళ్ళబోయినా అత్తగారూ, మామగారూ కూడా కంగారు పడుతూ 'అదిముట్టుకోకు, 'నీకేం కావాలి?' 'ఆ తలుపు వైపు వెళ్ళకు' 'ఇలా కుర్చీలో కూర్చో'లాంటి మాటలేవో చెపుతూ అస్థిమితంగా ఉంటారు. ఉన్నకాసేపూ. తోటలో మొక్కల సంరక్షణలో అత్తగారు, తన పుస్తకాల మధ్య మునిగిపోయి మామగారూ ఉంటే కొంతసేపటి తర్వాత సరోజకే ఏమీ తోచదు. బయలుదేరే ముందు ఒకటికి పదిసార్లు అక్కడ ఎలా ఉండాలో వివరించి చెబుతుంది మేఘనకి. అయినా ఏదో ఒకటి ఒలికి పోవడమో, గోడమీద మరక పడడమో జరగడం, అత్తగారు నొచ్చుకుంటూ అది తుడుచుకోవడం, తను 'నే తుడుస్తా అత్తయ్యా' అంటూ వెంట వెంట అందుకోబోవడం, తన పని నచ్చక ఆవిడ మళ్ళీ చేసుకోవడం... ఉన్న కాసేపూ ఊపిరాడనట్టుగా తనకీ, కట్టేసి బంధించినట్టుగా మేఘనకీ, 'ఈ పిల్ల ఏది పాడు చేస్తుందో'అని వాళ్ళకీ ప్రశాంతత ఉండదు! అందువల్లేనేమో మనవరాలితో వాళ్ళకీ, నానమ్మ తాతగార్లతో మేఘనకీ పెద్దగా అనుబంధం ఏర్పడలేదు. తను తీరిక చేసుకుని తల్లితండ్రుల దగ్గరకి తరచూ వెళ్ళకపోయినా, భార్యా కూతురూ వెళ్ళాలనీ, కూతురు తాతగారి ఒళ్ళో కెక్కి ఆడాలనీ, భార్య తల్లిని మెప్పించి కౌగిలించేసుకోవాలనీ కోరుకుంటూ భార్య మీద చికాకు పడుతుంటాడు నిరంజన్. ఇపుడు ఈ మూడు రోజులు మేఘనని ఏం చెయ్యాలా అని తర్జ భర్జన పడి భర్తకి ఫోన్ చేసింది సరోజ.

"అమ్మని అడుగు. మూడురోజులేకదా... షి విల్‌బి హేపీ టు బి విత్ మేఘన" అన్నాడు నిరంజన్.

సరేనని అత్తగారికి ఫోన్ చేసింది సరోజ.

అడగ్గానే "చిన్నపిల్ల తల్లివి! ఇలాంటి డ్యూటీలు నీకు కుదరవని పైవాళ్ళకి చెప్పేయ్" అన్నారావిడ.

అలా వీలవదనీ, వెళ్ళక తప్పదనీ చెప్పాక, ఆలోచించి చెప్తానని ఫోన్ పెట్టేశారావిడ. ఆవిడ ఫోనుకోసం ఎదురుచూసి, చివరికి తనే ఫోన్ చేసింది సరోజ.

"సరేలే. ఎలాగో తంటాలు పడతాను. ఇక తప్పదు కదా" అని ఒప్పుకున్నారు. అలవాటు లేనిచోట మొదటిసారి కూతుర్ని వదిలి రావడంతో రోజూ రాత్రి ఫోన్లో పలకరిస్తూ తన మేఘన కోసం తేబోయే బహుమతులూ, తాయిలాలూ వర్ణిస్తూ రెండురోజులు గడిపింది సరోజ. ఈరోజు తిరుగు ప్రయాణం.

"రేప్పొద్దున ఎప్పుడవుతుందా అని చూస్తున్నామమ్మా! ఈ రెండురోజుల్లో నీ కూతురు రెండు పుస్తకాలు చింపింది. నా పెన్ను ఏకీలుకాకీలు ఊడపీకి పెట్టింది. మీ అత్తగారికి చిన్నపిల్లలతో అలవాటు పోయి ముప్ఫయ్యేళ్ళయింది! నీ కాంప్ ఎప్పుడైపోతుందా, ఎపుడు తిరిగొస్తావా అని చూస్తున్నాం అదీ, నేనూ కూడా" అన్నారు మామగారు ఫోను తీయగానే ఏకబిగిన.

వెనక నుంచీ "నేను మాట్లాత్తా తాతగారూ... నేనూ మాట్లాత్తా అమ్మతో" అని మేఘన హడావుడి!

"ఇచ్చేదాకా ఆగాలి!" గదిమినట్టుగా మామగారి మాట వినిపించింది. ఫోనందుకుంటూనే మేఘన మాట్లాడిన మాటల్లో తనపట్ల బెంగ వినిపించింది సరోజకి.

సరోజ భర్త చాలా మెటీరియలిస్ట్. దానికి తోడు మితభాషి. ఆమె భావుకతకీ, అతని వ్యాపారధోరణికీ చుక్కెదురు. అతని బిజినెస్ తాలూకు లేట్‌నైట్ పార్టీలూ, డబ్బు వ్యవహారాలు, ఖాళీ దొరికితే టీవీ ముందు కూర్చుని అర్ధరాత్రిదాకా గడపడం, పేపరు పట్టుకుంటే ఇంట్లో భార్య ఉందనే ఊహకూడా లేకపోవడంతో, రోజులో

పదినిముషాలైనా కులాసాగా భర్తతో కబుర్లు చెప్పుకోవాలని ఆశించే సరోజ పెళ్ళైన కొత్తలో చాలా కృంగిపోయింది. తల్లీతండ్రీ కూడా తరుచూ అల్లుడి మంచితనాన్ని పొగడుతూ "ఒక్క చెడు అలవాటు లేదు. శ్రీరాముడులాంటి మనిషి ఉత్తముడు. మా అమ్మాయి అదృష్టవంతురాలు" అని చెప్పుకుంటుంటే తన సంసారంలో ఏం లోపమో, తన ఇంట్లో నవ్వుల జల్లులు ఎందుకు కురియవో, తన మొహం ఎందుకు కళకళ లాడడం లేదో తనకే అర్థంకాని స్థితిలో ఉండగా మంచి ఉద్యోగం దొరకడం, చేరి ఆ రొటీన్‌కి అలవాటు పడ్డాక మేఘన పుట్టడం జరిగింది. పాప పుట్టుకతో ఎడారిలో ఒయాసిస్సు దొరికినట్టైంది సరోజకి. కొన్నాళ్ళు ఇంట్లోనే ఉండే ఆయాని పెట్టుకునీ, కొన్నాళ్ళు క్రష్‌లో వేసీ, మరికొన్నాళ్ళు తల్లిసాయం తీసుకునీ, పిల్లని బడిలో వేసేదాకా బాగానే నెట్టుకొచ్చింది సరోజ. ఇపుడీ తప్పనిసరి ప్రయాణం ఎలాగో చివరికొచ్చిందని తేలిగ్గా నిట్టూర్చి, రూమ్ ఖాళీచేసి, స్టేషన్‌కి బయలుదేరింది.

ఆఫీస్ అసిస్టెంట్ వెంటవచ్చి, హైదరాబాద్ రైలెక్కించి వెళ్ళాక మళ్ళీ ఆలోచనలు చుట్టుముట్టాయి సరోజని. తన జీవితం గురించి తలచుకుంటూ 'ఏదైనా ఒక సంఘటన తీసుకుని వర్క్‌షాపులో చెప్పిన విధంగా, కవితాత్మకంగా, నిద్రపోతున్న వ్యక్తిని వెచ్చని సూర్యకిరణం మేల్కొలిపినట్టుగా ఒక చిన్న అందమైన కథ రాయాలి' అనుకుంది. రకరకాల ఎత్తుగడలూ, ముగింపులూ ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది. ప్రయాణపు కలత నిద్రనుంచీ మెలుకువ వచ్చేసరికి రైలు హైదరాబాదు చేరుకుంది. అత్తగారిల్లు చేరి, ఎదురొచ్చిన మేఘనను ఎత్తుకుని, హత్తుకుని, ముద్దాడి, పిల్ల సామానంతా పోగుచేసుకుని, అత్తగారిచ్చిన కాఫీ తాగి, ఇంటికి బయలుదేరింది. సోమవారం... తనకి ఆఫీసూ, పిల్లకి స్కూలూను.

"చాలా థాంక్స్ అత్తయ్యా! ఇన్నిరోజులు 'గాన' అల్లరి భరించారు నాకోసం" అంది గడపదాటుతూ కృతజ్ఞతగా.

"థాంక్యూ నాన్నమ్మా" అంది మేఘన కూడా.

నవ్వుతూ చెయ్యూపారు ఆవిడ.

ఇంటి తాళం తీసి లోపలికి వచ్చేసరికి ఫోను మోగుతోంది. పనులు చేసుకుంటూ మాట్లాడొచ్చని స్పీకర్ ఫోన్ మీటనొక్కింది సరోజ.

"గానా! ఇంటికొచ్చేశారా?" అటువైపునించి నిరంజన్ గొంతు.

"వొచ్చేశాం నాన్నా!" అంది మేఘన తియ్యగా.

"గుడ్ నాన్నమ్మ దగ్గర ఎంజాయ్ చేశావా? "అడిగాడు. మేఘన ఏం మాట్లాడలేదు.

"నాన్నమ్మ కథలు కూడా చెప్పిందిట కదా? బాగా ఎంజాయ్ చేశావా?" మళ్ళీ ప్రశ్నించాడు.

"ఊ... కొంచెం..." అయిష్టంగా అంది మేఘన.

"కొంచెమా? ఏం? ఎక్కువ ఎంజాయ్ చెయ్యలేదా?నాన్నమ్మ ఏవన్నా తిట్టిందా? కొట్టిందా?" అసహనంగా అడిగాడు నిరంజన్.

"తిట్టలేదూ... కొట్టలేదూ.. కథకూడా చెప్పింది" బుంగమూతితో చెపుతున్న కూతురివైపు వింతగా చూస్తూ చేస్తున్న పని ఆపేసింది సరోజ.

"ఇంకేమిటి మరి?" కొంచెం చికాగ్గా అడిగాడు నిరంజన్.

కూతుర్నే చూస్తూ నిలుచున్న సరోజకి తల్లీతండ్రీ గుర్తొచ్చారు. "శ్రీరామ చంద్రుడిలాంటి భర్త. ఒక్క వ్యసనం లేదు. కావలసినంత సంపాదన. ఇంకేం తక్కువమ్మా నీకు?" అని వాళ్ళు తనను ప్రశ్నించడం గుర్తొచ్చింది. 'ఇవన్నీ ఉన్నా

తను కోరుకున్నదీ, తనకు చాలా కావాలనుకున్నదీ తనకు తక్కువైనదీ ఏమిటో తనెపుడూ చెప్పలేకపోయింది ఇన్నేళ్ళొచ్చి. నాలుగేళ్ళ పసిది... అదేం చెపుతుంది?' బుంగమూతితో ఫోను దగ్గర నిలుచున్న మేఘనని చూస్తూ అనుకుంది సరోజ.

"ఏమైందంటే... నాన్నమ్మ నన్ను తిట్టలేదూ... కొట్టలేదూ... ఎత్తుకోలేదు కూడా" అంది మేఘన.

తర్వాత నిరంజన్ ఏమన్నాడో సరోజకి వినిపించలేదు. 'నాన్నమ్మ నన్ను తిట్టనూ లేదు, ఎత్తుకోనూ లేదు' అన్న ఒక్క వాక్యంతో అక్కడ తనకేం లభించలేదో చెప్పింది మేఘన! దృశ్యాదృశ్యంగా... సూచనప్రాయంగా... నిద్రపోతున్న వ్యక్తిని వెచ్చని సూర్యకిరణం గుచ్చినట్టుగా! 'కనగలిగే కనులుంటే, వినగలిగే మనసుంటే' పిల్లలు తమ మనోభావాలని ఎంత శక్తివంతంగా తెలియజేస్తారో అనుకుంది సరోజ. ***




ఉదయం పదిగంటలు! చలికాలం కావడంవల్ల సూర్యుడు మబ్బుల చాటు నుండీ అప్పుడప్పుడే బయటపడి శక్తిమేర ఎండకాస్తున్నాడు. అయినా వాతావరణం బద్ధకంగానే ఉంది.

కారు సిటీ లిమిట్స్ దాటుతోంది!

అందాకా మౌనంగా ఉండి లాప్‌టాప్‌లో బిజినెస్‌కి సంబంధించిన అకౌంట్స్ సరి చూసుకుంటున్న ప్రసాద్ స్విచ్ ఆఫ్ చేసి, కళ్ళద్దాలు తీసి ఒక్కసారి అరిచేతులతో మొహం తుడుచుకున్నాడు.

టెన్షన్‌గా అనిపించినపుడల్లా అట్లా మొహం తుడుచుకోవడం అతడికి అలవాటు. అయిదారు సెకన్ల తర్వాత కారు డ్రయివింగ్ చేస్తున్న మిత్రుడు శరత్ కేసి చూసి నిట్టూర్చాడు.

"ఏరా - ఏదైనా కొత్త సైట్ చూడడానికా?" సిగరెట్ అంటిస్తూ అడిగాడు.

"కాదు" ముక్తసరిగా బదులిచ్చి తిరిగి డ్రయివింగ్ చేయసాగాడు శరత్.

"మరెక్కడికిరా -?" అయోమయం పడిపోతూ మళ్ళీ ప్రశ్నించాడు ప్రసాద్.

"ఏ - ఇప్పుడు చెప్పక తప్పదా -?"

"అలా అనేమీ కాదు - గానీ, చెబితే సస్పెన్స్ తొలిగిపోతుంది కదా -! కొత్త సైటేమయినా సెటిల్ చేశావా "

"కాదన్నానా - " మిత్రుడి మాటలు మధ్యలోనే తుంచేస్తూ సీరియస్ అయ్యాడు. ప్రసాద్, శరత్ బాల్యమిత్రులు. అంతే కాకుండా ఇద్దరూ రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో ఆరితేరినవాళ్ళు. కొన్ని వెంచర్లు ఉమ్మడిగా, మరికొన్ని విడివిడిగా కొని ప్లాట్లుగా మార్చి బిజినెస్ చేస్తుంటారు. తెలివితేటల్లో ఎవరికి వారే సాటి, అయినా తమ బిజినెస్‌లో గానీ, ఇటు మనసుల్లోగానీ ఎన్నడూ లేశమంతయినా పొరపొచ్చాలు రాని స్నేహం వారిది. అందుకు అసలు కారణం ద్విగేట్ బిజినెస్

టైకూన్ గుప్త! దాదాపు అర్ధశతాబ్దం జీవితాన్ని బిజినెస్‌కే అంకితం చేసి, సైకిల్ మీద తిరిగి చింతపండు, ఉల్లిగడ్డలు అమ్మే స్థాయి నుండీ వందకోట్ల టర్నోవర్‌కి వ్యాపారాన్ని పెంచిన ధీశాలి! అతడి చేయికింద బిజినెస్‌లో తర్ఫీదు పొంది క్రమేపి మెరికల్లా తయారయిన యువకిశోరాలీ ప్రసాద్, శరత్‌లు!

ఆ మాటకొస్తే ఆయన నీడన ఎదిగి కోటీశ్వరులైన వారు కోకొల్లలు. కానీ వారందరిలోనూ అగ్రగణ్యులీ మిత్రద్వయం. విచిత్రమేమిటంటే అంతగా ఎదిగినా వాళ్ళకి ఇప్పటికీ గుప్తాగారంటే ఎనలేనిప్రేమాభిమానాలు.

"పోనీ - బిజినెస్‌లో ఏదయినా లాసొచ్చిందా?" సిగరెట్ వదులుతూ అడిగాడు.

"నో - నో - అదేం లేదు" పొడిగా నవ్వి బదులిచ్చాడు శరత్.

శరత్ వైఖరేంటో ప్రసాద్‌కి అస్సలు అర్థంకాలేదు. ఎందుకంటే పొద్దున్నే ఆఫీసులో హాయిగా కూచుని ఉన్న తనని కారణం ఏదీ చెప్పకుండానే ఇట్లా బయటకు తీసుకు రావాల్సిన అగత్యమేమిటో ఎంత ఆలోచించినా అర్థం కావడంలేదు.

మళ్ళీ ఒకసారి సిగరెట్ దమ్ము గట్టిగా పీల్చివొదిలాడు!

"సర్లే చెప్పడం ఇష్టం లేకపోతే మానేయ్" ఆఖరుగా నిష్టూరమాడాడు. నిమషం పాటు ఇరువురి మధ్య కొలవలేని నిశ్శబ్దం చోటు చేసుకుంది.

"చెప్పడానికి అభ్యంతరం ఏమీలేదుగానీ - చెబితే షాకవుతావేమోననీ" శరత్ మెల్లిగా అన్నాడు, బదులుగా ప్రసాద్ చిన్నగా నవ్వాడు.

"షాకా -? ఈ బిజినెస్‌లో దిగాకా ఆ పదానికి అర్థమే మర్చిపోఈయ్యానా -!"

"హు- అయితే విను" గట్టిగా నిట్టూర్చి అన్నాడు శరత్

ప్రసాద్ ఊపిరి బిగపట్టాడు. కారు మాత్రం ఎప్పట్లా రోడ్డు మీద నిశ్శబ్దంగా సాగిపోతూనే ఉంది.

కమలవ్వకు ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగడంలేదు. పొద్దున లేవగానే ఎవరి మొహం చూసిందో గుర్తుకు రావడం లేదుగానీ, ఇలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు. ఆ వార్త విన్నప్పటి నుండీ ఆమెకు మనసు మనసులో లేదు. తిండీ తిప్పలు ఏమీ సహించడం లేదు. వెంటనే చేతి సంచి తీసుకుని, ఇంట్లో ఉన్న రొన్నూరు రూపాయలు బొడ్డు సంచిలో దోపుకుని బస్సెక్కింది. బస్సెక్కినా దుఃఖం ఆగడంలేదు. ఆ దుఃఖం చూసి "ఏమైందమ్మా?" అంటూ ఎవరైనా పలకరించాల్సిందేగానీ - ఆమె అవతారం చూసీ ఎవరూ అందుకు ధైర్యం చేయడం లేదు. ఎందుకంటే కమలవ్వను చూస్తే అచ్చంగా దరిద్రదేవతకు మారుపేరులా ఉంటుంది! అందుకేఆమెను ఎవరూ పలకరించడం కాదుకదా-! బస్‌లో పక్కన నిలబడడానికి కూడా అనుమతించడంలేదు.

"వెనక్కి వెళ్ళమ్మా - సీట్లున్నాయ్" ఎవరో కసిరినంత పని చేశారు.

కమలవ్వ మౌనంగానే బస్సు వెనకవైపు అడుగులేసింది. ఆమె మనసు నిండా ఒకటే ఆలోచన! తాను విన్న ఆ వార్త నిజమేనా -? కాదేమో - అబద్ధమయితే ఎంత బాగుండును--? ఇంతకా కమలవ్వ విన్న ఆ దుర్వార్త ఏమిటంటే - - అన్న చంద్రయ్య పాము కరచి రాత్రి నిద్రలోనే ప్రాణాలు వదిలాడనీ - అంతే అది విన్నప్పటినుండీ ఆమె గుండెలవిసిపోయేలా ఏడుస్తూనే ఉంది. నిజానికి చంద్రం ఆవిడ సొంత అన్నేమీ కాదు. చిన్నాయన కొడుకు. అయితే మాత్రం? అటువంటి ఆత్మీయతా, ఆపేక్షగల అన్నలు కోటికొక్కరు కూడా ఉండరు.

"కమ్లా - కమ్లా -" అంటూ కళ్ళల్లో పెట్టుకుని చూసుకునేవాడు.

అంతటి బంగారు మనిషికి దేవుడెందుకో గానీ సంతానం కూడా ఇవ్వలేదు. అయినా చంద్రమంటే ఇష్టపడని - ఆపేక్ష చూపని 'బంధుగణం' లేరంటే అతిశయోక్తి ఏమీ కాదు.

"హుఁ ఎందరున్నా ఏం లాభం?-- పొయ్యేముందు ఎవరూ రారు. వచ్చినా పోయిన ప్రాణాలు తిరిగి తేలేరు "కమలవ్వ నిరాశగా నిట్టూర్చింది

"దిగవమ్మా బూరుగపల్లి వచ్చేసింది" కండక్టర్ గుర్తుచేశాడు.

మౌనంగా బస్సు దిగింది కమలవ్వ. బస్సువెళ్ళిపోయింది. ఊళ్ళోకి నడుస్తూనే చుట్టూ పరిశీలించి చూసింది. ఊరు వేగంగా మారిపోతుంది. సిటీకి ఆనుకుని ఉండడం వల్ల అక్కడక్కడా కళ్ళు చెదిరే మేడలు కూడా వెలిశాయి. గుడిసెల పక్కల మేడలు, మేడల చుట్టూ గుడిసెలు కలగలిసి పోయాయి.

అల్లంత దూరంలో తన అన్న గుడిసె - దాన్నిండా - చుట్టాలు పక్కాలు! బయట అంటించిన 'అగ్గి' చూడగానే కమలవ్వ దుఃఖం కట్టలు తెంచుకుంది.

"చంద్రన్నా - యాడబోయినవే - నేనొచ్చిన నీ చెల్లెను రావే - "గుండెలు బాదుకుంటూ గుడిసెవైపు పరుగుదీసింది.

హఠాత్తుగా కారాపాడు శరత్! ప్రసాద్ కారు డోరు తెరిచి కిందకు దిగాడు. రెండు మూడు సెకన్ల తేడాతో శరత్ కూడా కారు దిగి స్నేహితునికి జత కలిశాడు.

"గుప్తాగారు ఎక్కడుంటున్నారో తెలుసా?" సిగరెట్ అంటించుకుని అడిగాడు శరత్.

"నారాయణగూడాలో కదా -?" మామూలుగా బదులిచ్చాడు ప్రసాద్.

"కాదు - సౌండ్‌పొల్యూషన్ ఆరోగ్యానికి మంచిది కాదని స్పెషలిస్ట్ సలహా ఇవ్వడంతో -- కొన్నాళ్ళుగా ఇక్కడే - ఆ కనిపించే పల్లె - అదే బూరుగుపల్లెలో ఉంటున్నాడు"

"అట్లాగా - నాకు తెలియదే -?" ఆశ్చర్యపోయాడు ప్రసాద్.

"నీకు తెలియని విషయం మరోటి కూడా ఉంది" ఎటో చూస్తూ అన్నాడు శరత్.

"ఏమిటదీ -?"

"గుప్తాగారు - గుప్తాగారూ - ఈ తెల్లవారుఝామునే పోయారు"

"వాట్" ఊహించని పిడుగులాంటి వార్తకు అదిరిపడ్డాడు

"నువ్ షాక్ అంటావని ముందే హెచ్చరించిన వార్త ఇదే!"

"ఐకాంట్ బిలీవ్ ఇట్" వళ్ళు స్వాధీనం తప్పిపోతుంటే కారు డోర్ పట్టుకుని నిలదొక్కుకున్నాడు ప్రసాద్. క్షణాల్లో మనిషి ఒళ్ళంతా పూనకం వచ్చినట్లు వణికిపోతున్నాడు.

"ప్రసాద్ - కంట్రోల్ యువర్ సెల్ఫ్! నేముందే చెప్పాను - షాక్‌కి గురవతావని!" ప్రసాద్ ఏమీ మాట్లాడలేకపోతున్నాడు! రెండు నిముషాలాగి మళ్ళీ శరత్ చెప్పనారంభించాడు.

"గుప్తాగారు పోయే సమయానికి సెక్రటరీ తప్ప వెంట ఎవరూ లేరు. ఇప్పటికీ అంతే! ఉన్న ఇద్దరు కొడుకులు స్టేట్స్‌లో ఉన్నారు. ముగ్గురు కూతుళ్ళు దగ్గర్లోనే - అదీ ఖాళీగా ఉన్నా రాలేదు. ఆస్తిపంపకంలో తమకు అన్యాయం జరిగిందన్న సాకుతో మొహం చాటేశారు.--- సో --- అందరుండీ--- ఎవరూ లేని వారయ్యారు. దిగ్రేట్ గుప్త - ష్ -

పోనీ - ప్రస్తుతం మనం చెయ్యాల్సిందేమిటంటే అంత్యక్రియలు జరిగేవరకు దగ్గరుండి అన్నీ మనమే చూడాలి! అఫ్‌కోర్స్ కొడుకులొచ్చేంతవరకే అనుకో -" ఊపిరి తీసుకోవడానికి అన్నట్లు ఆగాడు.

"విత్ ప్లెజర్ --- కానీ ఎట్లా పోయాడో "కొంచెం తేరుకుంటూ అడిగాడు.

"హార్ట్ఎటాక్ - అదొక్కటీ చాలదూ - ప్రాణం పోవడానికి" తిరిగి కారెక్కాడు శరత్.

"నిజమే - పదపద -! తొందరగా వెళదాం" వేగిరపడ్డాడు ప్రసాద్.

అయిదు నిముషాల్లో మిత్రులిద్దరూ గుప్తాగారి ఇంటినుండు కారు దిగారు.

అరగంటపాటు ఏడ్చీ ఏడ్చీ అలసిపోయి కమలవ్వ మెల్లగా వదిన రాజమ్మ దగ్గరకు చేరింది. అప్పటికి సాయంకాలం అయిదు కావొస్తుంది. దవాఖాన నుండీ చంద్రం శవం ఇంకా రాలేదు అదే విషయం వదినను అడిగింది కమలవ్వ

"శవం అనకు బిడ్డా - ఇంకా ప్రాణం పోలేదు" చప్పున మరదలి నోరు మూసింది రాజవ్వ.

"అయ్యో నా నోరు పడిపోనూ - అన్న ఇంకా బతికే ఉన్నాడా? మరి వాకిటల ఆ అగ్గేందొ వొదినా -? అనుమానపడిపోయింది కమలవ్వ.

"అదా - ఇయ్యాళే ఎదురింటి మేడలో ఓ మారాజుపోయిండు. మాగొప్ప శ్రీమంతుడు. ఇద్దరు కొడుకులు, ముగ్గురు బిడ్డలట! ఆయన పోయిండని వాకిట్లో నిప్పు రాజేసిండ్రు - ఆయన పేరేందిరా -?" పేరు చప్పున గుర్తుకురాక పదిహేనేళ్ళ మనవడు గోవిందుకేసి చూసింది.

"గుప్తనట కోటీశ్వరుడు-- మబ్బులోనే ప్రాణం పోయిందట" గోవిందు చెప్పాడు.

"మరి కొడుకులూ - బిడ్డలూ ఎవరూ రాలేదా ---? ఇంట్లో ఏడుపులు లేవు - కనీసం సప్పుడేమీ లేదు" కమలవ్వ అనుమానపడింది.

"వచ్చిండొచ్చు - సదువుకున్నోళ్ళు - వచ్చినా మనలెక్క బయ్య బయ్య ఏడుస్తరా - ఏమన్ననా -?"

"నిజమే వదినా - ఎంతయినా ఉన్నోళ్ళ తరఫే వేరు" వొదినను కమలవ్వ సమర్థించింది

"ఏమిటాలశ్యం?" ఉండబట్టలేక ప్రసాద్, సెక్రటరీని ప్రశ్నించాడు.

గుప్తగారి సెక్రటరీ శ్యామ్ సమాధానం చెప్పడానికి కాసేపు తటపాయించాడు.

"సార్ - అటుకొడుకులు, ఇటు బంధుమిత్రులు ఎవరూ రాలేదు... మీరు తప్ప--! ఈ పరిస్థితుల్లో శవాన్ని ఎట్లా ఎత్తడం--?" నెమ్మదిగా అన్నాడు.

ముందరి హాల్లో గుప్తగారి శవం, జరుగుతున్న దాంతో సంబంధం లేనట్టి నిర్వికారంగా పడి ఉంది. తలవైపు ఉన్న అగరుబత్తులు నిరంతరాయంగా కాలిపోతూనే ఉన్నాయి.

"మరేమిటి చేయడం - మళ్ళీ ఒకసారి ఫోన్ కొట్టు" శరత్ సలహా ఇచ్చాడు.

"వందసార్లు చేశాను సార్! ఎవరూ రెస్పాన్స్ ఇవ్వడంలేదు"

శరత్, ప్రసాద్‌లకు గుప్తగారి కొడుకుల రూపాలు కళ్ళముందు మెదిలాయి.

"ఛ - ఎలాంటి మనిషి గుప్తగారూ - ఎంత మందికి జీవితాన్ని ప్రసాదించారు - వాళ్ళకు కృతజ్ఞత లేకపోవచ్చు - కన్నకొడుకులు వీళ్ళకేమయింది?" తనలో తాను అనుకుంటున్నట్టు అనుకుని బయటికే అనేశాడు ప్రసాద్.

"కన్నవారికే లేని ప్రేమ. బాధ్యత ఇతరులకి ఎట్లా ఉందనుకుంటావ్ ప్రసూ -"

"నిజమే - నిజమే -" ఏం బదులివ్వాలో తెలియక శరత్‌ని సమర్థించాడు.

అప్పటికి ఆరు కావొస్తుంది! నెమ్మదిగా చీకట్లు ముసురుకుంటున్నాయ్!

"సార్ - అబ్బాయిగారి నుండీ - అదే స్టేట్స్ నుండీ కాల్ -" సెక్రటరీ శ్యామ్ ఉన్నట్టుండి అరచినంత పని చేశాడు.

ఒక్కసారిగా తేరుకున్న శరత్ అంతలోనే సర్దుకుని "నువ్వే మాట్లాడు" అంటూ అయిష్టంగా మొహం అటువైపు తిప్పుకున్నాడు. ప్రసాద్ డిటో - డిటో -!! చెప్పాలంటే వాళ్ళిద్దరికీ గుప్తా కొడుకులతో కావాల్సినంత చనువూ, స్నేహం ఉన్నాయి, కానీ తండ్రిపోయి ఇరవైనాలుగ్గంటలు దాటుతున్నా ఇంకా బయలుదేరని వాళ్ళ బండ మనస్తత్వానికి సదరు స్నేహం, చనువు ఆవిరయిపోయాయి.

వీళ్ళ ఆలోచనల్లో వీళ్ళు ఉండగానే సెక్రటరీ, ఫోన్ మాట్లాడడం - స్విచ్ ఆఫ్ చేయడం జరిగిపోయాయి. మిత్రులిద్దరూ అత్నడికేసి ఆత్రుతగా చూశారు.

"సార్ - "సెక్రటరీ బలవంతంగా గొంతు పెగుల్చుకుని అన్నాడు.

"చెప్పు - "ప్రసాద్ ఆదేశించాడు.

"అదీ - అదీ"

"నసిగితే చంపేస్తాం - ఏం చెప్పాలనుకున్నావో నిరభ్యంతరంగా చెప్పేయ్" శరత్ విసుగ్గ అన్నాడు.

"అదీ - అదీ? వాళ్ళకి - అదే అబ్బాయిలకు పాస్‌పోర్ట్ క్లియరెన్స్ దొరకలేదట పైపెచ్చు రేపు ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికాతో ఏదో కాన్ఫరెన్స్ ఉందట. అది జీవితకాలంలో ఒకే ఒకసారి దొరికే అద్భుత అవకాశమట" ఆగిపోయాడు.

"అసలు కారణమేమిటట - పాస్‌పోర్ట్ ప్రాబ్లమా - ప్రెసిడెంట్‌తో కాన్ఫరెన్సా?" ప్రసాద్ అసహనంతో అరచినంత పని చేశాడు.

"రెండు కూడానట"

"అయితే మరెందుకట ఫోన్ చేయడం -" శరత్ కయితే వాడు ఎదురుగా ఉంటే చంపి పాతరెయ్యాలన్నంత కోపం తన్నుకొస్తుంది.

"అదీ - అదీ -"

"నసగకుండా ఏదీ చెప్పలేవా -?"

"సార్ అట్లా అంటే ఎట్లా సార్? విషయం అటువంటిది "సెక్రటరి తలదించుకున్నాడు.

"నువ్వెందుకు తల దించుకోవడ --- విషయమేమిటో చెప్పు"

"అదీ - అదీ - మరే - మీరిద్దరు దగ్గరుండి మిగతా కర్మకాండ - అదీ పూర్తి చేసి సదరు కార్యక్రమమంతా వీడియో తీసి సీడీగా మార్చి పంపిస్తే -" అగిపోయాడు.

"పంపిస్తే" - కలలో కూడా ఊహించని పరిణామానికి మిత్రులిద్దరు సంబీ భూతులయ్యేరు.

"దాన్ని చూసి ఏడుస్తారట -" పూర్తి చేశాడు సెక్రటరీ.

"వాట్" ఎగిరిపడ్డాడు ప్రసాద్.

"ఒట్టు సార్ - వాళ్ళు చెప్పిందే నేను చెప్పాను" తల మీద చేయిపెట్టుకున్నాడు సెక్రటరి. మిత్రులిద్దరికి నవ్వాలో, ఏడవాలో నిజంగా అర్థం కాలెదు. తలలు పట్టుకుని చాలా సేపు అలాగే నిలబడిపోయారు.

గుప్తగారి భౌతిక కాయం పంచభూతాల్లో లీనమయ్యే సరికి రాత్రిపదయింది.

అతడి మహాప్రస్థానానికి హాజరయినవారు లెక్కిస్తే అంకెలే తప్ప సంఖ్యల్లో లేరు. తిరుగు ప్రయాణంలో అయితే ఇద్దరే - అదే ప్రసాద్, శరత్‌లు మాత్రమే ఇంటికొచ్చి 'దీపం' చూసి తమ ఇంటికి వెళ్ళిపోవడానికి సిద్ధమవుతూ కార్లోకూచుని బండి స్టార్ట్ చేశారు.

సెక్రటరీ శ్యామ్ కారు దాకా వచ్చి సాగనంపడంతో బాటు 'థాంక్స్' చెప్పాడు. మిత్రులిద్దరు ఆఖరుసారిగా గుప్తగారిల్లు కేసి చూసి కళ్ళల్లో ఉబుకుతున్న నీళ్ళను అదిమి పెట్టి అతడి కేసి 'వెళ్ళొస్తాం' అన్నట్టు చేతులూపారు. అంతలోనే - ఎదురుగా ఉన్న గుడిసెలోంచి పెద్దగా కేరింతలు, అరుపులు వినిపించాయి. శరత్, ప్రసాద్ లిద్దరు ఒక్కసారిగా మొహామొహాలు చూసుకున్నారు. "ఏమిటి శ్యామ్? పొద్దుటి నుండీ ఎదురుగా ఉన్న గుడెసెలో హడావిడీ?" శరత్ ఉండబట్టలేక ప్రశ్నించాడు. సెక్రటరీ కొద్దిసేపు తటపటాయించాడు.

"సార్ చెబితే నవ్వుతారేమో? అయినా మనకెందుకు లెండీ - అంతా అలగాజనం"

"ఫర్వాలేదు చెప్పు - టైమ్‌పాస్ - అదీగాక ఇవాళ చూడకూడని వెన్నో చూశాం, అప్పుడు రాని నవ్వు ఇపుడేం వస్తుందిలే" సిగరెట్ అంటించి నింపాదిగా అన్నాడు.

సెక్రటరీ మళ్ళీ కాసేపు మౌనం వహించి, ఇక తప్పదన్నట్టు నోరువిప్పాడు.

"ఇక్కడో నమ్మకముందు సార్"

"ఏమిటది - "మిత్రులిద్దరు ఒకేసారి ప్రశ్నించారు.

"అదీ - ఈ కూలీజనంలోనే లెండీ" తేలికగా అన్నాడు శ్యామ్

"అదే, ఏమిటనీ"

"అదీ ఎవరయినా - పొరపాటుగా కాకులు 'కలుసుకోవడం' చూస్తే అది దోషమని భావించి -" ఆగిపోయాడు.

"దోషమని" రెట్టించి అడిగాడు ప్రసాద్, శరత్ ఆసక్తి వింటున్నాడు.

"ఆ దోషం పోవాలంటే - అట్లా చూసినవారు, తాము బతికుండగనే చనిపోయినట్టు బంధువులకు - తెలిసిన వారికి వర్తమానం పంపుతారు"

"భలేగా ఉందే - తర్వాత -"

"తర్వాతేముంది సార్! విషయం తెల్సిన బంధుమిత్రులు వచ్చి ఏడిస్తే - ఆ దోషం తొలిగిపోయి - సదరు వ్యక్తి చిరకాలం బతుకుతాడని ఓ నమ్మకం" ముగించాడు శ్యామ్.

"వెరీ - ఇంట్రెస్టింగ్ ఐతే - అట్లా ఎవరికి ఎక్కడ జరిగింది?" ప్రసాద్ ప్రశ్నించాడు.

"ఎక్కడో ఎందుకు సార్ - ఇక్కడే మీరన్న ఈ గుడిసెలోనే - అదే ఆహడావిడి, ఇందులో ఉన్న చంద్రయ్య అనే కూలీ నిన్న కాకులు `కలుసుకోగా` చూశాడట! చూసిన వెంటనే చంద్రయ్య బంధువులకు తాను చనిపోయినట్టు - ఉత్తుత్తిగానే వర్తమానం పంపాడు. అయితే విషయం తెలియని చుట్టాలు, పక్కలు నిజంగానే చనిపోయాడనుకుని గుండెలు బాదుకుంటూ దిగబడిపోయారు. తీరా అంతా ఉట్టిదే అని తెలిసి సంతోషంగా దావత్ చేసుకుంటున్నారు - దాని బాపతే ఏరింతాలు, అరుపులే అవి -!" విశదీకరించాడు సెక్రటరీ.

మిత్రులిద్దరూ చాలాసేపు ఏమిమాట్లాడలేక అలా నిలబడిపోయేరు! ఇంతలో ఒక నడీడు వ్యక్తి బాగా తాగి అటూ ఇటూ తూలుతూ వచ్చి కారుదాకా వచ్చి దబ్బున పడిపోయాడు. అంతలోనే లేచి" ఏదో బాంచన్.... గరీబుగాళ్ళం - మీలాగా ఉన్నోళ్ళం కాదు. దుఃఖమొచ్చినా - సంబరమొచ్చినా తట్టుకోలేం! మా బామ్మర్ది చెంద్రిగాడు - నిన్న కాకులు కలుసుకోగా చూసిండట. లష్మీకేడు సచ్చిపోయిన్నని పుకారు లేవదీశిండు - అది విని మేం సచ్చిపోయినంత బాధపడ్డామయ్యా - లబోలబోమని - ఏడ్చుకుంటూ - మొత్తుకుంట ఇగ ఎగపడి వస్తే సూద్దం గదా - గాడ్డికేడు గుండ్రాయోలె ఇంట్ల కూసోని కిలుక్కున నవ్వవట్టె - ఇగ ఊకుంటమా - వాని రోగం తిర్గెదాకా దావత్ తీస్కుంటం - నీయక్క ! వాడు మా - తాగుడుకి గుడ్సె అమ్ముకోవాలే - తప్పుంటవా బాంచన్ తప్పయితే నీ ఎడ్మకాలు చెప్పుతో కొట్టు పడ్త -" అంటూ దండం పెట్టి వెళ్ళిపోయాడు. బదులుగా ఎవరూ ఏమీ మాట్లాడలేకపోయారు. శరత్ నిశ్శబ్దంగా గేరు వేసి కారు ముందుకు దూకించాడు. కారు ఫర్లాంగు దూరం దాటినా `ఆ గుడిసె` లోంచి అరుపులూ - కేరింతలు వినిపిస్తూనే ఉన్నాయ్!

"శరత్" ప్రసాద్ మిత్రుడిని పిలిచి ఏదో అడగబోయాడు.

అయితే బదులుగా శరత్ ఏమీ మాట్లాడలేదు. కారు మెత్తగా కాలం లాగా సాగిపోతూనే ఉంది.

"కోట్ల ఆస్తి ఉండి కన్న తండ్రి చచ్చినా ఆఖరు చూపుకి కూడా రాని వాళ్ళు ఉన్నవాళ్ళా? లేక ఏమీలేకున్నా చుట్టం ఉత్తుత్తి చావుకే తండోపతండాలుగా తరలి వచ్చిన చంద్రయ్య బంధువులు అసలైన ఉన్నాళ్ళా?" శరత్ తేల్చుకోలేక పోతున్నాడు.

నిజానికి ప్రసాద్ కూడా మిత్రుడిని అడగాలనుకున్న ప్రశ్న అదే మరీ....!

***

# మలుపు

## - శారద



**బెంగుళూరు బస్టాండు రద్దీగా** ఉంది. అసలే శుక్రవారం, పైగా సాయంత్రం ఆరుగంటల సమయం. హైదరాబాదు వెళ్ళే బస్సు కదలటానికి సిద్ధంగా ఉంది. ఆ బస్సు అలా నిలబడి చాలా సేపే అయింది. చదివేసిన పేపరు పక్కన పెట్టి విసుగ్గా కిటికీలోంచి బయటికి చూసింది సురేఖ. బస్సు అందుకోవాలని ఆదరాబాదరాగా బాగ్‌లో బట్టలు పడేసుకుని వచ్చింది. ఇంత లేటవుతుందని ముందే తెలిసుంటే... తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది. జరగబోయేది ముందే

తెలిస్తే అసలు జీవితం ఎలా ఉంటుంది? ఏ మలుపులూ లేకుండా సాఫీగా, చక్కగా ఉన్న రోడ్డు మీద ప్రయాణంలా చాలా బోరింగ్‌గా ఉంటుంది కాబోలు. ప్రయాణం అన్నాక కొన్ని మలుపులూ, ఏ మలుపులోంచి ఎవరొస్తారో, ఏం చేస్తారో, తెలియని ఒక రకమైన అనిశ్చిత పరిస్థితి ఉంటేనే కొంచెం ఉత్సాహంగా ఉంటుందేమో, లేకపోతే ఏ మార్పులూ మలుపులూ లేకుండా ఏం బాగుంటుంది, తన బ్రతుకులా నిస్సారంగా..!

బహుశా ఆడవాళ్ళ జీవితంలో పెళ్ళీ పిల్లలు అన్నిటికంటే పెద్ద మలుపులు. వాళ్ళ ఆలోచనలనీ, ప్రయారిటీస్‌నీ, నిజానికి వాళ్ళ వ్యక్తిత్వాలని కూడా మార్చగలిగే మలుపులు. తనూ పెళ్ళితో కొంచెం మారిందేమో కానీ, పిల్లలు పుట్టక పోవటంతో ఒక రకమైన నిరాశ, నిస్తేజం ఆవరించాయి. పెళ్ళప్పుడు ఎంతో ఆశాజనకంగా, రంగు రంగుల్లో కనిపించి ఊరించిన భవిష్యత్తూ, పదేళ్ళు దాటేసరికి రొటీన్గా, అర్థంలేనట్టు అనిపించసాగాయి. చుట్టాలనీ, స్నేహితులనీ దిగ్భ్రాంతిలో ముంచుతూ తను చాలా మంచి ఉద్యోగాన్ని వదిలేసి ఒక ఎన్.జీ.ఓ.లో చేరి సమాజ సేవ చేయటం మొదలు పెట్టింది. అయినా తన మానసిక స్థితిలో ఏమీ మార్పులేదు. ఏమాత్రం తన బాగోగులు మనసుకి పట్టించుకోని భర్తా, అతన్నేమీ అనలేని తన బలహీనత, చుట్టూ ఉన్న మనుషుల వెక్కిరింపు మాటలు... నిజానికి, తన చదువూ, వదిలేసిన ఉద్యోగం, హోదా, డబ్బూ చూసి తననెవరూ పిల్లలు లేని విషయం ఎత్తి నొప్పించరు. అలా ఎవరైనా మొరటుగా తనతో మాట్లాడి ఉంటే, తనూ వాళ్ళతో పెద్ద జగడం చేసి తన మనసుని కొంచెమయినా చల్లబర్చుకునేదేమో. కానీ ఆ అతి మర్యాద మాటలు,

''మీకేమండీ, పిల్లలు లేని అదృష్టవంతులు, ఎంత స్వతంత్రం, స్వేచ్చ! కావాలంటే మా పిల్లల్ని తీసుకోండి'' లాంటి చెత్తజోకులు, లేదా అదేదో పెద్ద విషయం కానట్టు తనని లాలిస్తూ అనే మాటలు, ఇవి ఎక్కువగా బాధిస్తున్నాయి. కొన్ని రోజులు హైదరాబాదు వెళ్ళి మా అన్నయ్య దగ్గరుండొస్తాను, అంటే మౌనంగా టిక్కెట్టు కొనిచ్చిన భర్త, కనీసం మళ్ళీ ఎప్పుడొస్తావని అడగలేదు. చాప కింద నీరులా తనకి తెలియకుండానే ఇంత దూరం ఎప్పుడొచ్చింది తమ మధ్య? పిల్లలు లేని ప్రతి దంపతులూ ఇంతేనా? భార్యా భర్తలని దగ్గరకి చేర్చేదీ, జీవితాంతం కలిపి ఉంచేదీ ఆ పిల్లలూ, వాళ్ళ పెంపకాలూ, ఆ సమస్యలేనా? అతను మొదటినుంచీ తనతో ముభావంగానే ఉన్నాడు. ఆ ముభావానికి అర్థం తనకి తెలుసు కాబట్టి తను దానిని పెద్దగా పట్టించుకోలేదు, దాన్ని ఎలాగూ తను వదిలించగలదనే ధీమాతో. తను చాలా తెలివైనది. గల గలలాడుతూ, జలపాతంలా నవ్వుతూ, పుస్తకాలు చదువుతూ, వాటిని గురించి చర్చిస్తూ, తను ఎక్కడుంటే అక్కడ లైవ్లీగా, బాగుంటుందని ఫ్రెండ్స్ అంతా తన కంపెనీ కోసం పడి చచ్చేవారు. అలాంటిది తన జీవిత సహచరుడు స్తబ్దుగా, ముభావంగా ఉండటమా! ''నెవర్, ఐకెన్ ఫిక్స్ ఇట్'' అనుకుంది ఎప్పట్లాగే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో. తను తన ప్లాన్‌లన్నీ ఆచరణలో పెడుతుండగానే, దేవుడు చావు దెబ్బ తీసాడు, తనకి పిల్లలు పుట్టరన్న డాక్టర్ రిపోర్టుతో. తనకెందుకో ఒక్కటే క్షణంలో అన్ని ఆశలూ చచ్చిపోయిన భావనొచ్చింది. తను చేసిన తప్పుకి భగవంతుడింత పెద్ద శిక్షవేస్తాడని ముందే తెలిసుంటే ... ఆలోచనల్లో పడి కొట్టుకుపోతున్న సురేఖ, హడావిడిగా ఆటో దిగి పెద్ద బ్యాగు పట్టుకుని బస్సెక్కుతున్న స్త్రీని చూసి ఉలిక్కిపడింది. అరె, తనిక్కడుందేమిటి? ఇప్పుడేమిటి చెయ్యటం. ఈ బస్సు దిగి ఇంకొక బస్సెక్కుదామన్నా టైం లేదు. ఇప్పుడు తనొచ్చి పక్కనే కూర్చుంటుందేమో, ఇంకెక్కడా సీట్లు ఖాళీ ఉన్నట్టు లేవు. ఇక్కడే తను ఇండియన్ ఇన్స్టిట్యూట్లో ఫాకల్టీలో ఉందని తెలుసు కానీ ఇలా ఎదురు పడుతుందనుకోలేదు. గబగబా పేపరు తీసి ముఖాని కడ్డం పెట్టుకుంది.

అనుకున్నట్టుగానే ఆమె తన పక్కనే వచ్చి కూలబడింది. కనీసం పక్కనెవరున్నారో కూడా చూసేంత టైం లేనట్టు పెట్టెలోంచీ ఒక లావాటి పుస్తకం తీసి చదువుతూ కూర్చుంది. ఇప్పుడు తను పలకరించాలా వద్దా? పెళ్ళయ్యిందో లేదో? అయ్యే ఉంటుంది, పిల్లలు కూడా ఉండే ఉంటారు. తనూ తనకి ఇద్దరు బిడ్డలని చెప్పేస్తే సరి. మెల్లిగా పేపరు మడిచి రెండు క్షణాలామె వంకే చూసింది. ఆ చూపుల స్పర్శ తగిలిన దానిలా తలెత్తి చూసిందామె.

"మీరు..." ఆమె తీవ్రంగా ఆలోచిస్తోంది. తనకి ఆమె బాగా తెలుసు కానీ, ఆమెకి తనంత బాగా తెలియదు మరి. కేవలం ముఖ పరిచయం. అందుకే త్వరగా గుర్తు పట్టలేకపోతోంది.

"సురేఖ, మీ పేరు రేఖ కదూ?"

"అవును. మిమ్మల్నెక్కడో చూసాను."

"హైదరాబాద్‌లో విమెన్స్ కాలేజీలో మనిద్దరం బాచ్‌మేట్స్‌మి. దాదాపు ఇరవై ఏళ్ళ క్రితం,"

"ఆ! అవునవును. నా పేరు రేఖ, మీ పేరు సురేఖ! అందుకే అందరూ నవ్వే వాళ్ళు. రేఖ - సురేఖ, సినిమా పేరులాగుంది అంటూ", పాత రోజులు గుర్తు రావటంతో ఆమె నవ్వింది.

"అవును, ఇద్దరం ఒకటే క్లాసయినా వేరు వేరు సెక్షన్‌లలో ఉండే వాళ్ళం".

"ఇరవై ఏళ్ళయినా నువ్వేమీ మారలేదు! లావు కూడా కాలేదు", రేఖ మాటలకి నవ్వొచ్చింది. కొంచెం గర్వంగా కూడా అనిపించింది.

"యూ టూ" తనూ నవ్వుతూ అంది.

"ఎక్కడ ఉండటం?"

"హైదరాబాద్‌లో! చిన్న పని మీద బెంగుళూరొచ్చాను", కొన్ని సార్లు తనెందుకబద్ధం చెపుతుందో తనకే అర్థం కాదు.

"అవునా? నేనిక్కడే బెంగుళూరులో ఉంటున్నాను. "ఇంకా ఎక్కువ వివరాలేమీ ఇవ్వలేదు, ఎందుకో!

"ఉద్యోగం చేస్తున్నావా?" మళ్ళీ రేఖ అడిగింది.

"లేదు. ఇల్లూ పిల్లలతోటే క్షణం తీరికుండదు. యం.యస్సీ. కాగానే పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు. ఇంటర్లో ఒకళ్ళు, హైస్కూలులో ఒకళ్ళు చదువుతున్నారు. నాలుగురోజులిక్కడ ఉన్నానే కానీ, మనసంతా అక్కడే ఉందంటే నమ్ము! ఆయనైతే మరీ, ఒక్కరోజు ఆఫీసు నుంచీ వచ్చేసరికి ఇంట్లో లేకపోతే, వెతుక్కుంటారు. మా అన్నయ్య ఇంటికని నాలుగు రోజులు ఎలాగో బతిమిలాడి వచ్చాను. రేపొద్దుటికి ఇంట్లో ఉంటాను." ఉత్సాహంగా ఉన్నవీ లేనివీ కలిపించి చెప్పింది పావుగంట సేపు. తరువాత ఊపిరి పీల్చుకుని అడిగింది, "నీ గురించి చెప్పు" నవ్వింది రేఖ, "నా గురించి చెప్పటానికేమీ లేదు. పెళ్ళి చేసుకోలేదు. యం.యస్సీ, పీ.హెచ్.డీ చేసి ఇక్కడే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఫాకల్టీలో ఉన్నాను. మా నాన్నగారికి ఒంట్లో బాలేదంటే హైదరాబాద్ వెళుతున్నాను, అంతే".

అంతేనా? అయితే రేఖ పెళ్ళే చేసుకోలేదా? అయ్యో పాపం! చదువూ అందమూ, డబ్బూ తెలివీ అన్నీ ఉండి పెళ్ళెందుక్కాలేదో? తనకంటే డబ్బు లేక సంబంధాలు వెతకటం కష్టమయింది కానీ, రేఖ వాళ్ళలా కాదే? కాలేజీకి మంచి బట్టలేసుకుని రోజూ ఆటోలో వచ్చేది.

"పెళ్ళి ఎందుక్కాలేదు? ఏమయినా ప్రాబ్లమా?" ఉండబట్టలేక అడిగింది తనే. మళ్ళీ నవ్వింది రేఖ.

"పెళ్ళి కాలేదనలేదు. చేసుకోలేదు. నాకంతగా ఎవరూ నచ్చలేదు." ఈసారి సంభాషణ పొడిగించటం ఇష్టం లేనట్టు పుస్తకం మళ్ళీ తెరిచింది. తనూ పక్కకి తిరిగి కళ్ళు మూసుకుంది కానీ ఇక నిద్రపడుతుందా? రేఖకి తెలుసా తన పెళ్ళి ఎవరు చెడగొట్టారో? చిన్న చిన్న పొరపాట్ల వల్ల జీవితాలెంత మారిపోతాయి? తనూ స్వతహాగా చెడ్డదేమీ కాదు. కానీ నిస్సహాయతా, పెళ్ళి కావాలన్న ఆశా, కాలేదన్న నిరాశా, కాదేమోనన్న బెంగా అన్నీ కలిసిన ఒక అసహ్యకరమైన మానసిక స్థితిలో తనలా చేసింది. కానీ దానివల్ల రేఖ పెళ్ళే కాకుండా ఉండిపోతుందనుకోలేదు. తను చేసిన పొరపాటుకి, కేవలం తనకొక్కదానికే కాక, రేఖకి కూడా శిక్ష పడిందన్నమాట. ఆలోచనలతో రాత్రంతా నిద్రపోలేదు సురేఖ.

హైదరాబాదు చేరటానికి ఇంకా రెండు గంటల ప్రయాణం బాకీ ఉండగా రేఖని చేత్తో తట్టి లేపింది.

"రేఖా! నీతో ఒక సంగతి చెప్పాలి."

ఆశ్చర్యంగా చూసింది రేఖ. "ఇప్పుడా? ఏమిటంత అర్జంటు విషయం?"

అయోమయంగా అడిగింది.

"సునీల్‌తో నీ పెళ్ళి చెడగొట్టింది నేనే!"

"సునీల్‌తో? ఏ సునీల్?" అన్నదే కానీ ఆమె మొహంలో ఒక రకమయిన బాధ నిద్రలేచింది.

"నువ్వు యం.ఎస్సీ.లో ఉండగా, పెళ్ళి చేసుకుందామనుకున్న సునీల్. అతను నీకోసం కాలేజీకి వచ్చి నిన్ను బైక్ మీదెక్కించుకుని పోయేవాడు. నేనక్కడే బస్టాపులో నిలబడి చూసేదాన్ని."

"నువ్వు నా పెళ్ళి చెడగొట్టటం ఏమిటి?"

"ఎం.యస్సీలో ఉండగా మా వాళ్ళు నాకు బోలెడు సంబంధాలు చూసారు. ఒక్కటీ కుదరలేదు. కేవలం చదువూ తెలివితేటలు ఉండి అద్భుతమైన అందమో, బోలెడంత డబ్బో లేకపోతే ఎవరు చేసుకుంటారు? నిన్ను చూస్తే చాలా అసూయ వేసేది. నీకు పెళ్ళి కావటం పెద్ద కష్టం కాదు. అలాటి నీకు ఏమీ సంబంధాలు చూడటాలూ, పెళ్ళిచూపుల అవమానాలు లేకుండా అడ్డుపడటానికి ఒక ప్రేమికుడు. పాతికకి పైగా సంబంధాలు చూసినా నాకు కుదరలేదు. బయట ఇంత మంది అబ్బాయిల్లో నన్నొక్కరైనా ప్రేమిస్తే ఈ పెళ్ళి చూపుల బాధ తప్పుతుందనుకుంటే..."

కంఠంలోకి మెల్లిగా పాకుతున్న జీరని సవరించుకుని మళ్ళీ మొదలు పెట్టింది.

"ఇక ఈ జన్మకి దీని పెళ్ళి కాదు అని మా నాన్న శాపనార్థాలు పెడుతుండగా, సునీల్ వాళ్ళ సంబంధం వచ్చింది. అన్ని రకాలుగా సంబంధం స్థిరపడ్డట్టే నన్నారు. కట్నాలక్కర్లేదన్నారు. కానీ సునీల్‌ని చూడగానే తెలుసు నాకు ఈ పెళ్ళి కాదని. అనుకున్నట్టుగానే సునీల్ ఒక రోజు ఫోన్ చేసి చెప్పారు. అమ్మా నాన్నల బలవంతం మీద పెళ్ళి చూపులకొచ్చాడే కానీ తను అప్పటికే నిన్ను పెళ్ళాడాలని నిర్ణయించుకున్నాడు. అందుకే తనీ సంబంధం వద్దంటున్నానీ, దయచేసి దీనికి ఎక్కువగా నొచ్చుకోవద్దనీ రిక్వెస్టు చేసారు. రెండు రోజులు బాగా ఆలోచించి మళ్ళీ నేనే అతనికి ఫోన్ చేసాను. నీకు అతనే కాక ఇంకా ఇద్దరు అబ్బాయిల నుంచీ పెళ్ళి ప్రస్తావనలున్నాయనీ, నువ్వు ముగ్గురిలో ఎవరినెంచుకోవాలా అని బాగా ఆలోచిస్తున్నావనీ చెప్పాను. అతన్ని నమ్మించటానికి చాలా కష్టపడ్డాను. బోలెడన్ని అబద్ధాలు చెప్పాను. అబద్ధం చాలా అందంగా, చాలా అమాయకంగా ఉంటుంది. అందుకే అందరూ అబద్ధాన్నెక్కువ నమ్ముతారు. అతనూ నా మాటలు నమ్మాడు. నన్ను పెళ్ళి చేసుకున్నాడు."

రేఖ కళ్ళు నీటితో నిండిపోయాయి.

"పోనీలే! ఇప్పుడవన్నీ ఎందుకు. మీరంతా బాగానే ఉన్నారుగా? అతన్ని పెళ్ళి చేసుకోనందుకు నేనేమీ పెద్దగా డిజప్పాయింట్ అవలేదు కూడా", వణుకుతున్న కంఠాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ అన్నదే కానీ, ఆమెకి గుండె పగిలిపోతున్న చప్పుడు బాగా వినిపిస్తుంది.

"కాదు! నేన్నీకింకా చెప్పాలి. అన్నీ ఉన్న నీకు సునీల్ కాకపోతే మరో అనీల్ దొరుకుతాడు, కానీ నాకు ఇంక మళ్ళీ పెళ్ళి చూపులకి కూర్చునే ధైర్యం లేదు. అలా నా మనసుని మభ్య పెట్టుకుని ధైర్యంగా పెళ్ళి చేసుకున్నాను. సునీల్ పెళ్ళయిన కొత్తలో నాతో కొంచెం ముభావంగా ఉండేవాడు. అది అతను డిజప్పాయింట్ అయి ఉండడం వల్ల అని సర్ది చెప్పుకున్నాను. నా మాటలూ, తెలివి తేటలూ, చలాకీ తనంతో అతన్ని మళ్ళీ మాములు మనిషిని చేయొచ్చని ధీమాగా ఉన్నాను. దాదాపుగా నా ప్రయత్నంలో నెగ్గాను కూడా. కానీ, ఇంతలో అనుకోని దెబ్బ తగిలింది! నేను ఎప్పటికీ తల్లిని కాలేనని వైద్య పరీక్షల్లో తేలింది. ఒక్కసారిగా నాకు అన్నిటిలోనూ ఆసక్తి చచ్చిపోయింది. బ్రతుకంతా అర్థం లేనట్టుగా, ఏదీ చేయబుద్ది కాని ఒక రకమైన డిప్రెషన్, నన్నా డిప్రెషన్‌లోనుంచీ బయట పడేయాలన్న ఆలోచనా, నా మీద అభిమానం, ఏవీలేని సునీల్, ఇదే నిజం. మిగతాదంతా ఉత్త అబద్ధం. అసలలా చేసినందుకే దేవుడీ శిక్ష వేసాడేమో! అయాం సారీ రేఖా!"

విన్నదంతా అర్థం చేసుకుంటున్నట్టు మౌనంగా ఉండిపోయింది రేఖ. బస్సు హైదరాబాదు పొలిమేరలు చేరుకుంది.

"సురేఖా! నువ్వు సునీల్‌ని కాకుండా ఎవరిని పెళ్ళాడినా నీకు పిల్లలు పుట్టేవారు కారు, కదా? అంటే దేవుడు నిన్ను సునీల్‌కి అబద్ధం చెప్పినందుకు శిక్షించడమెలా అవుతుంది? నేనూ - సునీల్, ఇట్ వాజ్ నాట్ మెంట్ టుబీ, అంతే! నువ్వు కాకుండా సునీల్‌ని నేను పెళ్ళాడితే ఎలా ఉండేది? నువ్వు నాలాగా పెళ్ళి చేసుకోకుండా ఉండి పోయేదానివా? మన ఇద్దరి జీవితాలూ తారు మారుగా ఉండేవా? ఇలాంటి ప్రశ్నల వల్ల ప్రయోజనం ఉండదు."

బేగ్ భుజానికి తగిలించుకుని చెప్పింది,

"అనవసరమైన ఆలోచనలు పెట్టుకోకు. ఏదెలా రాసిపెట్టి ఉంటే అలాగే జరుగుతుంది. కొన్నిసార్లు అలాంటి వేదాంతం వంట బట్టించుకుంటే కానీ నెగ్గుకు రాలేం." నవ్వింది.

ఇద్దరూ బస్సు దిగారు.

"వస్తా సురేఖా, ఆల్ ది బెస్ట్", చేయి ఊపి ఆటో వెళ్ళిపోయింది.

కనీసం సునీల్ ఎలా ఉన్నాడని గానీ, తన అడ్రసు కానీ, ఫోన్ నంబరు కాని ఏదీ అడగలేదెందుకో. సునీల్‌ని కలవటం ఇష్టం లేకో, మరి తననే కలవటం ఇష్టం లేకో! దూరం నుంచీ చేయి ఊపుతున్న అన్నయ్య దగ్గరికి నడిచింది సురేఖ. ఈ మలుపులో రేఖ కనిపిస్తుందని ముందే తెలిసుంటే, అనుకుంటూ...

***




"సమీర్!"

"ఎస్ మున్నీ!"

"ఈసారి హాలిడేస్‌కి నేను మమ్మీ దగ్గరకి వెళ్ళను. నీతో యూరప్ వస్తాను."

"అలా ఎలా కుదురుతుందమ్మా! మమ్మీ, సంజయ్, సందీప్, ఉదయ్, కిరణ్మయీ, అంతా నీ విజిట్ కోసం ఎదురు చూస్తూ ఉంటారు. సంజయ్ బార్బీడాల్స్ సెట్ కొని నీకోసం దాచుంచాడు. నాకు చెప్పాడు నీతో చెప్పవద్దని. సీక్రెట్. సర్ప్రయిజ్ గిఫ్ట్ అన్నమాట. వెళ్ళాలి. వాళ్ళంతా నొచ్చుకోరూ?"

"ఐ గెట్ బోర్‌డ్ ఆ బార్బీడాల్స్ చిన్నపిల్లలు ఆడుకునేవి. నాకొద్దు"

"నువ్వేమంత పెద్ద పిల్లవనీ! ఇంకా ఏడేళ్ళేగా! కిరణ్మయి చూడు. గదినిండా బార్బీడాల్స్ పెట్టుకుని ఎలా ఆడుకుంటుందో! ఎండ్ షీ ఈజ్ ఆల్ ఆఫ్ థర్టీన్, ఎ టీనేజర్'

" ఆ కిరణ్మయి మిగిలిన వన్నీ బాగా చేస్తుంది కానీ, ఈ డాల్స్ మటుకు ఆర్ఫనేజ్‌లో ఇచ్చేయమంటే ఇవ్వదు. గదంతా క్లట్టర్. నాకు పెద్దగా స్పేస్‌తో ఉన్న గదులంటే ఇష్టం. ఐకెన్ థింక్ దెన్. సమీర్! ప్లీజ్! నన్నీసారి యూరప్ తీసుకెళ్ళు. పాస్‌పోర్ట్ ఆఫీసరుకి నా పేరు స్పెల్లింగే తెలియలేదు. నేనే చెప్పాను, తెలుసా?"

"ఇంకా నాకే మృణ్మయి స్పెల్లింగ్ సరిగా తెలియదు. వాడేం చేస్తాడు పాపం! పోనీ సింపుల్‌గా మున్నీ మాయీ అని మార్చేయనా?"

"నీతో ఇదే తంటా. ఒకటంటే ఒకటి మాట్లాడతావు. నేను మమ్మీ దగ్గరికి వెళ్ళను. దటీజ్ ఫైనల్!"

"నీ మమ్మీ మొండితనమే నీది. సరే చూద్దాం. లే, స్కూలికి టైమయింది. ముషారఫ్‌కి కారు తీయమని చెప్పు. నాకు ఎనిమిదిన్నరకి మీటింగ్ ఉంది. నిన్ను దింపి, నేనలా వెళ్ళిపోతాను. కమాన్! ఫినిష్ ద ఫ్రూట్!"

"శారూ!"

"ఏంటి సమీర్! మున్నీ ఎప్పుడొస్తోంది? సంజయ్, సందీప్, ఉదయ దానికోసం కాచుక్కూచున్నారు. కిరణ్మయి సమ్మర్ క్యాంప్‌కి దాని స్కూల్ మేట్స్‌తో డార్జిలింగ్ వెళుతోంది."

"ఈ పిల్లలే నయం. సమ్మర్ క్యాంపులూ, అవీ, ఇవీ, అని మంచి మంచి రిసార్ట్స్‌కి చెక్కేస్తున్నారు. నేను ఆంధ్రాయూనివర్శిటీలో చదువుతున్నప్పుడు, ఫ్రెండ్స్‌తో ఏరాడ కొండ క్కూడా వెళ్ళనిచ్చేది కాదు అమ్మ. అంత కట్టు దిట్టాలు! అందుకే ఇంత మంచి బాలుడనయ్యాను."

"ఆ కొండ జాతి స్త్రీలు నిన్నొదిలేయబట్టే నాకు మొగుడయ్యే ఛాన్సు నీకు దొరికింది."

"మరి నువ్వెందుకు నన్నొదిలేసి వెళ్ళిపోయావు శారూ? సంజయ్, సందీప్‌లని కూడా తీసుకు వెళ్ళిపోయావు."

"బిజినెస్ వంకని నువ్వెప్పుడూ ట్రావెల్ చేస్తూనే ఉండేవాడివిగా, వాళ్ళ చదువులు పాడయిపోతాయనీ, అయినా మున్నీ నీ దగ్గరే ఉందిగా!"

"డివోర్సిస్తే ఇచ్చావు కానీ, మున్నీనైనా నాకిచ్చినందుకు థ్యాంక్స్ శారూ."

"రమ్య చెప్పబట్టి ఆ పని చెయ్యాల్సివచ్చింది సమీర్. గతం తవ్వడమెందుకు కానీ, మున్నీ సంగతి చెప్పు. ఎప్పుడొస్తోంది?"

"మున్నీ బెంగుళూరు రాదట. నాతో యూరప్ వస్తానంటోంది."

"అదేమిటి? చిన్నపిల్ల. అక్కడేం చేస్తుంది? నువ్వు దాన్ని నైట్‌క్లబ్బుల చుట్టూ తిప్పేరకానివి. ఇక్కడికే పంపు. దానికి అంత స్వేచ్ఛ ఇవ్వకు."

"మున్నీకి మెంటల్ స్వేచ్ఛ కావాలి శారూ. ఆలోచించుకోడానికి స్పేస్! మృణ్మయి చాలా తెలివైనది, నైస్ గర్ల్. నా కూతురు కదా!. శారూ! ఈ సారికి నాతో యూరప్ రానీ. చాలా ఉత్సాహ పడుతుంది. దేశాలు తిరిగితే ఎక్స్పోజర్ వస్తుంది."

"ఆఁ! ఆఁ! కావాల్సినంత ఎక్స్పోజరు. మొన్న కిరణ్మయితో చెబుతోంది ఫోన్లో. ఫేషన్ ఛానల్‌లో బూబ్స్ చూస్తున్నానని. ఇదేకదా నువ్విచ్చే ఎక్స్పోజరు!"

"శారూ! ఇవన్నీ ఇగ్నోర్ చేసెయ్యాలి. కాసిని రోజులు పోతే అది మరిచిపోతుంది. చిన్నప్పుడు మనం నేర్చుకున్న మాటలు మనం మర్చిపోలేదూ! అలాగే ఇదీనూ. సంజయ్, సందీప్‌లని కొత్త మాటలు నేర్పమంటే, 'వాట్! డేడ్! ఎట్‌దిస్ ఏజ్?' అంటున్నారు. అంతా పిల్లల కంట్రోలే. అక్కడ బాయ్స్, ఇక్కడ మృణ్మయి. నా బతుకిలా అయిపోయింది. సరే, మున్నీకి ఏం చెప్పను? యూరప్‌కి తీసుకెళ్ళనా?"

"వద్దు. ఇక్కడికే రావాలని చెప్పు. దటీజ్ ఫైనల్! అంతగా అయితే కిరణ్మయిని క్యాంప్ మానుకోమంటాలే. మున్నీ మొండి ఘటం కానీ కిరణ్మయి నేను చెప్పిన మాట వింటుంది. "

"సమీర్! యూరప్ నుంచీ నాకొకటి తెచ్చిపెడతావా?"

"ఒకటేమిటి తల్లీ! ఎన్నయినా తెస్తాను. ఏం కావాలి?

"మొత్తం వరల్డ్‌లో అదొక్కటే. మొనాలీసా పెయింటింగ్."

"అది బ్రావ్ మ్యూజియంలో ఉంటుంది. దొంగతనం చేయాలి. సరే తెస్తాలే. పెయింటింగ్ నీకిచ్చేశాకే జైల్లో పెట్టమంటాను ఫ్రెంచ్ అధారటీస్‌ని"

"అబ్బ! కాపీ దొరుకుతుంది సమీర్! అది తీసుకురా. నువ్వు ఒరిజినల్ తెచ్చేస్తే మిగతా జనరేషన్స్ వాళ్ళకెలా తెలుస్తుంది, మొనాలీసా ఎలా ఉంటుందో?"

"నీకెంత ముందాలోచనే! ఇంతకీ ఏం చేస్తావు దానితో?"

"నా రూమ్‌లో అదొక్కటే పెట్టుకుంటా. కిరణ్మయి వచ్చినప్పుడు దానికి చూపిస్తా, రూమ్ ఎలా ఉంచుకోవాలో."

"గుడ్ థాట్! సరే ఫ్లయిట్‌కి టైమయింది. వెళదామా? ఉదయ్, కిరణ్మయి వాళ్ళకిచ్చే గిఫ్ట్సు సూట్‌కేస్‌లో పెట్టుకున్నావా? మమ్మీకి, సందన్నకీ, సంజన్నకీ ఏం తీసుకెళుతున్నావు?"

"నేను వేసిన పెయింటింగ్స్. గిఫ్ట్సు కోసం కాదు, సేల్‌కి, ఆ డబ్బుతో ఆర్ఫనేజ్‌లో పిల్లలకి ఐస్‌క్రీం కొనిస్తా. లాస్ట్ టైం సిస్టర్ చెప్పింది వాళ్ళింత వరకూ ఐస్‌క్రీమే తినలేదట."

"మోర్ గుడ్ థాట్స్! పద పద. బేగం పేట ట్రాఫిక్‌ని నమ్మలేం. ఇంకా ఆలశ్యం చేస్తే ముషారఫ్ యూరప్ నుంచీ ఫ్లయింగ్ కారు తెమ్మంటాడు, ఆ స్లో ట్రాఫిక్ పైనుంచీ దూకేసి, ఎయిర్ పోర్ట్ త్వరగా చేరడానికి ."

"నువ్వు తేగలవులే. దీనికి జైల్లో పెట్టరు. హి,హి,హీ!"

"నా మీద నీ కెంత ప్రేమే, నా మున్నీ! షూ లేస్ సరిగా కట్టుకో, మూడో ఏట నుంచీ షూలేస్ కట్టుకోగలిగినదాన్ని నిన్నే చూసాను. మై జీనియస్ డాటర్!"

"హాయ్ మున్నీ! నీ కోసం నేను సమ్మర్ క్యాంప్ మానేసాను తెలుసా! మనిద్దరం బార్బీడాల్స్‌తో ఆడుకోవచ్చు. పెళ్ళిచేద్దాం వాటికి."

"హుఁ! పెళ్ళి కొడుకు పేరేం పెడదాం?బార్బ్‌డ్ డాలా?"

"నీ జోకులు నాకర్థం కావు మున్నీ. పద పద. డిన్నర్‌కి తాజ్‌కి తీసుకు వెళుతున్నాడు ప్రభూ అంకుల్."

"అవినాశ్! మృణ్మయికి నీ కొత్త వీడియో చూపించు. మీ పిల్లలు అలా ఫౌంటెన్ దగ్గర తిరిగి రండి ఈ లోగా డిన్నర్ ఆర్డరిస్తాను. శార్వరీ! లాబ్‌స్టర్ ఇక్కడ బాగుంటుంది, చెప్పనా?!

"ప్రభూ అంకుల్! నేను వెజిటేరియన్‌ని. నాకొద్దు. నేనూ, అవినాశ్, కిరణ్మయీ వేరే టేబుల్ మీద కూచుంటాం."

"ఓకే మృణ్మయీ. నువ్వు ప్రిన్సెస్వి. ఈ రోజుకి ఛీఫ్‌గెస్ట్‌వి. నువ్వెలా చెపితే అలా. వెళ్ళండి. అలా ఆడుకుని రండి మీరంతా."

"శారూ! నేను చిన్మయి మిషన్‌లో సేవ చేయడానికి పూణె వెళ్ళిపోతున్నాను, అవినాశ్‌ని పంచగనీలో బోర్డింగ్ స్కూల్లో పెడుతున్నా. చంద్రిక చనిపోయాక నేను చాలా ఒంటరివాడినైపోయాను. అవినాశ్ నా మాట అసలు వినడం మానేశాడు. ప్రతిదానికీ పనివాళ్ళ మీద అరుస్తాడు. గత ఏడెనిమిదేళ్ళలో నువ్వూ, సంజయ్ యాడ్ ఏజన్సీని బాగా అభివృద్ధిలోకి తీసుకువచ్చారు. సంజయ్ బోలెడు కొత్త ఎకౌంట్స్ తీసుకువచ్చాడు. నువ్వు రాత్రింబవళ్ళు కష్టపడి పని చేసి ఈ సక్సెస్‌కి కారకురాలివయ్యావు. ఇటువంటి సమయంలో నేనో నిర్ణయం తీసుకున్నాను. ఏజెన్సీని మృణ్మయి పేరు మీద ట్రాన్స్‌ఫర్ చేస్తున్నాను. నువ్వు గార్డియన్‌గా ఉండి, మున్నీ మేజర్ అయాక దానికిచ్చేయ్. నడుపుకుంటుంది. తెలివైనది."

"ప్రభూ! ఇటువంటి పిచ్చి పనులు చేయకు. అవినాశ్ నీ కొడుకై ఉండగా మృణ్మయి పేర్న ఏజెన్సీ పెడితే అంతా ఏమనుకుంటారు? మనం సంజాయిషీ చెప్పలేం."

"ఇప్పటి దాకా గోప్యంగానే ఉంచాంగా. ఇక మీదటా అలాగే నడుస్తుంది."

"లేదు ప్రభూ. ఈ మధ్యే రమ్యకేదో అనుమానం వచ్చింది. 'సమీర్ అంత నల్లగా ఉంటాడు, నువ్వూ చామనఛాయే. మున్నీ ఏమిటంత తెల్లగా వుంది?' అనడిగింది. అదీగాక నీ పోలికలు అక్కడక్కడ కనపడుతూనే ఉంటాయి. ఇక నిజం చెప్పక తప్పలేదు. ప్రభూ! సమీర్‌కి మున్నీ అంటే ప్రాణం. ఇప్పుడు నువ్విలాంటి తిరకాసు వ్యవహారం చేసి అల్లకల్లోలం క్రియేట్ చేయకు. లెట్ స్లీపింగ్ డాగ్స్‌లై. ప్రభూ! ప్లీజ్"

"చంద్రిక తన యావదాస్తీ అవినాశ్‌కే రాసేసింది. వాడికి నేనేం అన్యాయం చేయడం లేదు. ఏజన్సీ నుంచి కొంత మొత్తం నా పేర ఫిక్సెడ్‌లో వేసుకున్నాను. మిషన్‌లో పెద్దగా ఖర్చులుండవు. అన్నీ ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చాను శారూ."

"ఏమో ప్రభూ! రమ్యతోనూ, సమీర్ తోనూ ఒకసారి సంప్రదించనీ."

"రమ్యకి చెప్పు. సమీర్‌తో ఏం అనకు. ఒప్పుకోడు.

"నాకి వీడియో గేమ్ అంటే చాలా ఇష్టం. ఆడకుండా ఒక్క నిముషం కూడా ఉండలేను. మొన్న డాడీ రెండు రోజులు గేమ్ దాచేశాడు. ఎంత ఏడ్చినా ఇవ్వలేదు.

"ఎందుకు?"

"తొమ్మిది తర్వాత టీ.వీ చూడొద్దన్నాడు. నేను పదిన్నర వరకూ పనివాళ్ళతో కూర్చుని చూసా. చెప్పొద్దంటే వాళ్ళు డాడీతో చెప్పేశారు. అందుకని పనిష్మెంట్."

"మా డాడీ నన్ను పనిష్ చేయరు. టీవీ చూసినా ఏమనరు. బార్బీ డాల్స్‌తో ఆడుకోనిస్తారు కూడా."

"మున్నయీ! మీ డేడ్ నీ కెప్పుడూ పనిష్మెంట్ ఇవ్వడా!"

"అవినాశ్! నా పేరు సరిగా పలకలేక పోతే మున్నీ అనలేవూ, అందరిలా?"

"డాడీ మున్నయనే అనాలని చెప్పాడు. సరే, నీకు పనిష్మెంట్ ఇవ్వడా సమీర్ అంకుల్?"

"ఎందుకివ్వడూ? ఒకసారి అల్లరి చేసానని బాత్రూంలో పెట్టి తలుపు గొళ్ళెం పెట్టేసాడు', గంటకోసం. కొంచెం సేపు ఏడ్చా. తర్వాత చుప్‌గా అయిపోయా. నాకేమయిపోయిందోనని, పదినిముషాలైనా కాకుండా గాభరాగా తలుపు తీసేసాడు. సమీర్ చాలా మంచివాడు. నేను కూడా మంచయిపోయా. తర్వాతెప్పుడూ అల్లరి చేయలే. బాత్రూంలో పెట్టే సమీర్ నా కన్నా ఎక్కువ ఏడుస్తాడు."

"అవినాశ్! కిరణ్మయీ, మృణ్మయీ ఎక్కడ?"

"బాత్రూం కెళ్ళారు డేడ్ నేను బయట కాసేపు వెయిట్ చేసి వచ్చేసా."

"హుం! ఏం చేస్తున్నారో ఇంతసేపు! గర్ల్స్!"

"అదిగో వచ్చేసారు. మృణ్మయీ, నీకోసం కట్‌లెట్, రష్యన్ సలాడ్ ఆర్డర్ చేసాను. ఒకే?"

"ఓ.కే. ప్రభూ అంకుల్! నేను లాబ్‌స్టర్ ఎవరయినా తింటూంటే కూడా చూడలేను. నేనొక్కదాన్నే వేరే టేబుల్ మీద కూర్చోనా?"

"అలాగేనమ్మా. నీ ఇష్టం."

"మున్నీ! మమ్మీ వాళ్ళతో హాలిడే ఎంజాయ్ చేసావా?"

"ఊం! నువ్వు కూడా యూరప్ ట్రిప్ ఎంజాయ్ చేసావా?"

"ఏం ఎంజాయ్‌మెంటో! నువ్వు లేకపోతే ఏమయిందిలే అని మెర్రీ గో రౌండ్ ఎక్కా. అక్కడ నీలాంటి పిల్ల కోతి గుర్రం మీంచి తోసేసింది. చూడు. ఎడం కాలికి ఎంత పెద్ద దెబ్బ తగిలిందో!"

"నేను తొయ్యను. పట్టుకుంటా. నాలాంటి పిల్లకోతి కాదు. పిల్లొకటి. ఎక్కడ పడ్డావ్?"

"ఎస్కలేటర్ మీద కాలు స్లిప్ అయింది."

"ఉండు. బామ్ రాస్తా."

"సమీర్ నువ్వు చాలా నల్లగా ఉంటావు."

"ఇప్పుడా కనిపెట్టావు! పోనీ చర్మం పీల్ చేసేసుకోనా? తెల్లగా అయిపోతానేమో!"

"వద్దు, నాకిలాగా బాగుంటావు, సమీర్! మొనాలీసా పెయింటింగ్ నాతో తీసుకెళ్ళనా?"

"ఎక్కడికి? స్కూల్‌కా?"

"కాదు. మమ్మీ ఇంటికి. 'అక్కడ నాకు గది ఉంది. పింక్ వాల్స్."

"మరిక్కడ నీ గదిలో ఏం పెట్టుకుంటావ్?"

"ఇక్కడికి రానట. మమ్మీ దగ్గరే ఉండాలట. ఎప్పటికీ."

"అదెలా? అయిదేళ్ళవరకే మమ్మీకి రైట్స్. ఆ తర్వాత ఫాదర్‌కే."

"అసలు ఫాదర్ అంటే?"

"చర్చిలో ఒకడుంటాడు. లేకపోతే కన్న తండ్రి. నేను"

"నువ్వు కన్న తండ్రివి కావుట."

"ఎవరన్నారా మాట. నేను నీ కన్న తండ్రినే."

"..........."

"మున్నీ! ఇలారా. నా ఒళ్ళో కూచో. ఏడవకు. చెప్పకు. ఏం జరిగింది?"

"అదుందే, ఆ కిరణ్మయి. వికెడ్‌విచ్. ఏంటేంటో మాట్లాడుతుంది. నాకేం అర్థంకాదు. నేను దానికి నువు చాలా మంచి ఫాదర్. ఎప్పుడూ నన్ను పనిష్ చేయవని చెప్పాను. ఫాదర్ కాదు కనుకే పనిష్ చేయవని చెప్పింది. నిజం ఫాదర్స్ పనిష్ చేస్తారుట. అవినాష్ ఫాదర్ వాడి వీడియో గేమ్ తీసేసుకుని పనిష్ చేసాడుగా. సమీర్! నాకో వీడియో గేమ్ కొనియ్యవూ. దాన్నిదాచేసి పనిష్ చేసేస్తే రియల్ ఫాదర్ అయిపోతావు. ఎవ్రీథింగ్ విల్ బీ ఓకే దెన్."

"శారూ!

మృణ్మయి కేం చెప్పింది కిరణ్మయి? నేను కన్నతండ్రిని కానని ఏదేదో అంటోంది. ఈ పెద్దవాళ్ళ విషయాలు వీళ్ళకి ఎలా తెలిసాయి? రమ్య చెప్పిందా? అసలా కిరణ్మయి నా దగ్గర ఎంతో బాగా ఉండేది. ఇప్పుడు మున్నీ వచ్చాక దానికి ఎటెన్షన్ తగ్గిందని జెలసీ అనుకుంటాను. మున్నీ బుర్రపాడు చేస్తోంది. ప్లీజ్! ఏం జరిగిందో చెప్పు, శారూ!"

"అదేం లేదు సమీర్. మొన్నా మధ్య రమ్యకి ఏదో సందేహం వచ్చింది. ఇక దాచేదేముందిలే అని నిజం చెప్పేసాను. అదేమైనా కిరణ్మయి చాటుగా విందేమో! దానికీ పెద్ద కబుర్లంటే భలే ఆసక్తి. ఆరిందాలా మాట్లాడుతూ ఉంటుంది. అసలింతకీ మున్నీ నీతో ఏం చెప్పలేదా?"

"నీ దగ్గరకి వచ్చేయమన్నావుట. అదెలా కుదురుతుంది శారూ! అయినా నువ్వే డైరక్టుగా నాతో చెప్పచ్చుగా. ఏమిటిదంతా శారూ? ప్లీజ్ టెల్‌మీ."

"ప్రభూ చిన్మయా మిషన్‌లో చేరడానికి పూణే వెళ్ళిపోతున్నాడు. ఏజెన్సీని మున్నీ పేరు మీద ట్రాన్స్‌ఫర్ చేసి, నన్ను గార్డియన్‌గా నియమించాడు. మున్నీ నా దగ్గరుంటేనే బాగుంటుందని దాన్ని ప్రిపేర్ చేస్తున్నా."

"హూ ద హెల్ ఈజ్ ప్రభూ టు మేక్ మై లైఫ్. దాన్ని వదిలి ఎలా వుండను?"

"సమీర్! ప్రభూ నిర్ణయం తీసేసుకున్నాడు. ఇప్పుడు నువ్వు కాదంటే అంతా బహిరంగంగా బట్టబయలు చేస్తాడు. చంద్రిక కూడాలేదేమో, ఇట్ విల్ నాట్ బాదర్ హిమ్ ఎట్ ఆల్. రభస చేయకు సమీర్!"

"మమ్మీ! నేను నీ దగ్గరకి రాను. ఏజన్సీ వద్దు, ఏం వద్దు. ఓన్లీ సమీరే కావాలి. కోర్ట్‌లో జడ్జి అడిగినా అదే చెప్తా. "

"మున్నీ! దొంగచాటుగా ఎక్స్టెటెన్షన్‌లో వింటున్నావా? తప్పు!"

"కిరణ్మయీ దొంగచాటుగానే వింది మమ్మీ. నాకు చెప్పింది, నేను సమీర్‌కి పుట్టలేదని. ప్రభూ అంకుల్‌కి పుట్టానని. అంటే నాకు తెలియదు. బట్ నేను నీ దగ్గరకి రాను."

"మున్నీ ఏవిటీ మొండితనం? బిహేవ్‌యువర్ సెల్ఫ్. ఫోన్ పెట్టేయ్!"

"పెట్టను. సమీర్ దేవుడు. దేవుడే అందరికీ ఫాదర్. అందుకే సమీరే నా ఫాదర్. నువ్వు ప్రభూ అంకుల్‌కి చెప్పు. అవినాశ్‌ని హాస్టల్లో పెట్టద్దని. వాడికి మమ్మీ అసలే లేదు. ఇంక ఫాదర్ కూడా లేకపోతే పాపం ఏం చేస్తాడు? నువ్వు అవినాశ్‌కి మమ్మీగా ఉండు. వాడు మంచివాడు. తన వీడియోగేమ్‌తో నన్నెంతో సేపు ఆడుకోనిచ్చాడు."

"మున్నీ! ఫోన్ పెట్టేయ్!"

"ఊఁఊఁ! అవినాశ్‌ని ఎప్పుడైనా మా ఇంటికి రానియ్యి. నేను పెయింటింగ్ నేర్పుతా. సమీర్ విల్ టేక్ గుడ్ కేర్ ఆఫ్ హిమ్. ఇంక నాకు నిద్రొస్తోంది. ఫోన్ పెట్టేయ్. గుడ్‌నైట్!"

"సమీర్! చీకట్లో ఏం చేస్తున్నావ్? ఏడుస్తున్నావా?"

"................."

"కంప్యూటర్‌లో చూసాను సమీర్. ఫొటోల్లో నేపీ మారుస్తున్నావు. స్నానం చేయిస్తున్నావు. బామ్మ చెప్పింది. బాటిల్‌తోపాలు తాగడం లేదని ఉగ్గు గిన్నెతో పాలుపట్టడం నేర్చుకున్నావుటగా. బామ్మింట్లో వెస్టర్న్ టాయిలెట్ లేదని బమ్‌వాషర్ కూడా బాత్రూం లోంచి తీసేసావు. బామ్మ నాకు ఇండియన్ టాయిలెట్ మీద కూచోడం నేర్పింది. నాకు దగ్గొస్తే తులసీ లీఫ్ తినిపించావు, కాఫ్ సిరప్ మంచిది కాదని, నువ్వు నన్ను ఎప్పుడూ పనిష్ చేయలేదు. దేవుడే ఎవరినీ పనిష్ చేయడు. నాకు పుట్టడం అంటే నువ్వే తెలుసు. ఇంకేం తెలియదు. నేను నిన్నొదిలి వెళ్ళను సమీర్. మమ్మీ తన దగ్గరకి వచ్చేస్తానని ఎలా అనుకుంది? షీ ఈజ్ ఎ ఫూల్ కదా!"

"అవును తల్లీ. షీ ఈజ్ ఎ ఫూల్. బట ఫుల్ ఆఫ్ లవ్. అందుకే నిన్ను నాకు ఇచ్చేసింది. మనిద్దరం ఒకటి. హూకెన్ సెపరేట్ అజ్? పద. నాకూ నిద్రొస్తోంది. పడుకుందాం."

# కంటే కూతుర్నే కనాలి

## మద్దూరి రాజ్యశ్రీ



భానుమతి ఉత్తరం చదివినప్పటి నుంచీ అనసూయమ్మ మనస్సు మనస్సులో లేదు. ఎక్కడ ఉంటే అక్కడ అలా పరధ్యానంగా ఉండిపోతుంది. పొద్దుటికి పొద్దున్న మంచం దిగి, పక్క దుప్పటి మడవటానికి అలా చేతిలో పట్టుకుని అలాగే ఎంత సేపుండి పోయిందో తనకే తెలీదు. ఆ ఉత్తరం లోని ప్రతి అక్షరం ఒక్కోరూపు దిద్దుకుని తన కళ్ళ ముందు నాట్యం చేస్తున్నాయేమో అనిపిస్తోంది.

ఇంతప్పటినుంచీ తెలుసు భానుమతి. ఇద్దరూ కలిసి స్కూలుకి వెళ్ళేవాళ్ళు. పుట్టింట్లో చాలా అపురూపంగా పెరిగింది. కారులో తప్ప ఎక్కడికీ వెళ్ళేదికాదు. తన చేత్తో మంచి నీళ్ళు ముంచుకుని తాగి ఎరగదు. వాళ్ళ బామ్మే అప్పుడప్పుడూ సణుగుతూ ఉండేది. 'ఆడపిల్లకి మరీ అంత అపురూపం పనికి రాదు. కాస్త పనిపాటలు నేర్పు లక్ష్మి' అని భానుమతి వాళ్ళ అమ్మని దెప్పేది. దానికి టకీమని భానుమతి నుంచీ జవాబు వచ్చేది. 'చూడు బామ్మా పనిపాటలు చేయటం పెద్ద గొప్పేం కాదు. అది ఎప్పుడైనా నేర్చుకోవచ్చు. నలుగురు పనివాళ్ళుంటే వాళ్ళ చేత ఎలా పని చేయించుకోవాలో నేర్చుకోవాలి' అనేది. ఏ ముహూర్తంలో అలా అందో అలాగే పెళ్ళైయి అత్తారింటికి వెళుతూనే సరిగ్గా నలుగురు పనివాళ్ళుండే వాళ్ళు.

భానుమతి పనల్లా పొద్దున్నే స్నానం చేసి, మంచి చీరకట్టుకోవటమే! ఆడపిల్ల కావాలని పంతం పట్టి ఆడపిల్లనె కన్నది. ఒక ఆయా పొద్దున్నే వచ్చి దానికి నీళ్ళు పోసి ముస్తాబు చేసి వెళితే, ఇంకో ప్యూను వచ్చి పాపని షికారు తీసుకువెళ్ళేవాడు. వంటవాడు వచ్చి వేళకి నాలుగు రకాలు వంటలు చేసి వెళ్ళేవాడు. బజారు పని ఉందా అని ఇంకోడు తయారు. అందరికీ రమ్మంటే వస్తుందా ఆ వైభోగం.

పనమ్మాయి కేకతో ఈ లోకంలోకి వచ్చి పడిన అనసూయమ్మ యాంత్రికంగా గిన్నెలు దానిముందు వేసింది. 'ఏమిటమ్మా అలా ఉన్నారు?' అని దాని ఆరా! 'ఏం లేదు పో' అని కసిరేసింది కానీ, 'ఇంత మాత్రం ఇంగిత జ్ఞానం అంత పెద్ద చదువులు చదివిన రాగిణికి, అదే భానుమతి కూతురికి లేదా' అనిపించింది. ఒక్కరోజన్నా కన్నతల్లిని అలా నోరు తెరిచి అడిగిన పాపాన పోలేదుట.

ఒక్కగానొక్క కూతురు రాగిణికి ఒంటికాలి మీద నిలుచుని అమెరికా సంబంధం తెచ్చింది. 'నీకేమైనా బుద్ధుందా భానూ! నీకా ఒక్కతే కూతురు! చూస్తే నీ ఆరోగ్యం అంతంత మాత్రం దగ్గరా దాపా! ఏమైనా సాయం కావాలంటే అది పరిగెత్తుకు రాగలదా! నువ్వు వెళ్ళగలవా' అని అంతా శతవిధాలా చెవిలో ఇల్లుచెవిలో ఇల్లు కట్టుకుని పోరాడినా వాళ్ళ మాట వినలేదు.

'మానాన్న నాకు ఫారిన్ సంబంధం చేద్దామనుకున్నారు కుదరలేదు. నా కూతురన్నా అమెరికా వెళ్ళి, అలాగైనా నన్ను తీసుకెళ్ళాలి. అంతే! ఎవరేంచెప్పినా నేను వినను గాక వినను' అని బల్ల గుద్ది చెప్పేసింది.

ఒక్కోసారి దీని మంకుపట్టుకి చిరాకేసేది. దీని కూతురి పెళ్ళవుతుందా అనుకున్నారు. మొత్తానికి మొండి ఘటం. అనుకున్నది సాధించింది. కూతురికి అమెరికా సంబంధం తేవడమేమిటి, ఏడాది తిరగకుండా అది కడుపుతో ఉండటమేమిటి, దానికి పురుడు పోయడానికి ఈవిడ రెక్కలు కట్టుకు వాలటమేమిటి అంతా నిమిషాల మీద జరిగిపోయింది. వెళ్ళిన నెలరోజులు అసలు ఉత్తరం పత్తరం లేదు.

తీరా వచ్చేసరికి కొండంత బరువు మోసుకొచ్చింది. రాగిణి అసలు ఏ పనీ చేయదుట. పోనీలే పాపం కడుపుతో ఉన్నపిల్ల కదా అని తనే సరిపెట్టుకుంటోందిట. అక్కడ పనమ్మాయి అంటే ఏమిటో ఎరగరు కదా. గిన్నెలన్నీ తోమే సరికి చచ్చిన చావయేది. డిష్ వాషర్ ఉన్నా ఒక్క రోజూ వేసిన పాపాన పోయేది కాదుట. 'అదేమిటే' అంటే, 'నీకు అది అలవాటు లేదు. ఎన్ని డాలర్లో పోసి కొన్నాం, అది పాడయిందంటే చచ్చి ఊరుకుంటాం అంటుందట.' ఇవన్నీ నేనెక్కడ తోమగలనే, నాకసలే అలవాటు లేదు అంటే 'అలవాటు లేదు కాబట్టే వేయటం లేదు' అంటుంది. ఏం నేర్పిస్తే నేర్చుకోలేదా? బొడ్డూడని వెధవలే మైక్రోవేవ్‌లు, విసిడిలు, కాఫీమేకర్‌లు ఆపరేట్ చేసేస్తుంటే తనో పల్లెటూరి బైతులా నోరెళ్ళ బెట్టి చూడాల్సొస్తోంది. రాగిణి ఫ్రెండు కొడుకు విఠల్ అనేశాడు కూడా, 'ఈ గ్రానీకి ఏం రావు మమ్మీ అని. దానికి వత్తాసుగా రాగిణి వయ్యారంగా వగలు పోతూ పగలబడి నవ్వటం. ఒక్కరోజు తీరిక చేసుకుని చెపితే నేర్చేసుకోదూ! అంత తీరికేదీ!

పైపెచ్చు తోముతున్నంత సేపు పనిమనిషి మీద అజమాయిషీలాగా, విసిడి పెట్టుకుని నోరెళ్ళ పెట్టి అటు చూస్తూ, అమ్మా రమేష్‌కి ఆ డిన్నర్ సెట్టంటే ప్రాణం అంటుంది. ఒక రోజు కాదు ఇది ప్రతిరోజూ భాగోతమే. తీసుకెళ్ళి దాని మొహం మీద పగలగొట్టాలనిపిస్తుంది. ఇంతోసి డిన్నరుసెట్టూ దానికే ఉంది మహా! తనకి ఇంతకన్నా బ్రహ్మాండమైన డిన్నరు సెట్టు కొని ఇచ్చాడు తన మొగుడూనూ! ఆ మర్నాడే ఆ పని చేసేది ఒక పళ్ళెం టప్పుమని విరగ్గొట్టేసింది. పాపం అది చాలా భయపడి పోయింది. తనే ధైర్యం చెప్పింది. పైపెచ్చు దాని చేతికి గాయం అయితే మందు రాసింది. అది గుర్తొచ్చిన భానుమతి కూతురేం చేస్తుందో చూద్దామని కావాలని ఒక రోజు ఒక చిన్న కప్పు పగల గొట్టింది. 'అమ్మో రక్తం' అని కూలబడింది. దానికి రాగిణి చేసిన హంగామా ఇంతా అంతా కాదు. 'అయ్యో, అయ్యో' అంటూ పరుగెత్తుకొస్తే తల్లి మనసు పులకించి పోయింది. తీరా అది వచ్చింది తల్లి గాయం చూడటానికి కాదు, తల్లి చేసిన గాయం చూడటానికి. ఆ రోజంతా ఇల్లు పీకి పందిరి వేస్తూనే ఉంది. ఆ కప్పు కన్నా పెద్దగా విరిగి పోయింది భానుమతి మనస్సు.

అక్కడ తనని ఒక్క క్షణం వదిలి ఉండని భర్తని ఏకంగా ఆరునెల్లకి వదిలేసి వచ్చి ఇక్కడ తను బావుకుంటున్నది ఏమిటో అర్థం కావటం లేదు. ఆ వీధికి రెండు వీధులవతల పచారీ సామాను కొట్టు. అదే మాలో, పీలో అంటారే అది. దానికి భానుమతే వెళ్ళి సామాన్లు తెచ్చుకోవాలి. మొగుడూ, పెళ్ళాం టింగురంగామంటూ షికార్లు తిరుగుతూనే ఉంటారు. తనని తీసుకెళ్ళాలన్న సరదా ఎవరికీ లేదు. పరాయి తల్లి కన్నబిడ్డ పాపం అల్లుడ్ని అనుకోవటం ఎందుకు. తన కూతురికే లేదు. 'నువ్వు అంత సేపు ప్రయాణం చేయలేవమ్మా,' 'నీకు వాళ్ళ భోజనాలు నచ్చవమ్మా,' 'అలా ఒకళ్ళ మీద ఒకళ్ళు పడటం నీకు ఇష్టం ఉండదమ్మా' అంటూ పురుడొచ్చేదాకా చెప్పిన కారణం

చెప్పకుండా చెప్పేది. పురుడొచ్చాక చెప్పనే అక్కరలేదు. 'చంటిపిల్ల ఏడుస్తుంది,' 'దానికి గాలి ఆడదు,' 'పిల్ల నలిగి పోతుంది' వగైరా వగైరా! డిస్నీలాండ్లు, నయాగరాలు, వెంకటేశ్వర స్వామి గుళ్ళు ఏమీ తను అడగనేలేదు. వాళ్ళు చూపిస్తారన్న ఆశా లేదు. ఉన్న ఊర్లో పార్కులు గట్రా చూపించవచ్చు కదా! ఒక్క హోటల్‌కి తీసుకెళ్ళచ్చు కదా. తనేమైనా నోట్లో వేలేసుకునే పాపాయా వాళ్ళు చెప్పిందల్లా నమ్మేయటానికి. ఆమాట కొస్తే పాపాయిలే నమ్మట్లేదు. ఏం లేదు వాళ్ళ గోలంతా తనని తీసుకెళితే వాళ్ళ డబ్బూ పోతుంది. వాళ్ళ పరువూ పోతుందని. తనకి ఇంగ్లీషు రాక కాదు, వాళ్ళ కొచ్చే యాష్, వూష్ ఇంగ్లీష్ రాదని. అక్కడికేదో రాగిణికీ, రమేష్‌కి పుడుతూనే వచ్చేసినట్టు. ఇక్కడికొచ్చిన కొత్తల్లో వాళ్ళెంత అవస్థ పడ్డారో వాళ్ళు మర్చిపోయినా, తను మర్చిపోగలదా?

ఆ డాలర్ల కాపీనం ఏమిటో అర్థం కాదు. పది డాలర్లకి కూడా లెక్క చూసుకుంటారు. ఏదైనా మనసు పడి కొనవే అంటే అది ఎంతో తెలుసా పది డాలర్లు అంటుంది. పైగా నీదాన ధర్మాలకిది ధర్మసత్రం కాదు అంటుంది. పది డాలర్లు పది రూపాయలతో సమానం కాదూ. తనూ అలా పైసా పైసా చూసుకుంటే ఈ రోజు తన కూతురు ఇలా డాలర్లతో దొర్లేదా? దానికి పెళ్ళికి ఆరు లక్షలు ఖర్చయింది అదేం అప్పనంగా ఆకాశం నుంచీ ఊడిపడలేదు. ఇంకా ఆ దెబ్బనుండీ కోలుకోనేలేదు. ఇప్పుడీ అమెరికా ప్రయాణం ఒకటి. అవసరం వాళ్ళది కాబట్టి టికెట్టు వాళ్ళు పెట్టుకున్నారు. అక్కడితో అయిపోయిందా?

అప్పటికీ తనే ఎక్కడికక్కడ సరిపెట్టుకుంటుంది. పోనీలే అలా డబ్బు పోగేసుకోకపోతే రేపు ఏదైనా అవసరం వస్తే ఎవరు ఇస్తారు దేశం కాని దేశంలో ఉన్నారు కదా అని. కనీసం ప్రేమగా ఒక మాటన్నా మాట్లాడదు. ఇంత చాకిరీ అలవాటు లేక వేళ కాని వేళ పడుకుంటే 'అదేమిటమ్మా అలా పడుకున్నావు, ఒంట్లో బాగోలేదా, మాత్ర వేసుకున్నావా, బి.పీ డౌనయిందా' అని అడిగిన పాపాన పోలేదు. అలా పడుకుంటుందో లేదో ఏదో ఒక పని చెపుతుంది. లేదా ఏ పిండి వంటో చేయమంటుంది.

ఇన్నీ రాసి ముక్తాయింపుగా, 'నీకేం, హాయిగా ఉన్నావు. నీకూతురుకి నువ్వంటే ప్రాణం. రోజూ నిన్ను వచ్చి ఆపేక్షగా పలకరిస్తుంది. దేనికైనా పెట్టిపుట్టాలే అంది.' ఇదిగో ఆ లైన్ల దగ్గరే తన మనస్సు తిరుగుతోంది. భానుమతి రాసిన విశేషాలకి బాధపడాలో, తన కూతురు యామినిని మెచ్చుకుంటూ రాసిన దానికి నవ్వాలో అర్థం కాలేదు. తన మొహం మీద ఒక పేలవమైన చిరునవ్వు వెలిసింది.

కనీసం భానుమతి కష్టాలు ఆరునెలల తర్వాత అన్నా తీరుతాయి. మరి తనవో! భానుమతి అన్నట్టే తనుకూడా చాలా అదృష్టవంతురాలననే మొన్నటికి మొన్న వరకూ అనుకునేది. భానుమతెలా రాగిణికి అమెరికా అల్లుడికి ఇవ్వాలనుకుందో, అనసూయమ్మ అలా తన పేగు తెంచుకు పుట్టిన కూతురు తన కళ్ళ ముందే ఉండాలని కోరుకుంది. ఎన్ని మంచి సంబంధాలు వచ్చినా కాదని తిరస్కరించింది. చివరికి ఏ దేవుడు కరుణించాడో పక్క వీధిలో సంబంధమే కుదిరింది. రాగిణి ఈడుదే అయినా యామినికి అన్నీ టక టక కుదిరాయి. ఇలా చదువు అయిందో లేదో అలా ఉద్యోగం రావడమేమిటి, అలా పెళ్ళి కుదరడమేమిటి, అలా పండంటి కొడుకు నెత్తుకోవటమేమిటి అన్నీ నిమిషాల మీద అయిపోయాయి. రోజూ మనవడు వర్షని తన దగ్గర దింపేసి ఉద్యోగానికి వెళ్ళిపోతారు ఇద్దరూ. సాయంకాలం వచ్చి తీసుకు వెళతారు. ఏ రాత్రో అయేటట్టుంటే ముందే ఫోన్ చేసి చెపుతారు. ఇద్దరూ ఇక్కడే కమ్మగా భోజనం చేసి వాళ్ళ గూడుకి చేరుకుంటారు. అంతవరకూ బాగానే ఉంది.

ఆ ఏర్పాటుకే అంతూ పొంతూ లేకుండా ఉంది. తనదీ మరీ ఏం చిన్న వయస్సు కాదు. వారం అంతా మనవడి సేవ చేసి ఆదివారం అన్నా విశ్రాంతి తీసుకుందాం అంటే, 'అమ్మా, ఇవాళ పదిమంది గెస్టులు వస్తున్నారు నువ్వయితే పలావు వగైరాలు బాగా చేస్తావు. చేసెయ్యి మమ్మీ' అని ప్రేమగానే అయినా హుకుం జారీ చేసేస్తుంది. సామాన్లు ఉన్నాయా లేవా చూసుకోవాల్సింది తనే. అవి రెక్కలు ముక్కలు చేసుకుని చేసి ఇస్తుందో లేదో, 'వీడు కాలికి చేతికీ అడ్డం, వీడ్ని చూడమ్మా' అని పడేసి పోతుంది. వాడిని ఇక్కడ పడేసే బదులు నువ్వూ రా సరదాగా అందరం కలిసి తిందాం అన్న పాపాన పోలేదు.

వాళ్ళకి అప్పనంగా చాకిరీ తను ఒక్కత్తే చేస్తే చాలదు. రిటైరైన నాన్నగారు కూడా చేయాలి. 'అమ్మా, నాన్నగారిని అలా షికారుగా వెళ్ళి టెలిఫోను బిల్లు కట్టేయమను' అని ఒకరోజు ఉత్తర్వులు. అప్పటికే ఒక రోజు తన ప్రాణం ఒప్పక, 'మీ నాన్నగారికి ఒంట్లో బాగుండలేదే, ఇవాళ మీ ఆయన్ను వెళ్ళమను' అంది తనే. 'ఏమిటమ్మా అలా అంటావు, దుక్కలా ఉన్న మనిషిని పట్టుకుని. కాస్త నలతకే ఏం అయిపోరు. ఇవాళే ఆఖరి రోజు వెళ్ళి తీరాలి. అయినా ఆయన్ని మరీ చంటిపిల్లాడిలా చూస్తారు నువ్వూ బామ్మ కలిసి' అని ఎదురు దెప్పుడు. చంటిపిల్లాడిలా చూస్తున్న నాన్నని చంటివాడిని చేసి ఆవిడగారు ఆడించడం మాత్రం కనబడదు.

మొన్నటికి మొన్న, తను రాకరాక ఊర్నించి వచ్చిన చుట్టాలని ఇంట్లో వదిలి, వాళ్ళకి వంద సంజాయిషీలు ఇచ్చి, ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న సాయిబాబా భజనకి బయలుదేరింది. తన ఫ్రెండురోహిణి ఇంట్లో చాలా బాగా చేస్తారది. దాదాపు సందు చివరికి వెళ్ళి పోయింది. బయ్యిమని మీద మీదకి కారు వస్తుంటే వాళ్ళని తిట్టటానికి కోపంగా వెనక్కి తిరిగితే, కారు దిగి ఆదరాబాదరా పరుగెత్తుకొచ్చింది తన ముద్దుల కూతురు. వాళ్ళు సినిమా కెళుతున్నారట, అబ్బాయిని తను చూసుకోవాలట. 'ఇవాల్టికి వాడిని తీసుకెళ్ళండే' అని నచ్చ చెప్పబోతూంటే 'ఏమిటమ్మా ఈ వయస్సులో నీకీ తిరుగుళ్ళు? ఎప్పుడు చూసినా భజనలనో, గుళ్ళనో తిరుగుతూనే ఉంటావు. దేవుడెక్కడ లేడు చెప్పు? మా అత్తగారు చూడు అడుగు తీసి బయట పెట్టదు. మీ అమ్మకేమిటా తిరుగుళ్ళు అంటారు అందరూ.' నాకు సిగ్గేస్తుందనుకో' అని ఎదురు తనకే క్లాసు పీకుడు. బయటికి వెళ్ళిన అమ్మని వెనక్కి పీక్కు రావటానికి సిగ్గు వేయదు కాబోలు...

వీళ్ళ చుట్టాలమ్మాయి అడగనే అడిగింది, 'అదేమిటాంటీ ఇప్పుడే మాకన్ని సంజాయిషీలు చెప్పి వెళ్ళారు. అలా వెనక్కి వచ్చాసారేం?'

పుండు మీద కారంలా వాళ్ళ పక్కింటావిడ వచ్చి, 'అది వాళ్ళమ్మాయి ఘనకార్యంలే మా కోడలే నయం ఎప్పుడన్నా బయటకి వెళ్ళాలనుకుంటే, అత్తయ్యా మీకు వీలేనా, బాబుని కాసేపు చూసుకుంటారా? ఇలా, వెళ్ళి అలా వచ్చేస్తాను. మీరు వాడితో వంటకి అవస్థపడకండి, నేను వస్తూ వస్తూ తినటానికేమైనా తీసుకు వస్తాను, అన్నం ఒకటి వండుకుంటే చాలు' అంటుంది.

అనసూయమ్మ ముఖాన కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు. వాళ్ళంతా వెళ్ళిపోయినా వాళ్ళ మాటలే గింగర్లెత్తుతున్నాయి. రోజులు మారాయి అంటున్నారు. ఏం మారాయో అర్థం కావటం లేదు. పూర్వం అత్తగార్లు వంద ఆంక్షలు పెట్టేవాళ్ళు, ఒక్క స్వతంత్రం ఉండేది కాదు. దాని తర్వాత కొంత సుఖం కూడా లేకపోలేదు. దయాధర్మ భిక్షం మీద బతుకుతున్నామనేవాళ్ళు. అందులో అవస్థలున్నా కొంత సుఖం కూడా లేకపోలేదు. అందరూ కలిసి ఉండేవాళ్ళు కాబట్టి తిట్టుకున్నా, కొట్టుకున్నా ఒక పని ఒకళ్ళు, ఒకపని ఇంకొకళ్ళు చేసుకునేవాళ్ళు. ఇప్పుడో కూతుళ్ళు

హయాం వచ్చింది. ఆడపిల్ల అంటే అక్కడి పిల్ల అనే వాళ్ళు. ఇప్పుడు ఈడపిల్ల అయింది. చదువులూ, ఉద్యోగాలూ వచ్చి పిల్లల్ని సాకే, ఇంటి వ్యవహారాలు చూసే నమ్మకమైన పనివాళ్ళు కావాలి. మళ్ళీ వాళ్ళని పోషించకూడదు. అందుకే అమ్మా వాళ్ళ ఇళ్ళకి రాయి విసిరే దూరంలో ఉండి గాడిద చాకిరీ చేయించుకుంటారు. ఓపిక ఉండనీ ఉండకపోనీ, డబ్బుండనీ ఉండకపోనీ వీళ్ళకి అనవసరం. ఇద్దరికీ కలిసి నలభయి వేలు వస్తున్నా చాలదనుకుంటారే కాని ఇందులో సగం జీతంలో నాన్న నలుగురుని ఎలా పోషించారు, ఇప్పుడు కేవలం పెన్షన్‌తో ఎలా గడుపుతారు వాళ్ళకేమైనా సాయం కావాలా అనుకోరు. వాళ్ళ దగ్గర సాయం తీసుకోవటం వాళ్ళ జన్మహక్కు అనుకుంటారు. ఇంకా కోడలికైతే మొహమాటం అన్నా ఉంటుంది. కూతురికేం ఉంటుంది? ధర్మేచ, కామేచ, మోక్షేచ, పుత్రికా చరామి అని శాస్త్రాలు తిరిగి రాయాలేమో!

'అబ్బబ్బ ఏమిటమ్మా ఎప్పుడు చూసినా ఏదో ఆలోచిస్తూ ఉంటావు. పాపం పసివెధవ ఎప్పటి నుంచీ గుక్క పట్టి ఏడుస్తున్నాడో ఏమిటో' అంటూ వచ్చింది పుత్రికా రత్నం.

ఇదంతా చెప్పినా అర్థంకాని కూతుర్ని ఒక వెట్టి చూపు చూసి లోపలికి వెళ్ళిపోయింది అనసూయమ్మ.

****